

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



గురువారం | 11-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 267 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: అమావాస్య సా. 5.28 తదుపరి పాడ్యమి; నక్షత్రం: పూర్వాషాఢ సా. 5.40 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: రా. 12.53-2.19; దుర్ముహూర్తం: ఉ. 10.33-11.17, మ. 2.58-3.42; అమృతఘడియలు: మ. 1.16-2.44; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 5.54 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కళ్లన్నీ రోహిత్‌పైనే!



మ్యాచ్‌కు కోహ్లీ దూరం

● అఫ్ఘాన్‌తో భారత్ తొలి టీ20 నేడు

● సిరీస్ నుంచి రషీద్ అవుట్

రాత్రి 7 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో



మొహాలీ: స్టార్ ఆటగాళ్లు లేకుండా సాగుతున్న టీ20లకు మళ్లీ మునుపటి జోష్ వచ్చింది. 14 నెలల సుదీర్ఘ విరామం తర్వాత రోహిత్ శర్మ పొట్టి ఫార్మాట్‌లో ఆడుతుండడంతో మొహాలీ మరోసారి మోతెక్కిపోనుంది. ఇటీవలి కాలంలో వేగంగా ఎదుగుతున్న జట్లలో ప్రమాదకరమైన అఫ్ఘానిస్థాన్‌తో భారత్ తొలిసారి వైట్‌బాల్ సిరీస్ ఆడుతోంది. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగే తొలి మ్యాచ్‌లో కెప్టెన్ రోహిత్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాడు. కోహ్లీ కూడా రీఎంట్రీ ఇచ్చినా వ్యక్తిగత కారణాలతో అతడు ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. తర్వాతి రెండు టీ20లకు విరాట్ అందుబాటులో ఉంటాడని కోచ్ రాహుల్ ద్రవిడ్ చెప్పాడు. 2022లో జరిగిన టీ20 వరల్డ్ కప్ సెమీస్‌లో ఓటమి తర్వాత రోహిత్, కోహ్లీ అంతర్జాతీయ టీ20లకు దూరంగా ఉంటున్నారు. అయితే, అమెరికాలో జరిగే పొట్టి వరల్డ్‌కప్ ముందు టీమిండియా ఆడే చివరి టీ20 సిరీస్ ఇదే కావడంతో.. హిట్‌మ్యాన్ ప్రదర్శనపైనే ఎక్కువగా అభిమానులు దృష్టి సారించే అవకాశం ఉంది. జైస్వాల్‌తో కలసి రోహిత్ ఓపెనింగ్ చేస్తాడని ద్రవిడ్ స్పష్టం చేశాడు. సౌతాఫ్రికా టూర్‌లో అంతగా రాణించలేక పోయిన గిల్‌కు ఈ సిరీస్ కీలకం. తిలక్ వర్మ దూకుడు పెంచాల్సి ఉండగా.. సూర్యకుమార్, హార్దిక్ పాండ్యా గైర్హాజరీలో ఫినిషర్‌గా రింకూ సింగ్ బాధ్యత మరింత పెరిగింది. వికెట్ కీపర్‌గా జితేష్ శర్మ, సంజూ శాంసన్ మధ్య గట్టిపోటీ నెలకొంది. స్పిన్నర్‌గా బిష్ణోయ్‌తో పోల్చితే కుల్దీప్ యాదవ్‌వైపే మేనేజ్‌మెంట్ మొగ్గుచూపే అవకాశాలున్నాయి. అర్ష్‌దీప్ సింగ్, ముకేష్ కుమార్, అవేశ్ ఖాన్‌లు పేస్ విభాగాన్ని నడిపించనున్నారు.



అఫ్ఘాన్‌తో జాగ్రత్త: మరోవైపు ప్రధాన స్పిన్నర్ రషీద్ ఖాన్ లేకుండా అఫ్ఘానిస్థాన్ బరిలోకి దిగుతోంది. వెన్నెముకకు శస్త్రచికిత్స చేయించుకొన్న రషీద్.. పూర్తి ఫిట్‌నెస్‌ను సాధించలేక పోవడంతో ఏకంగా సిరీస్‌కే దూరమయ్యాడు. కానీ, గుర్బాజ్, కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ లాంటి ఆటగాళ్లతో అఫ్ఘాన్ గట్టిపోటీ ఇచ్చే విధంగానే ఉంది. వన్డే వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్, పాకిస్థాన్ లాంటి జట్లకు షాకిచ్చిన అఫ్ఘాన్ మరోసారి అంచనాలకు మించి రాణించాలనుకొంటోంది. పైగా ఇక్కడి పిచ్‌లపై ప్రత్యర్థి ఆడిన అనుభవం లాభించనుంది.

147 టీ20ల్లో 4వేల పరుగులు పూర్తి చేసేందుకు రోహిత్ శర్మకు కావాల్సిన పరుగులు.

టీ20ల్లో 50 వికెట్ల ఘనత సాధించేందుకు అక్షర్ పటేల్‌కు కావాల్సిన వికెట్లు **5**

పిచ్/వాతావరణం

పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. శీతాకాలం కావడంతో రాత్రి వేళ మంచు ప్రభావం ఎక్కువగా ఉండనుంది. దీంతో టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకొనే అవకాశం ఉంది.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), జైస్వాల్, గిల్, తిలక్, రింకూ సింగ్, జితేష్/శాంసన్ (వికెట్ కీపర్), అక్షర్, కుల్దీప్/బిష్ణోయ్, అర్ష్‌దీప్, అవేశ్ ఖాన్, ముకేష్ కుమార్.

అఫ్ఘానిస్థాన్: హజ్రతుల్లా జజాయ్, రహ్మనుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), ఇబ్రహీం జద్రాన్ (కెప్టెన్), నజిబుల్లా జద్రాన్, మహ్మద్ నబీ, అజ్మతుల్లా ఒమర్‌జాయ్, ముజిబుర్ రహ్మాన్, షరాఫుద్దీన్ అష్రఫ్, కైయస్ అహ్మద్, నూర్ అహ్మద్/నవీనుల్, ఫజల్‌హక్ ఫారూఖీ.

ఆ ఇద్దరిని అందుకే తీసుకోలేదు

కోచ్ ద్రవిడ్



మొహాలీ: అఫ్ఘానిస్థాన్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌కు క్రమశిక్షణా చర్యల్లో భాగంగానే ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్‌ను ఎంపిక చేయలేదన్న ఊహాగానాలను కోచ్ ద్రవిడ్ కొట్టిపడేశాడు. సౌతాఫ్రికా టూర్ మధ్యలో బ్రేక్ కావాలని ఇషాన్ కోరడంతో అంగీకరిచామని తొలి టీ20 మ్యాచ్‌కు ముందు బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ద్రవిడ్ చెప్పాడు. అయితే, స్వదేశంలో అఫ్ఘాన్‌తో సిరీస్‌కు తాను అందుబాటులో ఉంటానని ఇషాన్ సమాచారం అందించలేదన్నాడు. అతడు మళ్లీ భారత జట్టులోకి రావాలంటే.. దేశవాళీ టోర్నీల్లో ఆడి నిరూపించుకోవాల్సి ఉంటుందని చెప్పాడు. మరోవైపు టీ20ల్లో జితేష్‌కు ఎక్కువగా అవకాశాలు ఇవ్వాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. కాగా, అయ్యర్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకొన్నారంటూ వస్తున్న వార్తలను కూడా ద్రవిడ్ ఖండించాడు. అయితే, ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌ను దృష్టిలో ఉంచుకొని ముంబై తరఫున శ్రేయాస్ రంజీ మ్యాచ్‌లు ఆడనున్నాడు.

ప్రణయ్, లక్ష్యసేన్‌కు షాక్

» సాత్విక్ జోడీ శుభారంభం

» మలేసియా ఓపెన్

కౌలాలంపూర్: భారత స్టార్ షట్లర్లు హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్‌కు మలేసియా ఓపెన్ తొలి రౌండ్లోనే షాక్ తగలగా, సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ శుభారంభం చేసింది. బుధవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్లో ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ ప్రణయ్ 14-21, 11-21తో అండర్స్ అంటోన్సెన్ (డెన్మార్క్) చేతిలో పరాజయం పాలయ్యాడు. మరో భారత క్రీడాకారుడు లక్ష్యసేన్ 15-21, 16-21తో వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా)తో పోరాడి ఓడాడు. డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం 21-18, 21-19తో షోహిబల్ ఫిక్రీ-మౌలానా బాగాస్ (ఇండోనేసియా) జోడీపై నెగ్గి ముందంజ వేసింది.

ఉమా మళ్లీ కొట్టాడు

ఆసియా షూటింగ్ టీమ్ ఈవెంట్‌లో రజతం



జకర్తా: తెలుగు షూటర్ మద్దినేని ఉమామహేష్ ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో రెండో పతకం సాధించాడు. బుధవారం జరిగిన జూనియర్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో ఉమా త్రయం రజతంతో మెరిసింది. ఉమా (630.5 పాయింట్లు), అభినవ్ షా (627.9), పార్థ్ రాకేష్ (626.8) బృందం 1885.2 స్కోరుతో ద్వితీయ స్థానంలో నిలవగా, చైనా బృందం ఒక పాయింట్ తేడాతో స్వర్ణం ఎగరేసుకుపోయింది. సీనియర్ మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో యువ షూటర్ నాన్సీ 252.8 స్కోరుతో స్వర్ణం, ఒలింపియన్ ఎలవెనిల్ వలరివన్ 252.7 స్కోరుతో రజతం కొల్లగొట్టారు. 10 మీ, ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో నాన్సీ, వలరివన్, మెహులీ ఘోష్ త్రయం పసిడి పతకం సొంతం చేసుకుంది. పురుషుల 10 మీ, ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో రుద్రాంక్ష్ పాటిల్ కాంస్యం నెగ్గాడు. 10 మీ. ఎయిర్ రైఫిల్ టీమ్ కేటగిరీలో రుద్రాంక్ష్, అర్జున్, శ్రీకార్తిక్ జోడీ కాంస్యం దక్కించుకుంది. జూనియర్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో అభినవ్ రజతం, పార్థ్ కాంస్య పతకాలతో మెరిశారు.

నాలుగు దేశాల హాకీకి జంబో జట్టు

న్యూఢిల్లీ: ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్ ఉండడంతో వీలైనంత మంది ఎక్కువ ఆటగాళ్లను పరీక్షించాలన్న ఉద్దేశంతో దక్షిణాఫ్రికాలో జరిగే నాలుగు దేశాల హాకీ టోర్నమెంట్‌కు భారత్ నుంచి జంబో జట్టును ఎంపిక చేశారు. ఏకంగా 26 మంది సభ్యులతో జట్టును ప్రకటించారు. ఈనెల 22 నుంచి కేప్‌టౌన్‌లో ఈ టోర్నీ జరగనుంది. ఆతిథ్య దక్షిణాఫ్రికాతో పాటు భారత్, ఫ్రాన్స్, నెదర్లాండ్స్ ఈ టోర్నీలో పోటీపడుతున్నాయి. హర్మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్ కాగా, హార్దిక్ సింగ్ వైస్ కెప్టెన్. ఇక, మాజీ కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్ సుదీర్ఘ కాలం తర్వాత జట్టులోకి వచ్చాడు. వెటరన్ స్టార్ శ్రీజేశ్, కృషన్ బహదూర్ పాఠక్ గోల్‌కీపర్లుగా వ్యవహరిస్తారు.

ఏడు ఓటముల తర్వాత తలైవాస్..

ముంబై: ప్రొ కబడ్డీలో తమిళ్ తలైవాస్ వరుస పరాజయాలకు ఎట్టకేలకు బ్రేక్ పడింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తలైవాస్ 46-27తో యూపీ యోధాస్‌పై విజయం సాధించింది. తలైవాస్‌కు ఏడు వరుస ఓటముల తర్వాత ఇదే తొలి విజయం. తలైవాస్ స్టార్ రైడర్ నరేందర్ 14 పాయింట్లతో, కార్నర్ డిఫెండర్ సాహిల్ గులియా 5 ట్యాకిల్ పాయింట్లతో ఆ జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించారు. హరియాణా స్టీలర్స్-యూ ముంబా మధ్య జరిగిన మ్యాచ్ 44-44తో టైగా ముగిసింది.



ట్రోఫీని పంచుకున్నారు

సంయుక్త విజేతలు భారత్, దక్షిణాఫ్రికా

వర్షంతో ముక్కోణపు సిరీస్ ఫైనల్ రద్దు

జొహాన్నెస్‌బర్గ్: మూడుదేశాల అండర్-19 వన్డే టోర్నమెంట్‌లో భారత్-దక్షిణాఫ్రికా జట్లు సంయుక్త విజేతలుగా నిలిచాయి. బుధవారం ఈ జట్ల మధ్య జరగాల్సిన ఫైనల్, వర్షం కారణంగా రద్దయింది. కనీసం 20 ఓవర్ల మ్యాచ్ అయినా నిర్వహిద్దామని రెఫరీలు వేచి చూసినా, చివరికి ఒక్క బంతి కూడా పడకుండానే మ్యాచ్ రద్దయింది. లీగ్ మ్యాచ్‌ల్లో భారత్ ఆడిన నాలుగింట్లోనూ నెగ్గి, నాకౌట్‌కు చేరడం తెలిసిందే. ఇక, టీమిండియా ఇప్పుడు తన దృష్టి ఈనెల 19 నుంచి జరగనున్న అండర్-19 వరల్డ్‌కప్‌పైకి మరల్చింది.

నేపాల్ క్రికెటర్ లామిచానెకు 8 ఏళ్ల జైలు



ఖాట్మాండు: అత్యాచారం కేసులో నేపాల్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, స్పిన్నర్ సందీప్ లామిచానె (23)కు ఎనిమిదేళ్ల జైలుశిక్ష విధించారు. 18 ఏళ్ల యువతిపై రేప్ కేసులో లామిచానెను స్థానిక జిల్లా కోర్టు దోషిగా తేల్చింది. జైలుశిక్షతోపాటు రూ. 3 లక్షల జరిమానా విధించిన న్యాయస్థానం.. బాధితురాలికి మరో రూ. 2 లక్షలను నష్టపరిహారంగా చెల్లించాలని తీర్పునిచ్చింది. అయితే, జడ్జిమెంట్‌పై హైకోర్టుకు వెళ్తామని లామిచానె లాయర్ చెప్పారు. నేపాల్ తరఫున 51 వన్డేలు ఆడి 112 వికెట్లు తీసిన సందీప్.. 52 టీ20ల్లో 98 వికెట్లు పడగొట్టాడు. 2018-20 మధ్య ఢిల్లీ కేపిటల్స్‌కు ప్రాతినిథ్యం వహించిన సందీప్.. ఐపీఎల్‌లో ఆడిన తొలి నేపాలీ క్రికెటర్‌గా నిలిచాడు.





టాప్‌సీడ్లు జొకో, స్వియటెక్

» 14 నుంచి ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు రంగం సిద్ధమైంది. ఈనెల 14 నుంచి జరిగే ఈ హార్డ్‌కోర్టు గ్రాండ్‌స్లామ్‌లో పోటీపడే క్రీడాకారులకు సంబంధించిన సీడింగ్స్ వివరాలను నిర్వాహకులు బుధవారం వెల్లడించారు. పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ నొవాక్ జొకోవిచ్‌కు టాప్ సీడింగ్ దక్కింది. స్పెయిన్ సంచలనం అల్కారాజ్ 2, మెద్వెదెవ్ 3, జానిక్ సిన్నర్ 4, రుబ్లేవ్ ఐదో సీడ్‌లుగా బరిలోకి దిగనున్నారు. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నెంబర్‌వన్ ఇగా స్వియటెక్‌కు టాప్ సీడ్ లభించింది. డిఫెండింగ్ చాంప్ సబలెంకా రెండో సీడ్‌గా పోటీపడనుండగా, నిరుటి రన్నరప్ రిబకినాకు 3, గాఫ్‌కు 4, పెగులాకు 5వ సీడింగ్స్ దక్కాయి.

బిజినెస్

నాలుగేళ్లలో భారత్ @ నం.3

2027-28 నాటికి జీడీపీ 5 లక్షల కోట్ల డాలర్లు.. 2047 నాటికి 30 లక్షల కోట్ల డాలర్లు

వైబ్రెంట్ గుజరాత్ సదస్సులో సీతారామన్

గాంధీనగర్: వచ్చే నాలుగేళ్లలో (2027-28 ఆర్థిక సంవత్సరం నాటికి) భారత్ 5 లక్షల కోట్ల డాలర్లకు పైగా జీడీపీతో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధీమా వ్యక్తం చేశారు. 2047 నాటికి జీడీపీ 30 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోనుందని, తద్వారా భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారనుందన్నారు. బుధవారం ప్రారంభమైన 'వైబ్రెంట్ గుజరాత్ సదస్సు 2024'లో ప్రసంగిస్తూ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం భారత్ 3.4 లక్షల కోట్ల డాలర్ల జీడీపీతో ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోంది. అమెరికా, చైనా, జపాన్, జర్మనీ మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. దేశానికి స్వాతంత్ర్యం



వచ్చి వందేళ్లు పూర్తి కానున్న ఈ అమృత కాలంలో ఎలక్ట్రానిక్స్, టెక్నాలజీ వంటి నవతరం పరిశ్రమల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిసారించనుందన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్‌డీఐ) సంబంధించి మోదీ ప్రభుత్వం చేపట్టిన విధానపరమైన మార్పులతో గడిచిన 9 ఏళ్లలో దేశంలోకి 59,500 కోట్ల డాలర్ల విలువైన విదేశీ పెట్టుబడులు వచ్చాయన్నారు.

నెలాఖరుకు వికసిత్ భారత్ విజన్ పత్రం

అభివృద్ధి చెందిన (వికసిత్) భారత్ కేవలం కల కాదని, సుసాధ్యమేనని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం అన్నారు. అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందితే, దేశం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. దేశంలో భౌతిక, డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణ శరవేగంగా జరుగుతున్నదని, మిగతా వర్ధమాన దేశాల కంటే భారత్ మెరుగైన పనితీరు కనబరుస్తున్నదని అన్నారు. 2047 నాటికి 30 లక్షల కోట్ల డాలర్ల జీడీపీతో అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగేందుకు విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈనెలాఖరు కల్లా ప్రధాని మోదీ చేతుల మీదుగా ఆ డాక్యుమెంట్‌ను విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రపంచంలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్: లక్ష్మీ మిట్టల్

హజీరాలో ఆర్సెలార్‌మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా భారీ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నదని కంపెనీ అధిపతి లక్ష్మీ మిట్టల్ సదస్సులో తెలిపారు. ప్రపంచంలో ఇదే అతిపెద్ద సింగిల్ లొకేషన్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ కానుందన్నారు. 2029 నాటికి సిద్ధం కానున్న ఈ స్టీల్ ప్లాంట్ 2.4 కోట్ల టన్నుల ముడి ఉక్కు తయారీ సామర్థ్యం కలిగి ఉండనుంది. అయితే దీనిపై ఎంత పెట్టుబడి పెడుతున్నది వెల్లడించలేదు.

అదానీ రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు

వచ్చే ఐదేళ్లలో గుజరాత్‌లో రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ సదస్సులో ప్రకటించారు. తద్వారా లక్ష మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పెట్టుబడుల్లో భాగంగా అంతరిక్షం నుంచి సైతం కన్పించేలా 725 చదరపు కి.మీ విస్తీర్ణంలో ప్రపంచంలోనే అతిపెద్ద శుద్ధ ఇంధన ప్రాజెక్టును రాష్ట్రంలోని కచ్ ఎడారిలో నిర్మించనున్నట్లు వెల్లడించారు.

ధోలేరాలో చిప్ యూనిట్: టాటా

ధోలేరాలో భారీ సెమీకండక్టర్ (చిప్) తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్లు టాటా గ్రూప్ వెల్లడించింది. ఇందుకు సంబంధించి బేరసారాలు తుది దశలో ఉన్నాయని, ఈ ఏడాదిలో యూనిట్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని టాటా గ్రూప్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ సదస్సులో చెప్పారు. అలాగే, టాటా గ్రూప్ రాష్ట్రంలోని సనంద్‌లో 20 గిగావాట్ల లిథియం అయాన్ స్టోరేజ్ బ్యాటరీ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని సైతం రెండు నెలల్లో ప్రారంభించనుందన్నారు.

హజీరాలో కార్బన్ ఫైబర్ ప్లాంట్: అంబానీ

న్యూ మెటీరియల్స్, సర్క్యులర్ ఎకానమీలో గుజరాత్‌ను అగ్రగామిగా మార్చేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ హజీరాలో దేశంలో తొలి కార్బన్ ఫైబర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుందని కంపెనీ చైర్మన్ ముకేశ్ అంబానీ సదస్సులో ప్రకటించారు. అయితే, ఎప్పటిలోగా ఏర్పాటు చేయనున్నది, పెట్టుబడులు వంటి వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు.

రూ.35,000 కోట్లతో రెండో ప్లాంట్: మారుతి సుజుకీ

గుజరాత్‌లో రెండో కార్ల తయారీ ప్లాంట్ కోసం రూ.35,000 కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్లు మారుతి సుజుకీ ప్రకటించింది. 2030-31 నాటికి కంపెనీ కార్ల ఉత్పత్తి వార్షిక సామర్థ్యాన్ని 40 లక్షల యూనిట్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

బిగ్ సీ సంక్రాంతి ఆఫర్లు

BIG C

హైదరాబాద్: మొబైల్ రిటైలింగ్ చెయిన్ బిగ్ సీ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కస్టమర్లకు ఆకర్షణీయమైన ఆఫర్లు ప్రకటించింది. తమ షోరూమ్‌లో మొబైల్ కొనుగోలు చేసిన వారికి రూ.3,000 వరకు తక్షణ డిస్కౌంట్‌తో పాటు రూ.4,999 విలువ గల స్మార్ట్ వాచ్ ఉచితంగా అందిస్తున్నట్టు సీఎండీ బాలు చౌదరి తెలిపారు. అలాగే రూ.1,10,000 విలువ గల హెల్త్‌కేర్ బెనిఫిట్, రూ.75,000 విలువ గల పేమెంట్ బెనిఫిట్ అందిస్తున్నామన్నారు. సంక్రాంతి సందర్భంగా వివో ఎక్స్ 100 సిరీస్ స్మార్ట్‌ఫోన్లు ప్రవేశపెట్టామని, ఈ ఫోన్ కొనుగోలు చేసిన వారికి 10 శాతం తక్షణ క్యాష్‌బాక్‌తో పాటు రూ.10,999 విలువ గల ఫైర్‌బోల్ట్ స్మార్ట్ వాచ్, టీడబ్ల్యూఎస్ బడ్స్ ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. దీనితో పాటు రెడ్‌మీ నోట్ 13 సిరీస్ మొబైల్స్ కూడా విడుదల చేశామంటూ ఈ మొబైల్ కొనుగోలు చేసిన వారికి రూ.2,000 క్యాష్‌బాక్‌తో పాటు డిన్నర్ సెట్ ఉచితంగా అందిస్తున్నట్టు వెల్లడించారు. వీటితో పాటుగా ఎన్నో ఆకర్షణీయమైన ఇతర ఆఫర్లు కూడా ఉన్నట్టు చెప్పారు.

సంగీతాలో రెడ్‌మీ నోట్ 13 ఆవిష్కారం

Sangeetha

హైదరాబాద్: సంగీతా మొబైల్స్ యెలహంకా స్టోర్‌లో ఎంతో కాలంగా ఆతృతగా ఎదురు చూస్తున్న, అత్యంత అధునాతన ఫీచర్లు గల రెడ్‌మీ నోట్ 13 5జీ స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరిం చింది. ఇది స్మార్ట్‌ఫోన్ అనుభవాన్ని మరింత ఉన్నత శిఖరాలకు చేర్చుతుందని తెలిపింది. షామి ఇండియా ఓటీ హెడ్ సాజు రత్నం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రెడ్‌మీ నోట్ 13లో మిడ్‌రేంజ్ విభాగంలో మరింత ఆకర్షణీయమైన నోట్ 13, నోట్ 13 ప్రో, నోట్ 13 ప్రో ప్లస్ వేరియెంట్లుంటాయి. నోట్ 13 ప్రోప్లస్ అయితే ఫింగర్‌ప్రింట్ సెన్సర్‌తో కూడిన 120 హెచ్‌జడ్ కర్వ్‌డ్ స్క్రీన్, 200 ఎంపీ మెయిన్ లెన్స్ కెమెరా ఉన్నాయి. దీనికి గల 120డబ్ల్యూ సూపర్ ఫాస్ట్ చార్జర్ సహాయంతో 5000 ఎంఏహెచ్ బ్యాటరీ కేవలం 20 నిముషాల వ్యవధిలోనే నూరు శాతం చార్జి అవుతుంది. ఐపీ 68 సర్టిఫికేషన్ గల ఈ ఫోన్ డస్ట్, వాటర్ రెసిస్టెంట్‌గా ఉంటుంది.

మార్కెట్‌లో 'డ్రీమ్' రిస్ట్ ఫోన్ ధర రూ.5,999



న్యూఢిల్లీ: స్మార్ట్‌వాచ్, స్మార్ట్‌ఫోన్ల మధ్య తేడా చెరిగిపోనుంది. ఈ రెండు పనులు 'రిస్ట్ ఫోన్' అనే ఒకే వస్తువు చేయనుంది. ఫైర్‌బోల్ట్ కంపెనీ భారత మార్కెట్‌లో తొలిసారిగా 'డ్రీమ్' పేరుతో ఈ వినూత్న పరికరాన్ని విడుదల చేసింది. అత్యాధునిక ఫీచర్లతో కూడిన ఈ ఆండ్రాయిడ్ రిస్ట్‌ఫోన్ ధర రూ.5,999. ఈ రిస్ట్‌ఫోన్‌ని స్మార్ట్‌ఫోన్‌గా, స్మార్ట్ రిస్ట్‌వాచ్‌గా ఉపయోగించవచ్చు. ఫ్లిప్‌కార్ట్‌తో పాటు కంపెనీ వెబ్‌సైట్, ఆఫ్‌లైన్ స్టోర్లలోనూ ఈ రిస్ట్‌ఫోన్ లభించనుంది.

'డ్రీమ్' రిస్ట్‌ఫోన్ ఫీచర్లు : 4జీ ఎల్‌టీఈ నానో సిమ్; కాలింగ్, మెసేజింగ్‌తో పాటు యూట్యూబ్, వాట్సప్ వంటి సోషల్ మీడియా యాప్స్, 2.02 అంగుళాల స్క్రీన్, ఆండ్రాయిడ్ 8.1 ఆపరేటింగ్ సిస్టమ్, 2 జీబీ రామ్‌తో కూడిన కార్టెక్స్ క్వాడ్ కోర్ సీపీయూ, 16 జీబీ స్టోరేజి, వైఫై, జీపీఎస్ వంటి సదుపాయాలు.

ఆదుకున్న ఆఖరి గంట కొనుగోళ్లు

» లైఫ్ టైమ్ హైలో రిలయన్స్ షేర్లు

ముంబై: స్టాక్‌మార్కెట్ బుధవారం తీవ్ర ఆటుపోట్లకు లోనైనా చివరి గంట కొనుగోళ్లతో లాభాల్లో ముగిసింది. సెన్సెక్స్ 71,110.98 పాయింట్లు, 71,733.84 పాయింట్ల మధ్యన కదలాడి ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 271.50 పాయింట్ల లాభంతో 71,657.71 వద్ద ముగిసింది. నిఫ్టీ 73.85 పాయింట్ల లాభంతో 21,618.70 వద్ద ముగిసింది. ట్రేడింగ్ చివర్లో రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వంటి హెవీ కౌంటర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో నష్టాల నుంచి బయటపడింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు బుధవారం బీఎస్ఈలో 2.7 శాతం వృద్ధితో జీవిత కాల గరిష్ఠ స్థాయి రూ.2,658.95ని నమోదు చేశాయి. చివరికి 2.69 శాతం లాభంతో రూ.2,649.95 వద్ద ముగిశాయి.

పబ్లిక్ ఇష్యూకి జేఎస్‌డబ్ల్యూ సిమెంట్: జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ ఐపీఓకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ రూ.6,000 కోట్ల మెగా ఐపీఓ కోసం కంపెనీ ఇప్పటికే ప్రముఖ దేశ, విదేశీ బ్యాంకులతో చర్చలు జరుపుతోంది. ఈ ఐపీఓ మార్కెట్‌కు వస్తే సిమెంట్ రంగంలో ఇదే అతి పెద్ద ఐపీవో అవుతుంది. జేఎస్‌డబ్ల్యూ సిమెంట్‌కు ఏపీలోని నంద్యాల, కర్ణాటకలోని విజయనగర్, పశ్చిమ బెంగాల్‌లోని సల్బోని, ఒడిసాలోని జాజ్‌పూర్, మహారాష్ట్రలోని డొల్వి వద్ద సిమెంట్ ప్లాంట్లున్నాయి.



షోరూంను ప్రారంభిస్తున్న కుమార్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సుబ్రహ్మణ్యం

తెనాలిలో రామ్‌రాజ్ షోరూం

తెనాలి (ఆంధ్రజ్యోతి): వస్త్రాల తయారీ సంస్థ 'రామ్‌రాజ్' తెనాలిలోని కొత్తపేటలో షోరూంను ఏర్పాటు చేసింది. ఈ షోరూంను బుధవారం ఉదయం 'కుమార్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్' మేనేజింగ్ డైరెక్టర్ కె.సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. తెనాలి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ దేసు శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలనం చేశారు. ఛాంబర్ సెక్రటరీ రావూరి సుబ్బారావు మొదటి కొనుగోలును చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. బ్యాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ పొందేలా ప్రత్యేక యాంటి బ్యాక్టీరియల్ ధోవతులు కొత్తగా ఆవిష్కరించినట్లు వివరించారు. అదే విధంగా ఇటీవలే మహిళల కోసం ప్రత్యేక కాటన్, శిల్క్ చీరలను ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు

త్వరలో విమానాశ్రయాల వ్యాపారం లిస్టింగ్

» అదానీ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ జీత్ అదానీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విమానాశ్రయాల వ్యాపారాన్ని లిస్టింగ్ చేయాలని అదానీ గ్రూప్ యోచిస్తోంది. స్థిరంగా ఏడాదిపాటు నవీ ముంబై విమానాశ్రయం కార్యకలాపాలు పూర్తి చేసిన తర్వాత విమానాశ్రయాల వ్యాపారాన్ని సమీప భవిష్యత్తులో లిస్టింగ్ చేసే వీలుందని గౌతమ్ అదానీ కుమారుడు, అదానీ ఎంటర్‌ప్రైజెస్ వైస్ ప్రెసిడెంట్ జీత్ అదానీ తెలిపారు. అదానీ ఎంటర్‌ప్రైజెస్‌కు 100 శాతం అనుబంధ కంపెనీ అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ లిమిటెడ్ (ఏఏహెచ్ఎల్) మొత్తం ఏడు విమానాశ్రయాలను నిర్వహిస్తోంది. వీటిలో ముంబై, మంగళూరు, అహ్మదాబాద్, జయపుర, తిరువనంతపురం ఉన్నాయి. నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్‌లో ఏఏహెచ్ఎల్‌కు 74 శాతం వాటా ఉంది. ప్రస్తుతం అన్ని విమానాశ్రయాలు సామర్థ్య విస్తరణలో ఉన్నాయని, గత ఏడాదిలో ఈ విమానాశ్రయాల నుంచి 8 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు నిర్వహించారని జీత్ అదానీ తెలిపారు. నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ఏడాది చివరి నాటికి పూర్తవుతుంది.

సన్‌షైన్‌లో కిమ్స్‌కు మరింత వాటా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సర్వేజన హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో (కిమ్స్-సన్‌షైన్ హాస్పిటల్) వాటాను కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లిమిటెడ్ (కిమ్స్) మరింత పెంచుకుంది. అనుబంధ కంపెనీ సర్వేజన హెల్త్ కేర్‌లో మరో 5.04 శాతం వాటాను సొంతం చేసుకున్నట్లు కిమ్స్ వెల్లడించింది. దీంతో సర్వేజనలో కిమ్స్ వాటా 59.10 శాతం నుంచి 64.14 శాతానికి చేరుతుంది. గత ఆర్థిక సంవత్సరంలో కిమ్స్-సన్‌షైన్ హాస్పిటల్ టర్నోవర్ రూ.279.97 కోట్లు ఉంది. దీన్ని 2009లో ఏవీ గురవారెడ్డి ప్రారంభించారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,960 ▲	57,710 ▲	77,500 ▼
ముంబై	62,350 ▼	57,110 ▼	71,450 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

10వ తేదీ		విజయవాడ	565
హైదరాబాద్	540	విశాఖపట్నం	599
11 జనవరి		వరంగల్	542
చిత్తూరు	573	డజను గుడ్లు రూ.72	
గోదావరి	565		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	85	గోదావరి	84
వరంగల్	85	విజయవాడ	84
కరీంనగర్	85	గుంటూరు	85
మహబూబ్‌నగర్	85	ఒంగోలు	85
కర్నూలు	85	చిత్తూరు	90
విశాఖపట్నం	79		

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 11-1-2024 | Vijayawada | Hyderabad | Mahabubnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**



తుని సభకు హాజరైన జనం.. మాట్లాడుతున్న చంద్రబాబు

జగన్ మళ్లీ వస్తే జనాలూ తాకట్టే

రాష్ట్రానికే అరిష్టం.. ఓడిపోతేనే మోక్షం

అంత కరుడుగట్టిన నేరస్తుడు, అవినీతిపరుడు ప్రపంచంలోనే లేడు

బూతులు తిట్టే వారికే వైసీపీలో సీట్లు

ఇంకా 80 మందిని మార్చుతాడంట

అంటే ఓటమిని ఒప్పుకొంటున్నట్టే

అరాచక పాలనకు అంతం పలుకుదాం

అంతా గర్వపడేలా స్వర్ణాంధ్ర సాధిద్దాం

తుని, బొబ్బిలి సభల్లో బాబు పిలుపు

సీఎం ఏం చెప్పినా రివర్స్ గేరే.. చాలా పేదోడని చెబుతుంటాడు

అవును ఇల్లే కాదు.. డ్రాయరూ లేదు.. అడుక్కు తింటున్నాడు

కాకినాడ/విజయనగరం (ఆంధ్రజ్యోతి)/బొబ్బిలి, జనవరి 10: ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రానికి అరిష్టమని, అయనంతటి కరుడుగట్టిన నేరస్తుడు, అవినీతిపరుడు ప్రపంచంలోనే లేడని టీడీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. అటువంటి వ్యక్తి అధికారం నుంచి దిగిపోతేనే రాష్ట్రానికి మోక్షమన్నారు. ఒకవేళ మళ్లీ జగన్ వస్తే చివరకు ప్రజలను కూడా తాకట్టు పెట్టేస్తాడని హెచ్చరించారు. అందుకే వైసీపీ రాతియుగం పోవాలని, టీడీపీ, జనసేన స్వర్ణయుగం రావాలని పిలుపునిచ్చారు. బుధవారం కాకినాడ జిల్లా తుని, విజయనగరం జిల్లా బొబ్బిలిలో జరిగిన రా.. కదలి రా బహిరంగ సభల్లో

మిగతా 11వ పేజీలో...

సంక్రాంతికి టీడీపీ తొలి జాబితా!

20-25 స్థానాల్లో పేర్ల ప్రకటన.. ఐవీఆర్ఎస్ విధానంలో సర్వే

ప్రజాభిప్రాయం సహా రెండు మార్గాల్లో కసరత్తు

కొద్ది మంది తప్ప అంతా పాతకాపులకే సీట్లు

11



ఎంపీ సంజీవ్‌కుమార్

మరో బీసీ బలి!

ఓసీ నేతకు జగన్ ఆహ్వానం

వైసీపీని వీడిన పద్మశాలి ఎంపీ సంజీవ్‌కుమార్

ఆ పార్టీలో చేరిన అగ్ర వర్ణ ఎంపీ కేశినేని నాని

బలహీన వర్గాలనే టార్గెట్ చేస్తున్న జగన్

సిటింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలకు మొండిచేయి

కేశినేనిని తాడేపల్లి తీసుకెళ్లిన అయోధ్యరామిరెడ్డి

వైసీపీలోకి ఆహ్వానించిన ముఖ్యమంత్రి

రాజీనామా ఆమోదం పొందాక చేరతానన్న నాని

పాదయాత్ర అర్హత లేదంటూ లోకేశ్‌పై విమర్శలు

కేశినేని నాని వైసీపీ కోవర్టు.. బుద్దా మండిపాటు

ఎమ్మెల్యేలే అభివృద్ధి చేస్తారట.. మీకేం పని అని సీఎం అన్నారు.. కర్నూలు ఎంపీ సంజీవ్ ఆవేదన

మార్పుచేర్పులపై తెగని సీఎం కసరత్తు

మలి జాబితా నేడు ప్రకటించే అవకాశం

10



8

పవన్‌తో రాయుడు భేటీ

పవన్ ఆలోచనలు నచ్చాయని వెల్లడి

వైసీపీ ఐడియాలజీతో ఇమడలేక బయటకు వచ్చానన్న మాజీ క్రికెటర్

బాబుకు ఊరట!



ఐఆర్ఆర్, మద్యం, ఇసుక కేసుల్లో ముందస్తు బెయిల్

మద్యం కేసులో కొల్లు రవీంద్ర, శ్రీనరేశ్‌కు కూడా.. కేసులపై బహిరంగ వ్యాఖ్యలు చేయొద్దు

ఇద్దరి పూచీకత్తుతో రూ.లక్ష బాండు ఇవ్వాలి.. పిలిచినప్పుడు విచారణకు హాజరు కావాలి

బాబుకు హైకోర్టు ఆదేశం.. 48 గంటల ముందు నోటీసివ్వాలని దర్యాప్తు అధికారికి నిర్దేశం

అమరావతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. రాజధాని అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్), ఉచిత ఇసుక పాలసీ, మద్యం పాలసీకి సంబంధించి సీఐడీ నమోదు చేసిన మూడు కేసుల్లోనూ ఉన్నత న్యాయస్థానం ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. వారం రోజుల్లో సంబంధిత దర్యాప్తు అధికారి ముందు లొంగిపోవాలని చంద్రబాబుకు సూచించింది. దర్యాప్తు అధికారి సంతృప్తి మేరకు ఇద్దరి పూచీకత్తుతో రూ.లక్ష విలువ కలిగిన బాండు సమర్పించాలని స్పష్టం చేసింది. అనంతరం ఆయన్ను విడుదల చేయాలని ఆదేశించింది. దర్యాప్తు నిమిత్తం అవసరమైనప్పుడు దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని చంద్రబాబుకు స్పష్టం చేసింది. అయితే ఆయన హాజరు కోరుతూ కనీసం 48 గంటల ముందు నోటీసులు ఇవ్వాలని దర్యాప్తు అధికారికి తేల్చిచెప్పింది. దర్యాప్తునకు సహకరించాలని, కేసుతో సంబంధం ఉన్నవారిని ప్రత్యక్షంగాకానీ పరోక్షంగాకానీ ప్రలోభపెట్టవద్దని, బెదిరించవద్దని చంద్రబాబును ఆదేశించింది. కేసులకు సంబంధించి బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్యలూ చేయొద్దని స్పష్టం చేసింది. ముందస్తు బెయిల్ ఉత్తర్వుల్లో

మిగతా 11వ పేజీలో...

తప్పు జరిగినట్లు ఆధారాలు చూపించాలి

ఏ కారణాలూ లేకుండా మూడున్నరేళ్లు కాలయాపన

ఇప్పుడు అరెస్టు చేసి ముందుకెళ్తామనడం సరికాదు

ప్రతిపక్ష నేత ప్రభుత్వ డాక్యుమెంట్లను ట్యాంపర్ చేయలేరు

ఎందుకు అరెస్టు చేయాలో అర్థం కావడం లేదు

ఐఆర్ఆర్ కేసులో హైకోర్టు కీలక వ్యాఖ్యలు

11

న్యాయ శాఖ సలహా మేరకే 'వాయిదా' చెల్లింపుల చాన్సు!



నాటి సీఎం నేరుగా నిర్ణయం తీసుకోలేదు

నేరత్వం ఆపాదించడానికి వీల్లేదు

డిస్టిలరీలకు అనుమతిలో పిటిషనర్ల ప్రమేయంపై ఆధారాలను చూపలేదు

17ఏ వర్తింపుపై సుప్రీం నిర్ణయం పెండింగ్

దానిపై అభిప్రాయం చెప్పలేం.. మద్యం కేసులో హైకోర్టు

ఉచిత ఇసుక పాలసీతో చంద్రబాబు లబ్ధి పొందినట్లు ఆధారాల్లేవు

అధికారుల వైఫల్యానికి విధాన రూపకర్తలను బాధ్యులను చేయలేం.. న్యాయమూర్తి వెల్లడి



వేల కోట్ల దోపిడీకి చెక్

గార, భీమిలిలో బీచ్‌శాండ్ మినరల్స్ కాంట్రాక్టుకు బ్రేక్

ప్రైవేటు మైనింగ్‌పై 2019లోనే నిషేధం

డెవలపర్ పేరిట దొడ్డిదారిన ప్రైవేటుకు కట్టబెట్టాలనుకున్న జగన్ సర్కారు

హైకోర్టు చర్యలతో నిలిచిన కాంట్రాక్ట్

మూడు కంపెనీల నుంచి బిడ్‌లు

అందులో అస్మదీయ కంపెనీ ఒకటి

టెండర్లు ఓకే.. బిడ్లు ఖరారు చేయొద్దు

బీచ్‌శాండ్ మైనింగ్‌పై హైకోర్టు ఆదేశం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో చోటుచేసుకోబోతున్న మరో భారీ దోపిడీకి హైకోర్టు చెక్‌పెట్టింది. ప్రభుత్వ పెద్దలకు అస్మదీయుడైన ప్రముఖ పారిశ్రామిక వేత్త అదానీకి బీచ్‌శాండ్ కాంట్రాక్ట్ ఇవ్వడానికి సంకల్పించిన వ్యూహాన్ని న్యాయస్థానం ప్రస్తుతానికి అడ్డుకుంది. బీచ్‌శాండ్ టెండర్ల ఖరారును నిలిపివేస్తూ హైకోర్టు బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ఈ విషయంపై అధికారుల్లో అయోమయం నెలకొంది. కాస్తోకూస్తో కాదు.. ఏకంగా రూ.లక్ష కోట్లకు పైగా విలువైన బీచ్‌శాండ్ మినరల్స్ తవ్వకం పనులను కేంద్ర చట్టాలను ధిక్కరించి మరీ అదానీకి డెవలపర్ పేరిట దొడ్డిదారిలో

మిగతా 10వ పేజీలో...

ముస్సిపల్ సమ్మె విరమణ

ఆరోగ్య భత్యం సహా రూ.21 వేల వేతనం

సంక్రాంతికి ఒక్కో కార్మికుడికి రూ.వెయ్యి

సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నాం

హామీలపై జీవోలొచ్చాకే పూర్తి విరమణ: సంఘాలు

జీతం పెంచిందేమీ లేదు.. ఓహెచ్ఏ సర్దుబాటే!

12

ఏక్‌నాథ్ షిండేదే అసలైన శివసేన

1999 నాటి పార్టీ రాజ్యాంగమే ప్రామాణికం

షిండేపై చర్యలకు ఉద్ధవ్‌కు అధికారం లేదు

మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ స్పష్టీకరణ

సంక్షోభం తర్వాత 18 నెలలకు నిర్ణయం

సుప్రీంకోర్టులో సవాల్ చేస్తాం: ఉద్ధవ్ ఠాక్రే

8

రామాలయానికి రాం.. రాం!

ఆహ్వానాన్ని తిరస్కరించిన సోనియా, ఖర్గే, అధీర్

అది ఆర్ఎస్ఎస్-బీజేపీ కార్యక్రమమని వ్యాఖ్య

రామ మందిరాన్ని రాజకీయ ప్రాజెక్టుగా మార్చాయని కాంగ్రెస్ నేతల విమర్శ

8

లాగిన్‌చేశారు!

ఓటరు జాబితాలో వైసీపీ మహా మోసం

తిరుపతి ఉప ఎన్నికల్లో జరిగిన మోసాన్ని బయటపెట్టిన కేంద్ర ఎన్నికల కమిషన్

ఎన్నికల కమిషనర్ లాగిన్‌ను అధికార నేతకు చేర్చిన అప్పటి తిరుపతి మున్సిపల్ కమిషనర్ గిరిషా!

దాంతో ఉప పోరులో భారీగా డూప్లికేట్ ఓట్లు

మీ లాగిన్ ఎక్కడుందో తెలుసా?.. ఇప్పుడు కలెక్టరుగా ఉన్న గిరిషాను ప్రశ్నించిన సీఈసీ

ఆ లాగిన్‌తో 30 వేల కార్డులు డౌన్‌లోడ్ చేశారని వెల్లడి

ఏమిటిదని ప్రశ్నించిన ఈసీ.. ఐ డోంట్ నో అంటూ జవాబు

దొంగ కార్డుల వ్యవహారంలో నెల్లూరు ఎస్పీపైనా ఆగ్రహం

అమరావతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలు వస్తే చాలు అధికార పార్టీ అన్ని అడ్డదారులూ తొక్కుతోంది. చివరకు.. ఎన్నికల కమిషనరు లాగిన్‌తో ఓటరు జాబితా డౌన్‌లోడ్ చేసుకుని భారీ అక్రమాలకు పాల్పడినట్టు తాజాగా బయటపడింది. తిరుపతి ఉప ఎన్నికల్లో చోటుచేసుకున్న ఈ ఘటన కేంద్ర ఎన్నికల కమిషన్.. జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహిస్తున్న సమావేశంలో వెలుగులోకి వచ్చింది. నిజానికి, తిరుపతి ఉప ఎన్నికలో వైసీపీ తేలిగ్గా నెగ్గగలదు. అయినా, రాజకీయంగా తమకు తిరుగులేదు అని చెప్పుకొనేందుకు భారీ బలప్రదర్శనకు పాల్పడింది. ఈ క్రమంలో చేయని అక్రమాలు, పాల్పడని మోసాలు లేవు. నిజానికి, ఈ ఏడాది మొదటి నుంచీ ఓటరు జాబితాలను అధికార పార్టీ గల్లంతు

మిగతా 3వ పేజీలో...

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు

ఓట్ల తొలగింపుపై పార్టీల ఫిర్యాదులు

వాటిని పరిశీలించి ఇప్పటికే చర్యలు

నిష్పక్షపాతంగా పనిచేయాల్సిందేనని కలెక్టర్లు, ఎస్పీలకు ఆదేశాలు

సీఈసీ రాజీవ్‌కుమార్ వెల్లడి

3



బుధవారం బెజవాడలో మీడియాతో మాట్లాడుతున్న సీఈసీ రాజీవ్‌కుమార్, ఇతర కమిషనర్లు



పుట్టపర్తిలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద బతుకమ్మ ఆడుతూ అంగన్వాడీల నిరసన

సడలని దీక్ష.. ప్రభుత్వానికి పరీక్ష

నోటీసులకు వెరవని అంగన్వాడీలు

12

తప్పుల 'రాజు'

మందుల విక్రయాల్లోనూ దందా

తనకు చెందిన కంపెనీ మందులే వినియోగించాలని ఆస్పత్రులపై ఒత్తిడి

నాసిరకం మందులు అంటగట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటం

అనుచరుల ద్వారా అవినీతి దందా

కరిగిపోతున్న కంకర కొండలు

విలువైన ప్రభుత్వ స్థలాలు సొంతం

ఉద్యోగాలు బేరం పెట్టి వసూళ్లు

ఉత్తరాంధ్ర జిల్లాల్లో అరాచకం

చీదరించుకునేలా మంత్రి అక్రమాలు

(శ్రీకాకుళం-ఆంధ్రజ్యోతి)

గత ఎన్నికల్లో గెలిచి తొలిసారిగా ఎమ్మెల్యే అయ్యారు. ఆ తర్వాత అధికార పార్టీలో మారిన సమీకరణాలు.. కలిసివచ్చిన అదృష్టంతో మంత్రి పదవి వరించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాలుగు మంచి పనులు చేసి పేరు తెచ్చుకోకుండా.. స్థానిక ప్రజలతో పాటు సొంత పార్టీ కార్యకర్తలే చీదరించుకునే పనులు చేస్తున్నారు. జేబులు నింపుకొనేందుకు అన్ని అడ్డదారులూ

మిగతా 12వ పేజీలో...





• ఇదేం పని.. అమాత్యా?

పూర్వ నేపథ్యం.. వైద్య రంగం. కాలం కలిసి రావడంతో అనతి కాలంలోనే మంత్రి అయ్యారు. ఉత్తరాంధ్రలోని ఆ జిల్లా ప్రజల పాలిట అదే శాపమైంది. మంత్రి తన 'పూర్వానుభవం'తో మందుల వ్యాపారం మొదలు పెట్టారు. తన కంపెనీకి చెందిన మందులే వినియోగించాలని ప్రైవేటు ఆస్పత్రులపై ఒత్తిడి తెచ్చి, రోగులకు నాసిరకం మందులు అంటగడుతూ క్యాష్ చేసుకుంటున్నారని తీవ్ర ఆరోపణలు ఉన్నాయి.

• కన్ను పడితే అంతే!

అవినీతి, అక్రమాల్లో సదరు మంత్రి ప్రమేయం నేరుగా ఉండదు. తన అనుచరుల ద్వారా 'వ్యవహారం' నడిపించి సొమ్ము చేసుకుంటున్నారు. నియోజకవర్గంలో కొండలు కరిగించేస్తున్నారు. కంకర తవ్వకాలతో కోట్లు దండుకుంటున్నారు. ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నారు. స్థానికంగా ఉద్యోగాలను బేరం పెట్టి ఒక్కో పోస్టుకు రూ.6 నుంచి రూ.10 లక్షలు దాకా వసూలు చేసినట్లు సమాచారం.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'మిత్ర' విజయాలు

పొరుగుదేశాలతో చారిత్రక, సాంస్కృతిక బంధం ఎంతబలంగా ఉన్నప్పటికీ, అక్కడ అధికారంలోకి వచ్చిన రాజకీయపక్షాల వైఖరి దౌత్య సంబంధాలను ప్రభావితం చేస్తూనే ఉంటుంది. మనతో సరిహద్దులు పంచుకొనే దేశాల్లో అధికారపక్షాలు మారినప్పుడల్లా వియ్యం, కయ్యం సహజం. నేపాల్‌లో కేపీశర్మ ఓలీ అధికారంలో ఉన్నంతకాలం ఏదో రచ్చ తప్పలేదు. కాస్త దూరంలో ఉన్న మాల్దీవుల్లో ఇప్పటికే మనమంటే గిట్టని పాలకుడు అధికారంలోకి వచ్చి గిల్లికజ్జాలు మొదలుపెట్టాడు. ఈ నేపథ్యంలో, భూటాన్, బంగ్లాదేశ్‌లలో భారత్ అనుకూల నాయకులు ఇటీవల అధికారంలోకి రావడం మనకు పెద్ద ఊరట.

భూటాన్‌లో మంగళవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ (పీడీపీ) నాయకుడు షేరింగ్ తోగ్బే మూడింట రెండువంతుల స్థానాలు గెలుచుకున్నారు. 2013—18మధ్యకాలంలో ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు భారతదేశానికి అనుకూలంగా వ్యవహరించారు. ఇప్పుడు చైనా—భూటాన్ సరిహద్దు ఒప్పందం చివరి అంకంలో ఉండగా, తోగ్బే మళ్ళీ ఆ పదవిలోకి వచ్చారు. ఇరుదేశాల మధ్యా ఉన్న వివాదాస్పద భూభాగాలను ఇచ్చిపుచ్చుకొనేందుకు ఉద్దేశించిన ఈ ఒప్పందంలో భాగంగా, పశ్చిమ భూటాన్‌లోని ప్రాంతాలను చైనాకు ఇస్తే, ఉత్తరంలో ఉన్నవాటిని భూటాన్‌కు చైనా అప్పగిస్తుంది. ఈ పశ్చిమప్రాంతంలోనే డోక్లామ్ ఉన్నందున, అక్కడ చైనా చొరబాట్లమీద భారత్ మండిపడుతున్న తరుణంలో, వివాదం పరిష్కారంలో భాగం కావడానికి చైనాకు కూడా హక్కు ఉన్నదని అప్పటి భూటాన్ ప్రధాని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో కొత్త ప్రధాని భారతదేశంతో సత్సంబంధాలని, ప్రత్యేక ఆర్థిక అనుబంధాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. అభివృద్ధి పేరిట సాగే విధ్వంసం కంటే, సంతోషంగా జీవించడం ప్రధానమని నమ్ముతూ, తన 'హ్యాపీనెస్ ఇండెక్స్'తో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన భూటాన్ ఇప్పుడు పలు కష్టాల్లో ఉంది. గత ఐదేళ్ళుగా ఆర్థికవృద్ధి రెండుశాతం లోపు ఉంటూ, నిరుద్యోగం 29శాతానికి చేరి, యువకులు వలస పోతున్న స్థితిని ఎదుర్కొంటోంది. హార్వర్డ్ యూనివర్సిటీలో ఉన్నతచదువులు చదివిన కొత్త ప్రధానిమీద ప్రజలు ఇప్పుడు ఎంతో నమ్మకం పెట్టుకున్నారు.

బంగ్లాదేశ్ ఎన్నికల ఫలితాలు ఊహించినట్టుగానే ఉన్నాయి. బంగ్లాదేశ్ పితామహుడు షేక్ ముజిబూర్ రహ్మాన్ కుమార్తె హసీనా వరుసగా నాలుగోసారి ప్రధాని అయ్యారు. ఎన్నికల బరిలో విపక్షం అంటూ లేకపోవడంతో 299స్థానాల్లో 223ఆమె పార్టీయే స్వాధీనం చేసుకుంది. ఆ తరువాత అత్యధిక స్థానాలు గెలుచుకుంది ఇండిపెండెంట్లే. వీరిని, పార్టీ తరఫున టికెట్లు ఇవ్వకుండా, తన అభ్యర్థులమీద గెలిచేట్టుగా అవామీ లీగ్ చూసుకుందని ఓ వాదన. ఎన్నికలు అప్రజాస్వామికంగా జరుగుతున్నాయని అమెరికా సహా దాని మిత్రదేశాలన్నీ గోలపెడుతున్న నేపథ్యంలో, అన్ని స్థానాలూ తానే నెగ్గితే బాగుండదని హసీనా అనుకున్నారేమో! ఆపద్ధర్మ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎన్నికలు జరగాలంటూ మాజీ ప్రధాని బేగం ఖలీదాజియా నేతృత్వంలోని ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ, దాని మిత్రపక్షాలూ పట్టుబడితే, రాజ్యాంగపరంగా అటువంటి నియమం లేదంటూ హసీనా ప్రభుత్వం కాదు పొమ్మంది. ఖలీదా జియా గృహనిర్బంధంలోనూ, ఆమె కుమారుడు విదేశాల్లోనూ ఉంటూ, మిగతా పెద్ద నాయకులంతా జైళ్ళలోనూ ఉన్నందున ఆమె పార్టీ విజయావకాశాలు నిజానికి బాగా తక్కువే. అయితే, ఎన్నికలను ఇలా వరుసగా బాయ్‌కాట్ చేయడం కాక, ఇప్పుడు కనీసం పోటీలో నిలబడినా బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ తన ఉనికిని కాపాడుకోగలిగేది. మళ్ళీ హసీనాకు ఇలా అధికారం పళ్ళెంలో పెట్టి అప్పగించడంతో పాటు, ఖలీదాజియా పార్టీ తన రాజకీయ భవిష్యత్తును మరింత కోల్పోయింది. బంగ్లాదేశ్ పార్లమెంట్‌లో ఇప్పుడు ప్రతిపక్షమే లేకుండా పోవడం హసీనా మరింత నిరంకుశంగా వ్యవహరించడానికి ఉపకరిస్తుంది. భారతదేశానికి సంబంధించినంతవరకూ హసీనా పునరాగమనం మంచిదే. ఖలీదా పెంచిపోషించిన ఉల్ఫా తీవ్రవాదం, మత తీవ్రవాదం మనకు తీవ్ర నష్టం చేశాయి. హసీనా వచ్చీరాగానే, బంగ్లాదేశ్‌నుంచి మన ఈశాన్యంలో చిచ్చుబెడుతున్న తిరుగుబాటుదారులను ఏరిపారేయడం, అప్పగించడం పెద్ద ఎత్తున జరిగాయి. తనదేశంలోని మతతత్వ శక్తులను ఉక్కుపాదంతో అణచివేశారు. ఉభయదేశాల ఆర్థిక, వాణిజ్య, రవాణా సంబంధాలు మెరుగుపడ్డాయి. దుర్భర దారిద్ర్యంలో మగ్గుతున్న బంగ్లాదేశ్ ఆమె పాలనలో ఎంతో బాగుపడింది. సంపూర్ణాధికారం ఎలాగూ సిద్ధించింది కనుక, కాస్తంత ప్రజాస్వామికంగా నడుచుకుంటే అగ్రరాజ్యాల ఆగ్రహాన్ని కాస్తంత ఉపశమింపచేయవచ్చు.

వందేళ్ల కార్చిచ్చు చల్లారేదెలా?

గత రెండు దశాబ్దాలుగా పెద్ద హింసాత్మక ఘటనలేవీ జరగకపోవటంతో పాలస్తీనీయుల నుంచి ఎదురయ్యే హింసను అరికట్టడంలో సఫలమయ్యామని ఇజ్రాయెల్ భావించింది. ముప్పేదీ లేనప్పుడు పాలస్తీనా సమస్య పరిష్కారానికి శాంతి చర్చలు, ఒప్పందాలు ఇక అవసరం లేదని ఆ దేశం వారు భావిస్తూ వచ్చారు. గత అక్టోబరు 7న జరిగిన దాడి ఆ భ్రమలకు తెర దించింది. అప్పటి నుంచి కొనసాగుతున్న హింసలో ఇరువైపుల సాధారణ పౌరులు ఎందరో మరణించారు. తాత్కాలిక యుద్ధ విరమణలతో తీవ్రత కొంత తగ్గింది గానీ ఘర్షణలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. భవిష్యత్తులో, ముఖ్యంగా పౌరులపై హింస పునరావృతం కాకుండా ఉండడానికి, పాలస్తీనా సమస్య పరిష్కారం దిశగా దృఢమైన చర్యలు అవసరం. ఇది ఇజ్రాయెల్ గ్రహిస్తే తప్ప ఈ ఘర్షణలకు అంతం ఉండదు.

పాలస్తీనియన్లకు, ఇజ్రాయెలీలుగా మారిన యూదు వలసదారులకు మధ్య హింసా చక్రం ఒక శతాబ్దం నాటిది. బ్రిటీషువారు 1920లో నానాజాతి సమితి ఆదేశంగా పాలస్తీనాపై నియంత్రణ సాధించిన తరువాత, ఈ భూభాగాన్ని యూదుల జాతీయ నివాసంగా ప్రచారం చేస్తూ, యూదు వలసలను అపరిమితంగా ప్రోత్సహించారు. దీనితో ఇరు వర్గాల మధ్య హింసాత్మక ఘర్షణలు మొదలయ్యాయి. పాలస్తీనాలో యూదుల స్థిరనివాసాన్ని నిరసిస్తూ అక్కడి అరబ్బుల అల్లర్లు మొదట 1920లలో చెలరేగాయి. అవి 1930లలో పూర్తి స్థాయి ఘర్షణలుగా మారాయి. మొదట యూదు ఉగ్రవాద సంస్థలు పాలస్తీనీయులకు వ్యతిరేకంగా పలు దాడులు చేసినాయి. 1948లో ఇజ్రాయెల్ రాజ్యం ఏర్పడిన తరువాత రాజ్యపరంగానే ఈ దాడులు కొనసాగాయి. ఇజ్రాయెల్ రాజ్య స్థాపనకు వ్యతిరేకంగా పాలస్తీనీయులు కూడా పలు ఉగ్రవాద దాడులు నిర్వహించారు. కొన్ని దశాబ్దాలపాటు జియోనిస్ట్ వ్యతిరేక పాలస్తీనా ఉద్యమాలు ప్రధానంగా లౌకిక సమూహాలచే నిర్వహించబడ్డాయి.



ఇజ్రాయెల్ – పాలస్తీనాల మధ్య చర్చలు కష్టం, కానీ అత్యవసరం. శాంతి కోసం 1993 ఓస్లో ప్రక్రియలో స్థూలంగా అంగీకరించిన అంశాలు కీలకమైనవి. వీటికి ఇజ్రాయెల్ ఒప్పుకోవటమేగాక, ఆ దేశం వెంట ఉండి దాన్ని అన్ని రకాలుగా సమర్థిస్తున్న అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాల వైఖరులలో మార్పు లేనిదే పరిష్కారం సాధ్యం కాదు.

1948—1949 సంవత్సరాల మధ్య జరిగిన అరబ్—ఇజ్రాయెల్ యుద్ధం నుండి ఉద్భవించిన పాలస్తీనా భూభాగాలైన వెస్ట్ బ్యాంక్, గాజా పట్టీలపై 1967లో ఇజ్రాయెల్ ఆక్రమణ, పాలస్తీనా రాజకీయ, ఆర్థిక వ్యవస్థలపైనా ప్రజల జీవితాలపైనా ఇజ్రాయెల్ ఆధిపత్యం, తూర్పు జెరూసలెంతో సహ వెస్ట్ బ్యాంక్‌లలో వరుసగా 67లక్షలు, 22 లక్షల యూదు జనాభా కలిగి ఉండే స్థావరాలను ఇజ్రాయెల్ నిర్మించింది. 1987లో మొదలైన మొదటి 'ఇంతిఫాద (తిరుగుబాటు)' సందర్భంలో హమాస్ ఆవిర్భావంతో పాలస్తీనా ఉద్యమం ఇస్లామిక్ తీవ్రవాద స్వభావాన్ని సంతరించుకున్నది. యాసర్ అరాఫత్ నాయకత్వంలోని ప్రధాన ఉద్యమ సంస్థ, పాలస్తీనా విమోచన సంస్థ (పిఎల్ఓ)ను నీరుగార్చడానికి, హమాస్‌ను ఇజ్రాయెల్ గూఢచార సంస్థ 'మొస్సాద్' మొదట్లో ప్రోత్సహించిందని వార్తలు వచ్చాయి. 2000 సంవత్సరంలో మొదలైన రెండవ ఇంతిఫాద లేదా అల్—అక్సా ఇంతిఫాదలో మరొక హింసాత్మక ధోరణులు కలిగిన పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్ (పిఐజె) ఆవిర్భవించింది. ఈ రెండూ సంస్థలు ఇజ్రాయెల్ పౌరులపై పలు ఉగ్రవాద దాడులు నిర్వహిస్తూ వచ్చాయి. 2007లో గాజాలో హమాస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గాజా నుంచి రాకెట్లను కట్టడి చేస్తూ ఈజిప్టు సహకారంతో ఇజ్రాయెల్ భూ, వాయు, సముద్ర దిగ్బంధాన్ని కొనసాగిస్తూ వస్తున్నది. దీనికి తోడు, గాజాలోని పలు పాలస్తీనా సంస్థల మధ్య అంతర్గత పోరు తోడవడంతో, గాజాలో సాధారణ జన జీవన పరిస్థితులు క్షీణిస్తూ వచ్చాయి.

హమాస్ నాయకులకు, పిఐజె నాయకులను, ఇతర మిలిటెంట్లను వెంబడించడం, వారి ఆయుధాగారాలను ధ్వంసం చేసే నెపంతో పాఠశాలలు, ఆసుపత్రులు, మసీదులు, చర్చిలపై తరచూ దాడులు నిర్వహించడం ఇజ్రాయెల్ ప్రత్యేక దళాలకు, సైన్యానికి పరిపాటిగా మారింది. పేదరికంలో బతుకుతున్న గాజా వాసులు ఈ దాడులలో పెద్ద సంఖ్యలో చనిపోతున్నారు. అదేవిధంగా, వెస్ట్ బ్యాంక్ ప్రాంతంలో పెరిగిన ఇజ్రాయెలీ సెటిలర్ల హింస, పాలస్తీనా భూభాగాలను స్వాధీనపరుచుకోవడం లాంటి చర్యల వల్ల అక్కడి ప్రజలలో నిరాశ నిస్పృహలు పెరిగినాయి. వెస్ట్ బ్యాంక్, గాజాలలో మానవ హక్కుల పరిస్థితిపై మార్చ్ 2022లో విడుదలైన ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం పాలస్తీనా ప్రాంతాలలో ఇజ్రాయెల్ వర్ణ వివక్ష పాలన పాతుకుపోయి ఉన్నది. ఎందుకంటే ఇజ్రాయెల్ ఆక్రమిత ప్రాంతాలలో నివసిస్తున్న ఇజ్రాయెలీలు, పాలస్తీనియన్లకు వేర్వేరు చట్టాలు అమలులో ఉన్నాయి. యూదు సెటిలర్లకు సమగ్ర హక్కులు అందిస్తూ, పాలస్తీనీయులకు మాత్రం కనీస రక్షణలు, హక్కుల ప్రస్తావన లేకుండా నియంత్రణలు విధిస్తూ ఇజ్రాయెల్ సైనిక పాలన కొనసాగిస్తున్నది. పాలస్తీనీయులను విచారణ లేకుండా నిర్బంధించడం, హింసించడం, సామూహికంగా శిక్షించడం, చట్ట వ్యతిరేక హత్యలకు పాల్పడటం చేస్తున్నది. ఇజ్రాయెల్ నిరంతర ఆక్రమణలవల్లే ఈ ప్రాంతాలలో అస్థిరత్వం, దీర్ఘకాలిక ఘర్షణలు కొనసాగుతున్నాయని ఈ నివేదిక అభిప్రాయపడ్డది. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ కథనం ప్రకారం 1967 నుంచి వెస్ట్ బ్యాంక్ ఆక్రమిత భూభాగాల జనాభాను శాశ్వతంగా మార్చే లక్ష్యంతో ఉన్నది. లక్షలాది మంది యూదు సెటిలర్లతో పాటు 50ఏళ్ళకు పైగా ఆక్రమణలో సుమారు 25 వేల ఎకరాల భూమిని ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకుంది, ఉగ్రవాదుల కుటుంబాలను శిక్షించడానికి 50 వేలకు పైగా పాలస్తీనీయుల గృహాలను కూల్చి వేసింది. పాలస్తీనీయులలో నిరుద్యోగ రేటు 40శాతానికి పైగా ఉన్నది, 65శాతానికి పైగా దారిద్ర్య రేఖకు దిగువన నివసిస్తున్నారు, 63శాతం ఆహార అభద్రతకు లోనై ఉన్నారని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. హమాస్ గత అక్టోబర్ దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్ చేపట్టిన విస్తారమైన విధ్వంసానికి, ఇప్పటికే పలు అవస్థలతో సతమతమౌతున్న గాజా వాసుల పరిస్థితి అత్యంత దయనీయంగా తయారయింది. వందల సంఖ్యలో మరణించారు, దాదాపు 20 లక్షల జనాభా గాజాలో నిర్వాసితులయ్యారు. ఇవన్నీ కూడా హమాస్‌ను అరికట్ట లేదు సరికదా, పేదరికం, బలహీనత, నిస్సహాయత, కోపం వల్ల హమాస్ రిక్రూట్మెంట్లకు మరింత అనుకూల పరిస్థితులను సృష్టించాయి. గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం వల్ల ఇజ్రాయెల్‌కు అత్యధిక ప్రాణ, ఆస్తుల నష్టం లేనప్పటికీ, ఆర్థిక వ్యవస్థలోని పలురంగాలపై విపరీత ప్రభావం చూపుతున్నదని, గత అక్టోబరు నుంచి డిసెంబర్ మధ్య కాలంలో సుమారుగా రోజుకు 2,600 లక్షల డాలర్ల వ్యయం జరిగిందని ఇజ్రాయెల్ ఆర్థిక విశ్లేషకుల అంచనా వేశారు. యుద్ధం ఇంకా కొనసాగితే ఆర్థిక వ్యవస్థ మరింత సమస్యాత్మకం అవుతుందని వారి సూచన.

పాలస్తీనా సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనకుండానే, ఆ ప్రాంతంలోని అరబ్ దేశాలతో శాంతి సాధ్యమని, ఇది సరిపోతుందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సహా పలువురు వాదిస్తున్నారు. ఒకవైపు ఇజ్రాయెల్, మరోవైపు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బహరైన్, మొరాకో, సూడాన్ మధ్య 2020—21లో కుదిరిన నాలుగు అబ్రహం ఒప్పందాలు ఈ ఆలోచనకు పునాది. కానీ గత మూడు నెలల్లో జరిగిన సంఘటనల పర్యవసానంగా, అబ్రహం ఒప్పందాలపై సంతకాలు చేసిన దేశాలతో సహా, గల్ఫ్ సహకార మండలి సభ్య దేశాలు, ఖతార్, ఒమన్‌లు కాల్పుల విరమణకు పిలుపునిచ్చాయి. లెబనాన్, ఇరాక్, జోర్డాన్, కువైట్, ఈజిప్ట్, ట్యూనీషియా తదితర దేశాలలో వేలాది మంది నిరసన కారులు ఇజ్రాయెల్ వ్యతిరేక ప్రదర్శనలు చేశారు. యుద్ధానికి ముగింపు పలకాలని, సమస్యకు తుది పరిష్కార దిశగా చర్చలు జరపాలని అరబ్ ప్రభుత్వాలపై ఒత్తిడి పెరిగింది. పాలస్తీనా స్వయం నిర్ణయాధికారాన్ని సాధించడానికి చర్చలు లేనంతకాలం, విస్తృత నిరాశకు ఆజ్యం పోసి, హింసను పాలస్తీనియన్లు అంగీకరించడాన్ని బలపరుస్తుంది.

ఇజ్రాయెల్ — పాలస్తీనాల మధ్య చర్చలు కష్టం, కానీ అత్యవసరం. శాంతి కోసం 1993 ఓస్లో ప్రక్రియలో స్థూలంగా అంగీకరించిన అంశాలు (వీటిని ఇజ్రాయెల్ పట్టించుకోవడం లేదు) కీలకమైనవి: పాలస్తీనా భూభాగాలకు శాశ్వత సరిహద్దులు నిర్ణయించడం; వెస్ట్ బ్యాంక్‌లోని కొన్ని ఇజ్రాయెల్ స్థావరాలకు వసతి కల్పించడం, వాటి పరిహారంగా భూ మార్పిడి; పాలస్తీనా శరణార్థులకు పునరావాసం; పాలస్తీనాకు రాజధాని స్థానం; ముస్లింల, క్రైస్తవుల పవిత్ర స్థలాల స్థితితో సహా జెరూసలెం స్థితిపై అంతర్జాతీయ ఒప్పందం, అజమాయిషీ; ప్రాంతీయ దేశాల మధ్య భద్రతా సహకారం; పాలస్తీనా ఆర్థిక కార్యకలాపాలు, గగన తలం, రెండు పాలస్తీనా భూభాగాల మధ్య, వాటి నుండి బయటి ప్రపంచానికి ప్రజల, వస్తువుల స్వేచ్ఛాయుత కదలికలకు వెసులుబాటుతో సహా ఇతర వివరాలతో కూడిన సుస్థిర మార్గాలు అన్వేషించనంతకాలం ఇజ్రాయెల్—పాలస్తీనా సమస్యకు శాశ్వత పరిష్కారం ఉండదు. వీటికి ఇజ్రాయెల్ ఒప్పుకోవటమేగాక, ఆ దేశం వెంట ఉండి దాన్ని అన్ని రకాలుగా సమర్థిస్తున్న అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాల వైఖరులలో మార్పు లేనిదే పరిష్కారం సాధ్యం కాదు.

● చెన్న బసవయ్య మఠపతి
విశ్రాంత ఆచార్యులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం

అర్ధసత్యాలంటూ అసంబద్ధ ఆరోపణలు!

ఆంధ్రజ్యోతి దినపత్రిక డిసెంబరు 29, 2023లో సి. మేఘనాధ రెడ్డి 'పౌర హక్కుల సంఘం ప్రకటనలో అర్ధసత్యాలు' అంటూ ఒక లేఖను రాశారు (ఆ ప్రకటన డిసెంబరు 23, 2023న 'యాభై ఏళ్ళుగా ప్రజల పక్షాన' పేరిట ప్రచురితమైంది). తన లేఖలో మేఘనాధ రెడ్డి శ్రీశ్రీ గారిని పౌర హక్కుల సంఘం అధ్యక్షునిగా ఎన్నుకున్నట్లు చెప్పారు. అంతవరకు అది సరైనదే. కానీ గుంటూరు, ప్రకాశం జిల్లాలలో మాత్రమే పౌర హక్కుల సంఘం ఏర్పడింది అన్న మాట సరికాదు. రాష్ట్రస్థాయి పౌర హక్కుల సంఘం సభ 1973 డిసెంబర్ 23న ఏర్పాటు చేయక మునుపే తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో తూర్పుగోదావరి జిల్లా పౌర హక్కుల సభ జరిగింది. ఆనాడు ప్రభుత్వం పెట్టిన కుట్ర కేసులో ముద్దాయిగా ఉన్న నేను రాజమండ్రిలో బెయిల్‌పై ఉన్నాను. ఆనాటి సీపీఐ (ఎం.ఎల్) పార్టీ డైరెక్షన్‌లో నేను పౌర హక్కుల సంఘం నిర్మాణ ఏర్పాటులో భాగస్వామిని అయ్యాను. ఆనాడు ఆ సభ తదనంతరం గొప్ప బహిరంగ సభ జరిగింది. ఆ బహిరంగ సభకు, మహాకవి శ్రీశ్రీ కూడా హాజరైనారు. ప్రముఖ న్యాయవాది పత్తిపాటి వెంకటేశ్వర్లు కూడా హాజరైనారు. ఆ సభకు ముందు నాగిరెడ్డి రాజకీయాలకు ప్రతినిధిగా ఉన్న సింహాద్రి సుబ్బారెడ్డి నన్ను కలిశారు. ఆరోజు రాజమండ్రిలో వైద్యవృత్తిలో ప్రాక్టీస్ చేస్తున్న డాక్టర్ కాటా నారాయణరావు కూడా ఆ సభ ఏర్పాటులో పాల్గొన్నారు.

అంతేకాకుండా జిల్లా మహాసభల తదనంతరం గుంటూరులో రాష్ట్ర స్థాయి మహాసభ ఏర్పాటు జరిగింది. ఆహ్వాన సంఘ అధ్యక్షుడుగా ప్రముఖ న్యాయవాది స్వాతంత్ర సమరయోధుడు ఎస్.వి.ఎల్. నరసింహారావు, కార్యదర్శిగా నేను ఆ సభ నిర్వహణలో ప్రధాన భాగస్వామిగా ఉన్నాము. డిసెంబర్ 23న జరిగిన సభలో ప్రముఖ మార్క్సిస్ట్ లెనినిస్ట్ నాయకులు, స్వాతంత్ర సమరయోధుడు పార్లమెంటు మాజీ సభ్యుడు కొల్లా వెంకయ్య, మరో పార్లమెంటు మాజీ సభ్యుడు స్వాతంత్ర సమరయోధుడు మాదాల నారాయణ స్వామి, ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు తరిమెల నాగిరెడ్డి మొదలగు ప్రముఖులు పాల్గొన్నారు. తరిమెల నాగిరెడ్డి ప్రతిపాదనను కొల్లా వెంకయ్య, మాదాల నారాయణస్వామి తిరస్కరించారన్న ఆరోపణ సరైనది కాదు. ఆనాడు రాష్ట్రవ్యాప్తంగా ఎమ్.ఎల్ పార్టీల మధ్య రెండు రాజకీయ బేధాభిప్రాయాలు నడుస్తున్నాయి. ఆ అభిప్రాయ బేధాలు పౌర హక్కుల సంఘంలో కూడా పొరచూపాయి. ప్రముఖ న్యాయవాది, పౌర హక్కుల సంఘ ప్రజాతంత్ర వాది పత్తిపాటి వెంకటేశ్వర్లని తరిమెల నాగిరెడ్డి తిరస్కరిస్తూ, ప్రత్యామ్నాయంగా తరిమెల రామదాసు రెడ్డి పేరుని ప్రతిపాదించారని కూడా అనవచ్చు కదా!

ఆ మహాసభలో అనేక రచ్చలు చర్చలు జరిగాయి. నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు ఏర్పడ్డాయి. పౌర హక్కుల సంఘానికి శ్రీశ్రీని అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న తరువాత కార్యదర్శిగా ప్రత్తిపాటి వెంకటేశ్వర్లు, తరిమెల రామదాసు రెడ్డి పేర్లు ప్రతిపాదించబడ్డాయి. కార్యదర్శిగా ఎవరు ఉండాలనే విషయం తేలకుండానే సాయంత్రం దాకా చర్చలు జరిగాయి. ఎవరి వాదన వారు చేసుకుంటూ పోయారు. బహిరంగ సభ టైము దగ్గరకొస్తుంది. ఆ విధంగా సభ వాయిదా పడింది. ఆ తరువాత గాంధీ పార్కులో బహిరంగ సభ జరిగింది. సభ అనంతరం సీపీఐ (ఎం.ఎల్) రాజకీయాలను సమర్థించే వారంతా ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం ఏపీసీఎల్సీగా ఏర్పడ్డారు. దానికి మహాకవి శ్రీశ్రీ అధ్యక్షుడిగా ప్రత్తిపాటి వెంకటేశ్వర్లు కార్యదర్శిగా కమిటీ ఎన్నుకోబడింది. ఆ తరువాత కొంత కాలానికి తరిమెల నాగిరెడ్డి వర్గం ప్రత్యేకంగా ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపిడిఆర్) ఏర్పాటు చేసుకున్నది. ఆ తదనంతరం రాష్ట్రస్థాయి పౌర హక్కుల సంఘం ఏర్పాటులోనే కాకుండా దీర్ఘకాలం పౌర హక్కుల సంఘంలో పని చేసిన కార్యకర్తను నేను. ఆనాటి సభలో పాల్గొన్నవారు చాలామంది నేటికీ బతికి ఉన్నారు. అటువంటి వారిలో గుర్రం విజయ్ కుమార్, సింహాద్రి సుబ్బారెడ్డి, సిఎసఆర్ ప్రసాదు, నల్లూరు రుక్మిణి, పీవీ రమణారెడ్డి, డాక్టర్ గంటా వెంకటరావు, డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు, డాక్టర్ శివరామిరెడ్డి లాంటివారు చాలామంది నేటికీ సజీవంగానే ఉన్నారు.

– కొల్లిపర వెంకటేశ్వరరావు

మధునాపంతుల సూరయ్య శాస్త్రి శత వసంత వేడుకలు

ఒక ఆత్మీయమైన పలకరింపు... ఒక స్నేహార్ద్రమైన చల్లని చూపు... ఒక సహృదయ మానసిక విలాసం... ఎల్లప్పుడూ వదనంలో చిరు మందహాసం... మారని సంతకంలా అరవై ఏళ్ళుగా ఒకే ఆహార్యం... గౌరవభావం ఉట్టిపడే స్థిర గంభీరత... ఇవన్నీ కలబోసిన మూర్తిమత్వం మధునాపంతుల సూరయ్య శాస్త్రి. పద్యకవి అయినా వచన కవితలో మెరిసిన భావశకలంను హత్తుకునే సహృదయశీలి... ఎన్నో ఎన్నెన్నో ప్రాచీన సాహిత్య అధ్యయన విశేషంతో పరిపక్వమైన ఆలోచనలు... ప్రక్రియాభేదం లేకుండా అందరినీ సమాదరించడం ఆనందించడం ఆయనలోని గొప్పతనం.

'తొలి మేల్ త్రోవలు నేటి సంస్కృతుల రీతుల్ లెస్స గుర్తించి నా తలలో తీయని నాల్కగా మెలగు సోదర్యుండు సూరయ్య శాస్త్రులు' అని ఆంధ్ర పురాణకర్త మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి 'ఆంధ్రపురాణము' అవతారికలో తన తమ్ముని గురించి చెప్పుకున్నారు. మధునాపంతుల సూరయ్య శాస్త్రి తెలుగు ఉపాధ్యాయులు. ఆయుర్వేద వైద్యంలో నిష్ణాతులు. పద్యకవిగా ప్రౌఢశైలిలో 'దేవీనవతి' కావ్యాన్ని వెలయించినవారు. వందలాది విద్యార్థులకు సాహిత్యాభిరుచి కలిగించినవారు. అందులో నేనూ ఒకడిని.

మధునాపంతుల సూరయ్య శాస్త్రి 1924 నవంబరు 15 తేదీన జన్మించారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో పల్లిపాలెంలో కుటుంబసభ్యులు, శిష్యులు శత జయంతి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డా. జి.వి. పూర్ణచందు, డా. యనమదల మురళీకృష్ణ, డా. పి.వి. శర్మ, దాట్ల దేవదానం రాజు, పి.ఆర్.ఎల్. స్వామి, కిరణ్ మధునాపంతుల, ఇంద్రగంటి రామచంద్ర గోపాలం, అల్లంరాజు రామగోపాల రావు, రవిశంకర రెడ్డి, గోవిందరెడ్డి లను ప్రతిభా పురస్కారాలు, ఆత్మీయ సత్కారాలతో గౌరవిస్తున్నారు.

– దాట్ల దేవదానం రాజు

ఖైదీలు సత్ప్రవర్తనతో బయటికి రావాలి

దశాబ్దాల కాలం నుంచి కోర్టులు ఎందరో నేరస్తులకు జైలుశిక్షలు విధిస్తున్నాయి. కానీ ఖైదు జీవితం అనుభవించిన తర్వాత ఎంత మందిలో మార్పు వస్తున్నది? కేవలం వేళ్లపై లెక్కించగలిగే సంఖ్యలో మాత్రమే మార్పు పొంది జైలు నుంచి వస్తున్నారు. మరి మిగిలినవారు ఇంకా క్రూరంగా తయారై బయటికి వస్తున్నారు. వీటికి కారణం జైలు వాతావరణం. ఇది మార్పు చెందాలి. ఖైదీలు పశ్చాత్తాపం పొంది మార్పు రావాలంటే వారి ఆహార అలవాట్లను మార్చాలి.. ఉప్పు, కారం లేకుండా కాయగూరలు ఎక్కువగా అందించాలి. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న వారికి సేవలు చేసే విధంగా ఖైదీలను పురమాయించాలి. అప్పుడే వారికి ప్రాణం విలువ తెలిసి వస్తుంది. అంతేకాకుండా మతపరమైన గ్రంథాలను అనుభవజ్ఞులు, పండితులైన వారి చేత బోధింపజేస్తూ ఖైదీలకు జ్ఞానోదయం కలిగించాలి. మానవ జీవితంలో ఎంతగా శ్రమిస్తేనో గాని, జ్ఞానం లభించదని నిపుణుల చేత శాంతియుతంగా బోధించాలి. ఖైదీలు వారి కుటుంబానికి అందుబాటులో లేకపోవడం వల్ల కుటుంబసభ్యులు పడుతున్న బాధలను వారికి తెలియజేయాలి. మానసిక వైద్యుల చేత కౌన్సెలింగ్ చేయిస్తూ ఉండాలి. అప్పుడు మాత్రమే వారికి తాము జీవితంలో చేసిన తప్పులకు పశ్చాత్తాపం చెంది, మంచి వ్యక్తులుగా మారడానికి అవకాశం ఉంటుంది. అంతేకానీ కేవలం జైలుశిక్ష అనుభవించి యథాతథంగా బయటికి వస్తే ఆ శిక్షకు ఏ మాత్రం ఫలితం ఉండదు.

– ఆలమూరి సాయి దినేష్

ఒక్కసారి ఆలోచించండి!

ఉచిత పథకాలు ఎన్ని ప్రకటించినా, అవి ప్రజలకు మేలు చేయడం అటుంచి, వారి బతుకులు మరింత భారమవుతున్నాయి. ఈ పథకాలు వికలాంగులకు, వృద్ధులకు, పేద రైతులకు ఉపయోగకరంగా ఉంటాయి. అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన నిత్యావసర వస్తువులు, పెట్రోలు దరలు, స్కూలు, కాలేజీ ఫీజులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. వీటిని అదుపు చేయడానికి ఏ రాజకీయ పార్టీ నాయకులూ ప్రయత్నించడం లేదు. వారు ఎంతసేపూ తమ ఓటు బ్యాంకు పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు గానీ ప్రజల గురించి ఆలోచించడం లేదు. దేశంలో ఎక్కడ చూసినా ఏదో ఒక సమస్య, ఆందోళన, అలజడి ఉంటున్నాయి. వీటి గురించి ఆలోచించని నాయకులు, తమ అధికారం కోసం మాత్రం ఉపన్యాసాలు ఇస్తుంటారు. ప్రజలకు కావలసింది ఉపన్యాసాలు కాదు, తమ సమస్యల పరిష్కారం. మనిషికి అవసరమైన విద్య, వైద్యం, ఉపాధి వీటిని ప్రజలకు అందుబాటులో ఉంచాలి. సాధ్యమైనంతవరకు నిత్యావసరాల దరలు పెరగకుండా చూడాలి. ఇది అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

– కాయల నాగేంద్ర

తిరగబడ్డ జగనన్న బాణం

కాలం కలిసిరాకపోతే ఏకు మేకై గుచ్చుకుంటుంది, తాడు పామై కరుస్తుందని అంటారు. ఒకే ఒక్క అవకాశం ఇవ్వాలని అడిగి, అధికారంలోకి వచ్చిన జగన్ మోహన్ రెడ్డి పదవీకాలం చివరలో జరుగుతున్న పరిణామాలు చూస్తే ఈ మాట నిజమని అనిపిస్తుంది. ఇప్పుడు ఆయనను ప్రతికూల పవనాలు ఒకటొకటిగా చుట్టుముడుతున్నాయి. ఒకపక్క దిశానిర్దేశం లేని అభివృద్ధి నమూనాతో ఖజానాను గుల్లచేస్తూనే, మరోపక్క ఇదేమి తీరని ప్రశ్నిస్తున్న అనుభవజ్ఞుడైన చంద్రబాబు నాయుడును అడుగడుగునా అవమానించి, అక్రమంగా అరెస్టు చేయడం పట్ల ప్రజాగ్రహం పెల్లుబుకడం ఇందుకు నిదర్శనం. రాష్ట్ర ప్రజల మేలు కోసం లోకేష్ జరిపిన పాదయాత్ర యువగళానికి వచ్చిన స్పందన ఇందుకు తార్కాణం.

రాష్ట్ర ప్రజలు గ్రహించినట్లే అన్న నిజస్వరూపం పూర్తిగా గ్రహించిన వైఎస్ షర్మిల కదుపుతున్న పావులు కూడా రాష్ట్రంలో ఆమె రాజకీయ భవితకు ప్రబల సూచికగా నిలుస్తున్నాయి. జైల్లో ఉన్న జగనన్న వదిలిన బాణంగా చెప్పుకుని ప్రచారంలో పాల్గొన్న షర్మిలకు, ఆ తర్వాత ఏపీ ప్రజల్లాగానే తత్త్వం బోధపడి, తిరగబడడంతో రాజకీయం రసవత్తరంగా మారింది. తన తండ్రి జీవితాంతం సేవలందించిన కాంగ్రెస్ పార్టీలో తన వైఎస్ఆర్ తెలంగాణ పార్టీని విలీనం చేస్తూనే రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఆమె ప్రకటించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో భూస్థాపితమైన కాంగ్రెస్ పునరుజ్జీవంలో షర్మిల క్రియాశీల పాత్ర పోషించి పార్టీకి పూర్వవైభవం సాధిస్తారన్న నమ్మకంతో కాంగ్రెస్ క్యాడర్ ఉంది.

తెలంగాణలో ఎన్నో సంక్లిష్ట పరిస్థితుల మధ్య, సీనియర్ల నిరసనల నడుమ తాను ఎంతో నమ్మకంతో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ బాధ్యతలు అప్పగించిన రేవంత్ రెడ్డి సృష్టించిన విజయ ప్రభంజనంతో స్ఫూర్తిపొందిన అధిష్ఠానం ఇప్పుడు ఏపీలో కూడా షర్మిలతో ఒక ప్రయోగం చేయడానికి సిద్ధమయింది. వైఎస్ రాజశేఖర రెడ్డి కూతురుగా షర్మిల పేరు రెండు రాష్ట్రాలలో సుపరిచితం కావడం, ఆమె రాజకీయ జీవితం స్వచ్ఛంగా ఉండడంతో కాంగ్రెస్‌కు ఇంతకు మించిన నేత దొరకని పరిస్థితి. జగన్ అభ్యున్నతి కోసం తన వంతు కృషి చేసినా, అధికార దాహం, అహం ముందు ఓడిన ఆమె ఇన్నాళ్లూ అంతఃపురానికి పరిమితమైన అనేక గుట్టుమట్లను బయటపెట్టి సొంత బలాన్ని పెంచుకునే అవకాశం ఉంది.

తెలంగాణలో విజయం ఇచ్చిన స్ఫూర్తితో కాంగ్రెస్ నాయకత్వం షర్మిలను జగన్‌పై ప్రధాన అస్త్రంగా వాడుకునే అవకాశం ఉంది. ఇది కాంగ్రెస్ పునరుజ్జీవనానికి ఉపకరించే చర్య. ఇంతకాలం పార్టీని నమ్ముకొని ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు సెగ్మెం ఇచ్చే పరిణామం. జగన్ వదలిన బాణం ఆయనకే గురిపెడితే, ఇన్నాళ్లూ ఆయన పాలనలో అఘాయిత్యాలను, అక్రమాలను కష్టనష్టాలకోర్చి ఎండగట్టిన టీడీపీ — జనసేన కూటమి వాదనకు బలం చేకూరి, కూటమి మరింత బలపడి అధికారానికి చేరువ కావడానికి అవకాశాలు బలపడతాయనడంలో సందేహం లేదు. ప్రజావ్యతిరేకతను అనుకూలంగా మలుచుకుని షర్మిల గట్టిగా కృషిచేస్తే జగన్ పార్టీని తోసిరాజని స్వల్పకాలంలోనే ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన పోటీ తెలుగుదేశం—జనసేన కూటమికి, కాంగ్రెస్‌కు మధ్య మారడం పెద్ద కష్టం కాకపోవచ్చు.



జగన్మోహన్ రెడ్డిని ప్రతికూల పవనాలు ఒకటొకటిగా చుట్టుముడుతున్నాయి. జగన్ పట్ల ప్రజల ఆదరణ తగ్గుతుందనే సంకేతాలు వెలువడుతుండటంతో పలువురు సీనియర్లు పార్టీని వీడుతున్నారు. పవన్ కళ్యాణ్ పాపులారిటీ, చంద్రబాబు రాజకీయ అనుభవం ఒక్కటవ్వడంతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వ్యూహాత్మక మార్పులు గోచరిస్తున్నాయి. ఈ పరిస్థితిలో షర్మిల ప్రవేశం జగన్‌కు వ్యతిరేకంగా వీస్తున్న పవనాల ఉధృతి పెంచేదే!!

రాష్ట్ర ప్రజలు ప్రస్తుతం జగన్ పాలన చూస్తున్నారు. అంతకుముందు చంద్రబాబు పాలనను చూశారు. రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలు, రాజధాని ఏర్పాటు, పారిశ్రామిక ప్రగతి కోసం తపన పడిన తీరు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి చేసిన కృషి, సంక్షేమ రంగంలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. జగన్ పాలనను, చంద్రబాబు పరిపాలన తీరును బేరీజు వేసుకుంటున్నారు. కక్ష సాధింపు చర్యలతో సాగిన జగన్ పాలనకంటే, ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా సాగిన చంద్రబాబు పాలన ఉత్తమమనే ఆలోచనకు వస్తున్నారు. అందుకే అధికార పక్షంలో గుబులు మొదలైంది. జగన్ పట్ల ప్రజల ఆదరణ తగ్గుతుందనే సంకేతాలు వెలువడుతుండటంతో పలువురు సీనియర్లు పార్టీని వీడేందుకు సిద్ధపడుతున్నారు. ఇప్పటికే కొంత మంది పార్టీకి దూరమయ్యారు.

అధికారంలోకి రావడానికి ముందు జగన్ జరిపిన పాదయాత్రలో చేసిన వాగ్దానాలు భంగమయిన తీరు ప్రజలను తీవ్ర నిరాశపరిచింది. డబ్బు పడేస్తే అభివృద్ధి జరిగినట్లేనన్న ధోరణిని జగన్ కూడా త్రికరణ శుద్ధిగా నమ్మడంతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఘోరంగా కుంటుపడింది. పాలనలో పారదర్శకత లేకపోగా, అన్ని వ్యవస్థలు అస్తవ్యస్తం కావడం ప్రజలను కలవరపరుస్తోంది. ఎంతో ఘన చరిత్ర ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు కనీసం రాజధాని లేని రాష్ట్రంగా ముద్రపడడంతో ప్రజలు కుములుతున్నారు. ప్రభుత్వం తీసుకునే అన్ని నిర్ణయాలూ న్యాయస్థానాల తలుపు తట్టేవిగానే ఉండడం, రాజధాని రైతులు సుదీర్ఘ పోరాటం చేసినా పాలకుడిలో కించిత్ సానుభూతైనా లేకపోవడం ప్రజలను తీవ్రంగా బాధించింది. చంద్రబాబు అక్రమ అరెస్టుతో రాష్ట్రంలో దారుణ పాలన పరాకాష్ఠకు చేరుకున్నట్లయ్యింది.

ఇదిలావుంటే రాజకీయాల్లో మార్పు రావాలని, ప్రజా సంక్షేమమే పాలకుల ధ్యేయం కావాలని, పాలనలో పారదర్శకత తీసుకురావడం ద్వారా పేదరికాన్ని నిర్మూలించాలని, సంక్షేమ రాజ్యంగా సమగ్రాభివృద్ధి సాధించాలని జనసేన పార్టీని స్థాపించిన సినీ నటుడు పవన్ కళ్యాణ్.. ఇప్పుడు తన పంథా మార్చుకున్నారు. కలిసి ఉంటేనే కలదు సుఖం అనే సూత్రం ఆధారంగా జగన్ పాలనకు వ్యతిరేకంగా పోరాటం సాగించడానికి టీడీపీతో చేతులు కలిపారు. పవన్ కళ్యాణ్ పాపులారిటీ, చంద్రబాబు రాజకీయ అనుభవం ఒక్కటవ్వడంతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వ్యూహాత్మక మార్పులు గోచరిస్తున్నాయి. ఈ పరిస్థితిలో షర్మిల ప్రవేశం జగన్‌కు వ్యతిరేకంగా వీస్తున్న పవనాల ఉధృతి పెంచేదే!!

■ విఎస్ఆర్ నాయుడు
సీనియర్ కమ్యూనికేషన్ నిపుణుడు, రాజకీయ విశ్లేషకుడు

యువతకు భవిత లేని పాలన

మిమ్మల్ని బలవంతులుగా చేసే ప్రతి ఆశయాన్ని స్వీకరించండి, బలహీనపరిచే ప్రతి ఆలోచననూ తిరస్కరించండి. ఉత్సాహంతో శ్రమించడం, అలసటను ఆనందంగా అనుభవించడం... విజయాన్ని ఆకాంక్షించే వారి ప్రాథమిక లక్షణాలు. లేవండి, మేల్కోండి, గమ్యం చేసే వరకు విశ్రమించకండి అని స్వామి వివేకానంద వ్యాఖ్యానించారు. వాటిని స్ఫూర్తిగా తీసుకొని తమ హక్కులకై పోరాటాలు చేసేందుకు సమాయత్తం అవుతున్న యువతపై అక్రమ కేసులు పెడుతూ, జైళ్ల పాలు చేస్తూ, యువత జీవితాలను ఛిద్రం చేస్తున్నది రాష్ట్ర ప్రభుత్వం. గత నాలుగున్నరేళ్ల నుంచి రాష్ట్రంలో నాణ్యమైన విద్య లేదు, ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేవు, ప్రైవేటు ఉద్యోగానికి ఒక్క పరిశ్రమ తేలేదు, పోనీ కూలో నాలో చేసుకుందామనుకున్నా పనులు లేవు. దీంతో యువత పొరుగు రాష్ట్రాలకు వలస పోతున్నది.



యువతను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని నమ్మిన చంద్రబాబు, తన హయాంలో విద్య ఉపాధి రంగాలపై అత్యంత శ్రద్ధ కనపరిచారు. నాడు రాష్ట్రానికి పరిశ్రమలను ఆకర్షిస్తే, నేడు ఉన్న కంపెనీలను తరిమేసి యువతకు ఉపాధిని దూరం చేస్తున్నారు. గంజాయి, మత్తుపదార్థాలకు యువతను దగ్గర చేసి వారి భవిష్యత్‌ని అంధకారంలోకి నెట్టిన ఘనత జగన్‌రెడ్డిది. ఆయన పాలనలో ఉద్యోగాలు, ఉపాధి లేక దాదాపు 20వేల మంది యువత ఆత్మహత్యలకు పాల్పడ్డారు. నాణ్యమైన విద్యను అందించాల్సిన ప్రభుత్వం విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ రద్దు చేసి వారిని ఉన్నత విద్యకు దూరం చేశారు. టీడీపీ హయాంలో నాణ్యమైన విద్యలో 3వ స్థానంలో ఉంటే, నేడు 19వ స్థానానికి దిగజార్చారు.

దాదాపు 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని హామీనిచ్చిన జగన్‌రెడ్డి నాలుగున్నరేళ్లల్లో కేవలం 10,143 ఉద్యోగాలతో ఫేక్ క్యాలెండర్ విడుదల చేశారు. ప్రతి ఏటా డీఎస్సీ జరుపుతామని, కనీసం ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదు. వేలాది మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించారు. ఏపీపీఎస్సీని అక్రమాలకు నిలయంగా మార్చారు. యువత తన కాళ్ల మీద తాము నిలబడేలా చేసే కార్పొరేషన్ స్వయం ఉపాధి రుణాలు రద్దు చేశారు.

2014—19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం ఏపీపీఎస్సీ ద్వారా 4,009 ఉద్యోగాలు, రెండుసార్లు పోలీస్ రిక్రూట్‌మెంట్ చేపట్టి 6,748 ఉద్యోగాలు, రెండు సార్లు డీఎస్సీ ద్వారా 17,591 ఉద్యోగాలు, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా 64,000 ఉద్యోగాలు, ఐటి అభివృద్ధితో 34 వేల ఉద్యోగాలు కల్పించింది. రూ.300 కోట్లతో క్రీడాభివృద్ధి, ప్రతి నియోజకవర్గంలో క్రీడలకు ప్రోత్సాహంతో పాటు స్టేడియంల ఏర్పాటుకు ప్రణాళికలు చేశారు. కాని జగన్ ప్రభుత్వం తమ తప్పుల నుంచి యువతను పక్కదారి పట్టించేందుకు ఎన్నికల సమయంలో ఆడుదాం ఆంధ్రా అంటూ మోసపూరిత కార్యక్రమాలకు పూనుకున్నది. నాలుగున్నరేళ్లుగా క్యాసీనోలు, పేకాట క్లబ్‌లు, కోడి పందాలు, బెట్టింగ్ లకు ఇచ్చిన ప్రోత్సాహంలో ఒక్క శాతమైనా ఆరోగ్యవంతమైన క్రీడలకు ఇచ్చి ఉంటే రాష్ట్రం నుంచి ఎంతోమంది క్రీడాకారులు వచ్చి ఉండేవారు. ఆంధ్రప్రదేశ్ యువత ప్రిజనరీ జగన్ వద్దు.. విజనరీ చంద్రబాబు కావాలని ముక్తకంఠంతో కోరుకుంటున్నారు. అందుకే చంద్రబాబును స్కిల్ కేసులో అక్రమంగా అరెస్ట్ చేస్తే దాదాపు 80 దేశాల్లో నిరసనలు తెలియజేశారు. హైదరాబాద్‌లో యువత స్వచ్ఛందంగా రోడ్ల మీదకు వచ్చి చంద్రబాబుకి సంఘీభావం తెలియజేశారు. ఏపీలో అయితే ఆయన అరెస్ట్ అయిన రోజు నుంచి బయటకు వచ్చే వరకు యువతంతా రోడ్ల మీదకు వచ్చారు. మేలు చేసిన వాడి మీద ఉన్న అభిమానం కంటే నమ్మించి నట్టేట ముంచిన వాడి మీద కోపం ఎక్కువగా ఉంటుంది. 'అందుకే పడి లేచే కెరటాలు నాకు ఆదర్శం. ఎందుకంటే లేచి పడుతున్నందుకు కాదు, పడినా లేస్తున్నందుకు' అన్న వివేకానందుడి వ్యాఖ్యలను స్ఫూర్తిగా నింపుకొని టీడీపీని అధికారంలోకి తీసుకొచ్చి మళ్లీ లేచి నిలబడేందుకు నేటి యువత ఉవ్విళ్లూరుతున్నారు.

– మానం ప్రణవ్ గోపాల్
టీఎనఎసఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్—76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు—70, జూబ్లీహిల్స్, హైదరాబాద్—500033. మెయిల్:editpage@andhrajyothy.com

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు

ఓట్ల తొలగింపుపై పార్టీల ఫిర్యాదులు

- వాటిని పరిశీలించి ఇప్పటికే చర్యలు
- నిష్పక్షపాతంగా పనిచేయాల్సిందేనని కలెక్టర్లు, ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు
- సీఈసీ రాజీవ్‌కుమార్ వెల్లడి

అమరావతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : దేశంలో సాధారణ ఎన్నికల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు జరుగుతున్నాయని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి రాజీవ్‌కుమార్ తెలిపారు. పూర్తి స్వేచ్ఛాయుత వాతావరణంలో అత్యంత పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు ఎన్నికల సంఘం కట్టుబడి ఉందని చెప్పారు. ఓటర్లు పెద్దఎత్తున పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రత్యేకంగా అర్బన్ ఏరియాల్లోని ఓటర్లు, మొదటిసారి ఓటుహక్కును వినియోగించుకునే యువత ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే అధికారులు రాజకీయ పార్టీలకు అనుకూలంగా పనిచేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టంచేశారు. వీరి పనితీరును ఎన్నికల పరిశీలకులు నిరంతరం పర్యవేక్షిస్తూనే ఉంటారన్నారు. ప్రజాస్వామ్య పండగగా భావించే ఎన్నికల్లో ఓటర్లందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తిచేశారు. రాష్ట్రంలో శాసనసభ, పార్లమెంట్ స్థానాలకు ఎన్నికల సన్నద్ధతపై వివిధ రాజకీయ పార్టీలు, రాష్ట్ర, జిల్లాస్థాయి ఎన్నికల అధికారులతో చీఫ్ ఎలక్షన్ కమిషన్ విజయవాడలో రెండు రోజులపాటు నిర్వహించిన సమీక్ష సమావేశాలు ముగిసిన అనంతరం బుధవారం సాయంత్రం సీఈసీ రాజీవ్‌కుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..



విజయవాడలో బుధవారం ఈసీ కమిషనర్లతో సమావేశమైన సీఎస్, డీజీపీ, సీనియర్ ఐఏఎస్ అధికారులు

ఏపీతోనే మొదలుపెట్టాం..

"దేశంలో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో ఏర్పాట్లపై సమీక్షా సమావేశాలను ఆంధ్రప్రదేశ్ నుంచే మొదలుపెట్టాం. 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలకు ఎన్నికల ఏర్పాట్లపై రెండు రోజులపాటు సమీక్ష సమావేశాలు నిర్వహించామని వివరించారు. మంగళవారం విజయవాడలో వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించాం. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాత్రపై కొన్ని పార్టీలు ఫిర్యాదు చేశాయి. వలంటీర్లు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు, సిబ్బందిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములను చేయవద్దని కోరారు. ఓట్ల తొలగింపులు, చేర్పులు, మార్పులపై తగిన చర్యలు తీసుకోవాలని కొన్ని పార్టీలు కోరాయి. ఎన్నికల్లో మద్యం, ధనప్రవాహాన్ని నియంత్రించాలని మరికొన్ని పార్టీలు అడిగాయి. పోలీస్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ పారామిలిటరీ బలగాలతో పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ఎన్నికలు నిర్వహించాలని ఓ రాజకీయ పార్టీ కోరింది. ఓట్ల డూప్లికేషన్‌పై చర్యలు తీసుకోవాలని మరో పార్టీ ప్రస్తావించింది. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో గిరిజన ఓటర్లకు అందుబాటులో పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలని మరో పార్టీ కోరింది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. ఎన్నికల్లో మద్యం, డబ్బు, తాయిలాల పంపిణీని నిరోధించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలకు నిర్దేశించాం. ఐదారు నియోజకవర్గాల్లో గంపగుత్తగా ఓట్లను తొలగించారన్న రాజకీయ పార్టీల ఫిర్యాదులపై లోతుగా పరిశీలన చేయించి స్వచ్ఛమైన ఓటరు జాబితాలను రూపొందించేలా చర్యలు తీసుకున్నాం. రాష్ట్రంలో 21 లక్షల ఓట్లను తొలగించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. వాటిపై తీసుకున్న చర్యలను ఇప్పటికే రాజకీయ పార్టీలకు అందజేశాం. ఓట్ల డూప్లికేషన్ నేరం. ఎవరైనా రెండు చోట్ల ఓటుహక్కు వినియోగించుకున్నట్లు రుజువైతే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం"

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో భేటీ

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు చెందిన అధికారులతో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సమావేశం నిర్వహించారు. హెచ్‌వోడీలు తమ శాఖల పనితీరుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సెబ్, ఎక్సైజ్‌శాఖలు ఎన్‌డీపీఎల్, మద్యం అమ్మకాల గురించి తెలిపారు. మద్యం, నగదు, ఎన్నికల తాయిలాలపై కఠినంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా ఆదాయపు పన్నుశాఖ, ఎయిర్‌పోర్టు అథారిటీ సంబంధిత శాఖల నుంచి సీఈసీ వివరాలు సేకరించింది.

అతివలే అధికం

ఏపీలో మొత్తం ఓటర్లు 4.07 కోట్లు

- పురుషులు 1.99 కోట్లు.. స్త్రీలు 2.07 కోట్లు
- తొలిసారి ఓటరు 5.05 లక్షల మంది
- ఓటర్ల తుది జాబితా 22న ప్రచురణ
- ఓటు వేయలేని వృద్ధులు, వికలాంగులు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం
- ఫిర్యాదులకోసం సి-విజిల్ ఏర్పాటు

"రాష్ట్రంలో మొత్తం 4.07 కోట్ల మంది ఓటర్లున్నారు. వారిలో పురుషులు 1.99 కోట్ల మంది, మహిళలు 2.07 కోట్ల మంది ఉన్నారు. మొత్తం 5.05 లక్షల మంది మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు. వీరిలో 3.05 లక్షల మంది మహిళలు. ఓటర్ల తుది జాబితాను ఈనెల 22న ప్రచురిస్తాం. రాష్ట్రంలో మొత్తం 46,165 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. ఒక్కొక్క పోలింగ్ బూత్ పరిధిలో సగటున 870 మంది ఓటర్లు ఉంటారు. పోలింగ్ బూత్‌లకు వచ్చి ఓటు వేయలేని వృద్ధులు, వికలాంగులు వారి ఇంటి నుంచే ఓటుహక్కును వినియోగించుకోవచ్చు. ఎన్నికల ప్రక్రియలో వచ్చే ఫిర్యాదులపై 100 నిమిషాల్లో స్పందించేలా సి-విజల్ అందుబాటులో ఉంది. అభ్యర్థుల ఆస్తులు, అప్పులు, నేరచరిత్ర తదితర వివరాలను అఫిడవిట్ పోర్టల్, కేవైసీ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. అభ్యర్థుల నేరచరిత్ర వివరాలను ఆయా రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పత్రికలు, టీవీ చానళ్ల ద్వారా ప్రకటించాలి. ఎన్నికల్లో మద్యం, డబ్బులు, తాయిలాల తరలింపును నిరోధించేందుకు అంతరాష్ట్ర సరిహద్దుల్లో మొత్తం 139 పోలీసు, సెబ్, జీఎస్టీ, రవాణా, ఫారెస్ట్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కేంద్ర ఎన్నికల కమిషనర్లు అనూప్ చంద్ర పాండే, అరుణ్‌గోయెల్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్‌కుమార్ మీనా తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.


కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం ఎర్రబాడు గ్రామంలో కౌలుట్లయ్య భార్య లక్ష్మీదేవికి చెక్కును అందజేస్తున్న నారా భువనేశ్వరి

అధైర్యపడకండి...

టీడీపీ అండగా ఉంటుంది: భువనేశ్వరి

- కర్నూలు జిల్లాలో 'నిజం గెలవాలి' 2వ రోజు యాత్ర
- ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 5 కుటుంబాలకు పరామర్శ
- ఒక్కొక్కరికీ 3 లక్షల చొప్పున సాయం అందజేత

కర్నూలు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబు అంటే మీకెంత గౌరవమో మాకు తెలుసు. బాబు అరెస్టును తట్టుకోలేక మనోవేదనతో ఎందరో కార్యకర్తలు మృతి చెందడం బాధాకరం. అధైర్యపడకండి టీడీపీ, చంద్రబాబు కుటుంబం మీకు తోడుగా ఉంటుంది' అని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి భరోసా ఇచ్చారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా కర్నూలు జిల్లా ఆమె రెండో రోజు పర్యటించారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఐదు కుటుంబాలను ఆమె కలిశారు. భువనేశ్వరి వెంట మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు తదితరులు ఉన్నారు. నందవరం మండలం మాచాపురం గ్రామంలో తుది శ్వాస వీడిన టీడీపీ కార్యకర్త హనుమంతు కుటుంబ సభ్యులను పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ముగతి గ్రామంలో మృతి చెందిన నాగరాజు భార్య లలితాంబ, కుటుంబ సభ్యులను భువనేశ్వరి ఓదార్చారు. విలపిస్తున్న నాగరాజు భార్యను దగ్గరకు తీసుకొని సముదాయించారు. ఆ సమయంలో భువనేశ్వరి సైతం కంటతడి పెట్టారు. గోనెగండ్ల మండలం అగ్రహారం గ్రామంలో బాబు అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో కన్నుమూసిన సుధాకర్ నాయుడు భార్య రాధమ్మతో పాటు కుటుంబ సభ్యులను భువనేశ్వరి ఓదార్చారు. అల్వాల గ్రామంలో టీడీపీ సీనియర్ కార్యకర్త ఆరెకంటి ఈరన్న చంద్రబాబు అరెస్టు, వెంటనే బెయిల్ రాకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురై మృతి చెందాడని తెలిసి ఆయన ఇంటికి వెళ్లి ఈరన్న భార్య కరెక్క, కుటుంబ సభ్యులను ఓదార్చారు. యర్రబాడు గ్రామంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త కౌలుట్లయ్య భార్య లక్ష్మీదేవి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించారు. ప్రతి ఇంటి దగ్గర దాదాపు 15 నిమిషాలకు పైగా భువనేశ్వరి గడిపారు. కుటుంబ సభ్యులుగా భావించి ఓదార్చారు. పిల్లల్ని దగ్గరకు తీసుకొని 'ఎలా ఉన్నారు? నాన్నలేడని భయం వద్దు. చంద్రబాబు కుటుంబం మీకు అన్ని విధాలుగా అండగా ఉంటుంది' అని భరోసా కల్పించారు. అనంతరం కర్నూలు విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాదుకు బయల్దేరారు. భువనేశ్వరి వెంట ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మంత్రాలయం, పాణ్యం, ఆలూరు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పాలకుర్తి తిక్కారెడ్డి, గౌరు చరిత, కోట్ల సుజాతమ్మ తదితరులు ఉన్నారు.

చివరి దశకు చేరిన జగన్ పాలన

- బటన్ నొక్కుడులో సగం మద్యం ద్వారా లాక్కొంటున్నారు: నీలాయపాలెం

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మద్యాన్ని దశలవారీగా నిషేధిస్తామని ఇచ్చిన హామీని జగన్ మరచారని, జగన్ పరిపాలన చివరిదశకు చేరిందని టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బటన్ నొక్కుడు ద్వారా ప్రజలకు ఇచ్చే సొమ్ములో సగం సొమ్ముని జగన్ మద్యం విక్రయాల ద్వారా లాగేస్తున్నారన్నారు. రోజుకు లక్ష కేసుల మద్యం అమ్మి రూ.80 కోట్లు మేర ఆదాయం గడిస్తున్నారని తెలిపారు. ఈ ఐదేళ్లలో జగన్ సర్కార్ రాష్ట్రంలో రూ.1.25 లక్షల కోట్ల మద్యం విక్రయాలు జరిపిందన్నారు. దాని వల్ల ప్రభుత్వానికి రూ.లక్ష కోట్లకు పైగా ఆదాయం వచ్చిందన్నారు. మద్యాన్ని నిషేధించిన తర్వాతే ఓట్లు అడుగుతానన్న ముఖ్యమంత్రి జగన్ దానికి విరుద్ధంగా 67 శాతం పెంచారన్నారు. రాష్ట్ర ఆదాయంలో 25 శాతం మద్యం అమ్మకాల ద్వారానే వస్తోందన్నారు. డిస్టలరీలు, సబ్‌లీజుల్లో కూడా భారీ దోపిడీ జరిగిందని, నచ్చిన వారికే డిస్టిలరీలు కట్టబెట్టి నాసిరకం మద్యాన్ని తయారుచేస్తున్నారని ఆరోపించారు. మద్యం అమ్మకాల్లో డిజిటల్ చెల్లింపులను ప్రభుత్వం అనుమతించకపోవడానికి కారణం కూడా దోపిడీనేనన్నారు.

'లాగిన్' చేశారు!

(మొదటి పేజీ తరువాయి)

చేస్తూనేఉంది. ప్రతిసారీ ఈసీతో మొట్టికాయలు వేయించుకుంటోంది. కానీ, ఓటరు నమోదు ప్రక్రియలో అక్రమ చొరబాట్లను మాత్రం మానుకోలేదు. దీనికి పరాకాష్ట తిరుపతి ఉప ఎన్నిక. కనీవినీ ఎరుగని రీతిలో ఓ అధికారి సాయంతో ఎన్నికల కమిషనరు లాగిన్ సంపాదించి ఓటరు జాబితాను డౌన్‌లోడ్ చేసి ఓటర్ల ఫొటోలు మార్చి ఈసీనే ఏమార్చే ప్రయత్నం చేశారు. గెలిచే సీటు విషయంలోనే అడ్డగోలుగా వ్యవహరించినవారు.. అధికారం తిరిగి నిలబెట్టుకోవడం కోసం వచ్చే ఎన్నికల్లో ఇంకెన్ని ఘోరాలకు వడిగడతారో అనేది రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మీ లాగిన్ ఎక్కడ ఉందో తెలుసా?

సాధారణంగా రాజకీయపార్టీలు అక్కడక్కడ దొంగ ఓట్లు వేయించడం చూస్తాం. కానీ ఒక అధికారి ఏకంగా ఎన్నికల కమిషనర్‌కు సంబంధించిన వెబ్‌సైట్ లాగిన్, యూజర్ ఐడీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేశారు. దీని ఆధారంగానే దాదాపు 30 వేల ఓటర్లకు సంబంధించిన డూప్లికేట్ ఓటర్ కార్డులను సృష్టించడానికి వీలు కల్పించారు. కేంద్ర ఎన్నికల సంఘమే ఈ వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకురావడం గమనార్హం. ఆ వివరాల్లోకి వెళితే.. ప్రస్తుతం అన్నమయ్య జిల్లా కలెక్టరుగా ఉన్న గిరిషా తిరుపతి ఉప ఎన్నికల సమయంలో అక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. ఆయన.....ఎన్నికల కమిషనర్ వెబ్‌సైట్ లాగిన్, యూజర్‌ఐడీలను స్థానిక ప్రజాప్రతినిధి కుమారుడికి ఇచ్చినట్టు తెలుస్తోంది. దీని ఆధారంగానే భారీగా దొంగ ఓటర్ కార్డులను ఆ ప్రజాప్రతినిధి సృష్టించారు. ఈ కార్డుల ఆధారంగా అనేకమంది ఆ ఎన్నికల్లో దొంగ ఓట్లను వేయగలిగారు. ఈ విషయం స్వయంగా ఎన్నికల కమిషన్ గుర్తించింది. ఇదే విషయాన్ని బుధవారం సమావేశంలో గిరిషాను కమిషన్ ప్రశ్నించింది. ఎన్నికల సంఘం అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇవ్వలేకపోయారు. "మీ లాగిన్ మీ వద్దనే ఉందా..? లేదా..? మీ లాగిన్ నుంచి 30 వేల మంది ఓటర్లకు సంబంధించిన కార్డులు డౌన్‌లోడ్ చేశారు. వాటి ఆధారంగా అనేక దొంగ ఓటరు కార్డులు సృష్టించారు. ఈ విషయాలు మీకు తెలుసా?" అని ఈసీ ప్రశ్నించింది. ఈసీ అడిగిన ఏ ప్రశ్నకూ ఆయన వద్ద సమాధానం లేదు. ప్రతి దానికీ నో.. ఐ డోంట్ నో అని సమాధానం ఇచ్చారు. దీంతో సీఈసీ మరింత ఆగ్రహం వ్యక్తం చేసింది. "మీ లాగిన్ ఎవరి వద్ద ఉందో తెలియదు.. ఎన్నిసార్లు ఉపయోగించారో తెలియదు.. ఎన్ని ఓటర్ కార్డులు డౌన్‌లోడ్ చేశారో మీకు తెలుసా?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ దగ్గర సమాచారం మొత్తం ఉందని చెప్పింది. 'అసలు మీరేం చేస్తున్నా'రని తీవ్రంగా మండిపడింది. 'మీకు పార్టీ పక్షపాతం ఉంటే వెంటనే విధుల నుంచి తప్పుకోండి. ఎన్నికల తర్వాత ఏదైనా చేసుకోండి.... కానీ ఎన్నికల్ షెడ్యూల్ విడుదల తర్వాత మాత్రం మా నిబంధనల ప్రకారమే విధులు నిర్వహించాల్సిందే"నని గట్టిగా చెప్పింది.

పెట్టిన ఒక్క కేసులోనూ నిందితుడిని వదిలేశారు..

దొంగ ఓటరు కార్డులపై ఢిల్లీ వరకూ వందల ఫిర్యాదులు వస్తుంటే...మీరేం చేస్తున్నారని నెల్లూరు కలెక్టర్, ఎస్పీలను ఈసీ నిలదీసింది. దొంగ ఓటర్ కార్డులపై కేవలం ఒకే ఒక్క కేసు నమోదు చేసి, దానిని కూడా పట్టించుకోలేదని మండిపడింది. ఆ కేసులో కూడా నిందితుడిని వదిలేశారని, అతను ఎక్కడున్నాడో కూడా తెలియదని పేర్కొంది. దొంగ ఓటర్ కార్డులపై ఇంత నిర్లక్ష్యంగా ఎందుకు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించింది. కేసుల పరిష్కారం ఇలానే చేస్తారా..ఏ కేసుకు ఏ సెక్షన్లు పెట్టాలో కూడాతెలియదా...దొంగ ఓటరు కార్డులు తయారీకి సంబంధించిన కేసులు వేసిన సెక్షన్లు కరెక్టేనా?" అని గట్టిగానే నిలదీసింది.

సీపీఎస్‌ఈఏకు నూతన కార్యవర్గం


విజయవాడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగుల సంఘం (ఏపీసీపీఎస్ఈఏ) రాష్ట్ర నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కోరుకొండ సతీష్, సీఎం దాస్ ఎన్నికయ్యారు. బుధవారం విజయవాడ గాంధీనగర్‌లోని కవితా పూర్ణానందం ధర్మసత్రంలో ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఏపీసీపీఎస్‌యూఎస్ నేతగా ఉన్న దాస్ తన సంఘాన్ని కొంతకాలం కిందట ఏపీసీపీఎస్ఈఏలో విలీనం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అతనికి ప్రధాన కార్యదర్శి పదవిని ఇచ్చారు. సంఘ ఆర్థిక కార్యదర్శిగా బత్తిన ప్రసాద్ (ప్రకాశం), సహాధ్యక్షులుగా ప్రేమనాథ్‌రెడ్డి (అనంతపురం), అదనపు కార్యదర్శిగా గుర్రాన శ్రీనివాసరావు(మన్యం), మహిళా అధ్యక్ష, కార్యదర్శులుగా కల్పన (గుంటూరు), సుబ్బలక్ష్మి (చిత్తూరు) ఎన్నికయ్యారు. కాగా.. పాత పెన్షన్ పథకం సాధన కోసం జనవరి 28వ తేదీన ఓట్ ఫర్ ఓపీఎస్ అనే కార్యక్రమాన్ని విజయవాడలో నిర్వహిస్తున్నామని సీపీఎస్ ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షుడు కోరుకొండ సతీష్ తెలిపారు. రానున్న ఎన్నికల్లో పాత పెన్షన్ అమలుకు హామీ ఇచ్చేవారికే మా సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టంచేశారు.

ఉద్యోగుల బకాయిలు చెల్లించండి: టీడీసీ ఈయూ

విజయవాడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను త్వరితగతిన చెల్లించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రావత్‌కు ఏపీపీటీడీ ఈయూ రాష్ట్ర అగ్రనాయకత్వం బుధవారం విజ్ఞప్తి చేసింది. ఆర్టీసీ హౌస్‌కు వచ్చిన రావత్‌ను ఈయూ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, విజయవాడ జోనల్ కార్యదర్శి వైశ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ నాయకులు శంకరరావు, సిద్దిక్, కోటేశ్వరరావు, చక్రవర్తి మొహిద్దీన్, నారాయణలు ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలకు సంబంధించిన లేఖను అందించారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసిన అనంతరం ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక అంశాలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని వాటిని తక్షణం ఇప్పించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

యువత తలచుకుంటే సాధించలేనిది లేదు

- కామన్వెల్త్ నేషన్స్ సెక్రటరీ జనరల్ పాట్రిసియా స్కాట్లాండ్


పాట్రిసియాకు కాటన్ ఇన్నోవేషన్ అవార్డు అందజేస్తున్న చైతన్యరాజు, శశికిరణ్

రాజానగరం, జనవరి 10: కామన్వెల్త్ దేశాల్లో 30 ఏళ్ల లోపు యువత అధికంగా ఉన్నారని, వారు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని కామన్వెల్త్ సెక్రటరీ జనరల్ పాట్రిసియా స్కాట్లాండ్ పేర్కొన్నారు. ఆమె బుధవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. తొలుత ధవళేశ్వరంలో గోదావరిని, కాటన్ బ్యారేజీని, అనంతరం కాటన్ మ్యూజియాన్ని పరిశీలించారు. అనంతరం రాజానగరం పరిధిలోని గైట్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాట్రిసియాకు గైట్ కళాశాల నుంచి సర్ ఆర్థర్ కాటన్ ఇన్నోవేషన్ అవార్డు-2023ను చైతన్యరాజు, ఎపీఈ శశికిరణ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కామన్వెల్త్ నేషన్స్ 2023-24 సంవత్సరాన్ని కామన్వెల్త్ యువత సంవత్సరంగా పరిగణించిందని, ప్రతీ ఒక్కరూ విలువలతో కూడిన నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. గోదావరి డెల్టా రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్‌ను నేటి యువ ఇంజనీర్లు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

గండికోట, లేపాక్షిని 'స్వదేశీ దర్శన్'లోకి తీసుకోవాలి: జాస్తి

న్యూఢిల్లీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని గండికోట, లేపాక్షి, నాగార్జున కొండలను స్వదేశీ దర్శన్ స్కీములోకి తీసుకొని ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన కేంద్ర పురావస్తు శాఖ నూతన డైరెక్టర్ జనరల్ యదుబీర్ సింగ్ రావత్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 2024-2025 లోనైనా యునెస్కో ఫైనల్ జాబితాలోకి లేపాక్షి, గండికోట ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ. 4.83 కోట్లు

శ్రీశైలం, జనవరి 10: శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. ఇందులో ఆలయ హుండీల ద్వారా రూ.4,83,53,238 నగదు రూపంలో లభించింది. ఈ హుండీ ఆదాయాన్ని భక్తులు గత 28 రోజుల్లో సమర్పించారు. నగదుతో పాటు 13.33 తులాల బంగారం, 11.850 కిలోల వెండి లభించాయి.

ఒక్కో పోస్టుకు లక్ష

డిగ్రీ లెక్చరర్ల క్రమబద్ధీకరణకు వసూళ్లు

- సారుకు ఇవ్వాలంటూ కొందరి డిమాండ్
- గూగుల్ మీట్ సమావేశంలో ప్రతిపాదన
- అర్హత లేకపోయినా చేయిస్తారని హామీ
- కమిషనరేట్ అధికారిపైనే అనుమానాలు
- కళాశాల విద్యాశాఖలో మామూళ్ల దందా

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టగానే కళాశాల విద్యాశాఖలో వసూళ్ల దందా మొదలైంది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా ఉద్యోగం రెగ్యులరైజ్ కావాలంటే ఒక్కొక్కరు రూ.లక్ష ఇవ్వాలంటూ బేరసారాలు ప్రారంభమయ్యాయి. తాజాగా కొందరు కాంట్రాక్టు లెక్చరర్లు గూగుల్ మీట్ ద్వారా ఒక సమావేశం ఏర్పాటు చేసుకుని ఇదే అంశంపై చర్చించారు. "ఒక్కొక్కరు రూ.లక్ష ఇవ్వాలని సారు అడుగుతున్నారు. అడిగినంత ఇచ్చేస్తే వీలైనంత త్వరగా రెగ్యులర్ అయిపోతాం. ఏవైనా చిన్నపాటి ఇబ్బందులున్నా సారు చూసుకుంటారు. పైగా డబ్బులిచ్చిన వారి పేర్లే ముందు పెడతామంటున్నారు. అందుకే రూ.లక్ష చొప్పున ఇచ్చి పని పూర్తిచేసుకుందాం" అంటూ వసూళ్లకు ప్రతిపాదన పెట్టారు. ముడుపులు వ్యవహారం నచ్చని కొందరు మీటింగ్ నుంచి బయటికొచ్చేశారు. అయితే వీరే కాకుండా ఇంకా కొంతమంది కూడా కమిషనరేట్‌లోని అదే అధికారి పేరుతో వసూళ్లు ప్రారంభించినట్టు తెలిసింది. అలాగే అర్హత లేనివారి నుంచి కూడా వసూళ్లు చేస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వం 2014 జూన్ 2 నాటికి ఉద్యోగంలో ఉన్నవారినే రెగ్యులర్ చేస్తామని ప్రకటించింది. అయితే రెండోసారి విధుల్లో చేరిన వారి పేర్లను క్రమబద్ధీకరణ జాబితాలో పెడతామంటూ వసూళ్లు చేస్తున్నారు. కళాశాల విద్యాశాఖ పరిధిలో మొత్తం 793 మంది కాంట్రాక్టు డిగ్రీ లెక్చరర్లు పని చేస్తున్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం పీజీలో 55.5శాతం మార్కులు వచ్చి ఉండాలి. పీహెచ్‌డీ, నెట్, సెట్ మూడింటిలో ఏదొకటి కలిగి ఉండాలి. ఇప్పుడు క్రమబద్ధీకరణకు కూడా ఇవే అంశాలు పరిగణలోకి తీసుకుంటారు. అలాగే ప్రభుత్వం నిర్దేశించిన కటాఫ్ తేదీకి ముందు ఉద్యోగంలో చేరి ఉండాలి. ఈ నిబంధనల ప్రకారం చూస్తే 250 నుంచి 275 మంది వరకు క్రమబద్ధీకరణకు అర్హులుంటారని అంచనా. వీరి నుంచి రూ.లక్ష చొప్పున వసూలు చేసినా దాదాపు రూ.2.5కోట్లు అవుతాయి. అర్హతలేని వారి నుంచి కూడా తీసుకుంటే మరో రూ.50లక్షల నుంచి రూ.కోటి వసూలవుతాయి. ఇవన్నీ వసూలు చేసి ఇస్తే సాఫీగా క్రమబద్ధీకరణ జరుగుతుందని కొందరు లెక్చరర్లు ప్రచారం చేస్తూ వసూళ్ల దందా మొదలుపెట్టినట్లు తెలిసింది.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని వైసీపీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టింది. నాలుగున్నరేళ్ల తర్వాత ఇప్పుడు ప్రక్రియ మొదలుపెట్టింది. దీంతో క్రమబద్ధీకరణ ఎంతవరకూ జరుగుతుందోనన్న ఆందోళన కాంట్రాక్టు ఉద్యోగుల్లో నెలకొంది. దీనినే కొందరు అధికారులు అవకాశంగా మలుచుకుని వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. కాగా కమిషనరేట్‌లోని ఆ అధికారిపై గతంలోనూ అనేక ఆరోపణలున్నాయి. అర్హత లేకపోయినా అక్కడ పోస్టింగ్ పొందారని, వాస్తవంగా అర్హత ఉన్న అధికారిపై చిన్నపాటి ఆరోపణలు మోపి పక్కకు నెట్టారని కళాశాల విద్యాశాఖలో బహిరంగ చర్చ సాగుతోంది. తనపై వచ్చిన విజిలెన్స్ విచారణను పక్కన పెట్టారన్న ఆరోపణలూ ఉన్నాయి. అయితే ఆ అధికారికి ఓ ఉన్నతాధికారి అండదండలు ఉండటం వల్లే ఆయన విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడుతున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. కళాశాల విద్యాశాఖ పరిధిలో ఏవైనా అవకతవకలు అంటే వెంటనే ఆయన పేరే చెప్పే స్థాయిలో ఆయనపై ఆరోపణలున్నప్పటికీ ఉన్నతాధికారులు మాత్రం స్పందించడం లేదు.

ఆ అధికారిపై ఆరోపణల వెల్లువ


బీజేపీకి జగన్ బీ టీమ్

- వైసీపీ ఎంపీలు చీర్ గర్ల్స్.. ఏపీకి మోదీ ఏమీ చేయలేదు
- కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి న్యాయం: మాణిక్కమ్ ఠాకూర్

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ఎక్కువ మంది పార్లమెంటు సభ్యులున్న జగన్ పార్టీ రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రయత్నించదు. కేంద్రంలోని బీజేపీకి బీ టీమ్‌గా ఉంటూ మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక బిల్లులకు మద్దతిస్తోంది' అని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్కమ్ ఠాకూర్ విమర్శించారు. రాష్ట్ర పార్టీ ఇంచార్జిగా నియమితులయ్యాక మొదటిసారి విజయవాడ వచ్చిన ఆయన కాంగ్రెస్ నేతలు, జిల్లాల ముఖ్యులతో ఆంధ్రరత్న భవన్ (కాంగ్రెస్ పార్టీ ఆఫీసు)లో సమావేశం అయ్యారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ఉన్న మార్గాలు, అధికార వైసీపీ అరాచకాలు, టీడీపీ-జనసేన కూటమి బలాలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, మాజీ అధ్యక్షుడు రఘువీరా రెడ్డి, ముఖ్య నేతలు తులసిరెడ్డి, పళ్లంరాజు, జేడీ శీలం తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నరేంద్ర మోదీ పాలనలో రాష్ట్రానికి ఒక్క మెట్రో ప్రాజెక్టు ఇవ్వలేదన్నారు. విభజన చట్టంలోని హామీలు గాలికి వదిలేశారని, అడగాల్సిన జగన్ రెడ్డి ప్రభుత్వం బీజేపీకి బీ టీమ్‌గా మారి వైసీపీ ఎంపీలను జగన్ చీర్ గర్ల్స్ చేశారని, రాష్ట్ర ప్రయోజనాల్ని గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌కు అన్నివిధాలా న్యాయం చేస్తుందని, 2024 ఎన్నికల్లో ఏపీ ప్రజలు కాంగ్రెస్‌ను ఆశీర్వదిస్తారనే విశ్వాసం ఉందన్నారు. షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి రావడాన్ని ఆహ్వానిస్తున్నామని, ఆమెకు ఏ బాధ్యతలు అప్పగించాలో పార్టీ అధినాయకత్వం నిర్ణయిస్తుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు మొదలయ్యాయని, నెలాఖరుకు భారీగా ఉంటాయన్నారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ యాత్రకు సంఘీభావంగా ఏపీసీసీ ముద్రించిన పోస్టర్‌ను రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో కలిసి మాణిక్కమ్ ఠాకూర్ ఆవిష్కరించారు.

బహిరంగ చర్చకు సిద్ధమా..?

- ఏపీ భూహక్కుల చట్టంపై ధర్మానకు ముప్పాళ్ల సవాల్



రాజమహేంద్రవరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ప్రజావ్యతిరేక ఏపీ భూహక్కుల చట్టంపై రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు బహిరంగ చర్చకు సిద్ధమా? అని భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, ఏపీ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు సవాల్ విసిరారు. బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ చట్టాన్ని వెనక్కి తీసుకోబోమని, చట్టాన్ని చదవని కొందరు అన్యాయం జరుగుతుందని ఆందోళన చేస్తున్నారని ఆయన ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. మంత్రి వ్యాఖ్యలకు కట్టుబడి ఉంటే తన సవాల్‌ని స్వీకరించాలన్నారు. నీతిఆయోగ్ అనుసరించి దేశంలో ఏపీలో మొదటిగా భూహక్కుల చట్టాన్ని ప్రవేశపెట్టామని, సివిల్ కోర్టుల్లో ఉన్న 66 శాతం భూవివాదాల కేసుల వల్ల నేరాల సంఖ్య కూడా విపరీతంగా పెరుగుతోందని ధర్మాన సమర్థించుకోవడం దారుణమన్నారు. ఈ చట్టం వల్ల అధికార, అంగ, అర్థబలం ఉన్నవాళ్లు భూఆక్రమణలకు పాల్పడమే కాకుండా రెవెన్యూ అధికారులను అనుకూలంగా మార్చుకొని అమాయకుల భూములను లాక్కునే ప్రమాదం ఉందన్నారు. న్యాయ పరిజ్ఞానం లేని రెవెన్యూ అధికారులకు జ్యూడిషియల్ అధికారాలు ధారాదత్తం చేయడం వల్ల వారి ఆగడాలకు అంతులేకుండాపోతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు చేస్తున్న ఆందోళనలను పరిగణనలోకి తీసుకొని చట్టం అమలు నిలుపుదల చేయకుండా వెనక్కు తీసుకోబోమని ప్రకటించడం ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు నిదర్శనమని ఆరోపించారు. ఇదే విధానం కొనసాగితే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ చట్టాన్ని రద్దు చేస్తామని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో పొందుపర్చాలని డిమాండ్ చేశారు.

ఓటర్ల వివరాలు బహిరంగం

- మంత్రి రజని గ్రీటింగ్స్‌పై అచ్చెన్న ఫిర్యాదు

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): గుంటూరు వెస్ట్ నియోజకవర్గ ఓటర్లకు మంత్రి విడదల రజని గ్రీటింగ్స్ పంపించేందుకు ఓటర్ల ఫోన్ నంబర్లను సరఫరా చేసి ఓటర్ల వివరాల గోప్యతకు భంగం కలిగించారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు చేశారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల సహకారంతో ఎన్నికల ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా ఓటర్ల ఫోన్ నంబర్లను సేకరించారని, ఆ నంబర్లను మంత్రి రజనికి అందించారని తెలిపారు. దీంతో రజని ఫోన్ల ద్వారా గుంటూరు వెస్ట్‌లోని ఓటర్లందరికీ గ్రీటింగ్స్ తెలుపుతూ వచ్చే ఎన్నికల్లో తాను గుంటూరు వెస్ట్ నుంచి పోటీ చేస్తున్నట్లు తెలియజేశారన్నారు. ఇది ఓటర్ల వివరాల గోప్యతకు భంగం కలిగించినట్లేనని, ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు.

జగన్‌ది నిరంకుశ పాలన: బీవీ రాఘవులు

ఏలూరు, జనవరి 10: రాష్ట్రంలో జగన్ నిరంకుశ పరిపాలన సాగిస్తున్నాడని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. ఏలూరు జిల్లా కేంద్రమైన ఏలూరులో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడం మూర్ఖపు చర్య. అంగన్వాడీలకు నోటీసులు జారీ చేసి 10 రోజుల్లో విధులకు హాజరు కాకుంటే ఉద్యోగాలు ఊడిపోతాయని హెచ్చరించడం తగదు. జగన్ ఉద్యమాలపై అణచివేత ధోరణి అవలంబిస్తున్నాడు. ఉద్యమాలను అణచివేస్తే అధికారాన్ని పళ్లెంలో పెట్టి ప్రతిపక్షాలకు అందించడమే అవుతుంది' అని రాఘవులు అన్నారు.

ఆందోళనాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం: రామకృష్ణ

శ్రీకాకుళం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): 'తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని ఎమ్మెల్యేలను బదిలీ చేయడం తప్ప.. రాష్ట్రానికి సీఎం జగన్మోహన్‌రెడ్డి చేసింది శూన్యం. వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని ఆందోళన ఆంధ్రప్రదేశ్‌గా జగన్ మార్చేశారు' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు చేపడుతున్న ధర్నాలో బుధవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి పాల్గొని సంఘీభావం తెలిపారు.

మంద కృష్ణ సభలను అడ్డుకుంటాం: పేరుపోగు

విజయవాడ(ధర్నాచౌక్), జనవరి 10: కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించకుండా ఆ పార్టీకి మద్దతు పేరుతో మందకృష్ణ మాదిగ రాష్ట్రంలో ఎక్కడ సభ నిర్వహించినా అడ్డుకుంటామని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ హెచ్చరించారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఎస్సీ వర్గీకరణ పేరుతో రాజకీయ పార్టీల దగ్గర ప్యాకేజీలకు అమ్ముడుపోయి వారికి మద్దతు ఇవ్వడం మంద కృష్ణకు అలవాటుగా మారిందని ఆరోపించారు.

ఆర్థిక ఇబ్బందులతో చేనేత కార్మికురాలి ఆత్మహత్య

వేటపాలెం (చీరాల), జనవరి 10: ఆర్థిక ఇబ్బందులతో బాపట్ల జిల్లా వేటపాలెం మండలం కొణిజేటి చేనేతపురికి చెందిన విజయలక్ష్మి(43) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలికి భర్త లేడు. కుమారుడు శంకర్ చిరుద్యోగం చేస్తూ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి కష్టంగా మారడంతో విజయలక్ష్మి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో రెండ్రోజులుగా ఆమె ఇంటి తలుపు తెరవకపోవటంతో స్థానికులు బుధవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి తలుపు తెరిచి చూడగా విజయలక్ష్మి ఉరికి వేలాడుతూ కనిపించింది.

కంగువ కంప్లీట్



సూర్య కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'కంగువ'. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దిశాపటానీ కథానాయిక. బాబీడియోల్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం అప్డేట్‌ను సూర్య అభిమానులతో పంచుకున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు బుధవారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. 'కంగువ'లో నా చివరి షాట్ పూర్తయింది. ఒక ముగింపు, మరెన్నో గొప్ప ప్రారంభాలకు పునాది వేస్తుంది. వెండితెరపై 'కంగువ'ను చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. గొప్ప దృశ్యకావ్యాన్ని ఆవిష్కరించిన శివకు నా ధన్యవాదాలు' అని సూర్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా సూర్య స్టిల్‌ను మేకర్స్ షేర్ చేశారు. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

సంక్రాంతికి మరో సూపర్‌హిట్ ఖాయం

నాగార్జున



'తెలుగువారికి సంక్రాంతి అంటే సినిమా పండుగ. ప్రేక్షకులు గతంలో నా సంక్రాంతి సినిమాలను గొప్ప హిట్ చేశారు. ఇప్పుడు 'నా సామిరంగ' చిత్రాన్ని కూడా అదే రీతిలో ఆదరిస్తారనే నమ్మకం ఉంది. ఈ సారి పండుగకు కిష్టయ్య వస్తున్నాడు. 'నా సామిరంగ' అంటూ బాక్సాఫీసును కొట్టబోతున్నాడు' అని నాగార్జున అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'నా సామిరంగ' చిత్రం ఈ నెల 14న విడుదలవుతోంది. విజయ్ బిన్నీ దర్శకుడు. చిత్రబృందం బుధవారం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ 'ఈ సంక్రాంతికి నాలుగు సినిమాలు వస్తున్నాయి. అన్నింటినీ ఆదరించాలని ప్రేక్షకులను కోరుతున్నాను. నాన్నగారి ఆజ్ఞగా భావించి 'నా సామిరంగ' చిత్రం చేశాను. కీరవాణి అద్భుతమైన పాటలు ఇచ్చారు. మూడు నెలల్లో ఈ సినిమాను పూర్తి చేయడం ఒక రికార్డు' అని తెలిపారు. అల్లరి నరేశ్ మాట్లాడుతూ 'చిన్నతనం నుంచి నేను నాగార్జున గారికి అభిమానిని. ఈలలు వేస్తూ థియేటర్లలో ఆయన సినిమాలు చూశాను. కీరవాణి, చంద్రబోస్ గారు మా టీంకు అండగా నిలిచారు' అని తెలిపారు. రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'నాగార్జున గారితో కలసి నటించడం మరచిపోలేని అనుభవం. అక్కినేని అభిమానులందరూ ఈ సారి థియేటర్లలో పండుగ చేసుకోవడం ఖాయం' అన్నారు. విజయ్ బిన్నీ మాట్లాడుతూ 'చాలా తక్కువ టైంలో మంచి క్వాలిటీతో సినిమాను పూర్తి చేశాం. నా సాంగ్స్ చూసి దర్శకుడిగా అవకాశం ఇచ్చిన నాగార్జున గారికి రుణపడి ఉంటాను. యూనిట్‌లో ప్రతి ఒక్కరి సహకారంతో సినిమాను అనుకున్న విధంగా తెరకెక్కించగలిగాను' అన్నారు. కీరవాణి మాట్లాడుతూ 'కొత్త ప్రతిభను గుర్తించి అవకాశాలు ఇవ్వడంలో నాగార్జున ముందుంటారు. 'నా సామిరంగ'తో విజయ్ దర్శకుడిగా హిట్ అందుకోవాలి' అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి నాగార్జున గారు నన్ను ఆహ్వానించడమే గొప్ప గౌరవం అని చంద్రబోస్ తెలిపారు. నాగార్జున గారి లాంటి స్టార్‌తో నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను అని ఆశికా రంగనాథ్ చెప్పారు.

ఫిబ్రవరిలో వస్తున్న భైరవకోన



సందీప్ కిషన్ కథానాయకుడిగా రూపొందుతున్న ఫాంటసీ అడ్వెంచర్ 'ఊరుపేరు భైరవకోన'. వీఐ ఆనంద్ దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. అనిల్ సుంకర సమర్పకులు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఫిబ్రవరి 9న విడుదల చేస్తున్నట్లు బుధవారం చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో సందీప్ కిషన్ మంత్రదండం పట్టుకొని గంభీరంగా కనిపించడం సినిమాపై ఆసక్తిని పెంచింది. అతీంద్రియ శక్తులకు సంబంధించిన అంశాల చుట్టూ అల్లుకున్న కథ ఇదని మేకర్స్ తెలిపారు. వర్ష బొల్లమ్మ, కావ్యా థాపర్ కథానాయికలుగా నటించిన ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: ఛోటా కె. ప్రసాద్.

దేవకీ నందన వాసుదేవ



'ఈ కథకి 'దేవకీ నందన వాసుదేవ' సరైన టైటిల్. ఈ కథకోసం రెండేళ్లు వర్క్ చేశాను. నేను రాసిన కథల్లో ఆద్యంతం వినోదభరితమైన కథ ఇదే. దీనిపై అశోక్ పేరు రాసుంది. అందుకే అతని దగ్గరకు చేరింది. కొత్త నిర్మాత బాలకృష్ణ ఇష్టంతో సినిమా నిర్మిస్తున్నారు. నాకంటే బాగా తీయగలడనే నమ్మకంతో అర్జున్‌కి ఈ కథ ఇచ్చాను. స్టార్ రైటర్ సాయిమాధవ్ బుర్రాగారి మాటలు ఈ సినిమాకు పెద్ద ఎస్సెట్. అద్భుతమైన సంభాషణలు అందించారాయన. భీమ్స్ మంచి పాటలు ఇచ్చారు. పాత్రలకు తగ్గట్టు ఆర్టిస్టులు సెట్ అయ్యారు. ఇంత మాస్ పాత్రను అశోక్ ఎలా చేస్తాడా అనుకున్నాను. రషస్ చూశాక షాక్ అయ్యాను. చాలా సర్‌ప్రైజ్ ఇచ్చాడు' అని ప్రశాంత్ వర్మ అన్నారు. ఆయన కథతో అశోక్ గల్లా కథానాయకుడిగా అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రానికి 'దేవకీ నందన వాసుదేవ' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. వారణాసి మానస కథానాయిక. సోమినేని బాలకృష్ణ నిర్మాత. ఈ చిత్రం టీజర్‌ని బుధవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ వర్మ మాట్లాడారు. 'ప్రశాంత్‌వర్మ అద్భుతమైన కథ, సాయిమాధవ్‌గారి సంభాషణలు, అర్జున్ దర్శకత్వ ప్రతిభ ఇవన్నీ ఈ సినిమాను నెక్స్ట్ లెవల్లో నిలబెట్టాయి. ఆ ప్రభావం రేపు థియేటర్లలో చూస్తారు.' అని అశోక్ గల్లా నమ్మకంగా చెప్పారు. బాలకృష్ణ రాజీ పడకుండా సినిమాను నిర్మిస్తున్నారని, సాయిమాధవ్ మాటలు, భీమ్స్ పాటలు అలరిస్తాయని దర్శకుడు చెప్పారు. కృష్ణగారి కుటుంబం నుంచి వచ్చిన అశోక్ తప్పకుండా సూపర్‌స్టార్ అవుతాడని సాయిమాధవ్ బుర్రా నమ్మకం వెలిబుచారు. ఇంకా చిత్రబృందం మాట్లాడారు.



అంజమ్మ అందరికీ నచ్చేస్తుంది


'నేను భాష గురించి ఆలోచించను. పాత్ర గురించి మాత్రమే ఆలోచిస్తాను. నచ్చితే బెంగాలీ సినిమా అయినా చేసేస్తాను. హీరోయిన్ అనిపించుకోవడం కంటే మంచి నటి అనిపించుకోవడమే నాకిష్టం. హీరోయిన్ అని ట్యాగ్ తగిలిస్తే ఆనందపడిపోయే టైప్ కాదు నేను. కథలో ప్రాధాన్యం ఉండాలి. 'వీరసింహారెడ్డి' సినిమా చూస్తే బాలకృష్ణగారి తర్వాత అంతా నేనే కనిపిస్తా. అది కదా కావాల్సింది..!' అంటూ చెప్పుకొచ్చారు వరలక్ష్మి శరత్‌కుమార్. తేజ సజ్జా కథానాయకుడిగా ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హను-మాన్'. కె.నిరంజన్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా అందులో కీలకపాత్ర పోషించిన వరలక్ష్మి శరత్‌కుమార్ విలేకరులతో ప్రత్యేకంగా ముచ్చటించారు.

- ప్రశాంత్‌వర్మ ఈ కథ చెప్పినప్పుడు కచ్చితంగా చేయాల్సిన కథ అనిపించింది. ఈ సినిమాలో నా పాత్రపేరు అంజమ్మ. నేనూ, తేజా అక్కాతమ్ముళ్లం. మాపై తీసిన సరదా సన్నివేశాలు చక్కటి వినోదాన్ని పంచుతాయి. ఇది సూపర్‌హీరో కాన్సెప్ట్‌లో తెరకెక్కిన సినిమా. నేను కూడా ఒక యాక్షన్ సీక్వెన్స్ చేశాను. ఒక మాస్ హీరోకి ఉన్నంత ఎలివేషన్ వుండే యాక్షన్ సీక్వెన్స్ అది. ప్రశాంత్‌వర్మ ఎంత అద్భుతంగా ఈ కథ చెప్పాడో, అంత అద్భుతంగా తీశాడు. చిన్న సినిమాగా మొదలైన ఈసినిమా.. ఇంతింతై, వటుడింతై అన్నట్టు ఇంత పెద్ద స్కేల్‌లో గ్రాండ్‌గా రావడం చాలా ఆనందంగా ఉంది. ప్రేక్షకుల్లో కూడా పాజిటివ్ బజ్ ఉంది.
- నిర్మాత నిరంజన్‌రెడ్డికి హ్యాట్సాఫ్ చెప్పాలి. 'హను-మాన్' అద్భుతంగా నిర్మించారు. దర్శకుడి విజన్‌ని అర్థం చేసుకునే నిర్మాత దొరకడం టీమ్ అదృష్టం. సినిమా ఒప్పుకున్న రోజున చిన్న సినిమా అనుకున్నాను. తొలిరోజు సెట్‌లోకి అడుగుపెట్టగానే ప్రత్యేకంగా తీర్చిదిద్దిన సెట్స్ కనిపించాయి. అప్పుడర్థమైంది ఇది చిన్న సినిమా కాదు అని. ఏ విషయంలోనూ నిర్మాత రాజీ పడలేదు.
- క్రాక్, వీరసింహారెడ్డి, కోటబొమ్మాళీ చిత్రాల్లోని నా పాత్రల్లో గ్రే షేడ్స్ ఉంటాయి. కానీ ఇందులో ఆ షేడ్ ఉండదు. ఇది పాజిటివ్ పాత్ర. అయినా ప్రేక్షకులకు బాగా నచ్చేస్తుంది. అంజమ్మ పాత్ర చాలా విభిన్నమైనది. కచ్చితంగా నాకు మంచి పేరు తెచ్చిపెడుతుంది.
- చిరంజీవిగారు అభినందించడం గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. అలాగే 'కోటబొమ్మాళీ' చూసి నాన్న తెగ మెచ్చుకున్నారు. మంచి పాత్రలు దొరకడం.. అందరూ మెచ్చుకోవడం చాలా ఆనందంగా ఉంది. తెలుగులో లభిస్తున్న ఆదరణ నాకు ఏ భాషలోనూ లభించలేదు. అందుకే హైదరాబాద్‌కి షిఫ్ట్ అయిపోయాను. ఇక్కడే ఉంటున్నాను. ప్రస్తుతం సుదీప్‌గారి 'మ్యాక్స్', ధనుష్ 'డి50'లో నటిస్తున్నాను. ఓ తెలుగు సినిమాలో అద్భుతమైన పాత్ర చేస్తున్నాను. ఆ వివరాలు త్వరలో తెలియజేస్తా.



వచ్చింది సెల్ఫీ కోసం కాదు

సినీతారలు కంటపడితే చాలు 'ప్లీజ్ ఓ సెల్ఫీ' అంటూ అభిమానులు ఎగబడడం, వారిని నిరుత్సాహపరచడం ఇష్టం లేకో, లేదా తమకు పొగరు అనుకుంటారనే భయంతోనో చాలామంది సెలబ్రిటీలు ఫొటోలు దిగటం చూస్తూనే ఉన్నాం. కానీ డ్రీమ్‌గర్ల్ హేమమాలిని లాంటి అతికొద్ది మాత్రం అందుకు మినహాయింపు అని చెప్పాలి. ఇటీవలే ముంబైలో జరిగిన ప్రముఖ రచయిత గుల్జార్ బయోగ్రఫీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓ అభిమాని హేమమాలినీని సెల్ఫీ ఇవ్వాలని అడగ్గా అందుకు ఆమె చిరాకుపడ్డారు. 'నీకు సెల్ఫీ ఇవ్వడానికి కాదు ఇక్కడకు వచ్చింది' అని కోప్పడ్డారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట్లో వైరల్ అవుతోంది. సెల్ఫీ అడిగితే ఇంత పొగరుగా ప్రవర్తించాల్సిన అవసరం లేదని కొంతమంది నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.



వినోదాన్ని పంచే మెకానిక్



మణిసాయితేజ, రేఖ నిరోషా జంటగా నటించిన చిత్రం 'మెకానిక్'. ముని సహేకర దర్శకుడు. కథ, కథనం, మాటలు, పాటలు కూడా ఆయనే రాయడం విశేషం. ఎం.నాగ మునెయ్య(మున్నా) నిర్మాత. ఈ నెల 26న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ఆడియో సక్సెస్‌మీట్‌ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయిత లక్ష్మీభూపాల, నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్ అతిథులుగా హాజరై సినిమా విజయం సాధించి, నిర్మాతకు లాభాల తెచ్చిపెట్టాలని ఆకాంక్షిచారు. ఈ సినిమా ఆడియోను టి సిరీస్ వంటి ప్రఖ్యాతసంస్థ తీసుకోవడం, వారి చార్ట్‌బాస్టర్‌లో ఈ సినిమా పాటలు దూసుకుపోవడం చాలా ఆనందాన్నిచ్చింది, ముఖ్యంగా సంగీత దర్శకుడు వినోద్ యాజమాన్యకు రుణపడి ఉంటానని నిర్మాత అన్నారు. 'దర్శకుడు ముని పర్‌ఫెక్షన్, విజన్ ఉన్న బహుముఖ ప్రజ్ఞాశాలి. అన్నీ తానే అయి ఈ చిత్రాన్ని పూర్తిచేశాడు. హీరోహీరోయిన్ల జంట యువతరాన్ని అలరిస్తుంది' అని ఆయన అన్నారు. వినోద్ యాజమాన్య పాటల విషయంలో తన సొంత సినిమా అన్నట్టుగా పని చేశాడని, వినోదంతో పాటు చక్కని సందేశం కూడా ఈ సినిమాలో ఉంటుందని దర్శకుడు చెప్పారు. అవకాశం ఇచ్చిన దర్శకనిర్మాతలకు హీరోహీరోయిన్లు కృతజ్ఞతలు తెలిపారు.

జీవితానికి తెరరూపం ది గోట్ లైఫ్



90వ దశకంలో జీవనోపాధి వెతుక్కుంటూ కేరళను వదిలి విదేశాలకు వలస వెళ్లిన నజీబ్ అనే యువకుడి జీవిత కథ ఆధారంగా రూపొందిన చిత్రం 'ది గోట్ లైఫ్' (ఆడు జీవితం). మలయాళ స్టార్‌హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధానపాత్ర పోషించారు. హాలీవుడ్ యాక్టర్ జిమ్మీ జీన్ లూయిస్, అమలాపాల్ కీలక పాత్రధారులు. బెన్యామిన్ రాసిన గోట్ డేస్ నవల ఆధారంగా దర్శకుడు బ్లెస్సీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. విజువల్ రొమాన్స్ సంస్థ నిర్మించిన ఈ పాన్ ఇండియా సినిమా ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని పృథ్వీరాజ్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని ప్రముఖహీరో ప్రభాస్ రిలీజ్ చేశారు. 'నా స్నేహితుడు ప్రభాస్ చేతులమీదుగా 'ది గోట్ లైఫ్' ఫస్ట్‌లుక్ విడుదల కావడం ఆనందంగా ఉంది. ఈ సినిమాకోసం ఐదేళ్లు కష్టపడ్డాను. మానసికంగా, శారీరకంగా నజీబ్ కేరక్టర్‌లా మారిపోయాను. ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నాను. పూర్తిస్థాయి ఎడారిలో రూపొందిన చిత్రం ఇది. ప్రేక్షకులకు కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తుందీ సినిమా' అని పృథ్వీరాజ్ తెలిపారు. కేఆర్ గోకుల్, అరబ్ ఫేమస్ యాక్టర్స్ తాలిబ్ అల్ బలూషి, రిక్ ఆబే తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సునీల్ కేఎస్, సంగీతం: ఏఆర్ రెహమాన్, సౌండ్ డిజైన్: రసూల్ పూకుట్టి.





ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు

నేడే ఫైనల్స్

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు, పవర్డ్‌బై ఎయిమ్స్ వి ద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం నగరంలో జరగనున్నాయి. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొంటారు. ఫైనల్స్‌లో ప్రథమ, ద్వితీయ బహుమతులతో పాటు కన్సొలేషన్ బహుమతులు ఉంటాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని 83 కేంద్రాల్లో ఈనెల 5, 6, 7, 8 తేదీల్లో పోటీలు నిర్వహించగా, 12వేల మందికిపైగా మహిళలు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలు రాష్ట్రస్థాయిలో జరిగే ఫైనల్స్‌కు అర్హత సాధించారు. గుడివాడలో జరిగిన ముగ్గుల పోటీల్లో విజేతగా నిలిచిన పూజిత కృష్ణాజిల్లా తరఫున ఈ ఫైనల్స్‌లో పాల్గొంటున్నారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ.

30 రోజుల అంగన్‌వాడీ

అలుపెరగని పోరాటంతో దూసుకెళ్తున్న మగువలు

నెలరోజుల్లో ఎన్నో ఆటుపోట్లు.. ఆటంకాలు.. అరెస్టులు..

- అయినా ఆగకుండా వినూత్నంగా నిరసనలు
- తాజాగా విధుల్లో చేరాలని షోకాజ్ నోటీసులు
- డిమాండ్ల సాధనే లక్ష్యంగా వెనకడుగు వేయని వైనం
- ప్రభుత్వం దిగొచ్చే వరకూ విరవి ఎంచేది లేదని హుకుం
- నగరంలోని ధర్నాచౌక్‌లో అలుపెరగని పోరు
- మచిలీపట్నంలోనూ వినూత్న నిరసనల హోరు



ధర్నాచౌక్‌లో నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

ఆడవారు.. పైగా అంగన్వాడీలే కదా.. అలసిపోతారనుకున్నారు. అడుగడుగునా ఆటంకాలు సృష్టించారు. జుట్టుపట్టి లాగారు.. చీరలు చించేశారు.. ఎత్తి కుదేశారు.. ఈడ్చి పడేశారు.. వాహనాల్లో కుక్కికుక్కి అరెస్టులు చేశారు.. అయినా ఆగకపోవడంతో నోటీసులిచ్చారు.. ఉద్యోగాలు తొలగిస్తామని బెదిరించారు.. అయినా వెనకడుగు వేయక బిగిసిన పిడికిలిని మరింత బిగించారు అంగన్వాడీలు. ప్రభుత్వ పక్షపాత ధోరణికి వెరవక.. పోలీసుల నిరంకుశ వైఖరికి నీరసించిపోక.. అలుపెరగక ఆందోళన చేస్తూనే ఉన్నారు. 30 రోజులు దాటి మరింత ముందుకు సాగుతున్నారు.

ఆంధ్రజ్యోతి-విజయవాడ : జిల్లాలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు చేస్తున్న సమ్మె నెల రోజులకు చేరింది. గతనెల 12వ తేదీన జిల్లావ్యాప్తంగా సమ్మెబాట పట్టారు. గ్రాడ్యుటీ అమలు చేయాలని, తెలంగాణాలో కంటే వెయ్యి రూపాయలు అధికంగా వేతనాలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న అద్దె, ఇతరత్రా బకాయిలను విడుదల చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో తమ కుటుంబాలకు ప్రయోజనం కల్పించాలనే ప్రధాన డిమాండ్లతో అంగన్వాడీలు ఈ సమ్మెబాట పట్టారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నంతో పాటు అవనిగడ్డ, మొవ్వ, గుడివాడ, పామర్రు, బంటుమిల్లి, కంకిపాడు తదితర ప్రాంతాల్లో రిలే దీక్షలు చేపట్టారు. విజయవాడలోని ధర్నాచౌక్‌లో, జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు తదితర ప్రాంతాల్లో నిరసనలు తెలుపుతున్నారు. వీరికి పలు ఉద్యోగ, ప్రజా సంఘాలు, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు, టీడీపీ, జనసేన, కాంగ్రెస్ మద్దతు తెలియజేశాయి. ప్రభుత్వం పలుమార్లు అంగన్వాడీల సంఘాల నాయకులతో చర్చలు జరిపినా

- మిగతా 6లో

ప్రయాణం కష్టమే..!



పీఎన్‌బీఎస్‌లో రద్దీ

కష్టతరంగా మారిన పండుగ ప్రయాణం



బ్యాగులతో ఇళ్లకు బయల్దేరిన విద్యార్థులు

సంక్రాంతి పండుగకు రాకపోకలు చుక్కలు చూపిస్తున్నాయి. ఆర్టీసీ రెగ్యులర్‌తో పాటు స్పెషల్ బస్సుల రిజర్వేషన్లు పూర్తవడం, రైళ్లలోనూ ఇదే పరిస్థితి కొనసాగడంతో ప్రయాణికులు మరో మార్గాన్ని వెతుక్కుంటున్నారు. మూడు రోజుల్లో పరిస్థితి మరింత దుర్లభంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఆర్టీసీ బస్సులు, రైళ్లు ఫుల్

- హైదరాబాద్ నుంచి పెరిగిన రాకపోకలు
- మూడు రోజుల్లో మరింత దుర్లభమే..
- విద్యార్థులు, తల్లిదండ్రుల రాకపోకలు భారీగా..
- రాయలసీమ, ఉత్తరాంధ్రకు స్పెషల్ బస్సులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వచ్చేందుకు ప్రయాణ కష్టాలు మొదలయ్యాయి. హైదరాబాద్ నుంచి విజయవాడకు 3 లక్షల మంది ప్రయాణికులను తీసుకురావడం దుర్లభంగా మారింది. ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు, రైళ్లు, విమానాలన్నీ కలిపినా మూడు రోజులకు 1,85,000 మందిని తీసుకురావచ్చు. మరో 1,25,000 మందిని ఎలా తీసుకురావాలన్నదే ప్రశ్న. కార్లు, క్యాబ్‌లు, సొంత వాహనాలపై ఆధారపడితే తప్ప వీరంతా బెజవాడ రాలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఈసారి ఎన్‌హెచ్-65పై వాహనాల రద్దీ తారస్థాయిలో ఉండే అవకాశం కనిపిస్తోంది.

మూడు రోజుల్లో ఎంతమంది..?

హైదరాబాద్ నుంచి విజయవాడకు ఆర్టీసీ షెడ్యూల్ బస్సులన్నీ హౌస్‌ఫుల్ అయ్యాయి. స్పెషల్ బస్సుల్లో 90 శాతం పైగా రిజర్వేషన్ జరిగిపోయింది. హైదరాబాద్‌కు పంపిన ఏపీఎస్‌ఆర్టీసీ బస్సులన్నీ కిటకిటలాడుతూ విజయవాడ వస్తున్నాయి. కాగా, ఈ సంక్రాంతికి హైదరాబాద్ నుంచి రెండున్నర లక్షల మందికి పైగా వస్తారన్నది ఆర్టీసీ అంచనాగా ఉంది. గత కొన్నేళ్లుగా వస్తున్న పండుగ ప్రయాణాల గణాంకాల ప్రాతిపదికగా ఆర్టీసీ అధికారులు ఈ లెక్కలు వేస్తున్నారు. విజయవాడకే కాకుండా ఇక్కడి నుంచి ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాలకు వెళ్లేవారితో కలిపితే 3 లక్షల మంది ఉంటారు. హైదరాబాద్ నుంచి వచ్చే వారిలో కేవలం ఇటు ఏపీఎస్‌ఆర్టీసీ, అటు టీఎస్‌ఆర్టీసీ రోజుకు సగటున 1,000 బస్సుల చొప్పున నడిపినా 40 వేల మంది మాత్రమే వచ్చే అవకాశం ఉంది. విమానాల్లో అయితే రోజుకు 1,000 మందిలోపు మాత్రమే తీసుకొచ్చే అవకాశం ఉంది. ఇక ఒక రైల్లో 1,728 మందిని మాత్రమే తీసుకురావచ్చు.



రైల్వేస్టేషన్‌లో విద్యార్థుల పడిగాపులు

సికింద్రాబాద్, హైదరాబాద్ నుంచి విజయవాడకు గరిష్ఠంగా 12 రైళ్లు ఉన్నాయి. ఈ లెక్కన చూస్తే రోజుకు 20 వేల మంది ప్రయాణికులను లెక్కేస్తే మూడు రోజుల్లో 60 వేల మందే వచ్చే అవకాశం ఉంది. ఈ లెక్కన బస్సు, రైలు, విమానాల ద్వారా సగటున మొత్తంగా మూడు రోజుల పాటు 1,85,000 మందే వచ్చే అవకాశం ఉంటుంది. మిగిలిన 1,25,000 మందిని తీసుకురావటం కత్తిమీద సామే. కార్లు, క్యాబ్‌లపై రావాలంటే భారీగా చేతి చమురు వదిలించుకోవాల్సి వస్తుంది.

కిటకిట..!

ప్రయాణికులు, విద్యార్థులతో పీఎన్‌బీఎస్, రైల్వేస్టేషన్ కిటకిట

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కళాశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో బుధవారం పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ (పీఎన్‌బీఎస్), రైల్వేస్టేషన్లు కిటకిటలాడాయి. వారం పాటు సెలవులు ప్రకటించడంతో పిల్లల్ని తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు వస్తున్నారు. దీంతో రాకపోకలు సాగించే వారితో పీఎన్‌బీఎస్, రైల్వేస్టేషన్ కిక్కిరిసిపోయాయి. షెడ్యూల్ బస్సులు నూరుశాతం ఫుల్ అయ్యాయి. విద్యార్థుల రద్దీ పెరిగితే మరిన్ని స్పెషల్స్ నడుపుతామని ఆర్టీసీ పీఎన్‌బీఎస్ డీసీటీఎం బషీర్ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఇందులో భాగంగానే 23 స్పెషల్ బస్సులను నడిపారు. రాజమండ్రి, విశాఖపట్నం, రాయలసీమకు వీటిని నడిపారు. మరోవైపు రైల్వేస్టేషన్‌లో కూడా రద్దీ కనిపించింది.

ఒంటరిగా..

ఎంపీ కేశినేని నానిని అనుసరించని ముఖ్య అనుచరులు

బేగ్, గన్నే ప్రసాద్, బొమ్మసాని సుబ్బారావు టీడీపీలోనే..

- ఒంటరిగానే వైసీపీ తీర్థం పుచ్చుకున్న ఎంపీ
- నందిగామ ఎమ్మెల్యే కారులో సీఎం వద్దకు..
- అచ్చెన్నాయుడిని కలిసిన ఎంఎస్ బేగ్
- లోకేశ్‌ను కలిసిన బొమ్మసాని, గన్నే
- టీడీపీని వీడేది లేదని స్పష్టీకరణ



తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వైసీపీ ఎమ్మెల్యే, నేతలతో కలిసి వెళ్తున్న ఎంపీ కేశినేని నాని

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : తన మాటతీరు, నిర్ణయాలతో వివాదాస్పదంగా మారిన ఎంపీ కేశినేని నాని చివరకు ఒంటరిగానే మిగిలారు. బుధవారం టీడీపీని వీడి వైసీపీ తీర్థం పుచ్చుకున్న ఆయన వెంట తన అనుకున్న వారెవరూ అడుగులు వేయలేదు. ఎంపీ నానికి అనుచరులుగా ముద్రపడిన పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఎంఎస్ బేగ్, మైలవరం నియోజకవర్గానికి చెందిన బొమ్మసాని సుబ్బారావు, గన్నే ప్రసాద్ తదితరులు ఆయన వెంట కలిసి నడవలేదు. నాని కూడా వీరికి ఫోన్ చేసి తనతో పాటు వైసీపీలోకి రావాల్సిందిగా ఆహ్వానించారు. కానీ, బుధవారం అందుకు భిన్నమైన పరిస్థితి కనిపించింది. పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు డ్రైవ్ చేస్తుండగా, నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు కారులో నాని సీఎం క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. వెనుక సీటులో దేవినేని అవినాశ్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ మాత్రమే సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. అదే సమయంలో ఎంఎస్ బేగ్.. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడిని కలిసి తాను పార్టీలోనే కొనసాగుతానని చెప్పగా, బొమ్మసాని, గన్నే ప్రసాద్.. లోకేశ్‌ను కలిసి తాము పార్టీ వీడేది లేదని స్పష్టం చేయడం గమనార్హం.

షరతులతో..

వైసీపీలో చేరేందుకు నాని కొన్ని షరతులు పెట్టినట్టు చెబుతున్నారు. విజయవాడ ఎంపీ టికెట్ ఇవ్వడంతో పాటు ఆర్థికంగానూ తోడ్పాటు అందించాలని, తిరువూరు అసెంబ్లీ స్థానం నుంచి నల్లగట్ల స్వామిదాసుకు అవకాశం కల్పించాలని కోరినట్లు సమాచారం. దీనికి వైసీపీ పెద్దలు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది.

ఎట్టకేలకు అభ్యర్థి దొరికాడు

విజయవాడ ఎంపీ అభ్యర్థి కోసం వైసీపీ చేస్తున్న అన్వేషణ కొలిక్కి వచ్చింది. మరోవైపు ఎక్కడ ఎంపీ టికెట్‌ను బలవంతంగా అంటగడతారా.. అని ఆందోళనకు గురైన పెడన ఎమ్మెల్యే, మంత్రి జోగి రమేశ్, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తాజా పరిణామాలతో ఊపిరి పీల్చుకున్నారు. ఎంపీ అభ్యర్థి కోసం పార్టీ పెద్దలు కొంతకాలంగా అన్వేషిస్తున్నారు. 2014లో కోనేరు ప్రసాద్, 2019 ఎన్నికల్లో పొట్లూరి వరప్రసాద్ (పీవీపీ) వైసీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. కోనేరు ప్రసాద్ ఇటీవల మరణించారు. పీవీపీ వైసీపీకి దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పెడన ఎమ్మెల్యే జోగి రమేశ్‌కు కానీ, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు కానీ ఎంపీ స్థానం అంటగట్టే ప్రయత్నాలు చేశారు. వారిద్దరూ విముఖత చూపడంతో కొత్త అభ్యర్థి కోసం అన్వేషణ ప్రారంభించారు. అనూహ్యంగా కేశినేని నాని టీడీపీ వీడటంతో వైసీపీకి ఎంపీ అభ్యర్థి దొరికినట్లయింది. అయితే, నాని కొంతకాలంగా వైసీపీ నాయకులతో టచ్‌లో ఉంటూ వచ్చారు. 2019 ఎన్నికల తర్వాత వైసీపీ దూకుడు చూసి, టీడీపీ ఇక కోలుకోదన్న భావనలో ఉన్న నాని పార్టీ వీడాలన్న నిర్ణయానికి వచ్చి, తన నియోజకవర్గ పరిధిలో వైసీపీ ఎమ్మెల్యేలతో సన్నిహితంగా మెలగడం ప్రారంభించారు. అయితే, ఏడాదిగా శరవేగంగా మారిన రాజకీయ పరిణామాలతో ప్రజలు మళ్లీ టీడీపీ వైపు మొగ్గు చూపుతుండటంతో పునరాలోచనలో పడ్డారు. అయితే, జరగాల్సిన నష్టం జరిగిపోవడంతో గత్యంతరం లేని స్థితిలో టీడీపీ నుంచి బయటకొచ్చారు. తొలుత బీజేపీలో చేరతారని ప్రచారం జరిగినా చివరికి వైసీపీ పంచన చేరారు.

కేశినేని నాని ఫొటో తొలగింపు

కంచికచర్ల రూరల్, జనవరి 10 : ఎంపీ కేశినేని నాని వైసీపీ తీర్థం పుచ్చుకోవడంపై టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధినేత చంద్రబాబు, లోకేశ్‌పై నాని చేసిన వ్యాఖ్యలకు కడుపుమండిన ఓ కార్యకర్త కంచికచర్ల టీడీపీ కార్యాలయం వద్ద ఫ్లెక్సీలో నాని ఫొటో కట్ చేసి నిరసన తెలిపాడు.



కూలిన బతుకులు

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి
- ఒకే కుటుంబానికి చెందిన బడుగు జీవులు
- ఏ.కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామంలో ఘటన

ఎ.కొండూరు, జనవరి 10 : బతుకుతెరువు కోసం వచ్చారు. చిన్నాచితకా పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. అలాంటి ముగ్గురు బడుగుల జీవితాలు ఓ రోడ్డు ప్రమాదంతో ముగిసిపోయాయి. విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందినవారు మృతిచెందారు. ఈ ఘటన ఏ.కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామంలో జరిగింది. తిరువూరు సీఐ అబ్దుల్ నబీ తెలిపిన వివరాల ప్రకారం చిత్తూరు జిల్లా మదనపల్లెకు చెందిన షేక్ హుస్సేన్‌బీ (55), నాగుల్‌మీరా (30), నాగుల్‌మీరా (23) బతుకు తెరువు కోసం గంపలగూడెం మండలం వినగడప గ్రామంలో నివాసముంటున్నారు. ఇద్దరు నాగుల్‌మీరాలు స్థానిక తోటమూల సెంటర్‌లో టీ స్టాల్, బేకరీలో పనిచేస్తున్నారు. నాగుల్‌మీరా భార్య.. మదనపల్లెలో ఉండగా, ఆమెను చూసేందుకు తల్లి హుస్సేన్‌బీని విజయవాడ రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కించేందుకు బైకుపై ముగ్గురు బయల్దేరారు. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామ సమీపంలో మైలవరం వైపు నుంచి యాష్ లోడుతో వెళ్తున్న టిప్పర్ ఎదురుగా వస్తున్న వీరి బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో హుస్సేన్‌బీ 10 మీటర్లు దూరం ఎగిరిపడి మృతిచెందగా, ఇద్దరు నాగుల్‌మీరాలు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం మేరకు తిరువూరు సీఐ అబ్దుల్ నబీ, ఎస్సై అంకారావు ఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను తొలగించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై అంకారావు తెలిపారు.



చలో సీఎం కార్యాలయం ఉద్రిక్తం

నిరుద్యోగులను అడ్డుకున్న పోలీసులు

లబ్బీపేట, జనవరి 10 : మెగా డీఎస్సీ ప్రకటించాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన 'చలో ముఖ్యమంత్రి కార్యాలయం' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఏటా జాబ్ క్యాలెండర్ అని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారని, దీనిపై ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని కోరుతూ ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నిరుద్యోగులు, డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొని శాంతియుతంగా వారధిపై నిరసనకు దిగారు. అయితే, పోలీసులు వీరిని అడ్డుకున్నారు. విచక్షణరహితంగా లాగేసి, నాయకులను, నిరుద్యోగులను అదుపులోకి తీసుకుని, పోలీసు వాహనాల్లో ఎక్కించి జ్యోతి కల్యాణ మండపానికి తరలించారు.



మైలవరంలో గంగిరెద్దుకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు

బసవన్నా.. మా గోడు వినవా!

మైలవరం, జనవరి 10 : తమ డిమాండ్ల సాధన కోసం సమ్మెలో ఉన్న అంగన్వాడీలు బుధవారం గంగిరెద్దుకు వినతిపత్రం ఇచ్చి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీఐటీయూ నేత సీహెచ్ సుధాకర్ మాట్లాడుతూ, నెల రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే ఈ ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్టు కూడా లేదన్నారు. ఇందుకు తగిన మూల్యం తప్పదన్నారు. కార్యక్రమంలో కె.బాలకృష్ణ, పుష్పకుమారి, శారద, బుల్లెమ్మ, రబ్బాని, మాణిక్యం, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు నోటీసులు..



మోపిదేవి: సమ్మె బాటలో ఉన్న అంగన్వాడీ ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మాలో భాగంగా రెవెన్యూ ఉద్యోగుల ద్వారా నోటీసులు ఇస్తున్నారు. బుధవారం మండలంలోని 30 అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు వీఆర్వో, సచివాలయ మహిళా ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి నోటీసులు ఇస్తున్నారు. ఉద్యోగుల ఇళ్లకు, కార్యాలయాలకు నోటీసులు అంటించి స్థానిక కుటుంబాలతో సంతకాలు తీసుకుంటున్నారు.

నందిగామలో ఉరితాళ్లకు వేలాడుతూ..

నందిగామ: ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ముఖ్యమంత్రి జగన్ తమకు ఉరి వేస్తున్నాడంటూ అంగన్వాడీ కార్యకర్తలు వినూత్న నిరసన తెలిపారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మెడకు ఉరితాడు బిగించి వినూత్న నిరసన తెలిపారు. ఈసందర్భంగా కటారపు గోపాల్ మాట్లాడుతూ, జగన్ పాలనలో అంగన్వాడీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.







ధర్నాచౌక్ దీక్షా శిబిరంలో అంగన్వాడీ కార్యకర్తలు, వేదికపై పలు సంఘాల ప్రతినిధులు

బెదిరింపులకు భయపడం

» అంగన్వాడీల సంఘం ప్రతినిధులు » 30వ రోజుకు సమ్మె » శిబిరంలోనే వంటా వార్పు

మచిలీపట్నం టౌన్, జనవరి 10 : జీతాలు పెంచాలంటూ నెలరోజులుగా సమ్మె నిర్వహిస్తున్నా ప్రభుత్వంలో చలనంలేదని అంగన్వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మచిలీపట్నం ధర్నాచౌక్ వద్ద కార్యకర్తలు రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. శిబిరంలోనే వంటా వార్పు నిర్వహించి రాత్రిళ్లు అక్కడే నిద్రిస్తూ ఉద్యమం కొనసాగిస్తున్నారు. అరెస్టులు చేసినా ఎస్మా విధించి నోటీసులు ఇచ్చినా ఆందోళన కొనసాగిస్తున్నామని సంఘ నాయకులు ఎ.రమాదేవి, రిజీనారాణి మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, అనంతర పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు.



● 22వ రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

జీతాలు పెంచాలంటూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 22వ రోజుకు చేరింది. మచిలీపట్నం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద రిలే దీక్షా శిబిరంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు పి.పోతురాజు, ఉపాధ్యక్షుడు రాజేష్‌బాబు తదితరులు మాట్లాడారు. ప్రభుత్వం నోటీసులు ఇచ్చినా బెదిరేది లేదన్నారు. ఎన్నికల సమయంలో జగన్ ఉద్యోగులకు ఇచ్చిన వాగ్దానం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

అప్రజాస్వామిక ఎస్మాను ఉపసంహరించాలి

» ఏఆర్ సింధు

ధర్నాచౌక్, జనవరి 10 : తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి గత నెల రోజులుగా ఉద్యమిస్తున్న అంగన్వాడీలపై అప్రజాస్వామికంగా ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫెడరేషన్ అఖిల భారత ప్రధానకార్యదర్శి ఏఆర్ సింధు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ ధర్నాచౌక్‌లో అంగన్వాడీల రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఆమె బుధవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సుప్రింకోర్టు తీర్పుమేరకు గ్రాట్యూటీ అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ముఖ్యమంత్రికి లేఖ రాయడం జరిగిందన్నారు. అంగన్వాడీలు గౌరవ వేతనం కాదు కనీస వేతనం చెల్లించాలన్నారు. కార్మిక హక్కులను కాలరాసే చర్యలను మానుకోవాలని పలువురు వక్తలు హితవు పలికారు. కార్మిక వ్యతిరేక చర్యలు మానుకోకుంటే ప్రతిఘటించడం, పోరాడటం కార్మికులకు అనివార్యమన్నారు. దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, నరసింహారావు, ముజఫర్ అహ్మద్, జి.బేబీరాణి, పి.రోజా, ఎంవీ.సుధాకర్, విద్యార్థి సంఘాల నేతలు ప్రసన్నకుమార్, సోమేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

బీజేపీని ఓడించేందుకు

ఐక్యంగా కలిసి రావాలి

» వడ్డే శోభనాద్రీశ్వరరావు



మాట్లాడుతున్న వడ్డే , రైతుసంఘం ప్రతినిధులు

ఉంగుటూరు, జనవరి 10 : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భారత రాజ్యాంగ హక్కులను కాలరాసేందుకు పూనుకుందని, ప్రభుత్వరంగ సంస్థలు, ప్రజాసంపదను కార్పొరేట్లకు కారుచౌకగా దోచిపెడుతూ, రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తోందని భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక, రాష్ట్ర కమిటీ కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు విమర్శించారు. మోదీ నేతృత్వంలోని బీజేపీని, దానికి మద్దతిస్తున్న రాష్ట్రంలోని పార్టీలను రాబోయే ఎన్నికల్లో ఓడించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై వుందన్నారు. బుధవారం మండలంలోని మానికొండలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మతోన్మాద బీజేపీని, దానికి మద్దతిచ్చే పార్టీలను ఓడించాలని పిలుపు నిస్తూ ఈనెల 12 శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి విజయవాడ మొగల్రాజపురంలోని సిద్ధార్థ కాలేజీ ఆడిటోరియంలో భారీ సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఏపీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసుల రెడ్డి



విజయవాడ: ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విజయవాడ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె.శ్రీనివాసుల రెడ్డి ఎన్నికయ్యారు. అసోసియేషన్ ఎన్నికలు నగరంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో శ్రీనివాసులరెడ్డి 50 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆయనకు 83 ఓట్లు రాగా, ఆయనపై పోటీ చేసిన రామ్ నరేశ్‌కు 33 ఓ ట్లు లభించాయి. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్‌వో ఎన్.లక్ష్మీపతి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎస్‌వీకే కుమార్, టి.ప్రభాకర‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా ఎ.సౌమ్య, కోశాధికారిగా ఇ.విశ్వేశ్వరరాము ఎన్నికయ్యా రు. నూతన కమిటీ మూడేళ్లు కొనసాగుతుంది. సభ్యులను పలువురు అభినందించారు.

నిరుద్యోగులను మోసం చేసిన జగన్: ఏఐవైఎఫ్

గవర్నర్‌పేట, జనవరి 10: నిరుద్యోగ సమస్య పరిష్కారంలో సీఎం జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా యువతను మోసం చేశారని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కి. లెనిన్‌బాబు అన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా నిర్మాణ మహాసభ బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో సమీపంలోని వీరభద్రరావు భవన్‌లో జరిగింది. ఏఐవైఎఫ్ పతాకాన్ని సీపీఐ నేత దోనేపూడి శంకర్ ఆవిష్కరించారు. మహాసభలో ఏపీ రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు తూము కృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరు వెంకటేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ సుభానీ, జిల్లా నేతలు మాలపాటి ఉదయ్, సాయికుమార్, మోహనకృష్ణ, గాడి అజయ్, నాగబాబు, మన్నే హనుమంతరావు, షేక్ మౌలాలి పాల్గొన్నారు.

జగన్‌రెడ్డికి కార్మికుల సత్తా చూపిస్తాం

● టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్

విద్యాధరపురం, జనవరి 10: వచ్చే ఎన్నికల్లో జగన్‌రెడ్డిని గద్దె దించి కార్మికుల సత్తా చూపిస్తామని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జోన్-3 ఇన్‌చార్జి రెంటపల్లి శ్యామ్ అన్నారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం టీఎన్‌టీయూసీ రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గ కమిటీలోని సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు సారథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా టెక్కలి నుంచి కుప్పం వరకు నిర్వహిస్తున్న చంద్రన్న కార్మిక చైతన్య బస్సుయాత్ర సంక్రాంతి సెలవుల అనంతరం కృష్ణాజిల్లా మీదుగా ఎన్టీఆర్ జిల్లాలో ప్రవేశిస్తుందన్నారు. దీనికి సంబంధించి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.ప్రసాద్, ఎస్.రామ్‌మోహన్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఆదిబాబు, నేతలు టి.కొండలరావు, జి.గోవింద్, జి.చిన్నా, బి.శివ, గోపి, ఎం అప్పలస్వామి, తిరుమలరావు, దుర్గారావు, ఆర్.అశోక్, శ్రీను, రాజు పాల్గొన్నారు.

ఐటీఎఫ్ 55 ప్లస్ విజేతగా వెంకటరామ్

విజయవాడ స్పోర్ట్సు: రాష్ట్ర లాన్‌టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఐజీఎంసీ టెన్నిస్ కాంప్లెక్సులో సీనియర్ మాస్టర్స్-200 ఐటీఎఫ్ (ఎస్‌వీ.రామయ్య మెమోరియల్ టెన్నిస్) టోర్నీలో బుధవారం నాటి 55 ప్లస్ విభాగంలో నెట్టెం తులసీ వెంకటరామ్‌కుమార్ విజేతగా నిలిచారు. ఫైనల్స్‌లో బండారు సాయిబాబాపై రామ్‌కుమార్ 3-1తో విజయం సాధించి టైటిల్‌ను వశం చేసుకున్నారు. 60ప్లస్‌లో దిలీప్ సింగ్ పవన్ జైన్‌పై 6-3, 3-1 (రిటైర్డు)తో విజయం సాధించి టైటిల్‌ను వశం చేసుకున్నారు. ఐదు రోజులుగా సాగుతున్న ఈ పోటీల ముగింపు గురువారం జరుగుతుందని టోర్నీ డైరెక్టర్ సూదగాని రామకృష్ణ తెలిపారు.

ప్రస్తుత వైసీపీ ఎంపీలంతా చీర్ గాళ్స్

● ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్

గవర్నర్‌పేట, జనవరి 10: ప్రస్తుత వైసీపీ ఎంపీలంతా చీర్ గాళ్స్ అని, వారంతా బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ నూతన ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ ఎద్దేవా చేశారు. ఏపీ ఇన్‌చార్జిగా నియమితులైన తరువాత ఠాగూర్ బుధవారం తొలిసారిగా ఏపీసీసీ కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక హోదా, పోలవరం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు, ప్రత్యేక ప్రాజెక్టులు వంటివి మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే సాధ్యమన్నారు. సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి మాట్లాడుతూ రాహుల్‌ను ప్రధానిని చేయడం మాజీ సీఎం వైఎస్ఆర్ కోరికని, వైఎస్ షర్మిల కూడా అదే ఆశయంతో కాంగ్రెస్‌లోకి వచ్చారన్నారు. జనవరి 14 నుంచి ప్రారంభం కానున్న రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర పోస్టర్, స్టిక్కర్లు, బ్యాడ్జీలను పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుతో కలిసి మాణిక్యం ఠాగూర్ ఆవిష్కరించారు.

టెండర్లలో మేయర్ అవినీతి

● టీడీపీ ఫ్లోర్‌లీడర్ బాలస్వామి

చిట్టినగర్, జనవరి 10: కాంప్లెక్సుల్లో షాపుల టెండర్లకు సంబంధించి మేయర్ అధికారులతో కుమ్మక్కై అవినీతికి పాల్పడుతున్నారని, లక్షల్లో కార్పొరేషన్ ఆదాయానికి గండి కొడుతున్నారని టీడీపీ ఫ్లోర్ లీడర్ ఎన్ బాలస్వామి ఆరోపించారు. బుధవారం వీఎంసీలోని టీడీపీ ఫ్లోర్‌లీడర్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల స్టేడియంలోని మూడు షాపులకు టెండర్లు నిర్వహించారని, ఒక్కోషాపు టెండర్ రూ.20 లక్షల వరకు వెళ్లాల్సింది, కేవలం రూ.5.80 లక్షలకే ధర నిర్ణయించారని, ఈ మూడు షాపులకు సంబంధించి రూ.50 లక్షల అవినీతి జరిగిందన్నారు. కళ్లుండి చూడలేని కమిషనర్, చెవులుండి వినలేని అధికారులని, ఇంత అసమర్థుడు, చేతకానితనంతో పనిచేసే కమిషనర్‌ను కౌన్సిల్ చరిత్రలో ఎన్నాడూ చూడలేదన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వీటిపై విచారణ ఉంటుందని, ఎవరిని వదిలేది లేదన్నారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ పాల్గొన్నారు.

స్థాయీ సంఘంలో 20 అంశాలకు ఆమోదం

చిట్టినగర్, జనవరి 10: వీఎంసీ స్థాయీ సంఘం సమావేశంలో 20 అంశాలకు ఆమోద ముద్రవేశారు. మేయర్ భాగ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం వీఎంసీ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో స్థాయీ సంఘం సమావేశం జరిగింది. 27 అంశాలపై చర్చించి 20 అంశాలను ఆమోదించారు. ఒక అంశం రికార్డు చేయడంతోపాటు పరిపాలన పరమైన అంశాలకు సంబంధించి ఒక అంశాన్ని ధ్రువీకరించారు. 4అంశాలను ర్యాటిఫై చేయగా, ఒక అంశాన్ని తిరస్కరించారు. వాంబేకాలనీలోని డీ బ్లాక్ కల్యాణమండపం టెండర్‌ను తిరస్కరించారు. పబ్లిక్ హెల్త్‌వర్కర్‌గా పనిచేస్తున్న కె.మహేష్‌ను వెహికల్ డిపోలో డ్రైవర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఆమోదించారు. దసరాకు సంబంధించి 800 మంది వర్కర్లకు చెల్లింపుల అంశాలను ర్యాటీఫై చేశారు. ఆరుగురికి కుళాయి కనెక్షన్ లేకుండా వస్తున్న పన్నును రద్దు చేయాలని కోరగా స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. శిల్క్ షోరూం ఎదురుగా పార్కింగ్ కాలపరిమితిని పెంచుతూ ఆమోదించారు. అలాగే మరిన్ని అంశాలను స్టాండింగ్ కమిటీ ఆమోదించింది.

దుర్గగుడి అభివృద్ధికి రూ.3లక్షల విరాళం



ఎలక్షన్ కమిషనర్లకు దుర్గమ్మ చిత్రపటం ఇస్తున్న కలెక్టర్

వన్‌టౌన్, జనవరి 10: దుర్గగుడి అభివృద్ధికి విజయవాడ ఆర్చిడ్స్ మారుతీ కో-ఆపరేటివ్ కాలనీకి చెందిన నిమ్మగడ్డ రాజేంద్ర, రూపలత దంపతులు అధికారులకు బుధవారం రూ.3లక్షల విరాళంగా ఇచ్చారు. నిత్యాన్నదానానికి రూ.లక్ష, మల్లేశ్వరాలయ పునర్నిర్మాణ పనులకు రూ.లక్ష, గో సంరక్షణకు రూ.లక్ష మొత్తం రూ.3లక్షలను అందజేశారు. అధికారులు వారికి దుర్గమ్మ దర్శనం కల్పించగా వేద పండితులు వేదాశీర్వచనం చేసి దుర్గమ్మ చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు. దుర్గగుడిలో కనకదుర్గమ్మ దర్శనార్థం బుధవారం పలువురు ప్రముఖులు విచ్చేశారు. కేంద్ర సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు అనూప్ చంద్రపాండే, అరుణ్‌గోయల్ కలెక్టర్ ఎస్.ఢిల్లీరావుతో కలిసి వచ్చారు. అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి సన్నిధికి తీసుకెళ్లి దుర్గమ్మ దర్శనం చేయించారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు, ఈఈ కోటేశ్వరరావు వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. వీరితో సీపీ కాంతిరాణా, జేసీ పి.సంపత్‌కుమార్, సబ్‌కలెక్టర్ అదితిసింగ్ ఉన్నారు. అలాగే మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎమ్మెల్యే కొడాలి నాని వచ్చారు. దుర్గమ్మ దర్శనానంతరం వీరికి ఈఈ దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

రైళ్లలో చోరీలకు పాల్పడే నేరస్థుడి అరెస్టు

రూ.16లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

రైల్వేస్టేషన్, జనవరి 10: రైళ్లలో ప్రయాణికుల వద్ద బంగారు ఆభరణాలు, నగదు చోరీలకు పాల్పడుతున్న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన రూవ సురేష్‌కుమార్ అలియాస్ చంద్రశేఖర్ అలియాస్ చందును రైల్వే పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నేరస్థుడి నుంచి రూ.16లక్షల విలువైన డైమండ్ రాళ్లతో పొదిగిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. డిసెంబర్ 30న గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌లో ఓ ప్రయాణికురాలి బంగారు ఆభరణాలున్న సూట్‌కేస్ చోరీకి గురైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు జీఆర్‌పీ సీఐ పి.శ్రీనివాస్, ఆర్‌పీఎఫ్ సీఐ టి.చంద్రశేఖర్ విచారణ చేపట్టారు. నేరస్థుడు గవర్నరుపేట రాజగోపాలచారీ వీధిలోని జైహింద్ కాంప్లెక్స్ వద్ద ఉన్నట్టు పోలీసులకు సమాచారం తెలిసింది. వారు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి సురేష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అతడ్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది.

వేతన సవరణ చర్చలు వెంటనే ప్రారంభించాలి

● ఎల్ఐసీ ఉద్యోగుల గంట వాకౌట్ సమ్మె

గవర్నర్‌పేట, జనవరి 10: 18 నెలలుగా బకాయి పడిన వేతన సవరణ చర్చలు వెంటనే ప్రారంభించాలని ఎల్ఐసీ ఉద్యోగులు, అధికారులు, పెన్షనర్లు కేంద్ర ప్రభుత్వాన్ని, ఎల్ఐసీ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా బుధవారం నగరంలోని ఎల్ఐసీ ఉద్యోగులు భోజన విరామానికి ముందు ఒక గంట వాకౌట్ సమ్మెను నిర్వహించారు. సమ్మెలో పాల్గొన్న ఉద్యోగ, అధికారుల సంఘ నేతలు మాట్లాడుతూ 2022 ఆగస్టు నాటికి ఎల్ఐసీలో వేతన సవరణ జరగాల్సి ఉందన్నారు. యాజమాన్యానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ ప్రదర్శనలో ఎల్ఐసీ ఉద్యోగ సంఘ నేతలు ఎన్ఎంకే ప్రసాద్, సీహెచ్ రాజశేఖరరెడ్డి, డి.వాసు, వీఎస్ సాయి, గుర్రం శ్రీనివాస్, అధికారుల సంఘ నేతలు కె.మురళీకృష్ణ, ఎస్.చంద్రమౌళి, డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ సంఘ నేతలు కేకేఎస్ శ్రీనివాస్, పెన్షనర్ల నేతలు కేబీ శంకర్ పాల్గొన్నారు.

వైభవంగా హరిదాసుల ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

● 500 మంది హరిదాసుల వేషధారణలో కోలాటం

వన్‌టౌన్, జనవరి 10: ధనుర్మాసం సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కృష్ణ ధర్మపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన హరిదాసుల ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణ వైభవంగా జరిగింది. త్రిదండి రామనుజ చిన్నజీయర్ స్వామి మంగళ శాసనాలతో సీతానగరంలోని జీయర్ స్వామి ఆశ్రమం వద్ద గిరి ప్రదక్షణను బుధవారం అహోబిల జీయర్ స్వామి ప్రారంభించారు. విజయకీలాద్రి నుంచి ప్రారంభమైన గిరి ప్రదక్షణ ఇంద్రకీలాద్రి వరకు జై శ్రీమన్నారాయణ అంటూ హరిదాసుల నామసంకీర్తనలతో కోలాహలంగా జనసందోహంలో నడిచింది. 10 కిలోమీటర్ల గిరి ప్రదక్షణలో రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున హరిదాసులు పాల్గొన్నారు. దాసుల సంక్షేమం సంఘం జాతీయ కార్యదర్శి వై.ధనుంజయరావు, నిర్వాహకులు పవన్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 5 లక్షల మంది జనాభా కలిగిన తమను ఏ రాజకీయ పార్టీ గుర్తించడం లేదన్నారు. నిర్వాహకులు బాబీ, కేడీఆర్, దాసుల సంక్షేమం సంఘం నేతలు పాల్గొన్నారు.

జాతీయ స్విమ్మథాన్‌లో శకుంతల సత్తా

విజయవాడస్పోర్ట్సు: జాతీయ స్థాయిలో పోర్ బందరులో ఈ నెల 7న జరిగిన స్విమ్మథాన్ 2024 చాంప్‌లోని 2 కిలోమీటర్ల ఈతలో అవార మహిళా-చిన్నారుల కోచ్, నగర స్విమ్మర్ శకుంతలాదేవి రజతంతో సత్తా చాటింది. కృష్ణానదీ తీరాన జరిగిన అవార "ప్రకృతిలో పిల్లలు"-అరవింద సహేస్ సమక్షంలో స్విమ్మర్లు, సభ్యులు శకుంతలాదేవిని ఘనంగా సత్కరించారు.

టైరు పేలి.. అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

» గుడివాడ రోడ్డులో భారీ గోతులే కారణం

» త్రుటిలో తప్పిన ప్రమాదం

» ఎమ్మెల్యే కొడాలికి ప్రయాణికుల శాపనార్థాలు



పేలిన బస్సు టైరు

ఉంగుటూరు, జనవరి 10 : పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం నుంచి విజయవాడ వస్తున్న ఆర్టీసీ బస్సుకు పెనుప్రమాదం తప్పింది. గుడివాడ దాటాక భయంకరమైన గోతుల రోడ్డు కారణంగా టైరు పేలటంతో అదుపు తప్పిన బస్సు పక్కనే వున్న గోతిలో దిగబడటంతో ప్రయాణికులు ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకున్నారు. భీమవరం నుంచి వయా మానికొండ మీదుగా సుమారు 40 మంది ప్రయాణికులతో ఆల్ట్రా డీలక్స్ బస్సు బుధవారం మధ్యాహ్నం విజయవాడ బయల్దేరింది. మానికొండ సెంటర్ దాటి జడ్పీ హైస్కూల్ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా పెద్ద శబ్దంతో బస్సు టైరు పేలి అదుపు తప్పింది. దీంతో భయాందోళనలకు గురైన ప్రయాణికులు హాహాకారాలు చేశారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించటంతో బస్సు రోడ్డు పక్కనే వున్న పెద్ద గుంతలో దిగబడి పక్కకు ఒరిగింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. ఆ సమాయంలో ఎదురుగా ఏదైనా వాహనం వచ్చివుంటే ఘోర ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు చెబుతున్నారు. గోతులమయమైన రోడ్డును చూపి ప్రయాణికులు స్థానిక ఎమ్మెల్యే కొడాలి నానికి తమదైన శైలిలో శపనార్థాలు పెట్టారు.

30 రోజుల అంగన్‌వాడీ

(5వ పేజీ తరువాయి)

ఫలితం లేకపోవడంతో సమ్మె కొనసాగుతూనే ఉంది.

డిసెంబరు 7న నోటీసులు, 12 నుంచి సమ్మె

తెలంగాణాలో కంటే వెయ్యి రూపాయలు అధికంగా అంగన్వాడీలకు జీతం ఇస్తానని 2019 పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. ఐదేళ్లలో తెలంగాణాల్లో అంగన్వాడీల జీతం రూ.13,650కు చేరింది. ఇక్కడ మాత్రం రూ.11,500 ఇస్తున్నారు. తెలంగాణాలో కన్నా వెయ్యి రూపాయలు అధికంగా జీతం పెంచి ఇవ్వాలని, లేదా సమాన పనికి సమాన వేతనమని సుప్రీంకోర్టు సూచించిన విధంగా రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ గతనెల 7వ తేదీన అంగన్వాడీలు సమ్మె నోటీసు ఇచ్చారు. ప్రభుత్వం అంగీకరించకపోవడంతో 12వ తేదీ నుంచి సమ్మెకు దిగారు.

షోకాజ్ నోటీసులతో భయపెట్టే యత్నం

అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారుల ద్వారా షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారు. మచిలీపట్నంలో ఈ తరహా నోటీసులు ఇంకా జారీ చేయకున్నా, బంటుమిల్లి, మోపిదేవి తదితర ప్రాంతాల్లోని వారికి అందుతున్నాయి. ఉద్యోగ నియమ, నిబంధనల ఉల్లంఘన, తగు క్రమశిక్షణా చర్యలు తీసుకోకుండా ఉండటానికి సంజాయిషీని సమర్పించాలని పేర్కొంటున్నారు.

వివిధ రూపాల్లో నిరసనలు

అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు నెల రోజులుగా వివిధ రూపాల్లో తమ నిరసనను తెలియజేస్తున్నారు. రిలే దీక్షలతో పాటు శాసనసభ్యులు, మంత్రుల ఇళ్ల ముట్టడి, పొర్లుదండాలు, ఉరేసుకున్నట్టుగా చూపడం, కలెక్టర్, ఇతర జిల్లా అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించడం, తహసీల్దార్ కార్యాలయాలు, కలెక్టరేట్ ఎదుట ధర్నాలు, వంటావార్పు, అంబేడ్కర్ విగ్రహాలకు వినతులు సమర్పించడం తదితర రూపాల్లో తమ నిరసనను తెలియజేస్తూనే ఉన్నారు. కాగా, ఈనెల 5వ తేదీ లోపు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు విధుల్లో చేరకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్, జేసీల ద్వారా ఇటీవల హెచ్చరికలు జారీ చేశారు. సమ్మె ప్రారంభం రోజుల్లో అయితే, మూసి ఉన్న అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగులకొట్టి మరీ తెరిచారు. అయినా వెనకడుగు వేయకుండా అంగన్వాడీలు సమ్మె కొనసాగిస్తున్నారు.

కేఆర్‌యూకు రెండో విజయం

విజయవాడ స్పోర్ట్సు: చెన్నైలోని హిందూస్థాన్ వర్శిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న సౌత్‌జోన్ ఇంటర్ వర్శిటీ క్రికెట్ చాంపియన్‌షిప్‌లో కృష్ణా వర్శిటీ టీమ్ బుధవారం టోర్నీలో రెండో విజయంతో సత్తాచాటింది. గతేడాది చాంపియన్ మద్రాస్ వర్శిటీపై 9 పరుగుల తేడాతో ఖంగుతినిపించి కేఆర్‌యూ జయభేరి మోగించింది. తొలుత బ్యాట్‌పట్టిన కేఆర్‌యూ 10ఓవర్లలో 73/8 పరుగులను చేసింది. మద్రాస్ వర్శిటీ 10 ఓవర్లలో కేవలం 63 పరుగులకు కుప్పకూలి పరాజయం పాలైంది.

వ్యాపారంలో నష్టాల వల్లే ఆస్తులు అమ్ముకున్నాడు

» చంద్రబాబుకు, టీడీపీకి ఆపాదించడం ఎంపీ నాని దిగజారుడు తనమే

» దేవినేని ఉమామహేశ్వరరావు

విద్యాధరపురం, జనవరి 10 : విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) తన ట్రావెల్స్ వ్యాపారంలో నష్టం రావడం వల్లే ఆస్తులు అమ్ముకున్నారని మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంపీ నాని తన వ్యాపారంలో వచ్చిన నష్టాల నుంచి బయటపడటానికే ఆస్తులు అమ్ముకున్నారని తెలిపారు. పదవి కోసం దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు. నిన్న, మొన్నటి వరకు జగన్‌రెడ్డి దుర్మార్గుడిలా కనిపించిన నానికి ఇప్పుడు సన్మార్గుడు ఎలా అయ్యాడని ప్రశ్నించారు. అమరావతి రైతులను కించపరచడమేమిటని మండిపడ్డారు. జగన్‌రెడ్డి కళ్లలో ఆనందం కోసం ఎంపీ నాని చంద్రబాబు, లోకేశ్‌లపై విమర్శలు చేస్తున్నారన్నారు. తామంతా పార్టీ కోసం మౌనంగా అవమానాలు భరిస్తే నాని మాత్రం ప్రొటోకాల్ పిచ్చితో ఇష్టానుసారంగా ప్రవర్తించాడన్నారు. లోకేశ్ పాదయాత్రతో యువతలో చైతన్యం వచ్చిందని రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ సభలకు యువత కదలివస్తుంటే ఎంపీ నానికి కనిపించడంలేదా అని ప్రశ్నించారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల నాయకులు ఎంపీ నోటి దురుసుతనం వల్లే దూరంగా ఉంటున్నారన్నారు. ఎంపీ ఏకపక్షంగా తన కుమార్తెను విజయవాడ మేయర్ అభ్యర్థినిగా ప్రకటించుకున్నా, ఆయనకు రెండుసార్లు ఎంపీ సీటు ఇచ్చినా టీడీపీ నాయకులు ఏమీ అనలేదన్నారు. 2019 ఎన్నికల్లో ఎంపీ గెలుపుకోసం అభ్యర్థులు పార్టీ డబ్బు ఖర్చు పెట్టారు తప్ప నాని ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదన్నారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థితో కుమ్మక్కయి, నాని అహంకారంతో మాట్లాడినా చంద్రబాబుపై ఉన్న గౌరవంతో సర్దుకుపోయామన్నారు. దుర్గమ్మ సన్నిధిలో నాని చేసిన వ్యాఖ్యలు ఆయనకే శాపంగా మారాయన్నారు. విజయవాడ, ఉమ్మడి కృష్ణాజిల్లా అభివృద్ధికి చంద్రబాబు వందల కోట్లు కేటాయించారని తెలిపారు. నాని విజయవాడ అభివృద్ధి కోసం జగన్‌రెడ్డితో మాట్లాడి రూపాయి కూడా ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు.



చెస్ పోటీల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కిలారు, రాజీవ్

14న రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

విజయవాడ స్పోర్ట్సు : నగరంలోని ఫన్‌టైమ్స్ మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో సంక్రాంతి పండగ సందర్భంగా ఈనెల 14న రాష్ట్రస్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఫన్‌టైమ్స్ కార్యదర్శి కిలారు వెంకట శివాజీ, ది విజయవాడ చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ అక్బర్ పాషా, మందుల రాజీవ్‌లు తెలిపారు. పోటీలకు సంబంధించిన బ్రోచర్లను బుధవారం వారు ఆవిష్కరించారు. రూ.70వేల నగదు ప్రోత్సాహకంతో పాటు ట్రోఫీలు, మెడల్స్‌ను సర్టిఫికెట్లను ప్రదానం చేస్తామన్నారు. పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఇంటర్నేషనల్ చెస్ క్రీడాకారులు వస్తున్నారన్నారు. వివరాలకు 9030308811 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆసియా షూటింగ్‌లో ఉమామహేష్‌కు రజతం

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 10: ఆసియా షూటింగ్ గ్రాం డ్ ప్రీలో నగరానికి చెందిన షూట ర్ మద్దినేని ఉమామహేష్ రెండో పతకంతో మెరిశాడు. జపాన్ రాజధాని జకార్తలో జరుగుతున్న ఈ టోర్నీలో 10మీటర్ల ఎయిర్ రైఫిల్ జూనియర్స్ టీమ్ ఈవెంట్‌లో ఇండియా టీమ్ మద్దినేని ఉమామహేష్, షా అభినవ్, మనే పార్థ రాకేష్ త్ర యం 1885.2 పాయింట్లతో రజతం వశం చేసుకుంది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ఇషా అనిల్‌తో కలిసి ఉమామహేష్ మంగళవారం స్వర్ణం వశం చేసుకున్న విషయం తెల్సిందే. బుధవారం 10 మీటర్ల షూటింగ్ వ్యక్తిగత ఈవెంట్‌లో ఉమామహేష్ ఫైనల్స్‌లో టాప్-1గా నిలిచినప్పటికీ పతకం రేసులో పోరాడి చివరకు ఆరోస్థానంలో నిలిచాడు. రెండు పతకాలను వశం చేసుకున్న ఉమామహేష్‌ను ఏపీ రైఫిల్ అసోసియేషన్ కార్యదర్శి డి.రాజ్‌కుమార్, కోచ్ నాగిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావు అభినందించారు.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 90, 97, 107
చికెన్ విత్ స్కిన్ 174
చికెన్ స్కిన్‌లెస్ 184
నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.65

పీబీ సిద్ధార్థలో ప్రపంచ హిందీ భాషా దినోత్సవం

మొగల్రాజపురం, జనవరి 10: పీబీ సిద్ధార్థ కళాశాలలో హిందీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ హిందీ భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వెన్నా వల్లభరావు మాట్లాడుతూ విదేశాల్లో 153 విశ్వ విద్యాలయాలల్లో హిందీ బోధన జరుగుతోందన్నారు. భారతీయ భాషలలో హిందీ భారత సంస్కృతికి నిదర్శనం అన్నారు. మోటూరి సత్యనారాయణ హిందీ భాష అభివృద్ధికి చేసిన సేవలను గుర్తు చేశారు. పీబీ సిద్ధార్థ కళాశాల మొదటి హిందీ విభాగాధ్యక్షులు యడ్లపల్లి సీతారామయ్య సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం డాక్టర్ వెన్నా వల్లభరావును ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, హిందీ విభాగాధిపతి డాక్టర్ ఎం. జయలక్ష్మి, ఎం. భవ్య, శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

మొబైల్ అన్న క్యాంటీన్

వన్‌టౌన్, జనవరి 10: కేశినేని ఫౌండేషన్ బుధవారం వన్‌టౌన్ రాయల్ హోటల్ సెంటర్ వద్ద మొబైల్ అన్న క్యాంటీన్‌ను నిర్వహించింది. హరి, దంగేటి శివరాంప్రసాద్, రాజగిరి అశోక్, పట్నాల హరిబాబు, సోమి వెంకటేశ్వర్లు, జి.సుధాకర్, బి.సత్తిబాబు, టి.జగదీష్, ఎస్‌కే మున్వర్ భాషా, రాంబాబు, బి.రాము, డి.దుర్గారావు, ఎల్.వాసు, వి.వెంకటేష్ పాల్గొన్నారు. **సత్యనారాయణపురం:** టీడీపీ నాయకుడు కేశినేని శివనాథ్ సహకారంతో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో 27వ డివిజన్ బావాజీపేట సాంబమూర్తిరోడ్డు డీమార్టు వద్ద బుధవారం అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు భోజనం అందజేశారు. టీడీపీ నాయకులు ఎన్.సాంబశివరావు, డివిజన్ అధ్యక్షుడు కె.ఆర్.కుమార్ పేదలకు భోజనం అందజేశారు. రవణమ్మ, చంద్రమౌళి, శ్రీనివాస్, బి.హనుమంతరావు, పద్మ తదితరులు పాల్గొన్నారు

స్వర్ణయుగం కావాలంటే ..

చంద్రబాబును సీఎంను చేయాలి

బాబు ష్యూరిటీ
భవిష్యత్తుకు గ్యారెంటీ
కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, జనవరి 10 : జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం రాతియుగం వైపు వెళ్తోందని చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో స్వర్ణయుగం మాదిరిగా ఉందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుని రాష్ట్రంలో స్వర్ణయుగాన్ని మళ్లీ తెచ్చుకుందామని పేర్కొన్నారు. 10వ డివిజన్ టీచర్స్ కాలనీలో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. అనంతరం స్థానికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాతియుగం కావాలో స్వర్ణయుగం కావాలో ప్రజలు ఆలోచించి వచ్చే ఎన్నికల్లో సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. డివిజన్ నేత వై. రంగారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డివిజన్ నేతలు, కార్యకర్తలు పాలొన్నారు.


మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్


టీడీపీ పథకాలు వివరిస్తున్న బొండా ఉమా

జనసేన- టీడీపీ కలయికతో

వైసీపీ నేతల గుండెల్లో దడ : బొండా ఉమా

సత్యనారాయణపురం: వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకుని చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. 30వ డివిజన్ మధ్య కట్ట బుడమేరు వంతెన వద్ద నుంచి బుధవారం సాయంత్రం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బొండా ఉమామహేశ్వరరావు, ఇంటింటికి వెళ్లి ప్రజలు పడుతున్న కష్టాలు అడిగి తెలుసుకొని ప్రజల భవిష్యత్తుకు టీడీపీ గ్యారెంటీ అని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అనుభవం ఉన్నవ్యక్తి, పవన్‌కల్యాణ్ నిబద్ధత కలిగిన వ్యక్తి వీరి కలయితో రాబోయే రోజుల్లో ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. వైసీపీని బంగాళాఖాతంలో కలిపే సమయం దగ్గరకు వచ్చిందన్నారు. టీడీపీ రాష్ట్రకార్యదర్శి ఎన్. సాంబశివరావు, ఘంటా కృష్ణమోహన్, సి. సూర్యనారాయణ, జి. శేషంరాజు, ఎల్. శ్రీనివాసరావజు, గరిమెళ్ల చిన్నా, కోటేశ్వరమ్మ, రాధిక, వెంకటరమణ స్థానిక టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌బీఎస్‌నగర్‌లో ...

పాయకాపురం : పాయకాపురం పరిధిలోని 62వ డివిజన్ ఎల్‌బీఎస్‌నగర్‌లో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. డివిజన్ ఇన్‌చార్జ్ పైడి శ్రీను ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రవేశపెట్టనున్న పలు పథకాలతో కూడిన కరపత్రాలను స్థానికులకు అందజేశారు. నేతలు ఉదయ్‌శంకర్, మరియాబాబు, గోసుల రవి, వీర్ల రత్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.

64వ డివిజన్ టీడీపీ కమిటీ సమావేశం

అజిత్‌సింగ్‌నగర్: స్థానిక టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో 64వ డివిజన్ టీడీపీ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి వైసీపీ కుట్రలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. డివిజన్ ఇన్‌చార్జ్ పలగాని శివ పాల్గొన్నారు.

200 మంది టీడీపీలో చేరిక

పాయకాపురం: నియోజకవర్గంలోని 200 మంది మహిళలు బుధవారం టీడీపీలో చేరారు. మొగల్రాజపురంలోని ఆయన నివాసంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నేతలు నవనీతం సాంబశివరావు, ఘంటా కృష్ణమోహన్ పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరం

మాచవరం, జనవరి 10 : విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని వినియోగదారులు ఇలాంటి చర్యలకు పాల్పడరాదని విద్యుత్ శాఖ విజిలెన్స్ ఈఈ జి. కమల హెచ్చరించారు. గుణదల డివిజన్ ఈఈ పి. హరిబాబు ఆధ్వర్యంలో సిబ్బంది 35 బృందాలుగా బుధవారం పట్టణంలో తనిఖీలు చేపట్టారు. 2711 గృహ, 193 వాణిజ్య సర్వీసులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 144 మంది వినియోగదారులు అదనపు లోడు వినియోగిస్తున్నట్లు గుర్తించి, రూ. 5.20 లక్షలు అపరాధ రుసుము విధించారు. తనిఖీల్లో డీఈఈ బాలాజి, ఏఈ దుర్గాప్రసాద్, డివిజన్ పరిధిలోని ఇతర డీఈఈ, ఏఈ, జేఈ, లైన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం

వన్‌టౌన్, జనవరి 10: విధి నిర్వహణలో ఆకస్మికంగా మృతి చెందిన ఆక్టోపస్ కమాండో కానిస్టేబుల్ జి.సోమేశ్వరరావు (పీసీ2556) కుటుంబానికి ఏపీ ఆక్టోపస్ ఉన్నతాధికారులు బుధవారం కానిస్టేబుల్‌కు రావాల్సిన బెనిఫిట్స్‌తో పాటు సహోద్యోగులు ఇచ్చిన రూ.6,24,943లను అందజేశారు. ఏపీ ఆక్టోపస్ అడిషనల్ డీజీపీ ఆర్‌కే మీనా, ఐజీపీ ఎస్.వి రాజశేఖర్‌బాబు ఉత్తర్వుల మేరకు బుధవారం మంగళగిరిలోని ఆక్టోపస్ కార్యాలయంలో సోమేశ్వరరావు భార్య వెంకటలక్ష్మికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పలువురు అధికారులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ...

చిట్టినగర్: 46వ డివిజన్ ఏసురత్నంవీధి కొండప్రాంతంలో ఇటీవల వర్షాలకు ఇల్లు, గోడలు కూలిపోయి ఇబ్బందులు పడుతున్న పాదర్తి దయాకర్, మేరీలకు కేశినేని శివనాథ్ సహకారంతో టీడీపీ నాయకుడు కె.నాగుల్‌మీరా బుధవారం కె.ఎల్.రావుపార్క్ రోడ్డులో కార్యాలయంలో రూ. 20వేల ఆర్థిక సాయం అందజేశారు. గుర్రం కొండ, నాగోతి రామారావు, పోతినేడి లోకేష్, దీటి ప్రభుదాస్, ఖాజా, చుక్క నరేష్, కొత్తరాము, పి.మధు, మోహన్‌రావు, జావీద్, సలీం, గణపతి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ

ఆటోనగర్(పెనమలూరు), జనవరి 10: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ పతిష్టా కార్యక్రమాన్ని ఈనెల 22న అట్టహాసంగా నిర్వహించేందుకు దేశమంతా సమాయత్తమవుతుండగా యనమలకుదురు డొంకరోడ్డు, రెల్లిస్ కాలనీ, ఆర్టీసీ న్యూ కాలనీ, న్యూపోస్టల్ కాలనీల్లో భక్తులకు, ప్రజలకు కిలారు దిలీప్ రాముడి పూజిత అక్షింతలను అందించారు. ఆయన వెంట ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు కోటి నాగమల్లేశ్వరరావు, వెలగపూడి కమలాకర్, అనుమోలు వెంకట జగన్‌మోహన్, రామాంజనేయులు ఉన్నారు.


శ్రీరాముడి అక్షింతలను అందిస్తున్న కిలారు దిలీప్



అరిసెలతో నిరసన

రాణిగారితోట, జనవరి 10: జగన్మోహనరెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంక్రాంతి కానుక రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ 18వ డివిజన్‌లోని టీడీపీ కార్యాయలం వద్ద ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు అరిసెలతో నిరసన తెలిపారు. టీడీపీ డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు మాట్లాడుతూ మరో మూడు నెలల్లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, వచ్చిన వెంటనే అన్ని పథకాలు అమలు చేసి పేదల కళ్లల్లో ఆనందం చూస్తామని అన్నారు. గంద్ర రాజు, వెంకటేశ్వరరెడ్డి, శివ, శ్రీనివాస్, దుర్గారావు, జానీ పాల్గొన్నారు.




మధురానగర్ గౌతమ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో, మొగల్రాజపురం లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో

సందడిగా సంక్రాంతి సంబరాలు

మొగల్రాజపురం, జనవరి 10: మధురానగర్ గౌతమ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముగ్గులు వేసి గొబ్బిళ్లను పెట్టారు. భోగి మంటలు వేసి విద్యార్థులు, ఉపాధ్యాయులు సంక్రాంతి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. బొమ్మల కొలువు అందంగా తీర్చిదిద్దారు. పాలు పొంగించి పొంగళ్లు వండారు. చిన్న పిల్లలకు భోగి పండ్లు పోశారు. పిల్లలు కోలాటాలతో సందడి చేశారు. పాఠశాల కరస్పాండెంట్ నెక్కంటి ప్రసాద్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● మొగల్రాజపురం సిద్ధార్థనగర్‌లో ఉన్న లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గంగిరెద్దులాట, బొమ్మల కొలువు, కోలాటం, పొంగళ్లు , చెరుకుగడలు మధ్య పొంగళ్లు, సంక్రాంతి పాటలు, సంప్రదాయ నృత్యాలు, భోగి మంటలు నిర్వహించారు. కేజీ నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల కరస్పాండెంట్ ముక్తేవి ఫణిప్రసాద్, ప్రిన్సిపాల్ సుధా ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

బాబా మందిరంలో అన్నసమారాధన



గవర్నర్‌పేట, జనవరి 10: మార్గశిర మాసం పండుగ పూజలు ముగింపు సందర్భంగా బుధవారం లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డి నాగసాయిబాబా-శ్రీనాగమానసాదేవి అమ్మవారి మందిరంలో అన్న సమారాధన నిర్వహించారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మందిరాన్ని సందర్శించి అమ్మవారికి అభిషేకాలు, హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా భక్తులు వెన్నా ఆంజనేయులు-రమాదేవి దంపతులు, కోడేబోయిన శివప్రసాద్-కవిత దంపతులు రెండు వేల మందికి ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని విష్ణు ప్రారంభించారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ (షిర్డి) ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌లు, డైరీలు ఆవిష్కరించారు. భక్తులకు దుప్పట్లు పంపిణీ చేశారు. భక్తులు అమ్మవారిని ఆవుపాలు, పంచామృతాలు, చెరుకు రసంతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి భక్తులు భరత్ భూషణ్, శివపార్వతి, వరలక్ష్మి, ఇందిర, యామిని, ధనలక్ష్మి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాస్వామి మాట్లాడుతూ గురువారం ఐశ్వర్య జ్యోతి వెలిగించే కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

కాశీ విశ్వేశ్వర ఆలయంలో

స్వామి శాంతికల్యాణం

చల్లపల్లి బంగ్లా సమీపంలోని శ్రీ కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో విశ్వేశ్వరస్వామి శాంతి కల్యాణం నిర్వహించారు. స్వామి కల్యాణ సేవా కార్యక్రమంలో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో మహా మృత్యుంజయ పాశుపత రుద్రహోమం, సర్వదేవత హోమాలు, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, బిల్వార్చన అనంతరం శాంతి కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. ఈవో నూతక్కి వెంకట సాంబశివరావు ఆధ్వర్యంలో ఉభయ దాతలు, భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

మర్యాదపూర్వక కలయిక



వన్‌టౌన్, జనవరి 10: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడుని బుధవారం పశ్చిమ పరిశీలకులు నల్లపాటి రాము ఆధ్వర్యంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్, పలువురు పశ్చిమ నాయకులు కరెన్సీనగర్‌లోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడుకు వారు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. అనంతరం విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ పార్టీ మారడంపై, పశ్చిమలో పార్టీ స్థితిగతులపై చర్చించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు పశ్చిమలో పార్టీని మరింత బలోపేతం చేయాలని వారికి సూచించారు. తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. డివిజన్ అధ్యక్షుడు కె.శివశర్మ, సురభిబాలు, షేక్ సుభాని, కె.గంగాధర్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి బి.కనకారావు, నియోజకవర్గం లీగల్ సెల్ అధ్యక్షుడు ఎస్ అశోక్, జిల్లా సహాయ కార్యదర్శి మీర్జా ముజాఫర్‌బేగ్, నాయకులు కె.అశోక్, దాసరి దేవేంద్ర, సాయి, అజీజ్, అనిల్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

కేటీ రోడ్డులో కార్మికుల భిక్షాటన

చిట్టినగర్, జనవరి 10: పారిశుధ్య కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం చేస్తామని సీఐటీయూ నాయకులు బోయి సత్యబాబు అన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ఆందోళనలో భాగంగా బుధవారం కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్ నుంచి కేటీ రోడ్డులో భిక్షాటన ద్వారా నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సమ్మెను విరమింపచేయాలన్నారు. యూనియన్ నాయకులు వీ.సాంబ, శివలక్ష్మి, కొండ, దుర్గారావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

13మంది విద్యార్థులకు

ధీర యువత బహుమతి ప్రదానం

భారతీనగర్, జనవరి 10: గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో జాగృత సాంస్కృతిక యువజన ఉత్సవాలలో భాగంగా మేలుకో నేస్తమా అనే అంశంపై బుధవారం విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ఎంపికైన 13మంది విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయసారథి ధీర యువత బహుమతిని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణమఠం సీతానగరం నుంచి స్వామి కార్తీక్ మహరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ విభాగాధిపతులు బి.శైలజ, ఎం.బి.ఎస్.ప్రసాద్, ఎం.నాగరాజు, కె.విజయభాస్కర్, టి.కొండారెడ్డి, బి.శ్రీనివాసరెడ్డి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన

గుణదల, జనవరి 10: నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో బెంజిసర్కిల్ సమీపంలోని ఐటీఐలో బుధవారం మత్తు పదార్థాల వినియోగం వల్ల వాటిల్లే నష్టాలను వివరిస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసైన వారి ఆరోగ్య పరిస్థితి, ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది అనే దానిపై స్క్రీన్‌పై ప్రొజెక్టర్ ద్వారా చూపించారు. అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. నవజీవన్ బాల భవన్ కోఆర్డినేటర్ ఎస్‌కె నజ్మా మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటుపడ్డ యువతను డి-ఎడిక్షన్ ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని, ఈ చికిత్స అందించేందుకు నవజీవన్ బాల భవన్ సంస్థ నూజివీడు మండలం పొలసనపల్లిలో బోస్కో డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసిందని చెప్పారు. 9490492020 నంబర్‌కు ఫోన్ చేసి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. ప్రిన్సిపాల్ ఎం.కనకారావు, నవజీవన్ బాల భవన్ కో ఆర్డినేటర్స్ కె.శ్రావణ్ కుమార్, కె.ఉదయ్, బి.పీటర్ బాబు, ఎస్.కుసుమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భువిపై రంగుల హరివిల్లులు

కన్నుల పండువగా 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' తెలంగాణ రాష్ట్ర స్థాయి ముగ్గుల పోటీ ఫైనల్స్



ముగ్గుల పోటీ విజేత హేమలతకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ఝాన్సీరెడ్డి, నటి అనన్య



- ఆదిలాబాద్ జిల్లావాసికి ఫస్ట్ ప్రైజ్
- వరంగల్, ఖమ్మం, మెదక్ మహిళలకు సంయుక్తంగా ద్వితీయ బహుమతి
- బహుమతులు అందించిన నటి అనన్య నాగళ్ల

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన) తెలంగాణ రాష్ట్ర స్థాయి ఫైనల్స్ బుధవారం జరిగాయి. అమీర్‌పేట గురుగోవింద్ సింగ్ మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఫైనల్స్‌కు ముఖ్య అతిథులుగా పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీ రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి, సినీ నటి అనన్య నాగళ్ల పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ముగ్గులు వేయడం మర్చిపోతున్న రోజుల్లో.. తెలుగు సంస్కృతీసంప్రదాయాలను ప్రతిబింబించేలా 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' ముగ్గుల పోటీ నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి ప్రశంసించారు. మహిళల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని.. ఝాన్సీరెడ్డి అన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న మహిళలు వేసిన ముత్యాలముగ్గులు మన సంస్కృతిని కళ్లముందు ఉంచాయని.. తనకు చిన్ననాటి రోజులను గుర్తుకుతెచ్చాయని అనన్య నాగళ్ల అన్నారు. ఈ ముగ్గుల పోటీలు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించాయని హైదరాబాద్ సర్కిల్ కెనరా బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.కనిమొళి పేర్కొన్నారు. కాగా.. బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ పి.రజని, ఆంధ్రమహిళా సభ విశ్రాంత చైర్‌పర్సన్ దాస్యం గీత భాస్కర్ ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన శనిగారపు హేమలత ప్రథమ బహుమతి సాధించి రూ.30 వేల చెక్కు అందుకున్నారు. వరంగల్ జిల్లాకు చెందిన మానేటి కవిత, ఖమ్మం జిల్లాకు చెందిన మారోజు నీరజ, మెదక్ జిల్లాకు చెందిన వజ్జ దివ్య రెండో బహుమతి సాధించి రూ.10 వేల చెక్కులను అందుకున్నారు. కన్సొలేషన్ బహుమతులు పొందిన ఆరుగురికీ 3 వేల చెక్కులతో పాటు.. 'హనుమండ్ల ఝాన్సీ- రాజేందర్ రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్' తరఫున రూ.12 వేల నగదును అందజేశారు. కాగా.. ముగ్గులంటే తనకు చిన్నప్పటి నుంచి ఇష్టమని.. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో 15 ఏళ్లుగా పాల్గొంటున్నానని విజేత హేమలత తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' న్యూస్ నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, 'ఆంధ్రజ్యోతి' అసిస్టెంట్ ఎడిటర్ వక్కలంక రమణ, 'ఆంధ్రజ్యోతి' అడ్వర్టైజ్‌మెంట్ డీజీఎం ఆర్.ఆర్ నాయుడు, 'ఆంధ్రజ్యోతి' తెలంగాణ

'ఆంధ్రజ్యోతి' ముగ్గుల పోటీ ఫైనల్స్ నేడే

విజయవాడ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) తుది అంకానికి చేరుకున్నాయి. తుది విజేతలు ఎవరో తేల్చే ఫైనల్స్ గురువారం విజయవాడలో జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగాను, తమిళనాడు, కర్ణాటకల్లోను సుమారు 40 కేంద్రాల్లో ప్రాథమిక స్థాయి ముగ్గుల పోటీలు ఈ నెల 5, 6, 7, 8 తేదీల్లో జరిగాయి. ఆరు వేల మంది మహిళలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతి కేంద్రంలో ప్రథమ స్థానం సాధించిన వారినుంచి 15 మంది ఫైనల్స్‌కు ఎంపికయ్యారు. వీరంతా విజయవాడలో జరిగే ఫైనల్స్‌లో పోటీ పడనున్నారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.30,000, మూడు ద్వితీయ బహుమతులు రూ.10,000 చొప్పున అందజేస్తారు. మరో ఆరుగురికి కన్సొలేషన్ బహుమతులు ఉంటాయి. పోటీల్లో పాల్గొనే అందరికీ స్పాన్సర్ల నుంచి గిఫ్ట్ హ్యాంపర్లు కూడా లభిస్తాయి. కొందరు సినీ, రాజకీయ, అధికార ప్రముఖులు ఈ ఫైనల్స్‌కు హాజరై విజేతలకు బహుమతి ప్రదానం చేస్తారు.



తల్లిదండ్రులకు ఆలయం

భీమడోలు: తాను దైవంగా భావించే తల్లిదండ్రులను నిత్యం స్మరించుకోవాలనుకున్న కుమారుడు వారికి ఏకంగా ఆలయం కట్టాడు. ఏలూరు జిల్లా భీమడోలు మండలం పోలసానపల్లి గ్రామానికి చెందిన దారముక్కల కాశీవిశ్వనాథశర్మ, అనసూయ దంపతులకు నలుగురు కొడుకులు, ముగ్గురు కుమార్తెలు. సుమారు 30 ఏళ్ల క్రితం మృతిచెందిన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నాలుగో కుమారుడైన గోపాలకృష్ణశాస్త్రి మందిరాన్ని నిర్మించారు. అందులో వారి విగ్రహాలను బుధవారం ఆవిష్కరిచారు.

ఆలయ ప్రతిష్ఠ వేళ మసీదుల్లోనూ దీపాలు పెట్టండి

- బీజేపీ మైనార్టీ మోర్చా జాతీయ అధ్యక్షుడు జమాల్ సిద్ధిఖి

బెంగళూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): దేశంలోని 140 కోట్ల మంది ప్రజల డీఎన్‌ఏ ఒకటేనని, హిందువులు, ముస్లింలు సోదరులని బీజేపీ జాతీయ మోర్చా అధ్యక్షుడు జమాల్ సిద్ధిఖి పేర్కొన్నారు. అయోధ్యలో శ్రీరామచంద్రుడి మూర్తులను ప్రతిష్ఠించే వేళ మసీదులు, దర్గాలలో కనీసం ఐదు దీపాలను ఈ నెల 22న సాయంత్రం వెలిగించాలని ఆయన ముస్లింలకు పిలుపునిచ్చారు. ఇది హిందూ-ముస్లింల మధ్య సామరస్యాన్ని ఎన్నో రెట్లు పెంచుతుందని తెలిపారు. బీజేపీ మైనార్టీ మోర్చా కార్యకర్తలు మసీదులు, దర్గాల కమిటీ పెద్దలను ఇందుకు ఒప్పించే ప్రయత్నం చేస్తారని, అయితే ఎక్కడా బలవంతం ఉండదని అన్నారు.

నా కొడుకును నేను చంపలేదు

- నిద్రలేచి చూసేసరికి ప్రాణాలు కోల్పోయాడు: సుచన



బెంగళూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): భర్త మీద కోపంతో కన్నకొడుకును చంపుకొన్న 'ఏఐ మైండ్‌ల్యాబ్స్' సీఈవో సుచనా సేథ్.. అసలు తనకు కొడుకును చంపే ఉద్దేశమే లేదని, అతడు అకస్మాత్తుగా చనిపోయాడని పోలీసులకు తెలిపినట్టు సమాచారం. కర్ణాటకలో అరెస్టయిన ఆమెను.. ట్రాన్సిట్ వారంట్‌పై గోవాకు తీసుకొచ్చిన పోలీసులు రెండు గంటలపాటు ప్రశ్నించారు. ఆదివారంనాడు (7వ తేదీన).. తన భర్త తమ కుమారుణ్ని కలవకూడదనే ఉద్దేశంతోనే శనివారం గోవాకు వచ్చినట్టు ఆమె పోలీసులకు తెలిపింది. తన కుమారుణ్ని చంపే ఉద్దేశమే లేదని.. తాను నిద్ర లేచేసరికి అతడు చనిపోయి కనిపించాడని వారికి చెప్పింది. అయితే, బాలుడి మృతదేహానికి పోస్ట్‌మార్టమ్ చేసిన వైద్యుడు కుమార్ నాయక్.. ఊపిరాడకపోవడం వల్లే అతడి మరణం సంభవించినట్టు వెల్లడించారు.

ప్రపంచానికే భారత్ ఆశా కిరణం: ప్రధాని మోదీ

గాంధీనగర్, జనవరి 10: ప్రపంచ దేశాలు అనిశ్చితితో అవస్థలు పడుతున్న వేళ భారతదేశం ప్రపంచానికి ఓ ఆశా కిరణంగా అవతరించిందని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచ దేశాలను ఆర్థికాభివృద్ధి దిశగా తీసుకెళ్లే శక్తిగా ఎదిగిందని పేర్కొన్నారు. ప్రపంచంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థ కలిగిన తొలి మూడు దేశాల్లో భారత్ అతి త్వరలో చోటు దక్కించుకుంటుందని పేరొందిన అనేక రేటింగ్ సంస్థలు చెబుతున్నాయని తెలిపారు. ప్రపంచంలోని అన్ని దేశాలకు భారత్ విశ్వమిత్ర దేశం(విశ్వ మిత్ర)గా మారిందని చెప్పారు. గాంధీనగర్‌లో 10వ విడత 'వైబ్రెంట్ గుజరాత్ అంతర్జాతీయ సదస్సు'ను మోదీ బుధవారం ప్రారంభించారు. యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ సదస్సులో పలు అంతర్జాతీయ సంస్థల సీఈవోలు, ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా, దేశ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన ప్రధాని మోదీనే అని అని రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ అన్నారు.

బిల్కిస్ బానో కేసు దోషుల్లో 9 మంది మిస్సింగ్?

న్యూఢిల్లీ, జనవరి 10: బిల్కిస్ బానో కేసులో సుప్రీం కోర్టు తాజాగా జారీ చేసిన ఆదేశాల మేరకు 11 మంది దోషులు తిరిగి జైల్లో లొంగిపోవాల్సి ఉండగా.. ఇప్పటి వరకు ఎవరూ లొంగిపోలేదని తెలుస్తోంది. దోషుల్లో తొమ్మిది మంది కనిపించకుండా పోయినట్టు మీడియా కథనాలు వెలువడుతున్నాయి. దోషులు రెండువారాల్లోగా సరెండర్ కావాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలపై ఎలాంటి అధికారిక సమాచారం అందలేదని దాహోద్ ఎస్పీ బలరాం మీనా తెలిపారు. అయితే దోషులందరూ అజ్ఞాతంలోకి వెళ్లినట్టు చెప్పలేమని, వారిలో కొందరు బంధువుల ఇళ్లకు వెళ్లినట్టు తెలిసిందన్నారు. శాంతి భద్రతల దృష్ట్యా సోమవారం ఉదయం నుంచే దోషుల గ్రామాల్లో బలగాలను మోహరించినట్టు చెప్పారు.

క్యూబాలో 500% పెరిగిన పెట్రోలు ధరలు

హవానా, జనవరి 10: ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న క్యూబాలో పెట్రోలు ధరలు అమాంతం పెరిగాయి. లీటరు పెట్రోలు ధర ఇప్పటి వరకు అక్కడ 25 పెసోలు ఉండగా ఇప్పుడది 132 పెసోల (సుమారు రూ.450)కు పెరిగింది. ఇక ప్రీమియమ్ పెట్రోలు ధర 30 పెసోల నుంచి 156 పెసోలకు పెరిగింది. ఈ ధరలు ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానున్నట్లు క్యూబా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. క్యూబాలో గతంలో పెట్రోలును సబ్సిడీ ధరలకు అమ్మేవారు. కరోనా మహమ్మారితో అక్కడి ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. దాంతోపాటు అమెరికా ఆర్థిక ఆంక్షలు కఠినతరం చేయడంతో సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయి.

కాల్‌మనీ వేధింపులకు యువకుడి ఆత్మహత్య

నంద్యాల క్రైం, జనవరి 10: కాల్‌మనీ వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నంద్యాల జిల్లాలో జరిగిందీ దారుణం. నంద్యాలలోని మారుతీనగర్‌కు చెందిన హరికృష్ణ(36) నంద్యాల మున్సిపాల్టీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నారు. ఆయన స్థానిక హరిజనవాడకు చెందిన వైసీపీ నాయకురాలు, మాజీ కౌన్సిలర్ కన్నమ్మ వద్ద రూ.10 వడ్డీకి రూ.3లక్షలు అప్పు తీసుకున్నారు. మూడు నెలల నుంచి వడ్డీ చెల్లించకపోవడంతో కన్నమ్మ ఆమె అనుచరులు బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ హరికృష్ణ సెల్ఫీ వీడియోలో ఏడుస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డీ నెలకు రూ.30వేలు చొప్పున మూడు నెలలకు రూ.90వేలు చెల్లించాల్సి ఉండగా వేధింపులు తాళలేక మహానంది మండలం నందిపల్లె సమీపంలో బుధవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. మరోవైపు తన కుమారుడికి కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడని, హరికృష్ణ తండ్రి ఫిర్యాదు చేయడంతో రైల్వే పోలీసులు ఆ మేరకు కేసు నమోదు చేశారు.

జనసేనానితో అంబటి రాయుడు భేటీ

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వైసీపీలో ఇలా చేరి.. అలా బయటకు వచ్చిన మాజీ క్రికెటర్ అంబటి రాయుడు తాజాగా జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో భేటీ అయ్యారు. పార్టీ సహా వచ్చే ఎన్నికల పరిస్థితిపై ఆయన చర్చించినట్టు తెలిసింది. బుధవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆయన పవన్‌తో గంటన్నర పాటు చర్చించారు. తాజా రాజకీయాలతో పాటు రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన అనేక అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్‌కు ఆయన వినాయకుని వెండి ప్రతిమను అందించారు. భేటీ అనంతరం అంబటి రాయుడు ట్విట్టర్(ఎక్స్) వేదికగా స్పందించారు. రాష్ట్ర ప్రజలకు సేవ చేద్దామన్న ఆలోచనతో ఉన్నట్లు తెలిపారు. "వైసీపీతో ప్రయాణం చేయలేను. నా ఐడియాలజీ వేరు. వైసీపీ ఐడియాలజీ వేరు. అందుకే బయటకు వచ్చేశాను" అని పేర్కొన్నారు. అంతేకాదు.. వైసీపీతో ప్రయాణం చేయడం వల్ల తన ఆలోచనలు నెరవేరేలా కనిపించడం లేదన్నారు. తన కుటుంబ సభ్యులు, స్నేహితుల సూచనల మేరకు పవన్‌కల్యాణ్‌ను కలిసినట్టు తెలిపారు. తాను దుబాయ్‌లో జరగనున్న క్రికెట్ టోర్నమెంట్‌కు వెళ్తున్నట్లు రాయుడు వెల్లడించారు.

రామాలయానికి రాం..రాం!

- ఆహ్వానాన్ని తిరస్కరించిన సోనియా, ఖర్గే, అధీర్



న్యూఢిల్లీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో జనవరి 22న జరిగే రామ మందిర ప్రారంభోత్సవానికి తాము రాలేమని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ఆ పార్టీ నేత అధీర్ రంజన్ చౌదరి స్పష్టం చేశారు. రామ మందిర ప్రారంభానికి రావల్సిందిగా సోనియా, ఖర్గే, అధీర్ రంజన్‌లకు గత నెలలో ఆహ్వానాలు అందాయని, అయితే ఈ ఆహ్వానాలను వారు గౌరవపూర్వకంగా తిరస్కరించారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. శ్రీరాముడిని దేశంలో లక్షలాది మంది పూజిస్తారని, మతం అనేది వ్యక్తిగత వ్యవహారమని పేర్కొన్నారు. కానీ బీజేపీ, ఆర్ఎస్ఎస్ రామమందిరాన్ని ఒక రాజకీయ ప్రాజెక్టుగా మార్చాయన్నారు. మందిర నిర్మాణం అసంపూర్తిగా ఉండగానే బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఎన్నికల్లో ప్రయోజనాల కోసం దాన్ని ప్రారంభిస్తున్నాయని ఆరోపించారు. రామాలయ ప్రారంభానికి వెళ్లకూడదన్న తన నిర్ణయానికి కాంగ్రెస్ పార్టీ విచారించాల్సి వస్తుందని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ పేర్కొన్నారు. శ్రీరాముడి అస్తిత్వాన్ని నిరాకరించే కాంగ్రెస్ తాజా నిర్ణయం ఆశ్చర్యం కలిగించలేదని బీజేపీ నేత నళిన్ కోహ్లీ వ్యాఖ్యానించారు. వామపక్షాలు, టీఎంసీ సహా పలు ప్రతిపక్ష పార్టీలు కూడా రామమందిర ప్రారంభోత్సవానికి వెళ్లబోమని స్పష్టం చేశాయి.

శాస్త్ర వ్యతిరేకులం కాకూడదనే...

అయోధ్యలో 22న జరుగనున్న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి తాము హాజరు కావడంలేదని ఉత్తరాఖండ్‌లోని జ్యోతిర్మఠ్ పీఠాధిపతి అవిముక్తేశ్వరానంద సరస్వతి ప్రకటించారు. ఈ కార్యక్రమానికి వచ్చేందుకు పూరీ గోవర్ధన మఠం పీఠాధిపతి నిశ్చలానంద సరస్వతి నిరాకరించిన కొద్ది రోజులకే ఆయన ఈ ప్రకటన చేశారు. తనతో పాటు జగద్గురువు ఆది శంకరాచార్యుల వారు దేశంలో నెలకొల్పిన నాలుగు పీఠాల అధిపతులు, మతపెద్దలు ఎవరూ ఈ కార్యక్రమానికి హాజరు కాబోరని స్పష్టం చేశారు. "ఈ వేడుకను శాస్త్రాలకు విరుద్ధంగా, హిందూగ్రంథాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్నారు. ఆలయ నిర్మాణం ఇంకా అసంపూర్తిగా ఉన్నప్పుడు ప్రాణప్రతిష్ఠ చేయడమే అసలు సమస్య" అని ఆయన తన అధికారిక "ఎక్స్" ఖాతాలో పోస్టు చేశారు. ఇదో అజ్ఞానపూరితమైన చర్యగా అభివర్ణించారు. తమ నిర్ణయాన్ని మోదీ పట్ల ద్వేషంగా భావించరాదని, 'శాస్త్ర వ్యతిరేకులం' కాకూడదని భావించి నలుగురు పీఠాధిపతులు తీసుకున్న నిర్ణయమని అవిముక్తేశ్వరానంద పేర్కొన్నారు.

మహిళలకు చోటేదీ: దుర్గావాహిని

రామాలయ ప్రతిష్ఠాపనలో తమను భాగస్వాములను చేయాలని అయోధ్యలోని మహిళా సంఘాలు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నాయి. ఎట్టకేలకు... నగరంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఈ నెల 22న ఏం చేయాలో అందరికీ చెప్పాలని వీహెచ్‌పీ మహిళా విభాగమైన దుర్గావాహిని సభ్యులకు ట్రస్టు పెద్దలు సూచించారు. అయితే ఆ రోజు చేయాల్సిన పనులేమిటో మాత్రం వారికి చెప్పనేలేదు. దీనిపై అయోధ్యలో దుర్గావాహిని అధ్యక్షురాలు వరిక్షా బసు మాట్లాడుతూ... "మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇది మాకు చాలా అవమానంగా ఉంది" అని ఆవేదన వ్యక్తం చేశారు.

22నే బిడ్డల్ని కంటాం

కొత్తచెరువు, జనవరి 10: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు వేద పండితులు నిర్ణయించిన సుముహూర్తం ఈ నెల 22వ తేదీ. ఆ అద్భుతమైన ముహూర్తంలో బిడ్డలను కనేందుకు ప్రసవ సమయం దగ్గరపడిన గర్భిణులు ఆసక్తి చూపిస్తున్నారు. ఆ రోజున సిజేరియన్ చేయించుకునేందుకూ వెనుకాడటం లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో పదుల సంఖ్యలో సిజేరియన్లకు ఇప్పటికే రిజర్వు చేసుకున్నారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రులకు డిమాండ్ పెరిగింది. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలోని రెండు ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ నెల 22వ తేదీన ప్రసవం కోసం ఏకంగా 45 మంది తమ పేర్లను ముందస్తుగా నమోదు చేసుకున్నారు. కదిరి, హిందూపురం, అనంతపురం తదితర ప్రాంతాల్లోని ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ ఆ తేదీన ప్రసవం కోసం రిజిస్ట్రేషన్లు జరిగాయి. సరిగ్గా రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠకు నిర్ణయించిన 12.29.08 గంటలకు తమకు సిజేరియన్ చేయాలని కూడా కొందరు కోరినట్లు సమాచారం. ఆరోజు ఎక్కువ ప్రసవాలు ఉండటంతో కొందరు ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు గైనకాలజిస్టులను ప్రత్యేకంగా రప్పించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.



సీట్లపై చర్చలు ముమ్మరం

- ఇండియా కూటమిలోని అన్ని పార్టీలతోనూ ఖర్గే సంప్రదింపులు

న్యూఢిల్లీ, జనవరి 10: సీట్ల సర్దుబాటు చర్చలు ప్రారంభించాక ఇండియా కూటమిలోని అన్ని పార్టీల నేతలతోనూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సంప్రదింపులు జరుపుతున్నట్టు ఆ పార్టీ వెల్లడించింది. కూటమికి సంబంధించిన కీలక విషయాలపై త్వరలో నిర్ణయం వెలువడనుందని ఏఐసీసీ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేశ్ బుధవారం చెప్పారు. కూటమిలోని అన్ని పార్టీలతోనూ చర్చలు ప్రారంభమయ్యాయని, కొన్ని పార్టీలతో చర్చలు ప్రాథమిక దశలో ఉండగా, మరికొన్ని పార్టీలతో చర్చలు పురోగతిలో ఉన్నాయన్నారు. 'బిహార్‌లో జేడీయూతో, బెంగాల్‌లో టీఎంసీతో ఒకటి రెండు రోజుల్లో సీట్ల సర్దుబాటు చర్చలు జరిపే అవకాశం ఉంది' అన్నారు. మహారాష్ట్ర, పంజాబ్, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లో సీట్ల పంపకాలపై కూటమిలోని పార్టీల నుంచి కాంగ్రెస్ గట్టి సవాళ్లను ఎదుర్కొంటోంది. ఢిల్లీలో 7 లోక్‌సభ స్థానాలు ఉండగా, కాంగ్రెస్‌కు 3 సీట్లు ఇస్తామని ఆప్ ప్రకటించినట్టు తెలిసింది. పంజాబ్‌లో 13 స్థానాలుండగా, కాంగ్రెస్‌కు 6 స్థానాలు ఇచ్చేందుకు ఆప్ సంసిద్ధత వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇక మహారాష్ట్రలో 48 లోక్‌సభ స్థానాలు ఉండగా, అత్యధిక స్థానాల్లో శివసేన(యూబీటీ) పోటీ చేసే అవకాశం ఉంది.

మణిపూర్‌లో రాహుల్‌యాత్రపై హైడ్రామా

మణిపూర్‌లోని ఇంఫాల్ తూర్పు జిల్లాలో చరిత్రాత్మక పోలో గ్రౌండ్ హట్టా కాంజేబంగ్‌లో జనవరి 14న రాహుల్ భారత్ జోడో న్యాయయాత్ర ప్రారంభించడంపై హైడ్రామా నెలకొంది. ఈ యాత్ర సందర్భంగా అక్కడ ర్యాలీ నిర్వహించాలన్న కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలకు గండి పడింది. భద్రతా కారణాల దృష్ట్యా తొలుత ప్రభుత్వం యాత్రకు నిరాకరించింది. అయితే, కాంగ్రెస్ అభ్యర్థన మేరకు ఎట్టకేలకు ర్యాలీ లేకుండా అతికొద్ది మందితో హట్టా కాంజేబంగ్ మైదానం నుంచే యాత్ర ప్రారంభానికి ఓకే చెప్పింది.

అసలైన శివసేన షిండేదే

- ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయటం లేదు
- మహారాష్ట్ర స్పీకర్ నార్వేకర్ ప్రకటన
- ప్రజాస్వామ్యం హత్యకు గురైంది: ఉద్ధవ్



నార్వేకర్

ముంబై, జనవరి 10: మహారాష్ట్ర మాజీ సీఎం, శివసేన చీలిక వర్గం అధినేత ఉద్ధవ్ ఠాక్రేకు మరో ఎదురుదెబ్బ తగిలింది. శివసేన రెండు చీలికవర్గాల్లో ప్రస్తుత సీఎం ఏక్‌నాథ్‌షిండే సారథ్యంలోని వర్గమే అసలైన శివసేన అని ఆ రాష్ట్ర స్పీకర్ రాహుల్ నార్వేకర్ బుధవారం ప్రకటించారు. ఇరువర్గాల్లోని ఏ ఎమ్మెల్యేపైనా అనర్హత వేటు వేయటం లేదని తెలిపారు. తద్వారా షిండే వర్గంలోని 16 మంది ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని రద్దు చేయాలన్న ఉద్ధవ్ ఠాక్రే విజ్ఞప్తిని తిరస్కరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు తన నిర్ణయంలోని ముఖ్యమైన అంశాలను నార్వేకర్ 105 నిమిషాలపాటు చదివి వినిపించారు. పార్టీలో అసమ్మతి లేదా క్రమశిక్షణా రాహిత్యంపై ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని ప్రయోగించటం ఏ పార్టీ నాయకత్వానికి కూడా సాధ్యం కాదని స్పష్టం చేశారు. పార్టీలో రెండు చీలిక వర్గాలు ఉనికిలోకి వచ్చిన 2022 జూన్ 21వ తేదీ నాటి నుంచే ఉద్ధవ్ వర్గం విప్‌గా ఉన్న సునిల్‌ప్రభు ఆ పదవిని కోల్పోయారని, అధికారిక విప్ హోదా షిండే వర్గానికి చెందిన భరత్ గోగావాలెకు దక్కిందని స్పీకర్ తెలిపారు. వైరి వర్గం ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ ఇరువర్గాలు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేస్తున్నానని, ఎవరినీ అనర్హులుగా ప్రకటించటం లేదన్నారు. ఎన్నికల సంఘానికి శివసేన సమర్పించిన 1999 నాటి పార్టీ నియమావళి ప్రకారం.. పార్టీలో జాతీయ కార్యవర్గమే అత్యున్నత నిర్ణాయక వేదిక అని, పార్టీ నుంచి ఎవరినైనా తొలగించే అధికారం శివసేన ప్రముఖ్‌కు (అధ్యక్షుడికి) లేదని, కాబట్టి, షిండేను పార్టీ నుంచి ఉద్ధవ్ తొలగించలేరని పేర్కొన్నారు. పార్టీలో అధ్యక్షుడి మాటే అత్యున్నతం అని పేర్కొంటూ 2018లో శివసేన నియమావళిలో చేసిన సవరణను పరిగణనలోకి తీసుకోవాలన్న ఉద్ధవ్ వర్గం విజ్ఞప్తిని నిరాకరించినట్లు స్పీకర్ వెల్లడించారు. 2022 జూన్‌లో పార్టీ చీలినప్పుడు, మొత్తం 54 మంది పార్టీ ఎమ్మెల్యేల్లో 37 మంది షిండే వెంట ఉన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. స్పీకర్ నిర్ణయంతో షిండే వర్గం సంబరాలు జరుపుకొంది. 'ప్రజాస్వామ్యంలో అంకెలు (ఎమ్మెల్యేల సంఖ్య) కీలకం. అవి మా వద్ద ఉన్నాయి' అని షిండే పేర్కొన్నారు. కాగా, స్పీకర్ నిర్ణయంపై ఉద్ధవ్ ఠాక్రే మండిపడ్డారు. ప్రజాస్వామ్యం హత్యకు గురైందని, న్యాయం కోసం తాము సుప్రీంకోర్టుకు వెళ్తామని తెలిపారు. ఈ కేసులో సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టమైన మార్గదర్శకాలను వెలువరించినప్పటికీ.. వాటిని స్పీకర్ పట్టించుకోలేదన్నారు. అసలు విషయం ఎమ్మెల్యేల అనర్హత గురించి కాగా, స్పీకర్ దానిని పట్టించుకోనేలేదని చెప్పారు. మహారాష్ట్ర ప్రజలు.. ఈ ద్రోహుల శివసేనను ఎన్నటికీ అంగీకరించరన్నారు. ఉద్ధవ్ వర్గం సుప్రీంకోర్టుకు వెళ్లాలని శరద్‌పవార్ సూచించారు.

టార్గెట్ 400



లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ లక్ష్యమిదే!

- 2019లో ఓడిన 164 సీట్లపై గురి
- జాతీయ ప్రధాన కార్యదర్శులతో జేపీ నడ్డా వ్యూహాత్మక చర్చలు

న్యూఢిల్లీ, జనవరి 10: లోక్‌సభ ఎన్నికలకు సెమీఫైనల్స్‌గా భావించిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మూడు చోట్ల ఘనవిజయం సాధించిన బీజేపీ.. ఇక అసలు టార్గెట్‌పై గురిపెట్టింది. 543 స్థానాల లోక్‌సభలో ఈ దఫా 400 సీట్లు గెలవాలన్న బృహత్తర లక్ష్యం పెట్టుకుంది. ముఖ్యంగా గత ఎన్నికల్లో ఓడిపోయిన, తక్కువ మెజారిటీతో గెలిచిన 164 లోక్‌సభ స్థానాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆ పార్టీ నాయకత్వం నిర్ణయించింది. గత రెండేళ్లుగా కేంద్ర మంత్రులను, పార్టీ నేతలను ఆయా నియోజకవర్గాలకు పంపించి.. క్షేత్ర స్థాయి వాస్తవాలను తెలుసుకుంది. పార్టీ అభ్యర్థులు గెలిచే అవకాశం లేని చోట్ల విపక్ష ఎంపీలను, నాయకులను చేర్చుకోవడం ద్వారా బలపడాలని నిశ్చయించింది. ఇందుకోసం ప్రత్యేకంగా చేరికల కమిటీని ఏర్పాటు చేశారు. దీనికి ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్‌డే నేతృత్వం వహిస్తారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మంగళవారం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులతో వ్యూహాత్మక సమావేశం నిర్వహించారు. కేంద్రమంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, భూపేంద్ర యాదవ్, అశ్వినీ వైష్ణవ్, మన్‌సుఖ్ మాండవీయ కూడా పాల్గొన్నారు. అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ వర్చువల్‌గా హాజరయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. కీలక బాధ్యతలను ప్రధాన కార్యదర్శులకు అప్పగించారు. ఎన్నికలకు పార్టీ తరఫున విజన్ డాక్యుమెంట్ రూపొందించే బాధ్యతను రాధామోహన్‌దాస్ అగర్వాల్‌కు అప్పగించారు. ఎన్నికల ప్రచారం, పబ్లిసిటీ సంబంధమైన అంశాలను సునీల్ బన్సల్, ఇతర ప్రధాన కార్యదర్శులు చూస్తారు. ప్రచార ప్రణాళికకు సంబంధించి కేంద్ర మంత్రులు, సీనియర్ నేతలు, రాష్ట్ర శాఖలతో సమన్వయం చేసుకునే బాధ్యతను కైలాస్ విజయవర్గీయ, బండి సంజయ్‌కుమార్, తరుణ్ చుగ్‌లకు కట్టబెట్టారు.

అధిక స్థానాల్లో బరిలోకి..

అత్యధిక స్థానాల్లో పోటీచేయడంతో పాటు 50% ఓట్లు సాధించాలని బీజేపీ నాయకత్వం ఇంకో లక్ష్యం పెట్టుకుంది. గత ఎన్నికల్లో 543 స్థానాలకు గాను బీజేపీ 436 చోట్ల పోటీచేసింది. 303 స్థానాల్లో విజయం సాధించింది. కాగా, 1984 తర్వాత ఏ పార్టీ కూడా 400 మార్కును దాటలేదు. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ హత్యానంతరం ప్రధాని రాజీవ్‌గాంధీ సారథ్యంలో జరిగిన ఎన్నికల్లో సానుభూతి పవనాలు వీయడంతో కాంగ్రెస్ 514 సీట్లకు గాను 404 చోట్ల విజయం సాధించింది.

హమాస్..మాకొద్దంటే వద్దు..!

తేల్చి చెబుతున్న గాజా వాసులు.. అరబ్ బారోమీటర్ సర్వేలో వెల్లడి



ఇంతకాలం హమాస్ సర్కారుకు మద్దతుగా నిలిచిన గాజావాసుల్లో ఆ ఉగ్ర సంస్థపై విశ్వాసం సన్నగిల్లుతోంది. హమాస్ పాలన తమకు వద్దంటే వద్దని వారు తేల్చిచెబుతున్నారు. వెస్ట్‌బ్యాంక్, గాజా కేంద్రాలుగా పనిచేస్తున్న 'అరబ్ బారోమీటర్' అనే పరిశోధన సంస్థ నిర్వహించిన సర్వే ఫలితాలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. అక్టోబరు 7 ఇజ్రాయెల్‌పై హమాస్ ముప్పేట దాడి జరిపినప్పుడు కూడా గాజా వాసుల అభిప్రాయాలను ఈ సంస్థ తెలుసుకుంది. అప్పట్లో హమాస్ దాడులను 72% మంది గాజావాసులు సమర్థించారు. అయితే, ఇటీవల మరోమారు సర్వే నిర్వహించగా.. హమాస్ మద్దతుదారుల సంఖ్య 44శాతానికి పడిపోయింది. గాజాలో ఇజ్రాయెల్ భూతల దాడులు ప్రారంభమయ్యాక.. పౌరులను హమాస్ పట్టించుకోకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

ఆపరేషన్ 'అసెస్‌మెంట్ మిషన్': బ్లింకన్

గాజా పౌరులను తిరిగి ఉత్తరాదికి తరలించేందుకు ఆపరేషన్ 'అసెస్‌మెంట్ మిషన్'ను ప్రారంభిస్తామని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ వెల్లడించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ఆపరేషన్‌ను ఐరాస నేతృత్వంలో చేపడతామన్నారు. పరిస్థితులు అనుకూలించిన వెంటనే.. గాజాలో అమెరికా రాయబార కార్యాలయాన్ని ఏర్పాటు చేసి, పౌరులు ఉత్తరాదికి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. గాజాలో శాంతి నెలకొనేలా అమెరికా చర్యలు తీసుకుంటోందని వివరించారు.

- సెంట్రల్ డెస్క్

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 11 జనవరి 2024
features@andhrajyothy.com



ఒత్తిడి తగ్గించే పైనాపిల్

పైనాపిల్‌లో సి- విటమిన్ పుష్కలం. ఇందు వల్ల కొల్లాజిన్ ఉత్పత్తి చక్కగా ఉంటుంది. తద్వారా జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది. చర్మం మిలమిలా మెరుస్తుంది. యాంటీ రిచ్ ఆక్సిడెంట్స్ ఉండటం వల్ల చర్మం బిగుతుగా ఉంటుంది కాబట్టి యవ్వనంగా కనిపిస్తారు.

- ఈ పండు తింటే జీర్ణశక్తిని వృద్ధి చేస్తుంది.
- వీటిలో ఇమ్యూనిటీని పెంచే శక్తి ఉంటుంది. ఇన్‌ఫెక్షన్లు, దగ్గు-జలుబు లాంటివి దరిచేరవు.
- కొలెస్ట్రాల్‌ను తగ్గించే గుణం ఉంది. అందు వల్ల బరువు తగ్గాలనుకునేవాళ్లు ఈ పండుతో దోస్తీ మంచిది.
- ఇందులో మెగ్నీషియం, కాపర్ ఉండటం వల్ల ఎముకల గట్టితనానికి ఉపయోగపడతాయి.
- పైనాపిల్‌లో న్యూట్రిన్లు అధికం. ముఖ్యంగా ఒత్తిడి, ఆందోళన తగ్గించే లక్షణాలు ఈ పండులో ఉంటాయి.
- ఫైబర్ కంటెంట్ ఎక్కువ ఉండటం వల్ల సులువగా జీర్ణం అవుతుంది. రక్తంలో చక్కెర శాతాన్ని నియంత్రిస్తుంది.
- పైనాపిల్‌ను తినటమే కాదు జ్యూస్‌లు, సలాడ్స్ రూపంలో తీసుకోవచ్చు. దీంతో పాటు ఈ గుజ్జును చర్మానికి పట్టించుకుంటే ఫేస్‌లో కాంతి వస్తుంది.



"వ్యవసాయ శాస్త్రవేత్తలు అద్భుతమైన ఆవిష్కరణలు ఎన్నో చేస్తున్నారు. రైతులకు చేరినప్పుడు, క్షేత్రస్థాయిలో అమలైనప్పుడే వాటికి సార్థకత" అంటారు స్వాతి నాయక్. ఆ దిశగా ఆమె చేస్తున్న కృషికి గుర్తింపుగా ప్రతిష్టాత్మకమైన 'నార్మన్ ఇ.బోర్లాగ్' పురస్కారాన్ని అందుకున్నారు. 'ఐఆర్‌ఆర్‌ఐ' దక్షిణాసియా విభాగం అధిపతిగా దేశ, విదేశాల్లో వ్యవసాయ రంగంపై తనదైన ముద్ర వేస్తున్న స్వాతి అంతరంగమిది.

సాగు రైతు

బాగు కోసం...

"నా స్వస్థలం ఒడిశాలోని పూరీ. ఆ రాష్ట్రంలోని మయూర్‌భంజ్ ప్రాంతంలో ఉన్న గిరిజనులు నన్ను 'బిహనా దీదీ' (విత్తనాల సహోదరి) అని పిలుస్తారు. కారణమేమిటంటే... దాదాపు పదేళ్ళ క్రితం... దుర్భిక్షాన్ని తట్టుకోగలిగే 'సహభంగీ' అనే వరి రకాన్ని అక్కడ పరిచయం చేశాం. ఇప్పుడు ఆ రకాన్ని ఎక్కువమంది సాగు చేస్తూ, మంచి దిగుబడులు పొందుతున్నారు. వారి పిలుపు, అంతకన్నా వాళ్ళకు కలుగుతున్న ప్రయోజనాలు ఎంతో సంతోషం కలిగిస్తాయి. చిత్రమేమిటంటే... వ్యవసాయ శాస్త్రవేత్త కావాలనేది నా చిన్ననాటి లక్ష్యం ఏమాత్రం కాదు. ఇంజనీర్, డాక్టర్ లేదా సివిల్స్... విజయానికి నిర్వచనంగా భావించే వృత్తులివి. చదువులో నేను బాగా చురుగ్గా ఉండడంతో... వాటిలో ఏదో ఒక దారి ఎంచుకోవాలనే ఒత్తిడి నా మీద ఎక్కువగానే ఉండేది. అయితే ఇలాంటి లక్ష్యాలు నాకు ఇబ్బందిగా అనిపించేవి. 'అవి చదివితేనే సక్సెస్ అయినట్టా?' అనుకొనేదాన్ని. అందుకే వాటిని సీరియస్‌గా తీసుకోలేదు. క్రమంగా బయాలజీ అంటే ఇష్టం పెరిగింది. ఆ తరువాత వ్యవసాయమంటే మక్కువ ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో... అగ్రికల్చర్‌లో బ్యాచిలర్ డిగ్రీ, గుజరాత్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజిమెంట్‌లో మాస్టర్స్ డిగ్రీ తీసుకున్నాను. ఆంధ్రప్రదేశ్‌లో... పద్దెనిమిది నెలలపాటు ఐటిడిఎకి చెందిన ఒక ప్రాజెక్ట్‌లో, రెండేళ్ళపాటు ఢిల్లీలోని 'నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్' (ఎన్‌ఆర్‌ఎల్‌ఎం)లో పని చేశాను. ఈ సందర్భంలోనే మహిళా రైతుల సాధికారత కోసం కొన్ని కార్యక్రమాలను రూపొందించాను. వారి పొలాలను మరింత లాభదాయకంగా వినియోగించుకోవడం, అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్ లాంటివాటికి అవి సాయపడ్డాయి. దీని ద్వారా లక్షలాది మహిళలు లబ్ధి పొందారు. వృత్తిరీత్యా అనేక గ్రామీణ ప్రాంతాలను సందర్శించినప్పుడు... కఠోరమైన పరిస్థితులు కనిపించాయి. అతివృష్టి, అనావృష్టి, పెరిగిపోతున్న సాగు ఖర్చులతో వ్యవసాయ రంగం అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతోంది. ఈ సంక్షోభాన్ని తట్టుకొని నిలబడాలంటే మెరుగైన, సరికొత్త వంగడాలే శరణ్యం. అదే సమయంలో... వాతావరణ మార్పులు అనేది ఒక కఠోరమైన వాస్తవం. మనం చేయగలిగేదల్లా వాటిని తట్టుకోగలిగే సామర్థ్యాలను పెంచుకోవడమే. వివిధ వాతావరణాల్ని తట్టుకోగలిగే విత్తనాలను రైతులకు మనం అందించగలిగితే... వరదలు, కరువుల వల్ల ఎదురయ్యే సమస్యల నుంచి వారికి రక్షణ ఏర్పడుతుంది. వ్యవసాయం ఒక శాస్త్రం మాత్రమే కాదు, అది కోట్లాది మందికి జీవనోపాధి కూడా. ఈ రంగాన్ని ఎలా పటిష్టం చెయ్యాలో, దీన్ని మరింత లాభసాటిగా ఎలా మార్చాలి అనే అంశాల మీద మనమందరం పని చెయ్యాలి. ఈ ఆలోచనలే నా వృత్తిలో నాకు దిశానిర్దేశం చేశాయి.

నైపుణ్యం, ప్రోత్సాహం అందించాలి...

ప్రస్తుతం 'ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్' (ఐఆర్‌ఆర్‌ఐ)లో... విత్తనాల విధానం- ఉత్పత్తుల యాజమాన్య విభాగానికి దక్షిణాసియా అధిపతిగా ఉన్నాను.



ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకొని, అత్యధిక ఫలసాయాన్నిచ్చే, జీవపరంగా బలోపేతం చేసిన 500 కొత్త వరి రకాలపై క్షేత్రస్థాయిలో పరీక్షలు జరపడం నా బాధ్యతల్లో ఒకటి. ఇలాంటి వాటిలో ఇరవైకి పైగా రకాలను మన దేశంలోని వివిధ రాష్ట్రాల్లోనే కాదు, బంగ్లాదేశ్, నేపాల్ దేశాల్లోనూ ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నాం. మరోవైపు 'సీడ్ వితవుట్ బోర్డర్స్' పాలసీ రూపకల్పనలోనూ నేను ప్రధానపాత్ర వహించాను. భౌగోళికంగా ఒకేరకమైన పరిస్థితులు ఉన్న ఏ దేశంలోనైనా పంటలను సాగు చేయడానికి అది వీలు కల్పిస్తుంది. దీని వల్ల పంట వైవిధ్యంతో పాటుగా ఆహార కొరతను కూడా తీర్చవచ్చు. కొత్త వంగడాల సృష్టికి కూడా ఆస్కారం ఏర్పడుతుంది. దీనిలో భాగంగా వాతావరణ ప్రభావాల్ని తట్టుకొనే వరి రకాలను ఇతర దేశాలకూ పరిచయం చేశాను. ఒక ఎకరం కన్నా తక్కువ భూమి ఉన్న రైతు కరువులు, వరదల్లాంటి సవాళ్ళను ఎలా ఎదుర్కోగలడనేది అన్నిటికన్నా నాకు ఆందోళన కలిగించే విషయం. తమ సాగు పద్ధతులను సమూలంగా మార్చే సాంకేతికతలు ఉన్నాయనే విషయం కూడా చాలామంది రైతులకు తెలీదు. కొత్త వ్యవసాయ సాంకేతికతలు రైతులకు అందుబాటులోకి తేవాలి. కొత్తతరం విత్తనాల గురించి వారిలో మరింత అవగాహన కల్పించాలి.ప్రయోగశాలలకు, పంట పొలానికి, మార్కెట్‌కు మధ్య ఉన్న అంతరాన్ని భర్తీ చేయాలి. అందుకే వ్యవసాయ పరిశోధనలకి, క్షేత్రస్థాయిలో వాటిని అమలు చెయ్యడానికీ మధ్య ఉన్న అవరోధాలను తగ్గించడానికి పని చేస్తున్నాను. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి వస్తేనే వారికి సాధికారత లభిస్తుంది. అలాగే... మన దేశ వ్యవసాయ కార్మికుల్లో సగానికి పైగా మహిళలే. కానీ వాళ్ళకు తగిన ప్రతిఫలం కానీ, భూమి హక్కులు కానీ లేవు. రికార్డుల ప్రకారం వారు రైతులు కారు. దీనివల్ల సాగు విషయాల్లో తగినంత పరిజ్ఞానం, శిక్షణ, వాళ్ళ శ్రమకి తగిన గుర్తింపు లేవు. తగిన నైపుణ్యాలను, ప్రోత్సాహాన్నీ అందిస్తే మహిళలు ఏదైనా సాధించగలరు. అంతేకాదు, నేను పనిచేసే రంగంలోనూ మహిళల సంఖ్య తక్కువ. దీనివల్ల అనేక సవాళ్ళు ఎదుర్కొన్నాను. కానీ ఈ రంగంపై అభిరుచి, అంకితభావం కారణంగా రాణిస్తున్నాను.

అది గర్వకారణంగా భావిస్తున్నా...

నేను శాస్త్రవేత్తను మాత్రమే కాదు, ఒక మహిళను. తల్లిని. ఏదైనా చేయాలని నేను అనుకున్నప్పుడు... నా కుటుంబ జీవితాన్నీ, వృత్తి జీవితాన్నీ బ్యాలెన్స్ చేసుకోవాలి. మాది వ్యవసాయ కుటుంబం కాదు. నాకు సాగు గురించి ఏమీ తెలీదు. కానీ అనుకోకుండా ఈ రంగమే నా జీవితమైపోయింది. గిరిజనులు, చిన్న కమతాల రైతులు, కుటుంబ పోషణ కోసం చిన్న చిన్న వ్యవసాయ పనులు చేసుకొనే మహిళలు... ఇలా అన్ని రకాల ప్రజలతో పని చేసే అవకాశం వచ్చింది. అదే సమయంలో కొన్ని ఇబ్బందులూ పడ్డాను. ఐఆర్‌ఆర్‌ఐలో పని చేస్తూనే పిహెచ్‌డీ కూడా చేసేదాన్ని. అప్పుడు నేను ఏడు నెలల బిడ్డకు తల్లిని. నా బిడ్డ కోసం పని భారాన్ని తగ్గించుకోవాలి. కానీ వారమంతా బిజీగా ఉండేదాన్ని. ఆ సమయంలో నా భర్త, స్టాక్ మార్కెట్ నిపుణుడు ప్రియదర్శి బాల్ అండగా నిలిచారు. మా బిడ్డ పనులు, ఇంటి పనుల్లో సాయం చేసేవారు. ఇప్పుడు మా అమ్మాయికి ఏడేళ్ళు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక మహిళ ఏదైనా రంగంలో నిలదొక్కుకొని, విజయం సాధించాలంటే... కుటుంబంతో పాటు సహోద్యోగుల సాయం కూడా అవసరం. అదృష్టవశాత్తూ నాకు అందరినుంచీ మంచి మద్దతు లభిస్తోంది. కిందటి ఏడాది ప్రతిష్టాత్మకమైన 'నార్మన్ ఇ.బోర్లాగ్' పురస్కారం నాకు లభించింది. నోబెల్ బహుమతి గ్రహీత, హరిత విప్లవం ప్రధాన రూపశిల్పి డాక్టర్ నార్మన్ బోర్లాగ్ జ్ఞాపకార్థం దీన్ని ఏర్పాటు చేశారు. ఆహారం, పోషకాహార భద్రత, ఆకలి నిర్మూలన రంగాల్లో విశేష కృషి చేసిన నలభై ఏళ్ల లోపు వయసుగల శాస్త్రవేత్తలకు ఈ పురస్కారం ప్రదానం చేస్తారు. దీన్ని భారతదేశం నుంచి అందుకున్న మూడో వ్యక్తిని నేను. ఇది ఎంతో గర్వకారణంగా భావిస్తున్నాను. అణగారిన ప్రజలకు ఏదో విధంగా సాయపడాలన్నదే నా ప్రయత్నం. నాణ్యమైన విత్తనాల ద్వారా రైతులకు సాధికారత కల్పించాలి. ఇది కేవలం వారి జీవనోపాధికి, మన ఆహార వ్యవస్థను పటిష్టం చెయ్యడానికీ మాత్రమే కాదు, రైతుల ఆదాయం గణనీయంగా పెరగడానికి కూడా దోహదపడాలి. దీనికోసం గ్రామీణ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి. భవిష్యత్తులో వరి పరిశోధనలు, వ్యవసాయ పద్ధతుల్లో నవ్యావిష్కరణలు చిన్నకారు, పేద రైతులకు సాయపడేలా ఉండాలి ఇవన్నీ నా కలలు. అవి సాకారం కావడానికి మరింత కృషి చేస్తాను."

రోజూ నడిస్తే...



రోజుకు కనీసం ఏడు కిలోమీటర్లు నడిస్తే ఆరోగ్యానికి మంచిదంటున్నారు హార్వర్డ్ యూనివర్శిటీ పరిశోధకులు. ఉదయాన్నే పరగడపున మాత్రమే నడిస్తే మరిన్ని ఫలితాలుంటాయట. వెయ్యిమందిని తీసుకుని ఉదయంపూట కనీసం ఇరవై నిముషాలు వాకింగ్ చేయిస్తే.. వారిలో దగ్గు, జలుబు, సిక్‌గా ఉండటం లాంటి లక్షణాలు 43 శాతం తగ్గాయి.

- శరీరాన్ని కదిలించటం, కాళ్లు కదపడం వల్ల లాభమే కానీ నష్టం ఉండదు. ముఖ్యంగా ఉదయం పూట వాకింగ్ చేయటం వల్ల మంచి గాలి పీల్చుకోవచ్చు. ఇతరులతో మాట్లాడటం వల్ల మానసికంగా చురుగ్గా ఉంటారు.
- ఉదయం పూట నడక క్రమశిక్షణతో పాటు పాజిటివ్ మూడ్ కలుగుతుంది. ముఖ్యంగా బ్లడ్‌లో షుగర్‌లెవల్స్ బ్యాలెన్స్ అవుతాయి. మెటబాలిజమ్ బూస్ట్ అవుతుంది.
- నడవటం వల్ల బరువు తగ్గుతారు. రక్తపోటు తగ్గుతుంది. దీనివల్ల గుండెకు మంచిది. శ్వాస బాగా ఆడుతుంది. తద్వారా హాయిగా ఉన్న ఫీలింగ్ కలుగుతుంది.
- కండరాలు గట్టిపడతాయి. ఉదయం పూట కాబట్టి సూర్యరశ్మి పడటం వల్ల డి- విటమిన్ వస్తుంది. ఎముకలు గట్టిపడతాయి.
- జీర్ణశక్తి మెరుగుపడుతుంది. వ్యాధి నిరోధకశక్తిని పెంచుతుంది.

స్టయిల్ టిప్

ఎలాంటి హ్యాండ్ బ్యాగ్?

సందర్భానికి తగ్గట్టు దుస్తులు ధరిస్తాం. మరి ఆ దుస్తులకు తగిన హ్యాండ్ బ్యాగ్ ఎంచుకుంటున్నామా? నిజానికి ఔట్‌ఫిట్‌కి మ్యాచ్ అయ్యే బ్యాగ్ చేతిలో ఉంటేనే స్టయిల్ చమక్కుమంటుంది. ఏ ఔట్‌ఫిట్‌కు ఎలాంటి బ్యాగ్ సెలెక్ట్ చేసుకోవాలంటే...

ఆఫీసు, షాపింగ్, క్యాజువల్, ఫార్మల్... ఇలా వేర్వేరు సందర్భాలకు తగ్గట్టు వేర్వేరు ఔట్‌ఫిట్స్, బ్యాగ్స్ ఎంచుకోవాలి. పెద్ద సైజు బ్యాగులు క్యాజువల్ అకేషన్స్‌కు సూటయితే, ఫార్మల్ అకేషన్లకు చిన్న బ్యాగులు మ్యాచవుతాయి. అలాగే....



- **షాపింగ్:** టీ షర్ట్, షార్ట్స్, స్నీకర్స్... ఈ డ్రస్‌లో షాపింగ్‌కు బయల్దేరితే పెద్ద సైజు హోబో లేదా డఫుల్ బ్యాగు ఎంచుకోవాలి. స్కిన్నీ జీన్స్ మీదకు హోబో లేదా టోట్ బ్యాగ్, సమ్మర్ డ్రస్, శ్యాండిల్స్ వేసుకుటే స్లింగ్ బ్యాగ్ ఎంచుకోవాలి.
- **ఆఫీసు:** చీర కడితే హ్యాండీగా ఉండే షోల్డర్ బ్యాగ్ సరిపోతుంది. అదే చుడీదార్ వేసుకుంటే స్లింగ్ బ్యాగ్ లేదా మరీ పెద్దది, చిన్నదిగా కాకుండా మధ్యస్తంగా ఉండే హ్యాండ్ బ్యాగ్ ఎంచుకోవాలి. ఒకవేళ ట్రౌజర్స్ ధరిస్తే బాక్సీ బ్యాగ్, హై వెయిస్ట్ ట్రౌజర్లు, కార్డిగాన్ ధరిస్తే శాచెల్ బ్యాగ్ ఎంచుకోవచ్చు.
- **బోర్డ్ రూమ్ మీటింగ్:** ఈ సందర్భాల్లో అఫిషియల్ లుక్ కోసం హోబో, డఫుల్‌లకు బదులు టాప్ హ్యాండిల్ టోట్ లేదా బ్రీఫ్ కేస్ బ్యాగ్ ఎంచుకోవాలి.
- **ఫార్మల్ ఈవెంట్లు:** లాంగ్ గౌన్ లేదా కాక్‌టెయిల్ డ్రస్ వేసుకుంటే క్లచ్ ఎంచుకోవాలి. ట్రెండీ లుక్ కోసం సెక్విన్, మెటాలిక్ లుక్ ఉండే ఎన్వలప్ క్లచ్ క్యారీ చేయాలి.

చర్మం పొడిబారిందా?

బ్యూటీ



చలికాలం చర్మం పొడిబారి కళావిహీనంగా తయారైందా? చర్మం తగినంత తేమగా లేకపోతే ఇలాగే డ్రైగా తయారవుతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి.

- స్నానం చేసిన వెంటనే తడి పొడి చర్మం మీదే మాయిశ్చరైజర్ అప్లై చేయాలి.
- చర్మాన్ని తేమగా ఉంచే మాయిశ్చరైజింగ్ సబ్బులే వాడాలి.
- రోజుకి 8 నుంచి 10 గ్లాసుల నీళ్లు తాగడం తప్పనిసరి.
- చలిగా ఉంది కదా! అని స్నానం చేయడం మానకూడదు. స్నానంతో మృత చర్మకణాలు వదిలి చర్మం మెరుగవుతుంది.
- స్నానానికి మరీ చల్లని లేదా మరీ వేడి నీళ్లు వాడకూడదు.
- శనగపిండి, ముల్తానీ మట్టిలతో ఫేస్ ప్యాక్ వేసుకోవడం వల్ల పొడిచర్మం మరింత పొడిబారుతుంది.
- ప్రతిరోజూ మాయిశ్చరైజర్ అప్లై చేసిన తర్వాత దాని మీద సన్‌స్క్రీన్ అప్లై చేసుకోవాలి.
- గ్లిజరిన్, నిమ్మరసం, రోజ్‌వాటర్ సమపాళ్లలో కలిపి ముఖం, చేతులు మీద పూసుకుని ఆరిన తర్వాత కడిగేసుకుంటే చర్మం తేమగా మారుతుంది.
- బొప్పాయి, అరటి గుజ్జులతో ముఖం మర్దనా చేసుకున్నా చర్మం తేమగా మారుతుంది.

ఫ్యాషన్

జీన్స్ జోష్



ఏదో ఒక రకం జీన్స్‌తో సర్దుకుపోయే రోజులు పోయాయి. రకరకాల మోడల్స్‌లో, మోడర్న్ స్టైల్స్‌లో ఎన్నో రకాల జీన్స్ నేడు అందుబాటులోకొచ్చాయి. వాటిలో నప్పేవీ, ట్రెండ్‌ను సృష్టించేవీ ఎంచుకోవాలి.

స్కిన్నీ, బూట్‌కట్, హై రైజ్, లో రైజ్, బాయ్ ఫ్రెండ్, మామ్, వైడ్ లెగ్, ఫ్లేర్డ్, డిస్ట్రెస్డ్, స్ట్రెయిట్... ఇలా ఎంచుకోడానికి ఎన్నో రకాల జీన్స్‌లు ఉన్నాయి. ఎత్తు, శరీరాకృతికి తగ్గట్టు రకరకాల షేపుల్లో దొరికే ఈ జీన్స్ ప్యాంట్స్‌ను ఆకర్షణీయమైన టాప్స్‌తో మ్యాచ్ చేసినప్పుడే జీన్స్ లుక్ నలుగురినీ కట్టిపడేయగలుగుతుంది.


బాడీ టైప్: నలుచదరాకారపు శరీరాకృతికి, స్ట్రెయిట్ కట్ జీన్స్ ఎంచుకోవాలి. ఇన్వర్టెడ్ ట్రయాంగిల్ బాడీకి పెద్ద జేబులున్న స్ట్రెయిట్ కట్ జీన్స్ బాగుంటాయి. త్రికోణాకారపు బాడీకి వైడ్ లెగ్స్‌తో కూడిన లూజ్ జీన్స్ బాగుంటుంది. అండాకారంలో ఉండే శరీరాకృతికి హై రైజ్ స్ట్రెయిట్‌కట్ జీన్స్ నప్పుతాయి.

యాక్సెసరీస్: జీన్స్‌తో మెటల్ జ్యువెలరీ సూటవుతుంది. స్టడ్స్, బ్రేస్‌లెట్స్ బాగుంటాయి. పాయింటెడ్ హీల్స్, బూట్స్, స్పోర్ట్స్ షూ ఏవైనా జీన్స్‌కు సూటవుతాయి. బూట్‌కట్ జీన్స్‌కు బ్లంట్ హీల్స్ బాగుంటాయి. డైలీ వేర్‌గా జీన్స్ వేసుకునేవాళ్లు స్పోర్ట్స్ షూస్ వేసుకోవచ్చు. ఫ్యాన్సీగా కనిపించాలంటే లో వెయిస్ట్ జీన్స్‌కు, బోల్డ్‌గా కనిపించే బెల్ట్ పెట్టుకోవాలి.



డిఫరెంట్ షేడ్స్

జీన్స్ అనగానే బ్లూ జీన్స్ కళ్ల ముందు మెదులుతుంది. అయితే నలుపు, బూడిద రంగు.. ఇలా ఎన్నో రంగుల్లో జీన్స్ తయారవుతున్నా, నీలం రంగుకే పెద్ద పీట వేస్తూ ఉంటాం. అయితే నీలంలో ఎన్నో రకాల షేడ్స్ ఇప్పుడు దొరుకుతున్నాయి. వాటిలో నప్పే రంగును ఎంచుకోవాలి. భిన్నంగా ప్రయత్నిస్తూ ఉండాలి.



కేశినేని నాని వైసీపీ కోవర్టు!

- విజయసాయి రెడ్డితో ఆయనకు పరిచయం
- నానిని తిట్టమని చంద్రబాబు చెప్పలేదు
- నా మనవళ్లపై ప్రమాణం చేసి చెబుతున్నా బాబు ఆగమన్నారనే ఇన్నాళ్లు ఆగా: బుద్దా వెంకన్న


మనవళ్లపై ప్రమాణం చేస్తున్న బుద్దా వెంకన్న

విజయవాడ(వన్ టౌన్), జనవరి 10: 'విజయసాయి రెడ్డితో కేశినేని నానికి ఎప్పటి నుంచో పరిచయం ఉంది. కేశినేని నాని వైసీపీ కోవర్టు. నానిని తిట్టమని చంద్రబాబు ఆదేశించలేదు. వాస్తవానికి నేను నానిపై విమర్శలు చేస్తే చంద్రబాబు మందలించారు. కేశినేని నానిపై ప్రెస్‌మీట్ పెట్టమని చంద్రబాబు చెప్పలేదు. నా మనవళ్లపై ప్రమాణం చేసి చెబుతున్నా' అని టీడీపీ సీనియర్ నేత బుద్దా వెంకన్న తన మనవళ్లపై ప్రమాణం చేశారు. బుధవారం విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఏంట్రా నాని?' అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. క్యారెక్టర్ లెస్ కేశినేని నాని ఏదేదో మాట్లాడుతున్నాడని వ్యాఖ్యానించారు. చంద్రబాబు రెండుసార్లు నానిని ఎంపీ చేశారని, అయినా కృతజ్ఞత లేదన్నారు. 'బుద్దా వెంకన్న చంద్రబాబు కాళ్లు మొక్కుతాడని కేశినేని అంటున్నారు. ఇవాళ నాని జగన్ కాళ్లు మొక్కాడు. చంద్రబాబు చాంబర్ గెడ పెట్టి మరీ కేశినేని నాని ఆయన కాళ్ల మీద పడ్డారు' అని వెంకన్న విమర్శించారు. 'చంద్రబాబును తిట్టిన వాళ్లను నేను తిట్టకుండా ఆగను. చంద్రబాబు ఆగమన్నా ఆగను. కేశినేని నాని సినిమా ఇకపై ఉంటుంది. సొంత తమ్ముడు కేశినేని చిన్ని భార్య జానకి మీద కేసు పెట్టిన శాడిస్టు. వచ్చే ఎన్నికల్లో కేశినేని నాని గెలుస్తాడా? గెలిస్తే నా బుద్దా భవన్ ఇచ్చేస్తా. ఓడితే కేశినేని భవన్ నాకిచ్చేస్తారా?' అని సవాల్ విసిరారు. చంద్రబాబును తిట్టిన వల్లభనేని వంశీ, కొడాలి నానిలపై ఒక్క మాటైనా మాట్లాడారా? అని నిలదీశారు. 'చంద్రబాబు మోసగాడైతే.. లోకేశ్‌కు అర్హత లేకుంటే ఇన్నాళ్లు కేశినేని నాని ఎందుకు చెప్పలేదు? కాళ్లు పట్టుకోవడం కేశినేని నానికి అలవాటే.. ఇప్పుడు కాళ్లు మారాయంతే. లావుగా ఉన్నానని, తనకేదో ఆకారం ఉందని అనుకుంటున్నాడు. నానిది ఆకారం కాదు.. వికారం' అని బుద్దా వెంకన్న ధ్వజమెత్తారు. పిచ్చి కుక్క కంటే దారుణంగా ప్రవర్తిస్తున్న కొడాలి నానికి, మరో ఐదుగురికి పిచ్చి తగ్గడానికి తన సొంత డబ్బుతో కుక్క కాటు ఇంజక్షన్లు కొని త్వరలో పంపిస్తానని బుద్దా చెప్పారు. త్వరలో ఎన్టీఆర్ వర్ధంతిని భారీ స్థాయిలో నిర్వహించబోతున్నామని, ఆ కార్యక్రమంలో పిచ్చి కుక్క నాని స్వైరవిహారం చేసే అవకాశం ఉంది కాబట్టి ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జగన్‌రెడ్డి పెద్ద 420 అయితే కొడాలి నాని 840 అని విమర్శించారు. జగన్‌రెడ్డి కావాలనే దళితులు, బలహీన వర్గాల వారిని అణిచివేస్తున్నారన్నారు.

కేశినేని నానిది దిగజారుడు: దేవినేని ఉమా

అమరావతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నష్టాలు రావడంతోనే కేశినేని నాని ట్రావెల్స్ వ్యాపారం వదులుకున్నారని, ఆస్తులు అమ్ముకుంది ఆ నష్టాల నుంచి బయటపడటానికేనని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. వాటిని టీడీపీకి, చంద్రబాబుకు ఆపాదించడం దిగజారుడుతనమేనని విమర్శించారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు పడుతున్న కష్టం చూసి తామంతా పార్టీ కోసం మౌనంగా అవమానాలు భరిస్తే, కేశినేని నాని మాత్రం ప్రోటోకాల్ పిచ్చితో ఇష్టానుసారం ప్రవర్తించాడన్నారు. లోకేశ్ యువగళం పాదయాత్రలో యువతకు చైతన్యం వచ్చి నేడు రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ సభలకు యువత కదిలివస్తుంటే నానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. 'కేవలం ఎంపీ పదవి కోసం ఇంత దిగజారి మాట్లాడాలా? నిన్నటి వరకు దుర్మార్గుడిగా కనిపించిన జగన్... ఇప్పుడు సన్మార్గుడిలా కనిపించారా?' అంటూ దేవినేని నిలదీశారు.

మాగుంట నా గడప తొక్కొద్దు!



ఆయన్ను పిలిపించి ఎందుకు మాట్లాడారు?

- విజయసాయిరెడ్డిపై జగన్ ఫైర్
- ఐప్యాక్ ప్రతినిధి రిషీ సింగ్‌పైనా!
- అలిగి జగన్‌ను కలవకుండానే హైదరాబాద్ వెళ్లిన బాలినేని

(ఒంగోలు-ఆంధ్రజ్యోతి)




వైసీపీ ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తన గడప తొక్కడానికి వీల్లేదని ముఖ్యమంత్రి జగన్ తెగేసిచెప్పారు. ఆయన టీడీపీలో చేరతారని వార్తలు వస్తున్నప్పటికీ.. ఆయన్ను తాడేపల్లికి పిలిపించి మాట్లాడిన ఎంపీ విజయసాయిరెడ్డిపైన, ఐప్యాక్ ప్రతినిధిపైన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది జరిగిన కొన్ని గంటలకే.. సీఎంను కలిసేందుకు విజయవాడలో వేచి ఉన్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అలిగి ఆయన్ను కలవకుండానే హైదరాబాద్ వెళ్లిపోయారు. రమ్మని ఫోన్ చేసిన విజయసాయిరెడ్డికి నో అని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌లను విలేకరుల సమావేశం పెట్టి మరీ విమర్శించాలని, రూ.180 కోట్లు డిపాజిట్ చేయాలని మాగుంటకు జగన్ షరతులు విధించడం, అందుకు ఆయన తిరస్కరించడం తెలిసిందే. సోమవారం సాయంత్రం మాగుంటను విజయవాడ పిలిచి ఐప్యాక్ ప్రతినిధి రిషీ సింగ్ చర్చలు జరిపారు. ఆ సందర్భంగా మీకెలాంటి షరతులూ పెట్టలేదని ఎంపీకి చెప్పారు. ఈ విషయం తెలిసి జగన్ మండిపడినట్లు తెలిసింది. బుధవారం మధ్యాహ్నం సీఎంను విజయసాయిరెడ్డి, ఐప్యాక్ ప్రతినిధి కలిశారు. మాగుంటను పిలిచి మాట్లాడడంపై జగన్ విరుచుకుపడ్డారు. ఈ వ్యవహారంతో తనకు సంబంధం లేదని.. ఐప్యాక్ ప్రతినిధే మాట్లాడారని విజయసాయిరెడ్డి వివరణ ఇచ్చారు. అయితే ఆయన సూచనతోనే తాము ముందుకెళ్లినట్లు ఐప్యాక్ ప్రతినిధి సీఎంకు చెప్పారని ప్రచారం జరుగుతోంది. దీంతో ఇద్దరిపై ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం.. 'ఆ ముగ్గురినీ విమర్శించని మాగుంట నా గడప తొక్కాల్సిన అవసరం లేదు. ఆయన స్థానంలో పూచికపుల్లను పెట్టయినా గెలిపించుకోగలను' అని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఇదే విషయం మాగుంటకు చేరవేయాలని ఆదేశించినట్లు సమాచారం. ఇది తెలిసి మాగుంట తీవ్రఅసంతృప్తికి గురైనట్లు తెలిసింది. ఇక తన దారి తను చూసుకోవాలనే ఆలోచనలో ఆయన ఉన్నట్లు సన్నిహితులు చెబుతున్నారు.

సీఎంను కలవని బాలినేని

ఇంకోవైపు.. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సీఎంను కలవకుండానే బుధవారం మధ్యాహ్నం విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లిపోయారు. సోమవారం సాయంత్రమే విజయవాడ వచ్చిన ఆయనకు మంగళవారం కూడా సీఎం నుంచి పిలుపురాలేదు. మంగళవారం మధ్యాహ్నం సీఎంవో అధికారి ధనుంజయరెడ్డిని కలిశారు. ఒంగోలులో ఇళ్ల పట్టాల పంపిణీకి భూసేకరణకు సీఎం ఇచ్చిన హామీ మేరకు నిధులు విడుదల విషయంపై మాట్లాడారు. బుధవారం ఉదయానికి నిధులు కలెక్టర్ అకౌంట్‌లో పడతాయని ధనుంజయరెడ్డి ఇదివరకే హామీ ఇచ్చినట్లు తెలిసింది. తన సీటు విషయాన్ని ఖరారు చేయక పోగా.. ఇస్తానన్న నిధులు కూడా ఇవ్వకపోవడంతో బాలినేని విసిగిపోయారు. బుధవారం మధ్యాహ్నం విజయసాయిరెడ్డి ఆయనకు ఫోన్ చేశారు. మాగుంట విషయాన్ని వదిలేయాలని.. కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో మీటింగ్‌లు పెట్టాలని జగన్ ఆదేశించారని చెప్పినట్లు తెలిసింది. 'నేను ఏ మీటింగ్‌కూ రాను.. మీ బాధలు మీరు పడండి.. నేను తిరిగి వెళ్లిపోతున్నాను' అని చెప్పి బాలినేని హైదరాబాద్ వెళ్లిపోయారు. అటు మాగుంట, ఇటు బాలినేని వ్యవహారం ముదురుపాకాన పడిన సమయంలో సీఎంవో నుంచి కొన్ని సంచలన ప్రతిపాదనలు బయటకు వచ్చాయి. ఒంగోలు ఎంపీగా మాగుంటకు బదులు వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డిని, ఒంగోలు అసెంబ్లీకి బాలినేని స్థానంలో చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను రంగంలో దింపాలని ప్రతిపాదించినట్లు ప్రచారం జరుగుతోంది. తాడేపల్లి నుంచే ఈ ప్రతిపాదనలు రావడం వైసీపీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. రానున్న రోజుల్లో మాగుంట, బాలినేని కలిసి ఉమ్మడిగా రాజకీయ నిర్ణయం తీసుకుంటారా.. మాగుంటను వద్దన్న సీఎం మరోసారి బాలినేనికి కబురు పంపుతారా అనేది వేచి చూడాలి.

బాబునే కాదు మాగుంటనూ తిట్టాల్సిందే

- ఆదాలకు విజయసాయి ద్వారా జగన్ ఆదేశం..!

ప్రతిపక్ష నేత చంద్రబాబును, లోకేశ్‌ను, పవన్ కల్యాణ్‌ను నోటికొచ్చినట్లుగా తిట్టాలని, కుటుంబ సభ్యులనూ తూలనాడాలంటూ కొంతమంది నేతలను జగన్ ఆదేశిస్తున్నారంటూ విస్తృత ప్రచారం జరుగుతోంది. ఇటీవల ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి ఇదే తరహా అనుభవం ఎదురైందని వైసీపీలోనూ, ఇతర రాజకీయపక్షాల్లోనూ విస్తృత ప్రచారం జరిగింది. ముఖ్యమంత్రి జగన్ విధించిన షరతుకు మాగుంట తలొగ్గనందునే ఆయనను తాడేపల్లి సీఎంఓలోకి అడుగుపెట్టనీయడం లేదని చెబుతున్నారు. సహజంగా ఇతర పార్టీల నేతలతో టచ్‌లో ఉన్నారన్న సందేహం ఉన్న ముఖ్య నేతలకు ప్రాంతీయ సమన్వయకర్తలతో... చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌లను దుర్భాషలాడాలంటూ ఆదేశాలు వెళ్తున్నాయని అంటున్నారు. తాజాగా ఇదే తరహా ఆదేశం ప్రాంతీయ సమన్వయకర్త వీ విజయసాయిరెడ్డి ద్వారా నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డికి కూడా వెళ్లిందని రాజకీయవర్గాల గుసగుస. చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌తో సహా మగుంట శ్రీనివాసులురెడ్డిని కూడా తిడుతూ మీడియా సమావేశం పెట్టాలని విజయసాయిరెడ్డి చెప్పినట్లుగా తెలిసింది. దానికి అదాల... 'నేను గౌరవప్రదంగా రాజకీయాలు చేసే వ్యక్తిని. ఎవరినీ దూర్భాషలాడబోను' అని తేల్చి చెప్పినట్లు రాజకీయవర్గాల సమాచారం.

మరో బీసీ బలి..!

- వైసీపీని వీడిన పద్మశాలి ఎంపీ సంజీవ్‌కుమార్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)


సీఎం జగన్‌ను కలిసిన ఎంపీ కేశినేని నాని, పక్కన వెలంపల్లి, అవినాశ్ తదితరులు

ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. వాస్తవానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ సిటింగ్‌లనే బలి చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీల్లో కొందరికి టికెట్లు నిరాకరిస్తున్నారు. ఇంకొందరి సీట్లు మారుస్తున్నారు. తాజాగా కర్నూలు ఎంపీ, పద్మశాలి సామాజికవర్గానికి చెందిన ఎస్.సంజీవ్‌కుమార్‌ను బయటకు పంపేశారు. ఇదే సమయంలో అగ్రవర్ణ కమ్మ సామాజిక వర్గానికి చెందిన విజయవాడ టీడీపీ ఎంపీని వైసీపీలోకి ఆహ్వానించారు. బుధవారం చోటు చేసుకున్న ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పనిగట్టుకుని మరీ వెనుకబడిన, బడుగు వర్గాల నేతలను అధికార పక్షం టార్గెట్ చేసిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాను దళిత ఎమ్మెల్యేనైనందునే.. అధికారపార్టీ పెద్దలు తనను తృణీకరిస్తున్నారని శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి బాహాటంగా విమర్శలు చేశారు. ఆమెను తాడేపల్లికి పిలిపించి సీఎం క్లాసు తీసుకున్నారు. అలాగే సీఎం దర్శనభాగ్యం తమకు కలగడం లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ ఇటీవల వాపోయారు. బీసీ నేత, పెనమలూరు ఎమ్మెల్యే మాజీ మంత్రి కొలుసు పార్థసారథి కూడా తనను ముఖ్యమంత్రి గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు టికెట్ నిరాకరించారు. మచిలీపట్నం ఎంపీ సీటుకు పోటీచేయాలని జగన్ సూచించారు. ఇందుకు ససేమిరా అన్న పార్థసారథి టీడీపీ వైపు చూస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. తాజాగా సంజీవ్‌కుమార్ కూడా వైసీపీకి గుడ్‌బై చెప్పారు. తెలుగుదేశం పార్టీలో చేరతారని తెలుస్తోంది.

సీఎంవోకు నాని..విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ బుధవారం ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. వైసీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, విజయవాడ తూర్పు అసెంబ్లీ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్, విజయవాడ సెంట్రల్ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాస్‌తో కలసి.. తాడేపల్లి సీఎంవోకు వెళ్లి జగన్‌ను కలిశారు. ఆయన్ను సీఎం వైసీపీలోకి ఆహ్వానించారు. జగన్‌కు కేశినేని గోధుమ రంగు కండువా కప్పి.. పుష్పగుచ్ఛం అందించారు. లోక్‌సభ సభ్యత్వానికి చేసిన రాజీనామాను స్పీకర్ ఆమోదించిన వెంటనే జగన్ సమక్షంలో వైసీపీలో చేరతానని ప్రకటించారు.

పాదయాత్ర చేసే హక్కు లోకేశ్‌కు లేదు: కేశినేని నాని

అనంతరం సీఎంవో వద్ద మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌పై విమర్శలు గుప్పించారు. పాదయాత్ర చేసేందుకు ఆయనకు ఏం హక్కు.. అర్హతలున్నాయని ప్రశ్నించారు. లోకేశ్ ఆఫ్టాల్ ఓడిపోయిన ఎమ్మెల్యే అని.. ఆయన పాదయాత్రలో గెలిచిన ఎంపీగా తానెలా పాల్గొంటానని అడిగారు. పార్టీ వనరులు, తాత పేరు, నాన్న పలుకుబడి వాడుకుని కూడా ఓడిపోయాడన్నారు. టీడీపీని భుజాలపై పెట్టుకుని మోశానని.. పార్టీ కోసం వ్యాపారాలను అమ్ముకున్నానని.. లోకేశ్ హెరిటేజ్‌ను అమ్ముకున్నాడా అని ప్రశ్నించారు. టీడీపీ, జనసేన కూటమికి 40 సీట్లు మించి రావన్నారు. 2013 జనవరి 16నుంచి విజయవాడ పార్లమెంటు ఇన్‌చార్జిగా కష్టపడుతున్నానన్నారు. జిల్లాలో అన్ని ఎన్నికల్లో కష్టపడ్డానని.. సొంత సామాజికవర్గానికి చెందిన చంద్రబాబును నమ్ముకుని డబ్బులు ఎందుకు పాడుచేసుకుంటున్నావని పలువురు ప్రశ్నించారని తెలిపారు. టీడీపీలో తనను అవమానించారని.. చంద్రబాబు జైల్లో ఉంటే ఆయన కుటుంబానికి అండగా నిలబడ్డానని అన్నారు. ఎంపీ పదవికి రాజీనామాను లోక్‌సభ స్పీకర్‌కు మెయిల్‌లో పంపుతానని చెప్పారు. పేదల పక్షపాతి జగన్ తనకు బాగా నచ్చాడన్నారు.

అభివృద్ధి చేయలేకపోయా

- ఎంపీ సంజీవ్‌కుమార్

స్వతహాగా వైద్యుడినైన తాను ప్రజలకు సేవ చేద్దామని రాజకీయాల్లోకి వచ్చానని కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్ అన్నారు. విజయవాడ స్టేట్ గెస్ట్ హౌస్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనను కర్నూలు లోక్‌సభ ఇన్‌చార్జిగా తొలగించడంతో మనస్తాపానికి గురయ్యానని తెలిపారు. తానెన్ని ప్రయత్నాలు చేసినా నియోజకవర్గ అభివృద్ధిని చేయలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు పదవులు ఇస్తున్నారని, కానీ వారి మాటకు విలువివ్వడం లేదన్నారు. అభివృద్ధి గురించి సీఎం వద్ద ప్రస్తావించగా.. అభివృద్ధి కోసం ఎమ్మెల్యేలు కష్టపడతారని.. ఎంపీలకెందుకని ఆయన అసహనం వ్యక్తం చేశారని చెప్పారు. కర్నూలులో వలసలు, ఆత్మహత్యలు ఆగాలని పోరాడానని తెలిపారు. అపాయింట్‌మెంట్ కోరినా సీఎం ఇవ్వలేదన్నారు. ఈ పరిస్థితుల్లో వైసీపీలో కొనసాగడం మంచిది కాదనుకున్నానని చెప్పారు.

వేల కోట్ల దోపిడీకి చెక్

(మొదటి పేజీ తరువాయి)

అప్పగించేందుకు జగన్ సర్కారు వ్యూహాలు పన్నింది. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ఇదివరకే వెలుగులోకి తీసుకొచ్చింది. అయితే, ఇవేవీ పట్టించుకోని ప్రభుత్వం తన ఇష్టానుసారంగా టెండర్లు పిలిచింది. అస్మదీయ అదానీ కంపెనీ సహా మరో రెండు ప్రైవేటు సంస్థలు బిడ్డింగ్‌లో పాల్గొన్నాయి. అయితే, ఇదే సమయంలో ప్రజా ప్రయోజన వాజ్యం(పిల్) రూపంలో తన ముందుకొచ్చిన పిటిషన్‌పై హైకోర్టు సత్వరమే స్పందించింది. టెండర్ల ఖరారును నిలిపివేయాలని ఆదేశించింది. అసలు బీచ్‌శాండ్ అంటే ఏమిటి? వాటిని మైనింగ్ చేయడం ద్వారా వచ్చే విలువ ఎంత? అదానీకి అప్పగించేందుకు జగన్ వ్యూహం ఏమిటో కాస్తా లోతుగా పరిశీలిస్తే అసలు విషయాలు తెలుస్తాయి.

బీచ్‌శాండ్ అంటే..

బీచ్‌శాండ్ అంటే.. సముద్రపు ఒడ్డున ఉండే నాణ్యమైన ఇసుక. ఇందులో ఆరు రకాల ఖనిజాలు ఉంటాయి. 1. ఇలిమినైట్. 2. రుటైల్, 3. జిర్కాన్, 4. గార్నెట్, 5. మోనజైట్, 6. సిలిమినైట్. వీటిని సాంకేతికంగా హై మినరల్స్‌గా పరిగణిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా వీటికి డిమాండ్ ఉంది. అన్నింటికంటే మోనజైట్‌కు ఎక్కువ డిమాండ్, విలువ కూడా ఉన్నాయి. దీనికి అణుదార్మికతను కలిగించే థోరియం శక్తి ఉంటుంది. థోరియంను అణువిద్యుత్ కోసం, ఇతర అణుధార్మిక శక్తుల సృష్టికి ఉపయోగిస్తారు. ఇంకా అణుబాంబు తయారీలోనూ ఇది కీలకపాత్ర పోషిస్తోంది.

రెండు చోట్ల బీచ్ మినరల్స్

రాష్ట్రంలో 900 కిలో మీటర్ల సముద్రతీరం ఉంది. ఇందులో శ్రీకాకుళం జిల్లా గారమండలం, విశాఖ జిల్లా భీమిలిలోని వెయ్యి హెక్టార్ల పరిధిలో బీచ్‌శాండ్ మినరల్స్ ఉన్నాయి. 1994-1995 మధ్య కేంద్ర ప్రభుత్వ అణుశక్తి విభాగం పరిధిలోని అటామిక్ మినరల్స్ డివిజన్ గార, భీమిలి మండలాల్లోని బీచ్‌శాండ్‌లో ఉన్న హెవీ మినరల్స్‌పై సమగ్ర అధ్యయనం చేసింది. ఆ నివేదిక ప్రకారం శ్రీకాకుళం జిల్లాలోనే 89,457 కోట్ల రూపాయల విలువైన మినరల్స్ ఉన్నాయి. విశాఖ జిల్లా భీమిలీ మండలంలోని తీరప్రాంతంలో 8,583 కోట్ల రూపాయల విలువైన హెవీ మినరల్స్ ఉన్నాయని తేల్చింది. వీటిపై మరింత అధ్యయనం, పరిశీలన చేయాలని ఆ నివేదిక పేర్కొంది. ఇది 1994-95లో జరిగిన సర్వే లెక్క. మరి ఇప్పుడు 30 ఏళ్లలో ఎన్నో మార్పులు వచ్చాయి. వాటి ధర ఎంతగా పెరిగి ఉంటుందో అంచనావేయడం కష్టం. పైగా, ఈ మినరల్స్ దేశ అంతర్గత భద్రత, ప్రాజెక్టులకు అవసరమని కేంద్రం గుర్తించింది.

2019లోనే నిషేధం

బీచ్‌శాండ్‌లోని అటామిక్ మినరల్స్, ఇతర ఖనిజాల అవసరం దేశానికి ఎంతో అవసరమని కేంద్రం గుర్తించింది. ఈ నేపథ్యంలో 2019లో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రైవేటు కంపెనీలు బీచ్‌శాండ్ మైనింగ్ చేయడానికి వీల్లేదని నిషేధం విధించింది. ఈ మేరకు 2019, మార్చి 1న ప్రైవేటు మైనింగ్‌ను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వంలోని మైనింగ్ విభాగం డైరెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. బీచ్‌శాండ్ మైనింగ్ కేవలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, వాటి పరిధిలోని విభాగాలే చేయాలని కేంద్ర గనుల శాఖ జాయింట్ సెక్రెటరీ 2019 మార్చి 1న ఆదేశాలు ఇచ్చారు.

అదానీ కన్ను

ఏపీలోని జగన్ సర్కారు వ్యాపార వేత్త అదానీకి సకల మేళ్లు చేసిపెడుతున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఏపీ బీచ్‌శాండ్ మైనింగ్ కూడా తనకు ఇవ్వాలని కోరారు. అంతే, డెవలపర్ పేరిట టెండర్‌లు పిలిచారు. ఏపీ బీచ్‌శాండ్‌పై ముందుగానే కన్నేసిన సంస్థ కేంద్రం విధించిన నిషేధం అమల్లో ఉండగానే రెండు కీలకమైన కంపెనీలను ఏర్పాటు చేసింది. ఏపీ కేంద్రంగా అల్లువియల్ హెవీ మినరల్స్ లిమిటెడ్, ఒడిశా కేంద్రంగా పూరీ నేచురల్ రిసోర్సెస్ లిమిటెడ్‌లను నెలకొల్పింది. ఈ రెండింటి వివరాలను 2022లోనే అదానీ గ్రూప్ ముంబై స్టాక్ ఎక్చేంజ్‌కి తెలిపింది.

దొడ్డిదారిలో డెవలపర్

ఎంఎండీఆర్ చట్టం ప్రకారం బీచ్‌శాండ్ మైనింగ్ చేస్తే ఏపీఎండీసీనే చేపట్టాలి. ఆ సంస్థకు అంత శక్తియుక్తులు లేవనుకుంటే జాయింట్ వెంచర్ కింద ప్రైవేటు సంస్థతో కలిపిచేయాలి. అప్పుడు ప్రాజెక్టులో ఏపీఎండీసీకి 74% వాటా, ప్రైవేటు సంస్థకు 26% వాటా ఉంటుంది. అందులోనూ మోనోజైట్ ఖనిజాన్ని ప్రైవేటు సంస్థ తవ్వి అమ్ముకోకూడదు. దాన్ని ఏపీఎండీసీకే అప్పగించాలి. కేంద్ర అణుశక్తి శాఖ సూచనల మేరకే ఆ ఖనిజంపై నిర్ణయాలు ఉంటాయి. అయితే, దీనికి విరుద్ధంగా ఏ పనిచేసినా అది చట్ట ఉల్లంఘన కిందకే వస్తోంది. తెలిసి తెలిసి ఎవరైనా చట్ట ఉల్లంఘనకుపాల్పడితే అది దేశభద్రతకు ముప్పు తీసుకొచ్చినట్లుగానే భావించాల్సి ఉంటుందని నిపుణులు సైతం హెచ్చరిస్తున్నారు. అయితే, జగన్ సర్కారుకు అదానీ కోరిక ముందు చట్టం, రూల్స్, నిబంధనలు పెద్ద విషయాలుగా కనిపించలేదు. ఎలాగైనా అదానీకి అప్పగించే ఉద్దేశంతో పెద్ద మాస్టర్‌ప్లాన్ వేశారు. మైనింగ్ ప్రైవేటుకు అప్పగిస్తున్నట్లుగా కాకుండా, 'మైనింగ్ ఏరియా డెవలపర్ కమ్ ఆపరేటర్' పేరిట ఆ సంస్థకు ఇద్దామనుకుని టెండర్లు పిలిచారు.

రంగంలోకి 3 కంపెనీలు

బీచ్‌శాండ్ మినరల్స్ డెవలపర్ ఎంపిక పేరిట పిలిచిన టెండర్లలో మూడు కంపెనీలు బిడ్లు దాఖలు చేసినట్లు తెలిసింది. వీటిలో అస్మదీయ అదానీకి సంబంధించిన కంపెనీ ఒకటి ఉన్నట్లు తెలిసింది. మిగిలిన రెండు ప్రైవేటు సంస్థలు ఉత్తరాదివేనని సమాచారం. నిజానికి సాంకేతిక బిడ్‌లను తెరచి కంపెనీల వివరాలను ఏపీఎండీసీ బుధవారమే ప్రకటించాల్సి ఉంది. అయితే, సరిగ్గా అదే సమయంలో టెండర్లను ఖరారు చేయవద్దంటూ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఈ టెండర్లలో తెరవెనక బాగోతాలు నడిపిన అధికారుల గుండెల్లో దడ మొదలైంది. దీనిపై స్పందించేందుకు గనుల శాఖ అధికారి నిరాకరించారు.

బిడ్లు ఖరారు చేయొద్దు: హైకోర్టు

బీచ్‌శాండ్ మైనింగ్ కార్యకలాపాలను ప్రైవేటు కంపెనీలకు అప్పగించే విషయంలో టెండర్ ప్రక్రియను కొనసాగించవచ్చని అయితే బిడ్లు ఖరారు చేయవద్దని ఏపీఎండీసీ, రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులుగా ఉన్న కేంద్ర గనులశాఖ కార్యదర్శి, కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ కార్యదర్శి, అణుధార్మిక మంత్రిత్వశాఖ కార్యదర్శి, ఏపీ కోస్టల్‌జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ మెంబర్ సెక్రెటరీ, రాష్ట్ర మైనింగ్‌శాఖ కార్యదర్శి, ఏపీఎండీసీ సీఎండీకి నోటీసులు జారీ చేసింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్. రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ జిల్లా భీమిలి, శ్రీకాకుళంజిల్లా గార పరిధిలో అణుధార్మిక బీచ్‌శాండ్ తవ్వకాలకు ప్రాజెక్ట్ డెవలపర్, ఆపరేటర్ ఎంపికకు ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ గత ఏడాది డిసెంబరు 14న జారీ చేసిన టెండర్‌ను సవాల్ చేస్తూ విశాఖపట్నానికి చెందిన జమ్మిశెట్టి వెంకట సత్యనారాయణమూర్తి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది అంబటి సుధాకర్ వాదనలు వినిపిస్తూ.. అణుధార్మిక శక్తి ఉన్న బీచ్‌శాండ్ మైనింగ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలే చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన టెండర్ ద్వారా ప్రైవేటు వ్యక్తులకు దీన్ని అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. బీచ్‌శాండ్ మైనింగ్‌కు అనుకూలమైన ప్రాంతాలను గుర్తించే అధికారం మాత్రమే ఏపీఎండీసీ, రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. టెండర్ ప్రక్రియను నిలువరించాలని అభ్యర్థించారు. ఏపీఎండీసీ తరఫున న్యాయవాది వీఆర్ఎన్ ప్రశాంత్ వాదనలు వినిపిస్తూ.. టెండర్ ప్రక్రియ ప్రాథమిక దశలోనే ఉందన్నారు. ఇప్పటికిప్పుడు బిడ్లు ఖరారు చేయడం సాధ్యపడదన్నారు. ఆయా ప్రైవేటు సంస్థలు ఏపీఎండీసీకి సహాయకారులుగా మాత్రమే వ్యవహరిస్తాయని తెలిపారు. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని అభ్యర్థించారు. ఇరు పక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. టెండర్ డాక్యుమెంట్‌ను పరిశీలిస్తే మైనింగ్ బాధ్యతలను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నట్లు అర్థం అవుతోందని వ్యాఖ్యానించింది.

సర్టిఫికెట్లపై సీఎం ఫొటో, నవరత్నాల లోగో

- ముద్రణపై వివరాలు సమర్పించండి: హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలకు జారీ చేసే కుల, స్థానికత, పుట్టుక తేదీ సర్టిఫికెట్లలో సీఎం జగన్ ఫొటో, నవరత్నాల లోగోను ముద్రించకుండా నిలువరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని, పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, గ్రామ-వార్డు సచివాలయాల ముఖ్య కార్యదర్శి, సాంఘిక సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. ఎస్సీ, ఎస్టీలకు జారీ చేసే కుల, స్థానికత, పుట్టుక తేదీ సర్టిఫికెట్లలో సీఎం ఫొటో, నవరత్నాల లోగోను ముద్రించడాన్ని సవాల్ చేస్తూ అమరావతి బహుజన సొసైటీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య హైకోర్టులో పిల్ వేశారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ వాదనలు వినిపిస్తూ... ఎస్సీ, ఎస్టీలకు జారీ చేసే సర్టిఫికెట్లు కేంద్ర హోం శాఖ మార్గదర్శకాలు, సాంఘిక సంక్షేమ శాఖ 1997లో ఇచ్చిన జీవో 58 నిబంధనలకు లోబడి ఉండాలన్నారు. గతంలో ప్రభుత్వం జారీ చేసే సర్టిఫికెట్లపై కేవలం జాతీయ చిహ్నాన్ని ముద్రించేవారన్నారు. ఫొటో, లోగోను ముద్రించకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు.

మీ ఇంటి నుంచే పార్శిల్ తీసుకెళ్తాం

- తక్కువ ధరకు, సురక్షితంగా ఆర్టీసీ కార్గో సేవలు: ఎండీ తిరుమలరావు

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): 'సంక్రాంతి పండుగకు పిండి వంటలు బంధువులకు పంపాలా? అయితే మీ ఇంటి కొచ్చి తీసుకెళతాం. వారి ఇంటికి అందజేస్తాం. అందుకు మీరు చేయాల్సింది ఒక్కటే. ఏపీఎస్ఆర్టీసీ లాజిస్టిక్ వెబ్ సైట్‌లోకి వెళ్లి డోర్ పికప్ బుకింగ్ చేసుకోవడమే' అని సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు చెప్పారు. విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో బుధవారం ఆయన 'డోర్ టూ డోర్ పికప్' కార్గోను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఏడాదికి 9 కోట్లు మాత్రమే ఆదయం వచ్చే కార్గోను ఆర్టీసీ 2017లో సొంతంగా ప్రారంభించడం వల్ల ఏడాదిలోనే 58.57కోట్లు టర్నోవర్ దాటిందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో డోర్ డెలివరీ ప్రారంభించడంతో రూ.169 కోట్లకుపైగా ఆదాయం పెరిగిందన్నారు. జనవరి 10నుంచి విజయవాడలో డోర్ పికప్ సర్వీసు కూడా మొదలు పెట్టామన్నారు. ఆర్టీసీ లాజిస్టిక్స్‌కు ఆదరణ పెరిగిందన్నారు. గత ఏడాది కొనుగోలు చేసిన 1500బస్సుల్లో ఆర్టీసీకి ఈ నెలాఖరున కొన్ని బస్సులు రాబోతున్నాయన్నారు. సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చి వెళ్లేవారు ఒకేసారి టికెట్ బుక్ చేసుకుంటే 10% రాయితీ ఇస్తామని, హైదరాబాద్‌కు వెయ్యి అదనపు బస్సులు తిప్పుతున్నట్లు తెలిపారు.

ఓటుకు నోటు కేసు విచారణ ఏప్రిల్‌కు వాయిదా

న్యూఢిల్లీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసు విచారణను సుప్రీంకోర్టు ఏప్రిల్‌కు వాయిదా వేసింది. ఓటుకు నోటు వ్యవహారంలో టీడీపీ అధినేత చంద్రబాబు పాత్రపై విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్ బుధవారం జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. తమకు మరికొంత సమయం కావాలని ప్రతివాది రేవంత్ రెడ్డి తరఫు న్యాయవాదులు విజ్ఞప్తి చేయడంతో కేసు విచారణను కోర్టు ఏప్రిల్‌కు వాయిదా వేసింది. ఓటుకు నోటు వ్యవహారంలో చంద్రబాబు పాత్రపై సీబీఐ విచారణ జరిపించాలని వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి 2018లో సుప్రీం కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

19వ తేదీ నుంచి కులగణన

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ నెల 19వ తేదీ నుంచి కులగణన చేపట్టనున్నట్లు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 28వ తేదీలోగా ఈ సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. ఫిబ్రవరి 15లోగా సమాచారాన్ని క్రోడీకరించి తుది నివేదిక రూపొందించాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో అధికారులకు సూచించింది. మొత్తం 20 అంశాలకు సంబంధించిన వివరాలను గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సేకరిస్తారని వెల్లడించింది. ఇప్పటికే రాష్ట్రంలో కులగణన రెండుసార్లు వాయిదాపడింది. అన్ని కలెక్టరేట్లలో కులసంఘాల ప్రతినిధులు, మేధావులు, విద్యావంతులు దీనిపై తమ సూచనలు, సలహాలు తెలియజేయవచ్చని తెలిపింది. కులగణనలో తహసీల్దార్లు నోడల్ అధికారులుగా వ్యవహరించాలని ఆదేశించింది.

మార్పుచేర్పులపై.. తెగని సీఎం కసరత్తు!

- మలి జాబితా నేడు ప్రకటించే చాన్సు
- తాడేపల్లికి తరలివచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు
- దర్శన భాగ్యం కల్పించని జగన్.. కర్నూలు ఎంపీకి మంత్రి జయరాం


అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ముందుగానే వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల జాబితాను వెల్లడిస్తామని ఆర్భాటంగా ప్రకటించిన సీఎం జగన్.. ఇప్పటికి 35 మంది అసెంబ్లీ, ముగ్గురు లోక్‌సభ అభ్యర్థులను మాత్రమే ఖరారు చేశారు. టికెట్లు దక్కని నేతలు, దక్కవని అధిష్ఠానం నుంచి సంకేతాలు అందుకున్నవారు.. పార్టీని వీడుతున్నారు. ప్రజల్లో తమపై వ్యతిరేకత లేదని.. ప్రభుత్వంపైనే ఉందని.. సీఎం తమను కనీసం మర్యాదకైనా పిలిపించి మాట్లాడడం లేదని.. తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లినా దర్శనమివ్వడం లేదని వారు ఆగ్రహంతో ఉన్నారు. రాజకీయాలతో సంబంధం లేని సీఎంవో అధికారి ధనుంజయరెడ్డితో, ప్రాంతీయ సమన్వయకర్తలతో మాత్రమే మాట్లాడి వెనుదిరగాల్సి రావడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు టీడీపీ, కాంగ్రెస్ వైపు చూస్తుండడంతో జగన్ ఆందోళన చెందుతున్నారు. బుధవారం ప్రకటిస్తామన్న జాబితాను గురువారం విడుదల చేసే అవకాశాలున్నాయని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. కాగా.. బుధవారం మంత్రులు గుమ్మనూరు జయరాం, గుడివాడ అమర్నాథ్, పలువురు ఎమ్మెల్యేలు సీఎంవోకు తరలివచ్చారు. ఎంపీ సంజీవ్‌కుమార్‌ను సాగనంపి.. కర్నూలు లోక్‌సభ అభ్యర్థిగా జయరాంను బరిలో దింపాలని జగన్ నిర్ణయించారని వైసీపీ నేతలు చెబుతున్నారు. ఆలూరు అసెంబ్లీ ఇన్‌చార్జిగా విరూపాక్షిని ఖరారు చేసినట్లు తెలిసింది. అంతకు ముందు విజయనగరం లోక్‌సభకు వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, విశాఖకు బొత్స ఝాన్సీ సహా పలువురు అభ్యర్థులను ఎంపిక చేసినట్లు విస్తృతంగా ప్రచారం జరిగింది. కానీ ఈ జాబితాను వైసీపీ ధ్రువీకరించలేదు. పెందుర్తి సిటింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను తొలగించి అక్కడ మంత్రి అమర్నాథ్‌కు అవకాశమిస్తారని ప్రచారం జరుగుతోంది. దీనికి బలం చేకూర్చే విధంగా వీరిద్దరూ కలిసి సీఎంవోకు రావడం గమనార్హం. బయటకు వచ్చిన తర్వాత అమర్నాథ్ మీడియాతో మాట్లాడారు. ఈ నెలలో రూ.2,500 కోట్లతో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయాల్సి ఉందని.. దీనిపై సీఎంతో చర్చించామని చెప్పారు. సీట్ల మార్పులపై చర్చేమీ జరగలేదన్నారు. పెందుర్తి, చోడవరంలలో ఏదో ఒక చోట తనను పోటీ చేయిస్తారన్నది ప్రచారం మాత్రమేనని చెప్పారు. తనకెలాంటి గాబరా లేదని.. తన భవిష్యత్‌ను జగన్ నిర్ణయిస్తారని.. వ్యాఖ్యానించారు. అంబటి రాయుడు వైసీపీకి రాజీనామా చేశాక.. ఆయన ఏ పార్టీలోకి వెళ్తే తమకేంటని ప్రశ్నించారు. జనసేనలో రాయుడు ఏం చేస్తాడో.. ఎన్నాళ్లుంటాడో చూద్దామన్నారు. తనను మండపేట నుంచి పోటీ చేయమన్నారని, తాను అక్కడే బరిలోకి దిగనున్నట్లు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చెప్పారు. బద్వేలు ఎమ్మెల్యే దాసరి సుధ, రాజానగరం, చోడవరం ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, కరణం ధర్మశ్రీ, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ కూడా సీఎంవోకు వచ్చారు.

వైసీపీని గెలిపించాల్సిన బాధ్యత మీదే

- వలంటీర్లకు మంత్రి ధర్మాన ప్రసాదరావు గీతోపదేశం

గుంటూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాల్లో అవకతవకలపై చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సమీక్షలు నిర్వహిస్తున్న సమయంలోనే గుంటూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు బరితెగింపు ధోరణితో వ్యవహరించారు. ఎన్నికల ప్రక్రియలో వలంటీర్ల మితిమీరిన జోక్యంపై విమర్శలు వెల్లువెత్తడంతో వారిని దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్ ఇప్పటికే ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే ఆ ఆదేశాలు లెక్కలోకి తీసుకోవాల్సిన అవసరం లేదనే ధిక్కార ధోరణితో మంత్రి రజనీతో కలసి ధర్మాన బుధవారం గుంటూరులోని విజ్ఞాన మందిరంలో రహస్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని వలంటీర్లను పిలిపించుకొన్న ధర్మాన వారినుద్దేశించి మాట్లాడారు. "వైసీపీ విజయం సాధించాలంటే మీ పాత్రే కీలకం... మీ పరిధిలో ఉన్న 50 ఇళ్లవారిని నయానో, భయానో అనుకూలంగా మార్చుకొని వైసీపీకి ఓటు వేయించాలి" అని గీతోపదేశం చేశారు. వైసీపీని గెలిపించుకోకపోతే ఇప్పుడు అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ రద్దవుతాయని వారికి చెప్పాలని సూచించారు. ఈ ఎన్నికల్లో టీడీపీ గెలిస్తే మీ ఉద్యోగాలూ ఉండవు, మా పదవులూ ఉండవంటూ బెదిరించారు. అలాగే గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేస్తున్న మంత్రి రజనీ విజయానికి అన్ని విధాలా సహకరించాలని హుకుం జారీ చేశారు. వార్డు సచివాలయ ఉద్యోగులు కూడా రావాలని ఆదేశించినప్పటికీ వారు పార్టీకి సంబంధించిన సమావేశానికి రాలేమని చెప్పినట్లు తెలిసింది. వలంటీర్లు కూడా కొంతమంది డుమ్మా కొట్టినట్లు సమాచారం.

బాబుకు భారీ ఊరట!



(మొదటి పేజీ తరువాయి)

తాము పేర్కొన్న విషయాలు ప్రాథమికమైనవి మాత్రమేనని, వాటికి ప్రభావితం కాకుండా సీఐడీ తన దర్యాప్తును స్వేచ్ఛగా కొనసాగించుకోవచ్చని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు బుధవారం తీర్పు వెలువరించారు. మరోవైపు మద్యం కేసులో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీనివాస్ శ్రీనరేశ్‌కు కూడా ఇవే షరతులతో ముందస్తు బెయిల్ మంజూరు చేశారు.

ఇవీ కేసులు.. రాజధాని అమరావతి మాస్టర్ ప్లాన్ డిజైనింగ్‌తో పాటు ఐఆర్ఆర్ ఎలైన్‌మెంట్ రూపకల్పనలో అక్రమాలు జరిగాయంటూ మంగళగిరి వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా 2022లో సీఐడీ కేసు నమోదు చేసింది. అలాగే ప్రజలకు ఉచితంగా ఇసుక పంపిణీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాకు నష్టం జరిగిందనే ఆరోపణలతో గనులశాఖ డైరెక్టర్, ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ ఎండి వెంకటరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీఐడీ ఇంకో కేసు పెట్టింది. మద్యం కంపెనీలకు అనుచిత లబ్ధిచేకూర్చేలా గత ప్రభుత్వ హయాంలో నిర్ణయాలు తీసుకున్నారంటూ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీఐడీ మరో కేసు నమోదు చేసింది. ఈ మూడు కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని చంద్రబాబు, మద్యం కేసులో కొల్లు రవీంద్ర, శ్రీనరేశ్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలు ఇటీవల విచారణకు రాగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, దమ్మాలపాటి శ్రీనివాస్, సిద్ధార్థ అగర్వాల్, నాగముత్తు, పోసాని వెంకటేశ్వర్లు, ఓ.మనోహర్‌రెడ్డి.. సీఐడీ తరఫున అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వు చేసిన న్యాయమూర్తి.. బుధవారం తన నిర్ణయాన్ని వెల్లడించారు.

న్యాయశాఖ సలహా మేరకే 'వాయిదా' చెల్లింపుల చాన్సు!

మద్యం కేసులో న్యాయమూర్తి స్పష్టీకరణ

నోట్ ఫైల్‌ను పరిశీలిస్తే న్యాయశాఖ ఇచ్చిన సలహా మేరకే ఎస్పీవై ఆగ్రోస్‌కు లైసెన్స్ ఫీజును వాయిదాల విధానంలో చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు స్పష్టమవుతోందని తీర్పులో న్యాయమూర్తి పేర్కొన్నారు. వాయిదాల విధానంలో లైసెన్స్ ఫీజు చెల్లించే విషయంలో అప్పటి ముఖ్యమంత్రి నేరుగా తీసుకున్నట్లు కనిపించడం లేదన్నారు. ప్రతిపాదనను కేబినెట్ ముందు ఉంచాలని ఆయన పేర్కొన్నారని.. హైకోర్టు ఉత్తర్వులు, న్యాయశాఖ సలహాకు అనుగుణంగా కేబినెట్ నిర్ణయం తీసుకుందని.. ఈ నేపథ్యంలో పిటిషనర్లకు నేరత్వం ఆపాదించడంపై రాష్ట్రప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని తెలిపారు. తీర్పులో ఇంకా ఏమన్నారంటే..

దురుద్దేశాలు ఆపాదించలేం..

నియమ నిబంధనలకు విరుద్ధంగా డిస్టిలరీలకు అనుమతి ఇచ్చే విషయంలో పిటిషనర్ల ప్రమేయాన్ని నిర్ధారించేందుకు ఎలాంటి ఆధారాలనూ కోర్టు ముందు ఉంచలేదు. ఈ నేపథ్యంలో వారికి దురుద్దేశాలు ఆపాదించడానికి వీల్లేదు. డిమాండ్ ఆధారంగా బేవరేజెస్ కార్పొరేషన్ వివిధ బ్రాండ్ల మద్యానికి ఆర్డర్ ఇస్తుందని, అధికారుల స్థాయిలో తీసుకునే నిర్ణయాలలో పిటిషనర్లకు ప్రమేయం ఉండదన్న సీనియర్‌న్యాయవాదుల వాదనతో ఏకీభవిస్తున్నాం. కార్పొరేషన్ రోజువారీ వ్యవహారాల్లో పిటిషనర్లు ఎలా జోక్యం చేసుకున్నారనే విషయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ఎన్నికైన ప్రభుత్వానికి తన సొంత విధానాన్ని కొనసాగించుకునే విశిష్ట అధికారం ఉంది. విధానం అమలు అక్రమం.. చట్టవ్యతిరేకం, దురుద్దేశపూరితం అయితే తప్ప ఆ విధాన రూపకర్తలకు ఉద్దేశాలు ఆపాదించడానికి వీల్లేదు.

- బార్లకు ప్రివిలేజ్ ఫీజు తొలగింపుతో ఉత్పన్నమయ్యే ఆర్థిక పర్యవసానాలపై ప్రశ్నలు లేవనెత్తడంతోనే అప్పటి ఎక్సైజ్ కమిషనర్ విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీనరేశ్‌ను కమిషనర్ పదవినుంచి బదిలీ చేశారు. తర్వాత బాధ్యతలు తీసుకున్న ఎంకే మీనా నుంచి వచ్చిన ప్రతిపాదన ఆధారంగానే బార్లకు ప్రివిలేజ్ ఫీజు తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్న శ్రీనరేశ్ తరఫు న్యాయవాది వాదనతో ఏకీభవిస్తున్నాం.

కేసు నమోదు జాప్యానికి కారణాలు చెప్పలేదు..

ప్రస్తుత ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చిన నాలుగేళ్ల తర్వాత కేసు నమోదు చేశారు. కొత్త పాలసీ తీసుకొచ్చే క్రమంలో పాత విధానంపై సమీక్ష జరిపి ఉండాలి. కేసు ఆలస్యంగా నమోదు చేయడానికి గల కారణాలను ప్రభుత్వం వివరించలేదు. పిటిషనర్లపై రాజకీయ కారణాలతో కేసు నమోదు చేశారా? వారిపై నమోదు చేసిన సెక్షన్లు చెల్లుబాటు అవుతాయా అనేదానిపై కోర్టు అభిప్రాయం వ్యక్తం చేయడంలేదు. కోర్టు ముందుంచిన వివరాలను పరిశీలిస్తే.. నేరంలో పిటిషనర్ల భాగస్వామ్యం ఉందనే ఆరోపణలు నిరూపించేందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నప్పుడు మాత్రమే సందేహించాలి తప్ప.. గత ప్రభుత్వాన్ని వేరే రాజకీయ పార్టీ నిర్వహించిందనే కారణంతో సందేహించడానికి వీల్లేదు. కేసు నమోదు చేయడానికి జరిగిన నాలుగేళ్ల జాప్యానికి కారణాలు వెల్లడించకపోవడాన్ని బెయిల్ మంజూరులో పరిగణనలోకి తీసుకోవచ్చు. చంద్రబాబు ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తున్నారు. ఎక్సైజ్ శాఖపై ఆయనకు ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగాగానీ ఏ నియంత్రణాలేదు. కేసుకు సంబంధించిన డాక్యుమెంట్లను ఆయన తారుమారు చేసినట్లు ఎలాంటి ఆధారం లేదు. అప్పటి ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర సైతం ఇప్పుడు అధికారంలో లేరు. మొదటి నిందితుడు శ్రీనరేశ్ సర్వీసు నుంచి పదవీ విరమణ చేశారు. కేసు డాక్యుమెంట్లన్నీ ప్రభుత్వం వద్దే ఉన్నాయి. పిటిషనర్లకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే.. దర్యాప్తుపై ఎలాంటి ప్రభావం చూపదు. నేర ఘటన 2014-17మధ్య చోటు చేసుకుంది. ఫిర్యాదు సైతం డాక్యుమెంట్ల ఆధారంగా చేసినందున వారిని అరెస్టు చేయాల్సిన అవసరం లేదు. వారికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తున్నాం.

స్కిల్‌పై సుప్రీం నిర్ణయం పెండింగ్‌లో..

అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ప్రకారం గవర్నర్ నుంచి ముందస్తు అనుమతి పొందకుండా కేసు నమోదు చెల్లుబాటు కాదని స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు వేసిన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టివేసింది. దీనిని సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నిర్ణయం పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో 17ఏపై అభిప్రాయం వ్యక్తం చేయడం సరికాదని భావిస్తున్నాం.

తప్పు జరిగినట్లు ఆధారాలు చూపించాలి

- ఏ కారణాలు లేకుండా విచారణలో మూడున్నరేళ్లు కాలయాపన
- ఇప్పుడు అరెస్టు చేసి ముందుకెళ్తామనడం సరికాదు
- ప్రతిపక్ష నేత ప్రభుత్వ డాక్యుమెంట్లను ట్యాంపరింగ్ చేయలేరు
- ఎందుకు అరెస్టు చేయాలో అర్థం కావడం లేదు
- ఐఆర్ఆర్ కేసులో హైకోర్టు కీలక వ్యాఖ్యలు

రాజధాని ఐఆర్ఆర్ ఎలైన్‌మెంట్ వ్యవహారంలో తప్పు జరిగినట్లు తప్పు జరిగినట్లు ప్రభుత్వం ప్రాథమిక ఆధారాలు చూపించాల్సి ఉందని న్యాయమూర్తి అన్నారు. గతంలో వేరే పార్టీ అధికారంలో ఉందని ప్రాథమిక సాక్ష్యాధారాలు లేకుండా అనుమానించలేమని స్పష్టం చేశారు. ఎలాంటి కారణం లేకుండా మూడున్నరేళ్లు ఈ కేసు విచారణపై ఆలస్యం చేశారని, మాజీ సీఎంకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు ఈ అంశం చాలన్నారు. 'అరెస్టు చేసే అధికారం ఒకటైతే.. అరెస్టును సమర్థించుకోవడం పూర్తిగా వేరే విషయం. అరెస్టు చేసే పోలీసు అధికారులు కచ్చితంగా సరైన కారణాలు చూపించాలి. ఒక వ్యక్తిని సరైన కారణాలు లేకుండా రొటీన్‌గా అరెస్టు చేయరాదు. అదుపులో తీసుకోవడం సీరియస్ అంశం. ఇది ఆయా పౌరుల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలపై ప్రభావం చూపుతుంది. ముందు అరెస్టు, ఆ తర్వాత ముందుకు వెళ్తామనడం సరైంది కాదు. ఇది పోలీసుల చేతికి ఆయుధం ఇచ్చినట్లు అవుతుంది. ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ వేసిన చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆయా శాఖలను నియంత్రించే అవకాశం ఆయనకు ఉండదు. ఆయన సాక్షులను, సాక్ష్యాధారాలను ప్రభావితం చేస్తారనడానికి ఎలాంటి కారణాలు కనపడడం లేదు. ఇదే దర్యాప్తు సంస్థ.. క్రైం నం. 29/2021 కేసు రిమాండ్ నివేదికలో.. చంద్రబాబు ఎక్కడకూ వెళ్లలేరని, ఆయన కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (ఎన్‌ఎస్‌జీ) పర్యవేక్షణలో జడ్ ప్లస్ భద్రతలో ఉన్నారని కోర్టు దృష్టికి తెచ్చింది. ఈ నేరం 2015 నుంచి 2019 మధ్య కాలంలో జరిగింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్న ఆ సమయంలో ఐఆర్ఆర్ ఎలైన్‌మెంట్‌కు సంబంధించిన పత్రాల ట్యాంపరింగ్ జరిగినట్లు కనపడడం లేదు. ఆయనకు బెయిల్ ఇస్తే దర్యాప్తునకు ఎలాంటి ఆటంకం కలుగదు. సంబంధిత డాక్యుమెంట్లు ఎలాగూ ప్రస్తుత ప్రభుత్వ అధీనంలో ఉన్నాయి. తదుపరి విచారణ కోసం చంద్రబాబును అదుపులోకి తీసుకుని విచారించాల్సిన అవసరం లేదు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఫిర్యాదు ఆధారంగా ప్రభుత్వం ఎలాంటి ఆధారాలు లేకుండానే చట్ట విరుద్ధంగా మూడున్నరేళ్ల పాటు రాజకీయంగా వేధించిందని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది వాదనలు వినిపించారు. సరైన సమయంలో ఎలాంటి ఫిర్యాదులు చేయకుండా ఆరేళ్ల తర్వాత ఇప్పుడు హడావుడి చేస్తున్నారని తెలిపారు. అధికారిక గెజిట్‌లో తుది మాస్టర్‌ప్లాన్ నోటిఫికేషన్ ఖరారు చేయలేదని, ఇది వివాదమే కాదన్నారు. ఈ ఫిర్యాదుకు సంబంధించిన లావాదేవీలన్నీ 2014-19 మధ్య కాలంలో జరిగాయి. వాటన్నిటికీ రికార్డులున్నాయి. మరి ఇప్పుడు చంద్రబాబును ఎందుకు అరెస్టు చేయాలో కోర్టుకు అర్థం కావడం లేదు. ఆయన కుమారుడు ఏబీఎన్, ఈటీవీలో ఇచ్చిన ఇంటర్వ్యూల్లో సాక్షులను ప్రభావితం చేసేలా మాట్లాడారని ప్రభుత్వం వాదించింది. అయితే ఈ ఇంటర్వ్యూ ప్రస్తుత నేరాలపై కాదని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది తెలిపారు. ఆయన ఇంటర్వ్యూ ఆధారంగా ముందస్తు బెయిల్ మంజూరుపై కోర్టు నిర్ణయం తీసుకోవడం లేదు. ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు సరైన కారణాలున్నాయి' అని స్పష్టం చేశారు.



ఉచిత ఇసుక పాలసీతో

బాబు లబ్ధి పొందినట్లు ఆధారాల్లేవు

అధికారుల వైఫల్యానికి విధాన రూపకర్తలను బాధ్యులను చేయలేం

హైకోర్టు న్యాయమూర్తి వెల్లడి

'ఇసుక రీచ్‌లను అప్పటి అధికార పార్టీ నేతలు పంచుకున్నారనే ఆరోపణలు తప్పితే ఉచిత ఇసుక విధానం ద్వారా ఫలానా వ్యక్తులు లబ్ధి పొందినట్లు నిర్దిష్ట వివరాలను సీఐడీ సమర్పించలేకపోయింది' అని న్యాయమూర్తి పేర్కొన్నారు. ప్రభుత్వ జీవోలు, మెమోలను పరిశీలిస్తే ఉచిత ఇసుక విధానం అధికార పార్టీ నేతల ప్రయోజనాల కోసం, ఎమ్మెల్యేలకు అనుకూలంగా తీసుకొచ్చినట్లు కనిపించడం లేదన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల నిర్మాణ అవసరాల తీర్చాలనేది ఈ విధానం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. 'ప్రభుత్వ విధాన నిర్ణయాలను అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. ఇసుక అక్రమ తవ్వకాలను నిలువరించడంలో అధికార యంత్రాంగం విఫలమైతే.. అందుకు విధాన రూపకర్తలను బాధ్యులను చేయడానికి వీల్లేదు. 2016-19 మధ్య ఇసుక అక్రమ తవ్వకాలపై రాష్ట్ర ప్రభుత్వం వెయ్యికి పైగా కేసులు నమోదు చేసి.. రూ.40 కోట్లను జరిమానాగా రాబట్టింది. దీనిని బట్టి చూస్తే ఇసుక అక్రమ తవ్వకాలపై అప్పటి ప్రభుత్వం కఠినంగా వ్యవహరించినట్లు అర్థమవుతోంది. ఇసుక అక్రమ తవ్వకాల ద్వారా పర్యావరణానికి జరిగిన నష్టాన్ని భర్తీ చేసేందుకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వద్ద రూ.100 కోట్లు డిపాజిట్ చేయాలని, ఆ సొమ్మును ఇసుక అక్రమ తవ్వకందారులు, బాధ్యులైన అధికారుల నుంచి వసూలు చేయాలని ఎన్‌జీటీ ఆదేశించింది. అక్రమ తవ్వకాలకు తావు లేకుండా ప్రభుత్వ పాలసీని అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొంది. ఈ ఆదేశాలను పరిశీలిస్తే ఉచిత ఇసుక పాలసీతో అక్రమ మైనింగ్ చేసినట్లు ఎక్కడా లేదు. పాలసీ అమలులో లోటుపాట్లకు దాని రూపకర్తలను బాధ్యులను చేయడానికి వీల్లేదు. ఉచిత ఇసుక విధానం ద్వారా ఖజానాకు నష్టం కలిగించేలా కుట్ర చేశారనే ఆరోపణలు నిరూపించేందుకు ప్రభుత్వం ప్రత్యక్ష సాక్ష్యాధారాలను సేకరించలేదు. ఇసుక పాలసీకి సంబంధించి నిర్ణయం తీసుకుని రెండు నెలలు గడవక ముందే నిబంధనలకు విరుద్ధంగా ఉచిత విధానాన్ని తీసుకొచ్చారని ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఏ బిజినెస్ రూల్స్‌ను పాటించకుండా నిర్ణయం తీసుకున్నారో సీఐడీ కోర్టు ముందు ఉంచిన వివరాల్లో స్పష్టంగా పేర్కొనలేదు. కేబినెట్ తీర్మానం, 2016 మార్చిలో జారీచేసిన మెమోను పరిశీలిస్తే లాభనష్టాలపై అధ్యయనం చేయకుండా పూర్వ పాలసీని మార్చి ఉచిత విధానం తీసుకొచ్చారనేందుకు ఎలాంటి ప్రాథమిక ఆధారాలూ లేవు. ఎంత మొత్తంలో ఇసుక తవ్వి తరలించవచ్చో కేబినెట్ తీర్మానంలో స్పష్టత లేదని ప్రభుత్వం వాదిస్తోంది. అయితే సొంత నిర్మాణ అవసరాలకు మించి ఇసుక నిల్వ చేయడానికి వీల్లేదని తీర్మానంలో స్పష్టంగా పేర్కొన్నారు. ఉచిత ఇసుక పాలసీ నిర్ణయంతో పిటిషనర్ లబ్ధి పొందారనేందుకు సీఐడీ ఏ ఆధారాలనూ మా ముందుంచలేదు. నేరానికి పాల్పడినట్లు ప్రాథమిక ఆధారాలు సేకరించాల్సి ఉందని చెబుతోంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని చంద్రబాబుకు ముందస్తు బెయిల్ ఇస్తున్నాం' అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

సంక్రాంతికి టీడీపీ తొలి జాబితా!

20-25 స్థానాల్లో అభ్యర్థుల ప్రకటన

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ప్రధాన ప్రతిపక్షం టీడీపీ తన అభ్యర్థులపై కసరత్తు పెంచింది. సంక్రాంతి సమయానికి 20-25 మందితో కూడిన తొలి జాబితా విడుదల చేయాలని భావిస్తోంది. తొలి జాబితాలో పెద్దగా సంచలనాలేవీ ఉండబోవని, ఖాయంగా పోటీ చేసే నేతల పేర్లే ఉండే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కుప్పం నుంచి చంద్రబాబు, మంగళగిరి నుంచి లోకేశ్, టెక్కలి నుంచి అచ్చెన్నాయుడు వంటి వారి పేర్లు తొలిజాబితాలో ఉంటాయని తెలుస్తోంది. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో అన్ని సామాజిక వర్గాలకు సంబంధించిన వారికి ఉండేలా ఈ జాబితా కూర్పు ఉండబోతోందని పార్టీ వర్గాలు తెలిపాయి. తమ అంతర్గత కసరత్తు పూర్తయిన తర్వాత కొన్ని నియోజకవర్గాలపై ఆ పార్టీ నాయకత్వం ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతోంది. ఐవీఆర్ఎస్ విధానంలో ఆయా నియోజకవర్గాల్లో ఫోన్ సర్వే చేస్తున్నారు. పార్టీ సభ్యులతో ఒక సర్వే, సాధారణ ప్రజలతో మరో సర్వే చేస్తున్నారు. క్షేత్ర స్థాయి సర్వే కూడా చేయిస్తున్నారు. పండుగకు ముందు లేదా తర్వాత జాబితా విడుదల అయ్యే అవకాశముంది. షెడ్యూల్ విడుదలైన తర్వాత ఫిబ్రవరిలో మలి జాబితాలు వెలువడతాయని సమాచారం. కాగా, టీడీపీ అధినేత చంద్రబాబు ప్రస్తుతం 'రా.. కదలిరా' పేరిట రాష్ట్రవ్యాప్తంగా బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. 22 పార్లమెంటు నియోజకవర్గాల్లో 22 అసెంబ్లీ స్థానాల్లో వీటిని నిర్వహిస్తున్నారు. టీడీపీ టికెట్లు ఎవరికి లభించబోతున్నాయో ఈ సభల ద్వారా సంకేతాలు అందుతున్నాయి. బుధవారం వరకు చంద్రబాబు ఆరు రా.కదలిరా సభల్లో పాల్గొన్నారు. వీటిలో కనిగిరికి ఉగ్ర నరసింహారెడ్డి, తిరువూరుకు శ్యావల దేవదత్, ఆచంటకు పితాని సత్యనారాయణ, ఆళ్లగడ్డకు భూమా అఖిలప్రియ, బొబ్బిలికి బేబి నాయన, తునికి యనమల దివ్య ఇన్‌చార్జులుగా ఉన్నారు. వీరిలో దేవదత్ విషయంలో కొంత ఊగిసలాటలో ఉన్నా చివరకు ఆయన వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. వెంకటగిరిలో ఇన్‌చార్జిగా కురుగుండ్ల రామకృష్ణ ఉన్నారు. వీరందరికీ టికెట్లు లభించబోతున్నాయని పార్టీ వర్గాలు అంటున్నాయి.

సభలు ఇక్కడే

రాబోయే రోజుల్లో చంద్రబాబు పాల్గొనే రా.. కదలిరా సభలు జరగనున్న వాటిలో గుడివాడకు వెనిగళ్ల రామ్మోహన్, గంగాధర నెల్లూరుకు డాక్టర్ థామస్, కమలాపురం నియోజకవర్గానికి పుత్తా నరసింహారెడ్డి, అరకుకు దన్నుదొర, మండపేటకు వేగుళ్ల జోగేశ్వరరావు, పీలేరుకు నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి, ఉరవకొండకు పయ్యావుల కేశవ్, కోవూరుకు పోలంరెడ్డి దినేశ్ రెడ్డి, పత్తికొండకు కేఈ శ్యాంబాబు, గోపాలపురం నియోజకవర్గానికి మద్దిపాటి వెంకటరాజు, పొన్నూరుకు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, మాడుగులకు పీవీజీ కుమార్, టెక్కలికి కింజరాపు అచ్చెన్నాయుడు, ఉంగుటూరుకు గన్ని వీరాంజనేయులు, చీరాలకు కొండయ్య యాదవ్ ఇన్‌చార్జులుగా ఉన్నారు. వీటిలో గోపాలపురంలో వెంకటరాజును ఆ నియోజకవర్గంలో ఒక వర్గం గట్టిగా వ్యతిరేకిస్తోంది. చీరాలలో కొండయ్య యాదవ్ విషయంలో కొందరు నేతలు అసంతృప్తిగా ఉన్నారు. మాడుగుల సీటు విషయంలో కుమార్‌కు మాజీ ఎమ్మెల్యే రామానాయుడు, ప్రవాసాంధ్రుడు పైలా ప్రసాదరావు నుంచి పోటీ ఎదురవుతోంది. ఈ మూడు సీట్లలో అధినేత నిర్ణయం ఎలా ఉంటుందోనన్న ఆసక్తి పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

సత్తెనపల్లిలో 'కన్నా'నే అభ్యర్థి

- గెలుపే లక్ష్యంగా ఎంపిక.. శివరాం సహకరించాలి: అచ్చెన్నాయుడు

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా సత్తెనపల్లి అసెంబ్లీ స్థానంలో ఈసారి ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా కన్నా లక్ష్మీ నారాయణ పోటీ చేస్తారని, దీనిలో ఎటువంటి మార్పు లేదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు తేల్చిచెప్పారు. ఆ నియోజకవర్గ సమన్వయ కమిటీ విస్తృత స్థాయి సమావేశం బుధవారం ఉదయం ఇక్కడ ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగింది. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణతోపాటు పెద్ద సంఖ్యలో నియోజకవర్గ నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. దివంగత టీడీపీ సీనియర్ నేత డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు తనయుడు డాక్టర్ కోడెల శివరాం ఈసారి సత్తెనపల్లి టిక్కెట్టు తనకే రాబోతోందని ప్రచారం చేపట్టడంతో స్థానిక టీడీపీ నేతలు కొంత అయోమయానికి గురయ్యారు. ఆయనకు టికెట్టు ఖరారైందంటూ శివరాం అనుచరులు ఇటీవల టపాసులు కూడా కాల్చారు. ఈ నేపథ్యంలో ఈ అయోమయానికి తెరదించే లక్ష్యంతో ఆ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశాన్ని కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. 'దివంగత కోడెల టీడీపీలో సీనియర్ నేత. ఆయన పట్ల పార్టీలో అందరికీ అపారమైన గౌరవాభిమానాలు ఉన్నాయి. ఆయన కుటుంబానికి ఇతరత్రా అవకాశాలు తప్పక పార్టీ నాయకత్వం కల్పిస్తుంది. ఈ ఎన్నికల్లో అక్కడ ఉన్న పరిస్థితుల్లో సీటు గెలవాలన్న లక్ష్యంతో కన్నా లక్ష్మీ నారాయణను ఎంపిక చేశాం. పార్టీ కోసం పనిచేసి గెలిపించాలని శివరాంను కూడా కోరుతున్నాం. శివరాంతోపాటు అక్కడ టికెట్టు ఆశించిన నాయకులు అనేక మంది ఉన్నారు. వారంతా పార్టీ నిర్ణయాన్ని శిరసావహించి మద్దతు ఇస్తున్నారు. మిగిలిన వారు కూడా కలిసి రావాలని కోరుతున్నాం' అని అచ్చెన్నాయుడు ఈ సమావేశంలో అన్నారు.

సంక్రాంతికి సొంతూరికి చంద్రబాబు

చంద్రబాబు సంక్రాంతికి కుటుంబంతో కలిసి సొంతూరుకు వెళ్తున్నారు. పండగ సందర్భంగా ఈ నెల 14, 15 తేదీల్లో ఆయన తిరుపతి సమీపంలోని తన స్వగ్రామం నారావారిపల్లెలో గడపనున్నారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.



బొబ్బిలి సభకు హాజరైన జనం

తునిలో విల్లు ఎక్కుపెట్టిన చంద్రబాబు

- 'ఈ దేశంలోనే అతిపెద్ద పెత్తందారుడు జగనే. రూ.510 కోట్ల ఆదాయాన్ని అఫిడవిట్‌లో చూపిన జగన్ నిజంగా పేదోడే. ఆయనకు ఇల్లే కాదు.. చివరకు డ్రాయర్ కూడా లేదు. రోజా భిక్షం అడుగుతున్నాడు. అందులో వచ్చే డబ్బులతోనే తింటున్నాడు. ఆయనకు తల్లీ, చెల్లీ కూడా లేరు' - తుని సభలో చంద్రబాబు
- 'ఓటు అనే ఆయుధంతో వైసీపీ అరాచక పాలనకు అంతం పలుకుదాం. ఈ ఐదేళ్లలో మనల్ని రాతియుగం నాటి మనుషుల్లా మార్చేశారు. అన్యాయం, దౌర్జన్యం, అణచివేతలు, అరాచకాలు, అభివృద్ధి వినాశనం, భూ దందాలు, ఇసుక దందాలు, ప్రశ్నిస్తే కేసులతో పాలన సాగించారు. ఇంతటి దుర్మార్గ పాలనపై తిరగబడే రోజులు వచ్చాయి' - బొబ్బిలి సభలో చంద్రబాబు

జగన్ మళ్లీ వస్తే జనాలూ తాకట్టే

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ప్రసంగించారు. ఓటమి భయంతో ఎమ్మెల్యేలు, మంత్రులను నియోజకవర్గాల నుంచి తీసేస్తున్న జగన్ బీసీ, ఎస్సీ ఎమ్మెల్యేలనే బలిచేస్తున్నారని, సీఎం సామాజికవర్గ నేతలను ఎందుకు తప్పించడం లేదని ప్రశ్నించారు. సైకో జగన్ ఏం చెప్పినా రివర్స్‌లో అర్థం చేసుకోవాలన్నారు. పాసుపుస్తకాలు, సర్వే రాళ్లపై జగన్ బొమ్మలు వేస్తే ఆ కరుడుగట్టిన నేరస్థుడి ముఖాన్ని రోజూ ఇళ్లల్లో జనం చూడాలా.. ఇదెక్కడి అరాచకమని ప్రశ్నించారు.

సంక్రాంతి సంకల్పం ఇదే

'సీఎం జగన్ అహంకార వ్యక్తి. ఆ అహంకారమే జగన్ అంతానికి దారితీస్తుంది. ఒక్క చాన్స్ అని అధికారంలోకి వచ్చిన జగన్ నిత్యం ప్రజలను పిడిగుద్దులు గుద్దుతున్నాడు. ఈసారి ఆయన్ను చిత్తుగా ఓడించి బంగాళాఖాతంలో కలపాలి. ఈ సంక్రాంతికి ఒక్కటే సంకల్పం. జగన్ రాతియుగం పోవాలి. టీడీపీ, జనసేన స్వర్ణయుగం రావాలి. ఐదు కోట్ల జనం గెలవాలా.. సైకో జగన్ గెలవాలా ఆలోచించండి. టీడీపీ, జనసేన రాకతో రాష్ట్రంలో మళ్లీ పేదల రాజ్యం, సంక్షేమ రాజ్యం రాబోతోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకంతో ఆటోవాళ్లు భయపడొద్దు. వారిని కూడా ఆదుకుంటాం. మత్స్యకారులను దెబ్బకొట్టే 217 జీవోను తెచ్చిన జగన్‌కు బుద్ధి రావాలి అని అన్నారు.

జగన్ నకిలీ సీఎం...

'డ్రైవర్‌ను చంపిన ఎమ్మెల్సీను జగన్ పక్కన పెట్టుకుని తిరుగుతున్నాడు. అసలు జగన్‌కు సిగ్గుందా? జగన్ పాలనతో రాష్ట్రంలో ఎస్సీలకు రక్షణ లేకుండా పోయింది. ఎస్సీ, ఎస్టీలను ఆయన నీచంగా చూస్తారు. జగన్ అప్పుల అప్పారావులా మారాడు. రాష్ట్ర ఆదాయంతో సమానంగా అప్పులు, వడ్డీలు కడుతున్నాడు. అప్పులు పుట్టించడం కోసం రైతుబజార్లు, కలెక్టరేట్ కూడా తాకట్టు పెట్టేశాడు. అమరావతిని చంపేశాడు. మూడు ముక్కలు చేశాడు. మళ్లీ చెబుతున్నా అమరావతే ఏపీ రాజధాని. జగన్ నకిలీ ముఖ్యమంత్రి. కాపులకు రూ.10వేల కోట్లతో కార్పొరేషన్ అన్నాడు. ఏమైంది? ఆయన చెప్పేది ఒకటి చేసేది మరొకటి. నేరం చేసేది ఆయనే. ఆ నేరం ఇంకొకరిపై మోపేదీ ఆయనే. బాబాయ్‌ను హత్య చేసి గొడ్డలి పోటు అని నేరం మాపై మోపాడు. జగన్‌ను అందరూ అర్థం చేసుకున్నారు. ఎన్నికలు దగ్గరపడ్డంతో జగన్ కొత్త డ్రామా మొదలుపెట్టాడు. మాట్లాడితే పేదలు, పెత్తందార్ల మధ్య పోటీ అంటాడు. తప్పులు చేసి నేరం ఇంకొకరిపై మోపే వ్యక్తికి పాలించే అర్హత లేదు. ప్రశ్నిస్తే కేసులు. పోలీసులతో వేధింపులు. అందుకే ఏపీ హేట్స్ జగన్ హ్యాష్ ట్యాగ్ హోరెత్తిపోతోంది' అని అన్నారు. 'రాష్ట్రంలో జగన్ పాలనపై తీవ్ర వ్యతిరేకత ఉంది. భరించలేరని ప్రజలు నిర్ణయించేశారు. కానీ ఇది తెలియదన్నట్లు ఆయన మంత్రులు, ఎమ్మెల్యేలను మార్చేస్తున్నారు. ఇంకా 80మందిని మార్చుతాడంట. అంటే ఓటమిని అంగీకరించినట్టే. ఆ సీట్లు కూడా వైసీపీకి గోవిందా. ఎస్సీ, బీసీ ఎమ్మెల్యేలను మార్చుతున్న జగన్ మంత్రి పెద్దిరెడ్డిని ఎందుకు మార్చరు? ఇదేనా సామాజిక న్యాయం అంటే. జగన్‌కు బినామీ ఎమ్మెల్యే ద్వారంపూడి బియ్యంలో కోట్లు గడించారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు అవినీతికి లెక్కేలేదు. రాష్ట్ర విభజన సమయంలో జరిగిన నష్టం కంటే జగన్ పాలనతో రాష్ట్రానికి జరిగిన నష్టమే ఎక్కువ. రాజకీయాలకు అర్హత లేని వ్యక్తి. ఆయన వల్ల రాష్ట్రం బ్రాండ్ పోయింది. ఏపీ అంటేనే అంతా భయపడిపోతున్నారు. మెడపై కత్తిపెట్టి కాకినాడలో సెజ్‌లు, పోర్టులు కొట్టేశారు' అని చంద్రబాబు మండిపడ్డారు.

నేరస్తుడి బొమ్మ చూడాలా..

'జగన్ లాంటి కరుడుగట్టిన నేరస్తుడి బొమ్మ రోజూ రాష్ట్రంలో అందరూ చూడాలా? ఇంట్లో అన్నింటిపైనా ఆయన బొమ్మపెడతారా. ఏంటీ అన్యాయం.. ఏంటీ అరాచకం? జగన్ ప్రభుత్వం తెచ్చిన భూరక్షణ చట్టం చూస్తే మీ ఆస్తులపై మీకు హక్కులు ఉండవు. రాష్ట్రం అంతా జగన్‌దే అయిపోతోంది. మంత్రి ధర్మాన కూడా ఈ చట్టంపై ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. ఇది సమగ్ర భూరక్షణ చట్టం కాదు భూ భక్షణ చట్టం. అత్యంత ప్రమాదం. జగన్‌ను ఇంటికి పంపితేనే రాష్ట్రానికి మోక్షం. కరుడుగట్టిన ఇటువంటి వ్యక్తికి మళ్లీ అధికారం ఇవ్వొద్దు' అని చంద్రబాబు అన్నారు. 'విభజిత రాష్ట్రానికి దిశానిర్దేశం చేస్తూ అమరావతి రాజధానికి అంకురార్పణ చేశాం. రాష్ట్రంలోని వనరులను వినియోగించుకుని తెలుగుజాతి గర్వపడేలా ఎందులోనూ తీసిపోమని, ఓ ప్రణాళికతో ప్రపంచంలోనే రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దే విధంగా పునాదులు వేశాం. దురదృష్టవశాత్తు ఒక్క చాన్స్ పేరుతో సైకో పాలన వచ్చింది. అన్ని వ్యవస్థలను నాశనం చేశారు. రాష్ట్రాన్ని అధోగతిపాలు చేశారు. అనేక సంక్షేమ పథకాలను రద్దు చేశారు. రైతు, యువత, ఉద్యోగులు.. ఇలా అన్ని వర్గాల్లోనూ అశాంతిని రేపారు. బొబ్బిలి నుంచే అవినీతి పాలనపై గర్జిద్దాం. ఎంతోమంది ప్రముఖులను కన్న విజయనగరం గడ్డ వీరత్వానికి ప్రతీక. ప్రతిఒక్కరూ తాండ్రపాపారాయుల్లా గర్జించాలి. గురజాడ, కోడిరామ్మూర్తి, ఆదిభట్ల, సుశీల, ఘంటశాల వంటి ఎంతో మంది ప్రముఖులు నడయాడిన గడ్డ. వారు మనకు అందించిన వారసత్వాన్ని నిలబెడదాం. ఐదు కోట్ల మంది ఆంధ్రుల భవిష్యత్‌ను తీర్చిదిద్దుదాం. అమరావతిని రాజధానిగా, విశాఖను ఆర్థిక రాజధానిగా చేసుకుని స్వర్ణాంధ్ర సాధనకు నడుం బిగిద్దాం. రా కదలిరా..' అని బొబ్బిలి సభలో చంద్రబాబు పిలుపునిచ్చారు.

బూతులు తిట్టేవారికి సీట్లా

'ఎన్నికలు వస్తున్నాయి. వైసీపీలో బూతులు తిట్టేవారికి, తిట్లదండకం చేసే వారికే సీట్లు కేటాయిస్తున్నారు. వైసీపీ నాయకులు బూతుల్లో పద్మశ్రీ, రత్నశ్రీ, భూషణ్, పద్మ విభూషణ్, బూతు సామ్రాట్లుగా బిరుదులు పొందుతున్నారు. ఒక నియోజకవర్గంలో చెత్త ఎమ్మెల్యేగా పనిచేసిన వారిని వేరే నియోజకవర్గానికి పంపిస్తున్నారు. ఇక్కడ చెత్త ఎమ్మెల్యే వేరే నియోజకవర్గానికెళితే బంగారం అవుతారా? టీడీపీలో బీసీలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రభుత్వం వచ్చిన వెంటనే ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరిస్తాం. ఉద్యోగ భద్రత కోసం పోరాడుతుంటే ఎమ్మెల్యే శంబంగి అంగన్వాడీలకు ఒళ్లు బలిసిందా అంటూ బలిసిన వాఖ్యలు చేయడం దారుణం. జీతం పెంచాలని డిమాండ్ చేస్తే ఎస్మా ప్రయోగం చేశారు. ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు పెంచారు. మేము ఇసుక ఉచితంగా అందిస్తే నేరమని ఇప్పుడు కేసులు పెడుతున్నారు. ఇసుకను ఇష్టారాజ్యంగా అమ్ముకుంటున్నారు. అన్నం తింటున్నారా.. ఇసుక తింటున్నారా.. గడ్డి తింటున్నారా? అన్నా క్యాంటీన్లను మూసివేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే క్యాంటీన్లను మండల స్థాయి వరకు ఏర్పాటు చేస్తాం' అని అన్నారు.

ఉద్యోగాలు కల్పిస్తాం

'అధికారంలోకి వచ్చిన వెంటనే పరిశ్రమలకు అవకాశాలు కల్పిస్తాం. పరిశ్రమలు స్థాపించి ఉన్న ఊళ్లలో తల్లిదండ్రుల చెంతనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. యువగళం పేరుతో నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి అందిస్తాం. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించే బాధ్యత నాది. ఐటీ రంగంలో యువత అమెరికా వంటి ఇతర దేశాల్లో పనిచేసినా.. స్థానికంగానే పనిచేసేలా గ్రామాల్లో వర్క్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తాం. గతంలో ఐటీ రంగాన్ని హైదరాబాద్‌లో అభివృద్ధి చేసిన ఫలితంగానే నాకు కష్టం వచ్చినపుడు 80 దేశాల నుంచి ఐటీ తదితర రంగాల ఉద్యోగులు మద్దతు పలికారు' అని చంద్రబాబు ప్రకటించారు.

విశాఖ భూములు లూటీ చేశారు.

'విశాఖ భూములను లూటీ చేశారు. భోగాపురం విమానాశ్రయం, గిరిజన విశ్వవిద్యాలయం, భావనపాడు పోర్టు టీడీపీ హయాంలో శంకుస్థాపన చేసినవే. వీటికే మళ్లీ శంకుస్థాపన చేసి ఆరాచకాలు చేస్తున్నారు. ఓటర్లను తొలగించి అరాచక ఎన్నికలకు సిద్ధం అవుతున్నారు. ఇన్ని అభ్యంతరాలు, ఫిర్యాదులు ఏ రాష్ట్రంలోనూ లేవని కలెక్టర్లు, ఎస్పీలకు ఎన్నికల సంఘం హెచ్చరించింది. అరాచక పాలన నుంచి తిరిగి గాడిలో పెట్టేందుకు కృషి చేద్దాం. రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, ఉద్యోగాలు, ఉపాధి, నిరుద్యోగ సమస్య పరిష్కారం, పిల్లల భవిష్యత్ కోసం ప్రణాళికలు, సాగునీరు, బోర్లు, సోలార్ పంపుసెట్లు, అన్ని వర్గాల ప్రజల సంక్షేమ కార్యక్రమాలకు కంకణబద్ధులమని భవిష్యత్ గ్యారెంటీకి శపథం చేస్తున్నాం' అని చంద్రబాబు ప్రకటించారు.



మంత్రిని నిలదీస్తున్న గౌరిగానిపల్లి, వెంకటాపురం గ్రామాల ప్రజలు

రోడ్డు వేస్తేనే కదలనిస్తాం..!

- మంత్రి పెద్దిరెడ్డిని చుట్టుముట్టిన ప్రజలు
- దళితులమని చిన్నచూపు చూస్తున్నారా అని నిలదీత

హిందూపురం, జనవరి 10: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి నిరసన సెగ తగిలింది. తమ ఊర్లకు రోడ్డు ఎందుకు వేయలేదంటూ రెండు గ్రామాల ప్రజలు ఆయనను ఘెరావ్ చేసినంత పనిచేశారు. అధికారంలోకొచ్చి ఐదేళ్లవుతున్నా రెండు కిలోమీటర్ల రోడ్డు కూడా వేయలేరా.. అంటూ మంత్రి పెద్దిరెడ్డిని చుట్టుముట్టి నిలదీశారు. మీకు ఓటుతోనే బుద్ధి చెబుతామని మంత్రి ముఖానే చెప్పేశారు. హిందూపురం నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి పంచాయతీల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం లేపాక్షి మండలంలోని మానెంపల్లిలో సమావేశానికి పెద్దిరెడ్డి హాజరయ్యారు. అనంతరం స్థానిక సర్పంచ్ నిర్మలమ్మ ఇంటికి భోజనానికి వెళ్లారు. మానెంపల్లి పంచాయతీ పరిధిలోని గౌరిగానిపల్లి, వెంకటాపురం గ్రామాల ప్రజలు అక్కడికి చేరుకుని, నినాదాలు చేశారు. ఇంటి నుంచి బయటకు వచ్చిన మంత్రి పెద్దిరెడ్డిని చుట్టుముట్టారు. అధికారంలోకి వచ్చి ఐదేళ్లవుతున్నా తమ గ్రామాలకు 2 కి.మీ. రోడ్డు కూడా వేయలేకపోయారని మండిపడ్డారు. వెంకటాపురంలో దళిత విద్యార్థులు అధికంగా ఉన్నారని, అందుకే తమపట్ల చిన్నచూపు చూస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు లేకపోవడంతో రెండు కిలోమీటర్లు నడిచివెళ్లి బస్సు ఎక్కాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమస్య పరిష్కరించాలని, అప్పటిదాకా కదిలే ప్రసక్తేలేదని అన్నారు. మంత్రి పెద్దిరెడ్డి సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వారు ససేమిరా అన్నారు. చివరికి ఎన్నికల్లోపు గాని, ఆ తరువాతగాని తప్పకుండా రోడ్డు వేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. దీంతో వారు శాంతించి వెనుదిరిగారు.

రోడ్డుకు అడ్డంగా గోడ కట్టేశాడు!

- దొప్పలపూడిలో వైసీపీ నాయకుడి బరితెగింపు



దొప్పలపూడి గ్రామంలో రోడ్డుకు అడ్డంగా నిర్మించిన సిమెంటు గోడ

పొన్నూరు టౌన్, జనవరి 10: గుంటూరు జిల్లా పొన్నూరు మండలం దొప్పలపూడి గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మించారు. గ్రామంలో శివాలయానికి వెళ్లే వీధిలో ఓ వ్యక్తి ఇటీవల గోదాము నిర్మాణం చేపట్టారు. అయితే గోదాము భవనానికి సంబంధించిన మెట్లు పంచాయతీ రోడ్డులోకి వచ్చాయని సదరు వైసీపీ నాయకుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. తన సొంత స్థలంలోనే మెట్లు నిర్మించుకున్నానని, నిబంధనలు అతిక్రమించలేదని ఆ వ్యక్తి పంచాయితీ అధికారులకు సమాచారం ఇచ్చారు. అయినా కూడా మెట్ల నిర్మాణం తొలగించాల్సిందేనని ఆ నాయకుడు పట్టుబట్టారు. పంచాయతీ అధికారులు చెప్పినా వినిపించుకోకుండా శివాలయం నుంచి రామాలయం వెళ్లే వీధిలో రోడ్డుకు అడ్డంగా సిమెంటు గోడ నిర్మించారు. పంచాయతీ స్థలం ఆక్రమణకు గురైతే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి కానీ ఇలాంటి చర్యలకు దిగడమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రహదారిపై అడ్డంగా గోడ నిర్మించడం పట్ల గ్రామంలో నిరసన వ్యక్తమవుతోంది.

తప్పుల 'రాజు'



(మొదటి పేజీ తరువాయి)

తొక్కుతున్నారు. అనుచరుల ద్వారా అక్రమాలకు పాల్పడుతూ కోట్లు సంపాదిస్తున్నారు. నియోజకవర్గంలో అవినీతికి అంతులేకుండా పోతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా అక్రమాలు జరుగుతున్నాయి. విలువైన ప్రభుత్వ భూములు ప్రైవేటుపరం అవుతున్నాయి. అమాత్యుని అండదండలతో కొండలు సైతం కరిగి పోతున్నాయి. మట్టి మాఫియా తీవ్రస్థాయిలో రెచ్చిపోతోంది.

మందుల విక్రయాల్లో దందా

మంత్రి వైద్యరంగంలో తనకున్న అనుభవాన్ని ప్రజల సేవకు కాకుండా సొంత జేబు నింపుకోవడానికి ఉపయోగిస్తున్నారు. ఏ కంపెనీకి చెందిన మందులు వాడాలని రోగులకు సూచిస్తే ఏ మేరకు ఆదాయం ఉంటుంది? మందుల విక్రయాల ద్వారా ఎంత లాభాలు వస్తాయి? ఇతరత్రా విషయాలపై పట్టున్న వ్యక్తి. పైగా ఇప్పుడు మంత్రి కూడా. తన మాట చెల్లుబాటు అవుతుండటంతో 'తెలివితేటల'కు పదును పెట్టారు. తనకు చెందిన కంపెనీలోని ఔషధాలనే వినియోగించాలని పలు ప్రైవేటు ఆసుపత్రులకు, వైద్యులకు తనదైన శైలిలో అనుచరులతో పరోక్షంగా చెప్పించారట. దీంతో కొందరు మంత్రి మాట కాదనలేక ఆయన ఆదేశాలను పాటిస్తున్నారు. చివరకు మందుల విక్రయాల్లోనూ దందా సాగిస్తున్నారనే విమర్శలు తీవ్రంగా వస్తున్నాయి. ముంబైలో ఉన్న మంత్రికి చెందిన మందుల కంపెనీలో రూ.కోట్ల పెట్టుబడులు ఎవరు పెట్టారని టీడీపీతో పాటు స్వపక్షంలో విపక్షంగా ఉన్న వారు సైతం ప్రశ్నిస్తున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రైవేటు వైద్యులు ఈ కంపెనీ మందులే వినియోగించాలని ఒత్తిడి చేసి, తద్వారా రోగులకు నాసిరకమైన మందులు అంటగడుతున్నారని ఆరోపిస్తున్నారు.

కొండను కరిగించేశారు

నియోజకవర్గంలోని ఓ మండలంలో సుమారు 11 ఎకరాల విస్తీర్ణంలో కంకర కొండ ఉండేది. నాలుగున్నరేళ్లుగా మంత్రి అనుచరులు కొండ నుంచి మొత్తం కంకర తవ్వుకుని డబ్బులు సంపాదించుకున్నారు. దీంతో కొండ కనుమరుగైపోయింది. కంకర తవ్వకాల్లో కోట్లల్లో డబ్బులు చేతులు మారాయని ప్రచారం జరిగింది. మంత్రి పాత్రపై తెలుగుదేశం నాయకులు ఆందోళన కూడా చేపట్టారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారం చేతిలో ఉండటంతో ఆయనపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. కంకరను తాము అమ్ముకోలేదని, పేద ప్రజల ఇళ్ల స్థలాలను చదును చేశామని మంత్రితో పాటు ఆయన అనుచరులు అధికారులకు వివరణ ఇచ్చుకున్నారు. ఇళ్ల స్థలాల విషయం సరే కానీ కంకర ఎక్కడికెళ్లిందంటే వారి నుంచి సమాధానమే లేదు.

కంకర తవ్వి కోట్లు

నియోజకవర్గంలో జంట పట్టణాలకు సమీపంలో మంత్రి అనుచరులు 60ఎకరాలకు పైగా కంకరను తవ్వుకున్నారు. ఆ ప్రాంతంలో ప్లాట్లు వేసుకొని రూ.20 కోట్లకు పైగా కూడబెట్టుకున్నారనే ప్రచారం ఉంది. దీంతో పాటు జగనన్న కాలనీకి సమీపంలోని కొండను పూర్తిగా కరిగించి కంకర అమ్ముకున్నారు. ఒక్క ఈ కొండ నుంచే రూ.10కోట్లకు పైగా చేతులు మారాయనే ఆరోపణలు ఉన్నాయి. నియోజకవర్గంలోనే మరో మండలంలో ఉన్న కంకర కొండను పూర్తిగా కరిగించారు. ఇక్కడ కూడా రూ.10 కోట్ల విలువైన కంకరను అమ్ముకున్నారు. ఈ అక్రమాల వెనుక మంత్రి హస్తం ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రతి దందాలో మంత్రికి వాటా వెళ్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. సముద్రం ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. నియోజకవర్గంలో విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. అనేక గిరిజన గ్రామాల్లో పట్టాలు మార్పిడి చేసి భూసంతర్పానికి శ్రీకారం చుట్టారు. వంద ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయి. పట్టాదారు పాసుపుస్తకాల్లో సైతం పేర్లు మారిపోయాయి.

ఉద్యోగాలు అమ్ముకుని సొమ్ము

కిడ్నీ పరిశోధన కేంద్రం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఉద్యోగాలను అమ్ముకుని మంత్రి సొమ్ములు చేసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. తన అనుచరుల ద్వారా ఒక్కో పోస్టుకు రూ.6 నుంచి రూ.10 లక్షలు దాకా వసూలు చేసినట్లు తెలుస్తోంది. డబ్బులు తీసుకుని అర్హత లేని వారికి కూడా ఉద్యోగాలు ఇప్పించారు. చివరకు అంగన్వాడీ కార్యకర్తల భర్తీలోను మంత్రి తన అనుచరుల ద్వారా చేతివాటాన్ని ప్రదర్శించారని సొంత పార్టీ కార్యకర్తలే చెబుతున్నారు.

టీడీపీ నేతలు టార్గెట్

మంత్రి అనుచరులు ప్రైవేటు ఆస్తుల్లో సైతం ప్రవేశించి భారీగా దండుకున్నారనే ప్రచారం ఉంది. రౌడీలు, గూండాలకు ఆశ్రయం కల్పించి తెలుగుదేశం నాయకుల్ని టార్గెట్ చేసినట్టు తీవ్ర విమర్శలు వచ్చాయి.

సొంత పార్టీలోనే వ్యతిరేకత

మంత్రి వ్యవహార శైలితో సొంత పార్టీ కార్యకర్తలే విసిగిపోతున్నారు. ఇప్పటికే చాలామంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరిపోయారు. కొందరు నేతలు ఇదివరకే మంత్రి అరాచకాలపై ముఖ్యమంత్రికి కూడా ఫిర్యాదు చేశారు.

ఉత్సవ విగ్రహాలుగా ఎమ్మెల్యేలు, ఎంపీలు

- ప్రస్తుతం ఎన్నికల్లో సీటు రానివారు ధన్యులు
- నేను, నా కుమారుడు ఎన్నికల్లో పోటీ చేయం: దగ్గుబాటి వెంకటేశ్వరరావు



కుంకలమర్రు(పర్చూరు), జనవరి 10: 'ఉత్సవ విగ్రహాలుగా నేడు ఎమ్మెల్యేలు, ఎంపీల పరిస్థితి ఉంది. సంపద అంతా ఒకే చోటుకు అన్న చందాన సింగిల్‌మెన్ పార్టీల వ్యవహారం సాగుతోంది' అని మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరావు అన్నారు. బాపట్ల జిల్లా కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామంలో ప్రవాసాంధ్రుల సహకారంతో రూ.1.50 కోట్లతో ఏర్పాటు చేసిన మహాప్రస్థానం(హిందూ శ్మశానవాటిక) ప్రారంభోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన దగ్గుబాటి వెంకటేశ్వరరావు ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై మాట్లాడారు. 'ఎన్నికల్లో రూ.కోట్లు ఖర్చుపెట్టుకొని గెలిచినా కనీస గౌరవం కూడా దక్కటం లేదు. మళ్లీ పోటీ చేద్దామంటే రూ.కోట్లు ఖర్చుపెట్టాల్సిన దుస్థితి. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం ఎన్నికల్లో సీటు రాని వారు ధన్యులు. భగవంతుడు ఈ రూపంలో నిజమైన ప్రజాప్రతినిధులను కాపాడేందుకే ఇలాంటి అవకాశం ఇచ్చాడని భావించాలి. నేను, నా కుమారుడు ఏ పార్టీ నుంచీ పోటీ చేయం' అని దగ్గుబాటి స్పష్టం చేశారు.





మెగా డీఎస్సీ ఎక్కడంటూ చలో సీఎం క్యాంపు కార్యాలయం చేపట్టిన డీవైఎఫ్ఐ నాయకులను విజయవాడలోని కనకదుర్గ వారధి వద్ద అరెస్టు చేస్తున్న పోలీసులు

సీఎంపై కేసు నమోదు చేయండి

కైకలూరు పోలీసులకు తెలుగుయువత ఫిర్యాదు

జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని ఆగ్రహం



కైకలూరులో ర్యాలీగా వెళుతున్న టీడీపీ నేతలు

కైకలూరు, జనవరి 10: జగన్ ప్రభుత్వం నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్‌ను ఇవ్వకుండా మోసం చేసిందని తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు విమర్శించారు. తెలుగుయువత ఆధ్వర్యంలో బుధవారం ఏలూరు జిల్లా కైకలూరు టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి ముఖ్యమంత్రి మోసం చేశారంటూ టౌన్ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. మాట ఇచ్చి మోసం చేసినందుకు సీఎం జగన్‌పై కేసు నమోదు చేయాలని కోరారు. రాష్ట్రంలో నిరుద్యోగం 6.5 శాతం పెరిగిందని, వలంటీర్ ఉద్యోగాలిచ్చి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చినట్లుగా తన సొంత పత్రికల్లో ప్రకటనలు ఇచ్చి ప్రజాధనాన్ని దోపిడీ చేస్తోందన్నారు.

మున్సిపల్ సమ్మె విరమణ

- ఆరోగ్య భత్యం సహా రూ.21 వేల వేతనం
- సంక్రాంతికి ఒక్కో కార్మికుడికి రూ.వెయ్యి
- హామీలపై జీవోలు వచ్చాకే పూర్తి విరమణ
- స్పష్టం చేసిన కార్మిక సంఘాలు
- కొత్తగా జీతం పెంచిందేమీ లేదు
- ఓహెచ్ఏ సర్దుబాటు మాత్రమే!

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు సమ్మె విరమించారు. గురువారం నుంచి విధులకు హాజరవుతున్నట్లు ప్రకటించారు. బుధవారం అమరావతి సచివాలయంలో మంత్రుల కమిటీ మున్సిపల్ కార్మిక సంఘాల నేతలతో చర్చలు జరిపింది. దీంతో సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నామని, ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిపై జీవోలు వచ్చిన తర్వాత పూర్తిగా విరమిస్తామని ప్రకటించారు. ఆరోగ్యభత్యాన్ని కూడా జీతంతో కలిపి.. ప్రస్తుతం ఇస్తున్న రూ.15 వేలను రూ.21 వేలకు పెంచుతున్నట్లు మంత్రుల కమిటీ తెలిపింది. మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మున్సిపల్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, మున్సిపల్ కార్మికుల జేఏసీ నాయకులు సుబ్బారాయుడు తదితర యూనియన్ల నాయకులు చర్చల్లో పాల్గొన్నారు. అనంతరం మంత్రి బొత్స సత్యనారాయణ, మున్సిపల్ కార్మిక సంఘాల నాయకులు మీడియాతో మాట్లాడారు.

'పారిశుధ్య పనులు చేసే అన్ని రకాల కార్మికులను 'క్లీన్ ఎన్విరాన్మెంట్ వర్కర్స్' అనే కొత్త కేటగిరీ కిందకు తీసుకొచ్చి వేతనం, ఆరోగ్య భృతితో కలిపి నెలకు రూ.21 వేలు ఇవ్వడానికి అంగీకరించాం. ఇకపై ఓహెచ్ఏ ఉండదు. ఈపీఎఫ్, ఈఎస్ఐ ఇస్తాం. అండర్ గ్రౌండ్ కార్మికులకు, డ్రైవర్లకు ఓహెచ్ఏ రూ.6 వేలు, వేతనం రూ.18,500 కలిపి రూ.24,500 ఇవ్వడానికి అంగీకరించాం. పాఠశాలల్లో పనిచేసే కంటింజెంట్ వర్కర్స్‌కి పురపాలక సంఘాల ద్వారా చెల్లింపులు చేస్తాం. నాన్‌పీహెచ్ కార్మికులకు సంబంధించి క్యాటిగిరేషన్ ప్రతిపాదనలను ఆర్థిక శాఖకు పంపి తగు చర్యలు తీసుకుంటాం. స్పైర్ డెత్‌కు సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు పరిహారం చెల్లించేందుకు ఉత్తర్వులు ఇస్తాం. సరెండర్ లీవుల చెల్లింపులు 10 రోజుల్లో జరిగేలా చర్యలు తీసుకుంటాం. రెగ్యులర్ కార్మికులకు పీఎఫ్ అకౌంట్లు తెరవడానికి చర్యలు తీసుకుంటాం. ఎక్స్‌గ్రేషియా ఇవ్వడానికి ఒన్‌టైం ఎగ్జామినేషన్ ఇవ్వడానికి చర్యలు తీసుకుంటాం. అవుట్ సోర్సింగ్ వర్కర్లకు రిటైర్‌మెంట్ సెక్యూరిటీగా పదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి ఏటా రూ.2000 వేల చొప్పున లేదా గరిష్ఠంగా రూ.75,000 ఇస్తాం. ప్రమాదవశాత్తు మరణించిన అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రస్తుతం ఉన్న రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషయాను రూ.7 లక్షలుగా పెంచడం జరిగింది. మట్టి ఖర్చులు 15 వేలను 20 వేలకు పెంచాం. అవుట్‌సోర్సింగ్ కార్మికులను నియమించుకున్నప్పుడు కరోనా టైంలో నియమించుకున్న వారికి ప్రధాన్యం ఇస్తామన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి కార్మికుడికి దుస్తులు కొనుక్కోవడానికి వెయ్యి రూపాయలు ఇస్తాం. వీటిపై కమిటీలు ఏర్పాటు చేశాం. జీవోలు జారీ చేస్తామని చెప్పాం' అని మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు.

సమ్మెను వాయిదా వేస్తున్నాం

సమ్మెను పూర్తిగా విరమించలేమని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి(సీఐటీయూ) ఉమామహేశ్వరరావు, మున్సిపల్ కార్మికుల జేఏసీ నేత సుబ్బారాయుడు తెలిపారు. గురువారం నుంచి కార్మికులు పనిలోకి వెళతారని చెప్పారు. చర్చలు సానుకూలంగానే జరిగినా.. కార్మికులందరూ పూర్తి సంతృప్తి చెందేవిధంగా లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిపై గురువారం మినిట్స్ ఇస్తామని చెప్పారని, మూడు రోజుల్లో ఇచ్చిన హామీలన్నింటికీ జీవోలు ఇస్తామని చెప్పారని, ఏది నెరవేర్చకపోయినా మళ్లీ సమ్మె చేస్తామని చెప్పారు. సరెండర్ లీవ్‌లు త్వరలో ఇస్తామని చెప్పారన్నారు. హామీలు అమలు కాకపోతే ఫిబ్రవరి నుంచి మళ్లీ సమ్మెకు వెళతామని చెప్పారు.

పెంచిందేమీ లేదు కానీ..!

ప్రస్తుతం మున్సిపల్ కార్మికులకు ఆరోగ్య భత్యంగా రూ.6 వేలు, వేతనంగా రూ.15 వేలు మొత్తంగా రూ.21 వేలు ఇస్తున్నారు. సమ్మె తర్వాత జరిగిన చర్చల్లో ఆరోగ్య భత్యాన్ని ఎత్తివేసి.. అలవెన్సు మొత్తాన్ని వేతనంగా పేర్కొంటూ రూ.21 వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. బేసిక్ పెరిగిన కారణంగా వచ్చే పీఆర్సీలో వేతనం భారీగా పెరుగుతుందని ఆశ చూపింది. అంతేతప్ప ప్రభుత్వం కొత్తగా వేతనాలను పెంచలేదు.

బిక్షాటనతో మున్సిపల్ కార్మికుల నిరసన

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రవ్యాప్తంగా 16 రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు బుధవారం భిక్షాటనతో నిరసన తెలిపారు. సీఎం జగన్ తమను మోసగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం నగరంలో కార్మికులు భిక్షాటన చేసిన మున్సిపల్ కార్మికులు నగరంలోని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ కార్యాలయ ముట్టడికి యత్నించడం... తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. అడ్డుకున్న పోలీసులు, 20 మంది నాయకులు, కార్మికులను అరెస్టు చేసి తీసుకెళ్తుండగా వాహనాలను కార్మికులు అడ్డుకున్నారు. పోలీసులు సర్దిచెప్పినా వినలేదు. దీంతో పోలీసులు 'మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి' అంటూ.. ఆర్డీ కార్యాలయం గేట్లు తెరిచి.. ఎంతమందైనా వెళ్లండని చెప్పి.. చెట్ల కిందకు వెళ్లిపోయారు. విజయవాడ ధర్నాచౌక్‌లో కార్మికులు అర్ధనగ్నంగా, వేప ఆకులు చుట్టుకుని నిరసన తెలిపారు. నంద్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు దీక్షతోపాటు భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు.



విజయవాడలో అంగన్వాడీల ఆందోళన

ప్రభుత్వానికి పరీక్ష

- నోటీసులకు వెరవని అంగన్వాడీలు
- ఉధృతంగా కొనసాగుతున్న సమ్మె
- 30వ రోజు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

సమ్మె విరమించి విధుల్లో చేరాలని.. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ ఓవైపు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీచేస్తున్నా.. అంగన్వాడీలు వెనక్కి తగ్గడం లేదు. 30వ రోజైన బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీల ఉద్యమం మరింత ఉధృతంగా సాగింది. ఎస్మా ప్రయోగించినా.. షోకాజు నోటీసులు జారీ చేసినా వెనక్కి తగ్గేదేలేదంటున్నారు. తమ న్యాయమైన కోర్కెలు తీర్చే వరకు, వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు చేసే వరకు సమ్మె విరమించేదేలేదని తెగేసి చెబుతున్నారు. సమస్యల పరిష్కారానికై అంగన్వాడీలు పూనిన సమ్మె దీక్ష ప్రభుత్వానికి పరీక్షగా మారింది. బుధవారంనాడు రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెను కొనసాగించారు. ప్రభుత్వం షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్, ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్లు డిమాండ్ చేశాయి. ఈమేరకు వాటి నాయకులు సుబ్బరావమ్మ, లలితమ్మ, జ్యోతి బుధవారం ప్రకటన విడుదల చేశారు. చర్చలకు సిద్ధమని చెప్పినా నోటీసులు జారీ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు అంగన్వాడీ కేంద్రాల వద్ద బుధవారం నుంచి ఐసీడీఎస్ అధికారులు షోకాజ్ నోటీసులు అతికించడం ప్రారంభించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీడీపీఓలు, సచివాలయ మహిళా పోలీసులను ప్రభుత్వం ఈ పనికి పురమాయించింది. జిల్లా వ్యాప్తంగా బుధవారం రాత్రికి 1,567 మంది వర్కర్లకు, 861 మంది ఆయాలకు పోస్టుల్లో షోకాజ్ నోటీసులు పంపినట్లు ఐసీడీఎస్ అధికారుల ద్వారా తెలిసింది. గురువారం నుంచి సెంటర్ల వారీగా ఐసీడీఎస్ అధికారులు, మహిళా పోలీసులు నోటీసులు అతికించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, ఉమ్మడి అనంతపురం జిల్లా కలెక్టరేట్ వద్ద రోడ్డుపై 30 అంకె రూపంలో అంగన్వాడీలు కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. విడపనకల్లులో కళ్లకు గంతలు కట్టుకుని ఆందోళన చేశారు. శింగమనల తహసీల్దారు కార్యాలయం వద్ద కబడ్డీ ఆడారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద బతుకమ్మ ఆడారు. ప్రకాశం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన 24గంటల దీక్షలు 5వ రోజుకు చేరాయి. ఐసీడీఎస్ ప్రాజెక్టుల కేంద్రాల్లో కార్యకర్తలు చెవిలో పువ్వులు, ఒంటికాలిపై నిలబడటం, ఎస్మా ప్రతులను తగలబెట్టడం వంటి కార్యక్రమాలను చేపట్టారు. మరోవైపు అధికారులు బుధవారం నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు నోటీసులు పంపిస్తున్నారు. విశాఖ జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా గాంధీ విగ్రహం వద్ద 30 అంకె ఆకారంలో అంగన్వాడీలు కూర్చుని నిరసన తెలిపారు. నెల్లూరు జిల్లాలో 2,546 మందికి షోకాజ్ నోటీసులు అందజేశారు. తహసీల్దార్లు, వీఆర్వోలు, సీడీపీవోలు అంగన్వాడీల ఇళ్లకు వెళ్లి వ్యక్తిగతంగా లేదా వారి ఇళ్లకు, పక్కింటి వారికి నోటీసులు అందిస్తున్నారు. మరోవైపు కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష కొనసాగింది. తిరుపతి జిల్లాలో రిలే దీక్షలు, నిరసన ప్రదర్శనలు కొనసాగాయి. తిరుపతిలో అంగన్వాడీ మహిళలకు మద్దతుగా రౌండ్ టేబుల్ నిర్వహించారు. సత్యవేడులో చేతుల్లో మట్టి వుంచుకుని, నాయుడుపేటలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. గూడూరు, కోట, వెంకటగిరి, సూళ్ళూరుపేట, పిచ్చాటూరు, శ్రీకాళహస్తి, చంద్రగిరి, రేణిగుంటల్లో నిరాహార దీక్షలు కొనసాగాయి. కడప, అన్నమయ్య జిల్లాల్లో రిలే దీక్షలు కొనసాగాయి. జమ్మలమడుగులో మెడలకు ఉరితాళ్లు కట్టుకుని నిరసన తెలుపగా బద్వేలులో పొర్లు దండాలు పెట్టారు. రాయచోటిలో ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. రాజంపేటలో గౌరమ్మ పూజలు చేశారు. వాల్మీకిపురం ఎండలో నిలబడి నిరసన తెలిపారు. తంబళ్లపల్లె సర్వమత ప్రార్థనలు చేశారు. పార్వతీపురం కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు భోగీ మంటలు వేసి.. నృత్యాలు చేస్తూ నిరసన తెలిపారు. సాలూరులో సీఎం జగన్ ఫొటో ఎదుట సాష్టాంగ నమస్కారాలు చేశారు. భామిని, కురుపాంలో 30వ సంఖ్య రూపంలో కూర్చొని నిరసన తెలపగా... గరుగుబిల్లిలో చెప్పులతో కొట్టుకుని నిరసన తెలిపారు.



తమ పోరుకు నెల పూర్తైన సందర్భంగా విశాఖలో 30 అంకె ఆకారంలో కూర్చుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో పాత చీరలను పైన కట్టుకుని దీక్ష చేస్తున్న అంగన్వాడీలు

పాత యూనిఫాం చీరలే టెంట్లు!

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో బుధవారం అంగన్వాడీలు తమ పాత యూనిఫాం చీరలను టెంట్లుగా వేసుకుని, వాటి కిందే రిలే దీక్షలు చేశారు. 30 రోజులుగా చేస్తున్న దీక్షలకు టెంట్ల నిమిత్తం ఇప్పటికే రూ.50 వేలు అద్దె చెల్లించామని, ఇక చెల్లించే స్తోమత లేకే ఈవిధంగా చేశామని చెప్పారు.

మానసిక ఒత్తిడితో ఆయా మృతి

బల్లికురవ, జనవరి 10: ఒకవైపు కుటుంబ ఆర్థిక ఇబ్బందులు.. మరోవైపు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో మానసిక ఒత్తిడికి లోనైన బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొండాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్‌గా పనిచేస్తున్న కొణిదెన అంజమ్మ(58) మంగళవారం రాత్రి బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతిచెందింది. భర్త వెంకటేశ్వర్లు గత నెలలో ఆర్థిక ఇబ్బందులతో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆమెకు ఆయా ఉద్యోగమే జీవనాధారమైంది. ఈ తరుణంలో గత కొద్దిరోజులుగా సమ్మె చేస్తుండటంతో జీతం లేక గడవడం కష్టంగా మారింది. సమ్మె విరమించే పరిస్థితి కనిపించకపోవడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవడంతో తలలో నరాలు చిట్లాయి.

అనారోగ్యంతో అంగన్వాడీ మృతి



యాడికి, జనవరి 10: అనంతపురం జిల్లా యాడికి మండలం కేశవరాయునిపేటకు చెందిన అంగన్వాడీ కార్యకర్త విజయలక్ష్మి(50) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతిచెందారు. అనారోగ్యంతో బాధపడుతూనే ఆమె సమ్మెలో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో ఈ నెల 5న జ్వరం వచ్చి పరిస్థితి విషమించడంతో చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. కోలుకోలేక ఆమె మృతిచెందారు.

సమ్మెపై హైకోర్టులో పిల్

- విచారణ ఈ నెల 23కి వాయిదా

అమరావతి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమ్మెతో రాష్ట్రంలోని గర్భిణీలు, శిశువులకు అందించే పౌష్టికాహారం వృధా అవుతున్నదంటూ దాఖలైన పిల్‌ను బుధవారం హైకోర్టు అత్యవసరంగా విచారణకు స్వీకరించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈమేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. అంగన్వాడీల సమ్మెతో రాష్ట్రంలోని గర్భిణీలు, శిశువులకు పౌష్టికాహారం అందడం లేదంటూ కృష్ణా జిల్లాకు చెందిన న్యాయవాది కె.ఉషారాణి పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది జీఆర్ సుధాకర్, ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు ఏజీ సమయం కోరారు. అంగీకరించిన ధర్మాసనం విచారణను ఈ నెల 23కి వాయిదా వేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● గురువారం 11 జనవరి 2024

ఖరగ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీకేజీపీ)- 'మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్(ఎంహెచ్‌ఆర్‌ఎం)', 'మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ)', 'మాస్టర్ ఇన్ మెడికల్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఎంఎంఎస్‌టీ)' ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లు.

● వెబ్‌సైట్: iitkgp.ac.in



ఐఐటీ ఖరగ్‌పూర్‌లో పీజీ ప్రోగ్రామ్‌లు

ఎంహెచ్‌ఆర్‌ఎం

సంస్థ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తోంది. మొత్తం 60 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా వింటర్, సమ్మర్ ఇంటర్న్‌షిప్‌లు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఇంజనీరింగ్, టెక్నాలజీ, ఫార్మసీ, మెడిసిన్ తదితర ప్రొఫెషనల్ విభాగాల్లో నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏదేని స్పెషలైజేషన్‌తో పీజీ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. జనరల్, ఓబీసీ అభ్యర్థులకు ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 అక్టోబరు 31 నాటికి డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. క్యాట్ 2023 అర్హత తప్పనిసరి. ఇందులో జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 80; ఓబీసీ అభ్యర్థులకు 72; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 53.33 శాతం పర్సంటైల్ ఉండాలి.

ఎంపిక: అకడమిక్ ప్రతిభ, క్యాట్ 2023 స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి క్యుములేటివ్ స్కోర్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 25
- **గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు:** ముంబై, బెంగళూరు సెంటర్లలో మార్చి 15 నుంచి 17 వరకు; కోల్‌కతా, ఢిల్లీ సెంటర్లలో మార్చి 22 నుంచి 24 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 25 నుంచి మే 5 వరకు

ఎంబీఏ

సంస్థ ఆధ్వర్యంలోని వినోద్ గుప్త స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లకుగాను మొత్తం 91 క్రెడిట్స్ నిర్దేశించారు. మొత్తం 200 సీట్లు ఉన్నాయి.

- **విభాగాలు:** బిజినెస్ అనలిటిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, ఎకనామిక్స్ అండ్ స్ట్రాటజీ, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, జనరల్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్సెస్, ప్రొడక్షన్ అండ్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్.
- **అర్హత:** ఇంజనీరింగ్, టెక్నాలజీ, ఫార్మసీ విభాగాల్లో నాలుగేళ్ల డిగ్రీ ఉత్తీర్ణులు; మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు సైన్స్/ఎకనామిక్స్/కామర్స్ స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. జనరల్, ఓబీసీ అభ్యర్థులకు 60 శాతం; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు ఉండాలి. ప్రస్తుతం డిగ్రీ చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు/పరీక్షలు రాసి ఫలితాల కోసం చూస్తున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 అక్టోబరు 31 నాటికి డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. క్యాట్ 2023లో జనరల్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 90; ఓబీసీ అభ్యర్థులకు 81; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 60 శాతం పర్సంటైల్ ఉండాలి.
- **ఎంపిక:** అకడమిక్ ప్రతిభ, క్యాట్ 2023 స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్ పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి క్యుములేటివ్ స్కోర్ ఆఫ్ అప్లికేషన్ రేటింగ్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.
- **వెయిటేజీ:** అప్లికేషన్ రేటింగ్‌కు 20 శాతం; క్యాట్ 2023 లో వీఏఆర్‌సీ సెక్షన్ స్కోర్‌కు 20, డీఐఎల్‌ఆర్ సెక్షన్ స్కోర్‌కు 10, క్యూఏ స్కోర్‌కు 10 శాతం; పర్సనల్ ఇంటర్వ్యూ స్కోర్‌కు 40 శాతం వెయిటేజీ ఉంటుంది.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1600; దివ్యాంగులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు రూ.800
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 5
- **కరెక్షన్ విండో ఓపెన్:** ఫిబ్రవరి 6 నుంచి 8 వరకు
- **ఆన్‌లైన్ పర్సనల్ ఇంటర్వ్యూలు:** మొదటి షెడ్యూల్ మార్చి 2 నుంచి 4 వరకు; రెండో షెడ్యూల్ మార్చి 9 నుంచి 11 వరకు; మూడో షెడ్యూల్ మార్చి 22 నుంచి 24 వరకు
- **ఫలితాలు విడుదల:** మే 1 నుంచి 5 వరకు

ఎంఎంఎస్‌టీ

ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. మెడికల్ సైన్సెస్‌లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వినియోగానికి సంబంధించి శిక్షణ ఇస్తారు. సైన్స్-ఇంజనీరింగ్ స్కిల్స్‌పై అవగాహన కల్పిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్ సబ్జెక్టులు, ఎలక్టివ్ సబ్జెక్టులు, సెమినార్‌లు, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. వీటికి సంబంధించిన వివరాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.


- **ప్రోగ్రామ్‌లోని అంశాలు:** ప్రివెంటివ్ అండ్ ప్రొమోటివ్ హెల్త్ కేర్ సిస్టం, బయో మార్కర్స్ అండ్ అప్లికేషన్ ఇన్ అంకాలజీ, బయో మెటీరియల్స్, క్యాన్సర్ రీసెర్చ్, మైక్రో ఫ్లూయిడ్స్ అండ్ పాయింట్ ఆఫ్ కేర్ డయాగ్నస్టిక్స్, బయో ఎంఈఎంఎస్ అండ్ సెన్సర్స్, వూండ్ హీలింగ్ రీసెర్చ్ అండ్ టిష్యూ ఇంజనీరింగ్, మెడికల్ ఇమేజింగ్ అండ్ ఇమేజ్ అనాలిసిస్, టెలీ మెడిసిన్ అండ్ టెలీ సర్జరీ, ప్రోటోమిక్స్ అండ్ మెటబాల్మిక్స్, రీ ప్రొడక్టివ్ హెల్త్, రెస్పిరేటరీ హెల్త్, మెడికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, రీహాబిలిటేషన్ ఇంజనీరింగ్, హెల్త్‌కేర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం, హెర్బల్ మెడిసిన్, మెషిన్ లెర్నింగ్ అండ్ కంప్యూటర్ అసిస్టెడ్ టెక్నాలజీ ఇన్ మెడికల్ ఇమేజింగ్, బయోస్టాటిస్టిక్స్, రీజనరేటివ్ మెడిసిన్, ఇమ్యూనాలజీ, కార్డియోవాస్కులర్ రీసెర్చ్.
- **అర్హత:** మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 55 శాతం మార్కులతో ఎంబీబీఎస్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ సబ్జెక్ట్‌ను అదనంగా చదివి ఉండాలి.
- **సీబీటీ వివరాలు:** ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 75 ప్రశ్నలను ఎంబీబీఎస్ సిలబస్ నుంచి; మిగిలిన 45 ప్రశ్నలను ఇంటర్ స్థాయి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సిలబస్ నుంచి ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు.
- **అసిస్టెంట్‌షిప్:** నిబంధనల ప్రకారం సెమిస్టర్ వర్క్‌లు పూర్తిచేస్తూ అకడమిక్ ప్రతిభ కనబరచినవారికి నెలకు రూ.25,000 అసిస్టెంట్‌షిప్ ఇస్తారు. ఇందుకుగాను అభ్యర్థులు సంస్థ ఆధ్వర్యంలోని బీసీ.రాయ్ టెక్నాలజీ హాస్పిటల్‌లో వారానికి పది గంటలు క్లినికల్ సర్వీస్ చేయాల్సి ఉంటుంది.
- **దరఖాస్తుకు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1800; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.900
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 31
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** ఫిబ్రవరి 17 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో ఎగ్జామ్ సెంటర్లు:** హైదరాబాద్, విశాఖపట్నం
- **సీబీటీ తేదీలు:** మార్చి 17 నుంచి

ఐఐటీబీ మోనాష్‌లో పీహెచ్‌డీ

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బాంబే, మోనాష్ యూనివర్సిటీ(ఆస్ట్రేలియా) ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'ఐఐటీబీ-మోనాష్ రీసెర్చ్ అకాడమీ' పీహెచ్‌డీ 2024 జూన్ సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. గేట్ వ్యాలిడ్ స్కోర్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడు నుంచి నాలుగేళ్ల వరకు ఉంటుంది. ఎంచుకొన్న పరిశోధనాంశాన్ని అనుసరించి అభ్యర్థులు కనీసం మూడు నుంచి ఆర్నెల్లు/ఏడాది వరకు మోనాష్ యూనివర్సిటీలో చదవాల్సి ఉంటుంది.

రీసెర్చ్ థీమ్స్

- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటేషనల్ మోడలింగ్
- క్లీన్ ఎనర్జీ
- హెల్త్ సైన్సెస్
- స్మార్ట్ మెటీరియల్స్
- సస్టయినబుల్ సొసైటీస్ అండ్ మేనేజ్‌మెంట్
- సర్క్యులర్ ఎకానమీ
- ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్



అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ+ మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ఇంజనీరింగ్ డిగ్రీతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్/రీసెర్చ్ ఫెలోషిప్ అర్హత ఉన్నవారు కూడా అర్హులే. గేట్ స్కోరు లేని పక్షంలో రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. మోనాష్ యూనివర్సిటీ నిర్దేశించిన విధంగా ఆంగ్ల భాషా ప్రావీణ్యానికి సంబంధించిన అర్హతలు ఉండాలి. ఐఈఎల్‌టీఎస్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: వచ్చిన దరఖాస్తులు పరిశీలించి అకడమిక్ ప్రతిభ, గేట్ స్కోరు/అనుభవం ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు. ఎంపికైనవారికి ఈ మెయిల్ ద్వారా సమాచారమిస్తారు.

ముఖ్య సమాచారం

- **స్కాలర్‌షిప్:** మొదటి రెండేళ్లు ఏడాదికి రూ.4,20,000; తరవాత ఏడాదికి రూ.4,68,000 ఇస్తారు. ఆస్ట్రేలియాలో చదివేటప్పుడు ఏడాదికి 29,000 ఆస్ట్రేలియన్ డాలర్ల గ్రాంట్ ఇస్తారు.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 26
- **వెబ్‌సైట్:** http://iitbmonash.org

లిటిల్స్




మీకు తెలుసా?

- నల్లగా, పొడవైన ముక్కు ఉండే ఈ కోడిలాంటి పక్షిని 'నార్తర్న్ బాల్డ్ ఐబిస్' అని పిలుస్తారు. దక్షిణ ఆఫ్రికాలోని ఎడారుల్లో, కొండల్లో, పచ్చిక బయళ్లలో ఇవి కనిపిస్తాయి.
- 135 సెంమీ పొడవు ఉండే ఈ పక్షి వింగ్ స్పాన్ 125 సెం.మీ. వీటి సంతతి మిడిల్ ఈస్ట్, యూరప్‌లో కూడా ఉన్నాయి. ఎక్కువగా నేలమీద నడవటంతో పాటు ఇవి చెట్లమీద ఎగురుతూ ఉంటాయి.
- 1758 సంవత్సరంలో ఈ పక్షి గురించి స్వీడిష్ పరిశోధకులు రాశారు.
- వీటి తలభాగంతో పాటు కాళ్లు కూడా పింక్ రంగులో ఉంటాయి. ఇవి చెట్లమీద, గుంపు పొదల్లో గూళ్లు పెడతాయి.




- ఇవి కాలనీలను ఏర్పరచుకుంటాయి. మూడేళ్లు పడినప్పటి నుంచి గుడ్లు పెడతాయి. కనీసం రెండు నుంచి నాలుగు గుడ్లు పెడతాయి. తెల్లని గుడ్లు. ప్రతి గుడ్డు 50 గ్రాముల బరువు ఉంటుంది. పొదగటానికి 28 రోజులు పడుతుంది.
- బరువు కేజీ నుంచి కేజీన్నర వరకూ ఉంటాయి. ఇవి ఒంటరిగా తిరుగుతుంటాయి. అందుకే వీటిని వేటాడటం వేటగాళ్లకు సులువు.
- వీటిని జూలో కూడా పెంచుతున్నారు. మనుషులతో స్నేహంగా ఉంటుందిది.
- చిన్న పక్షులు, పురుగులు, కీటకాలు, పండ్లు తిని బతుకుతాయి.
- సిరియాలో వీటి సంతతి లేదు. మొరాకోలో మాత్రం 500 పక్షులు ఉన్నాయి.
- ఒకచోట నుంచి మరొక చోటకు పోవటానికి ఇష్టపడవు. గుంపుగా కూడా జీవిస్తాయి. ప్రతి గుంపులో 50 పక్షులు ఉంటాయి. ఇవి కోపంగా ఉన్నప్పుడు జుట్టు నిక్కబొడుచుకుంటుంది. విమానంలా రివ్వున దూసుకెళ్తాయి.
- దక్షిణ ఆఫ్రికాలో వీటి సంఖ్య 4600 వరకూ ఉన్నాయి. ఈ జాతి కనీసం పది నుంచి పదిహేనేళ్ల వరకూ జీవిస్తాయి.


దారి కనుక్కోండి




10 తేడాలు గుర్తించండి



చుక్కలు కలపండి



రంగులు వేయండి



డైలీ సుడోకు - 201

	4		6					
		9		4				8
	1			5	9	3		4
		4					6	9
8	6					1		
4		6	7	8			2	
1				3		7		
					5		9	

సుడోకు - 200 సమాధానం

9	5	1	8	2	4	6	7	3
3	2	6	9	7	1	8	4	5
4	7	8	5	6	3	1	2	9
1	6	4	3	9	2	7	5	8
2	8	5	1	4	7	3	9	6
7	3	9	6	5	8	4	1	2
8	4	3	2	1	9	5	6	7
5	9	7	4	8	6	2	3	1
6	1	2	7	3	5	9	8	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

ఇండియాలో ఎదుగుతున్న ఆన్‌లైన్ లెర్నింగ్


ఆన్‌లైన్ లెర్నింగ్‌పై విశ్వసనీయత ఇండియాలో రాన్రాను పెరుగుతోంది. లీడింగ్ టెస్ట్ ప్రిపరేషన్ వేదిక 'ఫిజిక్స్ వాలా' నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ఇరవై ఏడు లక్షల మంది విద్యార్థులు, సంస్థకు చెందిన యూట్యూబ్ చానల్స్ చందాదారులు నాలుగు కోట్ల మంది నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషించారు. 2022 నుంచి రెండేళ్ళ పాటు ఈ సర్వే జరిగింది. కొవిడ్ అనంతర కాలంలో ఆన్‌లైన్ లెర్నింగ్‌కు జనాదరణ బాగుందని ఫిజిక్స్ వాలా తేల్చింది. ఒక్క పెయిడ్ కోర్సుల్లోనే 182 శాతం మేర ఎదుగుదల ఉందని గణాంకాలతో తేటతెల్లం చేసింది. ఆన్‌లైన్ కోర్సులపై అమితాసక్తికి ఇదే సాక్ష్యం. యాప్ డౌన్‌లోడ్స్‌లో 38 శాతం ఎదుగుదల ఉంది. పిన్‌కోడ్ ఉన్న గ్రామాలు, పట్టణాలతో సమీక్షించినప్పుడు 98 శాతం వరకు ఫిజిక్స్ వాలా చేరుకుంది. ఫిజిక్స్ వాలా చందాదారులు ఇప్పుడు నాలుగు కోట్లు. ఒక్క ఏడాదిలో దీని 81 యూట్యూబ్ చానల్స్ ద్వారా ఒక లక్ష మేర కంటెంట్ అప్‌లోడ్ అయ్యింది. రోజుకు వీక్షణ సమయం సైతం యాభై నుంచి అరవై అయిదు నిమిషాలకు పెరిగింది. హిందీ మీడియమ్‌లో బ్యాచ్‌లకు సంబంధించి ఎదుగుదల 300 శాతంగా నమోదైంది. తెలుగు సహా ప్రాంతీయ భాషల్లో పెరుగుదల అయిదింతలైంది.



భారత రాజ్యాంగం - ముఖ్య చట్టాలు

పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ



పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు 'భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం', 'రాజ్యాంగ పరిషత్' అంశాలను చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. తొలుత రాజ్యాంగంలోని అన్ని అంశాలను అర్థం చేసుకోవాలి. ఆ తరవాత భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం, రాజ్యాంగ పరిషత్ అనే అంశాలను ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.

పిట్ ఇండియా చట్టం-1784: ఈ చట్టం ద్వారా ఈస్టిండియా కంపెనీ కార్యకలాపాలను రెండు రకాలుగా విభజించారు.

1) బోర్డ్ ఆఫ్ కంట్రోల్: పరిపాలనా వ్యవహారాలను పరివేక్షిస్తుంది. దీనిలో ఆరుగురు సభ్యులు ఉంటారు.

2) కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్: వీరు వ్యాపార, వాణిజ్య అవసరాలను నియంత్రిస్తారు.

బోర్డ్ ఆఫ్ కంట్రోల్, కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ వ్యవస్థల ఏర్పాటు దేశంలో పార్లమెంటేతర నియంత్రణనే కాక ద్వంద్వ పాలనకు కూడా పునాది వేసింది. 1773 రెగ్యులేటింగ్ చట్టం ద్వారా గవర్నర్ జనరల్‌కు సలహా ఇవ్వడానికి కౌన్సిల్ ఆఫ్ ఫోర్ అనే నలుగురు సభ్యుల కార్యనిర్వాహక మండలి ఉండేది. పిట్స్ ఇండియా చట్టం ద్వారా సభ్యులను ముగ్గురికి తగ్గించారు. ఈ చట్టం ద్వారానే దేశంలో బ్రిటిష్ పాలిత ప్రాంతాలు అనే పదం బహుళ ప్రాచుర్యంలోకి వచ్చింది. పిట్స్ ఇండియా చట్టం అనంతరం 1793, 1813, 1833, 1853 చార్టర్ చట్టాలు చేశారు.

చార్టర్ చట్టం-1793: 1773 రెగ్యులేటింగ్ చట్టం చేసిన తరవాత బ్రిటిష్ పార్లమెంటు ప్రతి 20 సంవత్సరాలకు ఈస్టిండియా కంపెనీ భారతదేశంలో కొనసాగడానికి సంబంధించిన అనుమతిని పునఃపరిశీలించాలని భావించింది. కానీ రెగ్యులేటింగ్ చట్టంలోని లోపాల దృష్ట్యా 1784లో పిట్స్ ఇండియా చట్టాన్ని చేశారు. అనంతరం(1773 నుంచి 1853 వరకు) బ్రిటిష్ పార్లమెంటు ఈస్టిండియా కంపెనీని క్రమబద్ధీకరించడం, నియంత్రించడానికి ప్రతి 20 సంవత్సరాలకు ఒక చట్టాన్ని చేసింది.

చట్టంలోని ముఖ్యాంశాలు

1) ఈ చట్టం ద్వారా ఈస్టిండియా కంపెనీకి భారతదేశంలో 20 సంవత్సరాలు వ్యాపారం చేసుకునే అవకాశాన్ని పొడిగించారు.

2) కంపెనీ వ్యవహారాల వార్షిక నివేదికను బ్రిటన్ పార్లమెంటుకు సమర్పించాలి.

3) గవర్నర్ జనరల్‌కు కౌన్సిల్ తీర్మానాలపై వీటో అధికారాన్ని కల్పించారు.

4) కంపెనీకి వచ్చే లాభాల నుంచే ఉద్యోగులకు జీత భత్యాలు చెల్లించాలి.

5) మున్సిపాలిటీలకు చట్టబద్ధత కల్పించారు.

6) భారతీయులకు సంబంధించిన వారి ఆస్తులు, వివాహం, వారసత్వం, మతం మొదలైన అంశాల్లో బ్రిటిష్ పార్లమెంటు చేసే చట్టాలతోపాటు గవర్నర్ జనరల్ రూపొందించిన నియమాలకు సమానమైన విలువ ఉంటుంది.

చార్టర్ చట్టం-1813: ఈ చట్టం ద్వారా ఈస్టిండియా కంపెనీకి 20 సంవత్సరాల వ్యాపార అనుమతి ఇచ్చారు. ఈస్టిండియా కంపెనీలో భారతీయులకు కూడా ఉద్యోగావకాశాలు కల్పించారు. భారతదేశ వ్యాపారంపై ఈస్టిండియా కంపెనీ గుత్తాధిపత్యం (చైనాతో తేయాకు వ్యాపారం మినహా)పోయింది. ప్రతి బ్రిటిష్ పౌరునికి ఇండియాలో వ్యాపార స్వేచ్ఛ కల్పించారు. క్రైస్తవ మిషనరీలు ఇండియాకు వచ్చాయి. స్థానిక సంస్థలకు పన్నులు విధించే అధికారాన్ని కల్పించారు. ఇండియాలో విద్యావ్యాప్తికి ఒక లక్ష రూపాయలు కేటాయించారు.

చార్టర్ చట్టం-1833: ఈస్టిండియా కంపెనీకి మరో 20 సంవత్సరాలు వ్యాపార అనుమతి ఇచ్చారు. బెంగాల్ గవర్నర్ జనరల్ పదవిని, భారత గవర్నర్ జనరల్‌గా పదోన్నతులు కల్పించారు. మొదటి భారత గవర్నర్ జనరల్- విలియం బెంటింక్. సివిల్ సర్వీస్ పరీక్షల్లో భారతీయులకు ప్రవేశం కల్పించారు. కానీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ వ్యతిరేకత వల్ల దీని అమలు ఆగిపోయింది. గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలి సభ్యుల సంఖ్యను నాలుగుకి పెంచారు. గవర్నర్ కౌన్సిల్‌లో ఒక న్యాయ నిపుణుడైన సభ్యుడిని ఏర్పాటు చేశారు. న్యాయ సభ్యునిగా నియమించిన మొదటి వ్యక్తి- లార్డ్ మెకాలే. ఈయనే భారత 'లా కమిషన్ ఛైర్మన్'గా నియమితులయ్యారు.

చార్టర్ చట్టం-1853: బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీకి 20 సంవత్సరాల వ్యాపార అనుమతిని పొడిగించలేదు. ఇండియాలో సివిల్ సర్వీసులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. శాసన నిర్మాణంలో భారతీయులకు అవకాశం కల్పించారు. కానీ తుది నిర్ణయం గవర్నర్‌దే. గవర్నర్ జనరల్ విధులను రెండుగా విభజించారు. అవి- 1) శాసన నిర్మాణ విధులు 2) కార్య నిర్వాహక విధులు. అలాగే లా కమిషన్ సిఫార్సులను ప్రకటించారు. అవి- 1) 1859- సివిల్ వివాదాల చట్టం అమలులోకి వచ్చింది(సీపీసీ) 2) 1860- భారత పీనల్‌కోడ్ అమలులోకి వచ్చింది(ఐపీసీ) 3) 1861- క్రిమినల్ చట్టం అమలులోకి వచ్చింది(సీఆర్‌పీసీ). కానీ కంపెనీ హక్కులను పొడిగించే అంశాన్ని ప్రస్తావించలేదు.

భారత రాజ్యాంగచట్టం-1858: ఈ చట్టం ద్వారా దేశంలో ఈస్టిండియా కంపెనీ పాలన అంతమై నేరుగా బ్రిటిష్ పాలన ప్రారంభమైంది. ఈ చట్టంలో బ్రిటిష్ రాణి భారతదేశానికి కూడా మహారాణియే అని ప్రకటించడం ద్వారా దేశంలోని సంస్థానాలు కూడా బ్రిటిష్ ప్రభుత్వం అధికారాన్ని ఒప్పుకోవాల్సి వచ్చింది. భారత గవర్నర్ జనరల్‌ను వైస్రాయ్‌గా మార్చారు. మొదటి వైస్రాయ్ 'లార్డ్ కానింగ్'(చివరి భారత గవర్నర్ జనరల్). 1857 సిపాయిల తిరుగుబాటు కాలంలో గవర్నర్ జనరల్- కానింగ్. బ్రిటన్ మహారాణి భారతదేశానికి కూడా మహారాణియే. బ్రిటిష్ ప్రభుత్వంలో భారత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఏర్పాటు జరిగింది. మొదటి భారత వ్యవహారాల మంత్రి, భారత కార్యదర్శి- రిచర్డ్ స్టాన్లీ. భారతదేశం తొలిసారిగా బ్రిటిష్ ప్రత్యక్ష పాలనలోకి వెళ్లింది. 1858 నవంబరు 1న మొదటి విక్టోరియా రాణి ఒక చారిత్రాత్మక ప్రకటన చేసింది. 'భారత ప్రజల అభ్యుదయమే మాకు బలం, వారి కృతజ్ఞతే మాకు పారితోషికం, సర్వశక్తి సంపన్నుడైన భగవంతుడు మాకు, మా ఉద్యోగులకు, భారత ప్రజలకు సేవ చేయడానికి శక్తి సామర్థ్యాలు ఇచ్చు గాక'. భారత వ్యవహారాల మంత్రిత్వపు శాఖ భారత కౌన్సిల్ సభ్యుల సలహా మేరకు పనిచేస్తుంది. ఈ చట్టం ప్రకారం భారతదేశ పాలనా వ్యవస్థ మౌలిక స్థాయిలో ఏర్పడింది.

1858 నవంబరు 1న మొదటి విక్టోరియా రాణి చేసిన చారిత్రాత్మక ప్రకటన - 'భారత ప్రజల అభ్యుదయమే మాకు బలం, వారి కృతజ్ఞతే మాకు పారితోషికం, సర్వశక్తి సంపన్నుడైన భగవంతుడు మాకు, మా ఉద్యోగులకు, భారత ప్రజలకు సేవ చేయడానికి శక్తి సామర్థ్యాలు ఇచ్చు గాక'.



వి.చైతన్యదేవ్,
పోటీ పరీక్షల నిపుణులు